NIRO1F209

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)

వార్షిక సంచిక-2003



కోట్ల గొంతులొక్కసారి గర్జిస్తాయ్ గర్జిస్తాయ్
సీట్ల మీద కూర్చున్న మంత్రులారా! ఖబడ్దార్!
ప్రజాస్వామ్యమనే ముసుగు తగిలించిన మీ పాలన
సజావుగా పరిసమాప్తి జరిగేరోజు లొస్తున్నాయ్!!



రైతుకూలీ-కార్మిక ఐక్యత వర్ధిల్లాలి!



వెలుగోడులో మే 18, 2003న కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి స్థూపావిష్కరణ





NPROIF209

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)

ఎర్రజెండా

దించినా దాన్ని చించినా
ఎరుపుండక మానదు
గాయాల లోంచి లేచి
గగుర్పొడవక మానదు
ఎంతో ఫున్నట్లు చూపేందుకు
ఏమి లేని దగ్గర ఎలా ఫుండగలదు
యూరపు గుండె మంటయి
గ్లోబంతా చుట్టుకోదూ
రష్యాను ఎరగదా
చీనాను ఎరగదా
ఎత్తినా దాన్ని ఎగరేసినా
అనుభవాలను మరవదు
నాభిలోంచి పాడుచుకొచ్చి
నపాశంలో రెపరెపలాడక మానదు
ఎంతో ముందు ఫుందని
ఎందరిని కనిపెట్టి ఫుంది
ఏమి జరగదని అది
ఎలా భావిస్తుంది
అనాధుల కళ్ళ జీరై
ఆరు ఖండాలలోనూ పోరెత్తదూ
ఆంధ్రులో పెరగదా
అవనితలంపై ఎగరదా

- ఛాయరాజ్

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)
వార్షిక సంచిక - 2003

రు. 25/-

ప్రతులకు :

మైత్రీ బుక్ హౌస్
మసీదు వీధి,
కారల్ మార్క్స్ రోడ్,
విజయవాడ - 2

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)
ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్స్,
కృష్ణలంక, విజయవాడ - 10

ముద్రణ :

చైతన్య ప్రింటర్స్,
విజయవాడ -10

ప్రచురణకర్తలు: కా॥ ఎస్. ఝాన్సీ, కా॥ కె.కోటయ్య, అధ్యక్ష, కార్యదర్శులు. రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)
ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్స్, కృష్ణలంక, విజయవాడ - 10

మా మాట

2003 సంవత్సరం నిశ్శబ్ద అగ్నిగుండంలో గడిపి 2004ని నెడుతున్నది.

గత వార్షిక సంచిక (2002) లో మేము వ్యక్తపరిచిన విషయాలను 2003 సంవత్సరం రుజువుచేసింది. ప్రజల జీవనం అత్యంత దారుణంగా మారింది. కరువు మీద కరువు కొనసాగింది. వ్యవసాయ కార్మికుల, పేదరైతుల, వలసలు పెరిగిపోయాయి. రుణభారం, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందుల మూలంగా ఆత్మహత్యలు పెరిగాయి. తాగునీరు, సాగునీరు సమస్య తీవ్రమయింది. పర్యావరణ సమస్య భయంగొలిపేదిగా మారింది. ఫ్లోరిన్ నీళ్ళ సమస్య ఆందోళన కలిగిస్తూంది. మురికినీరు ఉదరసమస్యలను తెచ్చింది. స్కూలు పిల్లలు తరచుగా విషాహారం బారిన పడుతున్నారు. దళితులపై, స్త్రీలపై దాడులు, అత్యాచారాల వార్త వినని రోజు లేదు. ఇలా ఎన్నో సమస్యలతో గ్రామీణజీవితం అతలాకుతలంగానూ, అస్తవ్యస్తంగానూ వుంది.

పట్టణాలలో మురికిపేటలు రోజురోజుకీ పెరుగుతూనే వున్నాయి. శ్రమ అంగళ్ళలో పాట్టలంటుకుపోయిన జనం కిక్కిరిసి వుంటున్నారు. ఈ పూటకు తిండిపెట్టండి - పనిచేస్తాం - డబ్బు వద్దు బాబూ - అంటూ నిలబడుతున్నారు. ఫ్యాక్టరీల మూసివేతలు, ప్రయివేటీకరించబడడంతో ఉపాధి ఊడిన - నిరుద్యోగులు, చదువులు చెప్పడానికి తయారైన యువ బడిపంతుళ్ళు, టెక్నీషియన్స్, పట్టభద్రులు, విశ్వవిద్యాలయ పట్ట భద్రులు - వీరంతా నిరుద్యోగ సైన్యంలోనే వున్నారు.

ఈ దారుణపరిస్థితికి కారణం ప్రభుత్వాల విధానాలు; అధికారంలో వున్న పార్టీ రాజకీయ, సిద్ధాంత వైఖరులే కారణం. ఎన్నో పథకాలు రూపొందించామనీ, అమలుజరుపుతున్నామనీ, అభివృద్ధి ఆఘమేఘాలతో పరుగు తీస్తుందనీ గొప్పలు చెప్పకున్నప్పటికీ; ప్రజల పరిస్థితి అత్యంత దారుణంగా మారిందనేది వాస్తవం.

ప్రపంచబ్యాంకుకి దాసోహమవడం; అప్పలు తీసుకురాగలిగిన మొనగాడిగా బాకాలు వాయించుకోవడం లాంటివన్నీ చంద్రబాబు ప్రభుత్వానికే చెల్లింది. ఇది వారి ప్రభుత్వ దివాళాకోరుతనానికీ; కాలం చెల్లిన అభివృద్ధి నిరోధక స్వభావానికీ అద్దం పడుతున్నది. పెట్టుబడిదారీ నీతిని ఆశ్రయించి తాము ప్రజాస్వామికత్వాన్ని కాలరాయాలనీ, దాన్ని పూడ్చిపెట్టాలనే నిరంకుశ భావాలను అది దాచిపెట్టుకోలేక పోతున్నది. ఈ కాలంచెల్లిన సిద్ధాంతాలనాశ్రయించి పురోగమనం వైపు, అభివృద్ధి వైపు పరుగులు తీస్తూ వుంటే ఎవరో ఆటంకపరుస్తున్నారనీ ; ప్రతిపక్షాలు సహకరించడం లేదనీ; ఎదురుదాడికి దిగడం వారి దివాళాకోరుతనానికీ, బానిస స్వభావానికీ తార్కాణం.

తెలుగుదేశం రాష్ట్ర సంపదలను పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద శక్తులకు దోచిపెడుతున్నది. వారి అడుగులకు మడుగులొత్తుతూ, వారి దోపిడీకి సౌకర్యవంతమైన మార్గాలను ఏర్పాటుచేయడంలో నిమగ్నమై బిజీబిజీగా నడుస్తున్నది. దీనినే అభివృద్ధివైపు పయనంగా, హైటెక్‌పాలనగా, గుడ్ గవర్నెన్స్‌గా తనను తానే కీర్తించుకుంటున్నది.

ప్రపంచబ్యాంకు దారిద్ర్య నిర్మూలనా పథకాలు, గ్రామీణ పేదరికంతగ్గింపు ప్రాజెక్టు, పనికి ఆహారపథకం, డ్వాక్రా పాదుపు పథకాలు, కోటివరాలు, అవినీతి నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి బాజాలు - కంచుధ్వనులతో భ్రమాపాలనలో ప్రజలను బంధించాలని ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ప్రతిదానికి చార్జీలు (యూజర్‌చార్జీ) వసూలు పద్ధతిపెట్టి ప్రజల రక్తాన్ని జుర్రుతున్నారు. విద్యుత్‌కే కాదు నీటికి కూడా మీటర్లు పెట్టి అమ్మడానికి

సిద్ధమవుతున్నారు. గిరిజన ప్రజానీకాన్ని పరాయీకరణ వైపు నెట్టే కృషి ముమ్మరంగా సాగిస్తున్నారు. అడవి నుండి, భూమి నుండి గెంటివేసే వ్యూహాలను అనేక చిట్కాలతో, నిర్భంధాలతో అమలుజరపాలని చూస్తున్నారు. విద్య, వైద్యరంగాల ప్రైవేటీకరణ; రైతుజనావళి ధనంతో నిర్మించిన సహకార చక్కెర మిల్లులను కారుచౌకగా ప్రైవేటు పెట్టుబడిదారులకు కట్టబెట్టడం; నీటి ప్రైవేటీకరణ, సాగునీరందించ నిరాకరించడం, రుణభారం మోపడం - ఇవన్నీ నిరాటంకంగా సాగిస్తున్నారు. ప్రజలను పీడించడం - అణచివేయడం అన్న దోపిడీ సూత్రాన్ని అత్యంత మొరటుగా అమలుజరప జూస్తున్నారు.

పంటలకు నీరు వదలాలనీ, కరువు నివారణాచర్యలు చేపట్టాలనీ, తుఫాన్ బాధితులను ఆదుకోవాలనీ, ఫ్యాక్టరీలు ప్రైవేటుపరం చేయవద్దనీ, రైతాంగం ఆందోళనలు సాగించింది. రైతాంగమే కాదు కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఈ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించారు.

ఉద్యమాలను అణచివేయడానికి, ప్రక్కదారి పట్టించడానికి, ప్రజల మధ్య మత, కుల, ప్రాంతీయ విద్వేషాలను వెదజల్లే కృషిలో వున్నారు. టెర్రరిజం, నక్సలిజం పేరుతో అనివార్యంగా వెల్లడవుతున్న ప్రజల ఆగ్రహాన్ని అణచడానికి, నిర్భందంలో ముంచెత్తడానికి, హత్యాకాండ సాగించడానికి పథకాలు పన్నారు. పన్నుతూనే ఉన్నారు.

రైతుకూలీ సంఘం ఈ సంవత్సర కాలంలో ప్రజల దీర్ఘకాల, తక్షణ సమస్యలపై స్పందించింది. అనేక ఆందోళనలు, పోరాటాలను నిర్మించింది. ప్రపంచవాణిజ్య సంస్థకు వ్యతిరేకంగా దోహా నుంచి కాన్‌కున్ వరకు జరుగుతున్న మూడవ ప్రపంచదేశాల రైతాంగ ఆందోళనలతో తన గొంతు కలిపింది. ఆర్థిక లావాదేవీలకు, లాభసాటి వ్యాపారాలకు అడ్డు తగులుతున్న దేశాలపై రకరకాల కుంటిసాకులతో యుద్ధాలు ప్రకటిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాద దురాక్రమణ చర్యలను ఖండించింది. అమెరికా,బ్రిటన్ సంకీర్ణ దళాలను ప్రతిఘటిస్తున్న ఇరాక్ ప్రజలకు సంఘీభావాన్ని ప్రకటించింది. వివిధ జిల్లాల్లో సభలు, సమావేశాలు, జరిపింది. రైతుకూలీ సంఘం తన లక్ష్యానికనుగుణంగా ముందుకి సాగుతున్నది.

రైతుకూలీ సంఘం సభలు, సదస్సులు నిర్వహించడం ద్వారా నిరంతరం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రమాదానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తున్నది. ఫ్యూడల్ పెత్తందారీ శక్తుల ఆణచివేతలను ఎదుర్కొనే సమరశీలతను పెంచుతున్నది.

ఈ సంచికలో సదస్సు రిపోర్టులు, ఉపన్యాసాలు, ప్రముఖనాయకుల, కార్యకర్తల వ్యాసాలతో పాటు రైతాంగ సమస్యలపై కవులు, చిత్రకారుల స్పందనను తెలియజేయాలని ప్రయత్నించాం. మాకందుబాటులో వున్న చిత్రాలను అందిస్తున్నాం. వివిధ కవితల, గేయాల సంపుటాల నుంచి కవితలను, గేయాలను ఎంచుకొన్నాం. రైతు-కూలీ సంఘం కార్యక్రమాలను, ఆందోళనోద్యమాలను తెలియచేసే ఫోటోలను ప్రత్యేకంగా ముద్రించాం.

మేము ఎవరి వ్యాసాలను, ఎవరి కవితలను, గేయాలను, చిత్రాలను ఉపయోగించుకున్నామో వారందరికీ రైతుకూలీ సంఘం కృతజ్ఞతలు తెలియజేస్తున్నది. డి.టి.పి, కంపోజింగ్, ప్రింటింగ్ పని చక్కగా, బాధ్యతతో చేసిన మిత్రులకూ, సహచరులకూ రైతుకూలీ సంఘం అభినందనలు తెలియజేస్తున్నది.

విజయవాడ,
24.12.2003.

రాష్ట్ర కార్యవర్గం
రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)

విషయ సూచిక

1.	**హైదరాబాద్ రాష్ట్ర సదస్సు**	1-20
2.	**ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సు**	21-26
3.	**ప్రత్యేక వ్యాసాలు**	27-68
	మార్క్స్ వివరించిన స్వయంసంపూర్ణ గ్రామీణ వ్యవస్థ – కామ్రేడ్ సి.వి.	
	స్వాతంత్రోద్యమ కాలంలో రైతుసంఘ ఆశయం – రైతు ఉద్యమ వ్యాప్తి – కా॥ వై.వి	
	రెండవ ప్రపంచ యుద్ధానంతరం రైతు పోరాటాల విజృంభణ – కా॥ వై.వి	
	వ్యవసాయ కార్మికులు – కా॥ తరిమెల నాగిరెడ్డి	
	భూకేంద్రీకృతం – కా॥ భీమిరెడ్డి నరసింహారెడ్డి	
	కష్టజీవుల ఉద్యమంలో కా॥ కమలమ్మ పాత్ర – జి. నరసింహమూర్తి	
4.	**ఆసియా సోషల్ ఫోరం సందర్భంగా**	69-84
	భూమి–ప్రజల జీవనాధారాలపై ప్రపంచీకరణ ప్రభావం	
	ప్రపంచీకరణ నేపథ్యంలో ఆదివాసులు – భూమి సమస్య	
	ప్రపంచీకరణ నేపథ్యంలో భారత వ్యవసాయ రంగం –	
	ప్రభుత్వ విధానాల్లో వస్తున్న మార్పులు	
5.	**అనుబంధాలు**	85-88



పదండి ముందుకు

కారుమబ్బు చీల్చవోయ్ - క్రాంతిరేఖ చూపవోయ్
మాతృదేశ ముక్తికై - మరణమైన సరియెనోయ్

జాతి వాంఛ స్వేచ్ఛరా - స్వేచ్ఛకొరకు పోరరా
సర్వజాతులైక్యమై - సాగినడువ ముక్తిరా

నేలహక్కు ప్రజలదే - నీటి హక్కు ప్రజలదే
ప్రజల దోచుకొనే గుంపు - బ్రతుకు లెత్తి చూపరా

మనల జీల్చువారలన్ - మనల గూల్చు క్రూరులన్
దయను చూపబోకురా - ధర్మమదియె నీకురా


-నార్ల చిరంజీవి

"గ్రామీణ రుణభారం- నీటి ప్రయివేటీకరణ-విత్తనాల సమస్య"లపై హైదరాబాద్ రాష్ట్ర సదస్సు

భూమి, సహజ వనరులపై హక్కు ప్రజలదే !

బహుళజాతి కంపెనీలను తరిమి తరిమి కొట్టండి !!

"గ్రామీణ రుణ భారం-నీటి ప్రయివేటీకరణ-విత్తనాల సమస్య" అనే అంశాలపై రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో 2003, సెప్టెంబర్ 21, 22 తేదీలలో హైదరాబాద్‌లోని రాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు సదస్సు జరిగింది. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన వందలాది మంది రైతుకూలీలు- గిరిజనులు -మేధావులు- కార్యకర్తల సమక్షంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్య సభా ప్రాంగణంలో రైతు కూలీ సంఘం జెండాను ఉత్తేజపూరిత వాతావరణంలో ఆవిష్కరించారు. "వర్థిల్లాలి! ఎర్ర...జెండా; జోహార్- రైతాంగ పోరాట యోధులకు; దున్నే వానికే -భూమి హక్కు; వర్థిలాలి! వ్యవసాయక విప్లవం; వర్థిల్లాలి! కార్మిక కర్షక ఐక్యత" అంటూ ప్రతినిధులు నినాదాలిస్తుండగా అరుణోదయ కళాకారులు అరుణ పతాకానికి రెడ్ సెల్యూట్ చెబుతూ ఓ అరుణ పతాకమా...అంటూ పాట పాడారు.



సదస్సులో ప్రారంభోపన్యాసం చేస్తున్న డా॥బి.డి.శర్మ, వేదికపై ఎడమ నుంచి కా॥జస్వంతరావు, కా॥ఝాన్సీ, ప్రొ॥కె.ఆర్.చౌదరి, కా॥కె.కోటయ్య, కా॥కిశోర్‌బాబు

ఈ ఉత్సాహ పూరిత వాతావరణంలో సదస్సుకి వచ్చిన ముఖ్య అతిథులను మరియు వక్తలను రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె.కిషోర్‌బాబు వేదిక పైకి ఆహ్వానించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఝాన్సీ, సంతాప తీర్మానాల్ని ప్రవేశపెట్టారు.

1. ప్రపంచవాణిజ్య సంస్థ విధానాలకు నిరసన తెలియజేస్తూ ఆత్మబలిదానం చేసుకున్న లే-క్యుంగ్-హేకి :

ప్రపంచ వాణిజ్య సంస్థ విధానాల ఫలితం గానే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల రైతాంగం, వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరిన 10సం॥లఅనంతరం దక్షిణ కొరియా రైతాంగం సంఖ్య 6మిలియన్ల నుండి 3మిలియన్‌లకు పడిపోయింది. ప్రపంచ వాణిజ్యంలో దక్షిణ కొరియా చేరికకు ముందు ఆదర్శరైతుగా తోటి రైతుల మన్ననలు, ప్రభుత్వఅవార్డును పొందిన లే-క్యుంగ్-హే ప్రపంచవాణిజ్యసంస్థ నిర్దేశిత విధానాల అమలుతో దెబ్బతిన్న లక్షలాదిమంది రైతులలో ఒకడయ్యాడు. ప్రపంచ వాణిజ్యసంస్థ సాగిస్తున్న దుర్మార్గాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ రైతునాయకుడుగా కృషి చేశాడు. దక్షిణకొరియాలో పుట్టి, మెక్సికోలో కాన్‌కున్ లో సెప్టెంబర్ 11, 2003న ఆత్మ బలిదానం చేశాడు. లే-క్యుంగ్-హే మరణం కోట్లాది మూడవ ప్రపంచ దేశాల రైతుల ఆవేదనకు ప్రతి రూపం. లే-క్యుంగ్-హేకి ఈ సదస్సు జోహార్లు తెలుపుతున్నది.


2. ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాల వల్ల ఆత్మహత్యలు చేసుకున్న రైతాంగానికి:

రాష్ట్ర వ్యాపితంగా ప్రపంచబ్యాంక్ నిర్దేశిస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాలను పాలకులు అమలు జరుపుతున్న ఫలితం గానే రైతాంగం ఆత్మహత్యలు చేసుకోవలసిన దుస్థితికి, విధిలేక ఆందోళనలు జరపవలసిన పరిస్థితికి నెట్టబడ్డారు.

ప్రభుత్వ కుమ్మక్కుతో విత్తన వ్యాపారులు సాగిస్తున్న నకిలీ విత్తన వ్యాపారాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, వరంగల్‌జిల్లా చేవెళ్ళలో జరిగిన ఆందోళనలో అసువులు బాసిన రైతాంగ సోదరులకు సదస్సు జోహార్లు అర్పిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రపంచబ్యాంక్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాల ఫలితంగా ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఇటీవల కాలం వరకు 1150 మంది రైతన్నలు ఆత్మహత్య లు చేసుకొన్నారు. ఈ ఆత్మహత్యలేవీ వ్యక్తిగతం కాదు. ప్రభుత్వం దుర్మార్గంగా సాగించిన సామూహిక హత్యలే. ఆత్మ గౌరవం నిలుపు కొనేందుకు మరో మార్గం కనపడక నిస్పృహతో ఆత్మహత్యలు చేసుకొన్న రైతన్నలకి ఈ సదస్సు సంతాపం తెలియజేస్తున్నది.

3. పీడిత ప్రజా ఉద్యమంలో అమరులైన వారికి

పీడిత ప్రజల ఉద్యమంలో మమేకమౌతూ, ప్రజలకు నాయకత్వం వహిస్తూ; పాలక-పోలీసు యంత్రాంగం చేతిలో అమరులైన వారికి ఈ సదస్సు జోహార్లు తెలుపుతున్నది.



సదస్సుకు హాజరైన ప్రతినిధులు

4. ప్రజాతంత్రవాది కా॥ రత్తయ్యకు

జంటనగరాల ఓ.పి.డి.ఆర్. సంస్థ నాయకుడు, ప్రజాతంత్ర వాది, రైతుకూలీలపై వివిధ సందర్భాల్లో సాగిన నిర్బంధాన్ని ఖండించడంలో ముందున్న కా॥ రత్తయ్యగారి మృతికి ఈ సదస్సు జోహార్లు తెలియజేస్తున్నది అని సంతాప తీర్మానాన్ని సభ ముందుంచారు.

ఒక్క నిముషం మౌనం పాటించి, అమర వీరులకి జోహార్లు చెబుతూ, ప్రతినిధులు సంతాప తీర్మానాల్ని ఆమోదించారు. అరుణోదయ కళాకారులు అమరవీరులకు జోహార్లు చెప్తూ పాడిన పాట ప్రతినిధులకు స్ఫూర్తినిచ్చింది.

సదస్సుకి అధ్యక్షతవహించిన కా॥ ఝాన్సీ తన అధ్యక్షోపన్యాసంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల్ని చర్చించు కోవలసిన అవసరాన్ని తెలియజేసారు. పాలకులు అనుసరిస్తున్న భూస్వామ్య, సామ్రాజ్యవాద అను కూల విధానాల ఫలితంగా వ్యవసాయ రంగ సంక్షోభాన్ని, ఫలితంగా రైతులు ఆత్మ హత్యలు చేసుకుంటున్న దుస్థితిని వివరించారు. రెండురోజుల పాటు జరిగిన ఈ సదస్సులో భారత్ జన్ ఆందోళన్ అధ్యక్షులు డా॥బి.డి. శర్మ ప్రారంభోప న్యాసం చేసారు. 'జనశక్తి' ఎడిటర్ కా॥జస్వంతరావు, ప్రొ॥ సి. రామచంద్రయ్య (సెస్), రైతు కూలీ సంఘం కార్యదర్శి కా॥కోటయ్య,ప్రముఖ వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త ప్రొ॥కె.ఆర్.చౌదరి, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥కిషోర్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥మానం రామారావు, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ గుర్రం విజయకుమార్, విప్లవకవి జ్వాలా ముఖి తదితరులు ఉపన్యసించారు. అనంతరం అనారోగ్య కారణం చేత సదస్సుకి రాలేక పోయిన డా॥పి.వి.ఆర్. భాస్కరరావు (పీమ్) పంపిన ప్రసంగపాఠాన్ని చదివారు.

రెండు రోజుల పాటు సదస్సులో చర్చించిన అంశాలను రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఝాన్సీ సమీక్షించారు. మన రాష్ట్రాన్ని మరు భూమిగా మారనివ్వకుండా, మనపంట పొలాలు ఎడారిగా మారకుండా ఉద్యమించాల్సిన ఆవశ్యకతను వక్కాణించి మాట్లాడారు. సభలోని ప్రతినిధులందరూ ముక్తకంఠంతో మా భూములను ఎడారిగా మారనివ్వం, మా గ్రామాల నుండి బహుళజాతి కంపెనీలను తరిమి, తరిమి, కొడతాం; ఆకలితో చావడం కంటే పోరాటమే మేలంటూ నినాదాలిస్తూ; విప్లవానికే మా జన్మ.... అంటూ ప్రతినిధులందరూ ఏకకంఠంతో ఆలపించడంతో ఉత్సాహం, ఉత్తేజంతో సదస్సు ముగిసింది.

ప్రదర్శన: ఆదివాసీ నృత్యాలతో, అరుణోదయ కళాకారుల డప్పుల డాన్సులతో, సమస్యలపై డిమాండ్లతో కూడిన బానర్లతో, ఎర్రజెండాలతో, రైతాంగ ఉద్యమ నినాదాలతో సభావేదిక నుండి ప్రారంభమైన క్రమశిక్షణాయుత ఊరేగింపు కాచిగూడ స్టేషన్ వరకు సాగింది. ✦



సదస్సు ఆమోదించిన తీర్మానాలు

1. రాష్ట్రమంతా కరువు సహాయక చర్యలు చేపట్టాలి.

గత నాలుగైదు సంవత్సరాలుగా పాలకుల విధానాల ఫలితంగా రాష్ట్రంలో కరువు సమస్య తీవ్రరూపం దాల్చింది. నీరులేక, సాగులేక, పంటలు పండక, అప్పులపాలై రైతులు అల్లాడుతున్నారు. వ్యవసాయ కూలీలు పనులు లేక వలసలు పోతున్నారు. పశుగ్రాసం, మంచినీటి కొరత తీవ్రరూపం దాల్చి, పశువులు కబేళాలకు తరలించబడుతున్నాయి. రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ సహాయం కంటితుడుపు చర్యలుగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కరువు పరిస్థితులను ఎదుర్కోవటానికి సాగునీరు-త్రాగునీరు అందించాలని, పశుగ్రాసం ప్రభుత్వమే సప్లయ్ చేయాలని, రాయల సీమకు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ అమలుజరపాలని, నిత్య జీవితావసర వస్తువులను సబ్సిడీతో పంపిణీ చేయాలని, వ్యవసాయ కూలీ కుటుంబాలకు నెలకి 5 కేజీల బియ్యం ఉచితంగా యివ్వాలని, గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన కరువు పనులు కల్పించాలని, పేద-మధ్య తరగతి రైతులకు వడ్డీలేకుండా 10 వేల రూ॥లు కొత్తరుణాలు యివ్వాలని ఈ సదస్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

2. భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక వ్యవసాయక విప్లవ క్రమం కోసం సమైక్యంగా నిలబడాలి:

పాలకుల సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగా పాలకులు సృష్టించిన కరువు, అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా గ్రామీణ సామాజిక జీవితం చిన్నాభిన్నం అవుతున్నది. వేలాదిమంది కూలీలు పొట్ట చేత పట్టుకొని వలసలు పోతున్నారు. పనుల కోసం వెతుకులాటలో వందలాదిమంది ప్రయాణాలలో ప్రతి సంవత్సరం మరణిస్తున్నారు. పనులులేక, బతుకులేక ఎందరో మహిళలు వ్యభిచారవృత్తిలోకి నెట్టబడి, ఇతర రాష్ట్రాలకు పెద్ద ఎత్తున ఎగుమతి చేయబడుతున్నారు. గ్రామాలలో చేతివృత్తులు మంట గలసి పోతున్నాయి. దళితులపై దౌర్జన్యాలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. విచ్ఛిన్నమవుతున్న సామాజిక జీవితాల పతనానికి, సాంస్కృతిక విలువల పతనం తోడుగా నిలుస్తున్నది. వీటన్నింటికీ మూలం పాలకుల విధానంలో ఉంది. శ్రమజీవులు సమైక్యంగా నిలిచి భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక వ్యవసాయక విప్లవక్రమాన్ని ముందుకు తీసుకు పోవాలని; గ్రామీణ పేద, మధ్య తరగతి ప్రజలకి పిలుపునిస్తున్నది.

3. నల్గొండ జిల్లాలో యురేనియం ప్రాజెక్టు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి.

నల్గొండ జిల్లాలో సాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ అనుకొని వున్న యురేనియం నిల్వలను తవ్వి తీసేందుకు, గనులను తవ్వేందుకు ప్రభుత్వం పథక రచన చేసింది. పర్యావరణ రీత్యా ప్రమాదకరమని, సాగర్ ప్రాజెక్టు నీరు కూడ కలుషితమవుతుందని, ప్రజా జీవితంపై పలురూపాల్లో వ్యతిరేక ఫలితాలు కల్గిస్తుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నా ప్రభుత్వాలు వెనక్కి తగ్గడం లేదు. సామ్రాజ్యవాద పథకాలకు పాలక వర్గాలు కొమ్ముగాస్తున్నాయి. ప్రాజెక్టు మా కొద్దనే ప్రజలకు మద్దతునిస్తూ; ప్రజలకు ప్రమాదకరమైన యురేనియం ప్రాజెక్టుని నెలకొల్పే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని ఈ సదస్సు డిమాండ్ చేస్తోంది.

4. విత్తనాలపై సహజ హక్కురైతులదే; బహుళ జాతి గుత్త సంస్థలకు అప్పుజెప్పుతున్న ప్రభుత్వ విధానాలను ఉపసంహరించు కోవాలి.

వ్యవసాయానికి భూమి, నీటితోపాటు విత్తనం కీలకమైనది. ఆధునిక వ్యవసాయంలో విత్తనం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. తన ప్రత్యక్ష అనుభవంలోంచి పంటల లోని మేలైన మొక్కల నుండి విత్తనాలు కట్టుకోవడం రైతులకున్న అనుభవం. దేశంలో పైరు పచ్చ విప్లవం వచ్చిన తర్వాత విత్తన వ్యాపారంపై సామ్రాజ్యవాదుల కన్ను పడింది. ప్రభుత్వ రంగంలో వ్యవసాయ యూనివర్శిటీలు, వ్యవసాయ పరిశోధన సంస్థలు సాగిస్తున్న పరిశోధనలను తనకు అనుకూలంగా మల్చు కోవడానికి సామ్రాజ్యవాదం నిరంతరంగా ప్రయత్నిస్తున్నది.

సామ్రాజ్యవాద దేశాలలో ప్రభుత్వ సంస్థలు పరిశీలించకుండా కొత్త మొక్కలను, విత్తనాలను అనుమతించటం లేదు. మన దేశంలో మాత్రం విత్తన ఉత్పత్తిపై, దిగుమతిపై ప్రభుత్వం అదుపు లేకుండా చేసాయి సామ్రాజ్యవాద దేశాలు. 1985లో విత్తనాలు, మొక్కల దిగుమతిని ఓపెన్ జనరల్ లిస్టులో చేర్చి, ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులకు అనుమతించారు.

గ్లోబలీకరణ క్రమంలో వ్యవసాయ రంగంలోకి పేటెంట్ల భావన తెచ్చారు. మన జన్యు సంపదను కొల్లగొట్టిన గుత్తకంపెనీలు టెర్మినేటర్, బోల్‌గార్డు వంటి విత్తనాల ఉత్పత్తికి పూనుకున్నాయి.రైతు వ్యతిరేక దోపిడీ ప్రతినిధులు అయిన మన ప్రభుత్వాలు ఈ విత్తన సాగుకి రైతాంగం ప్రతిఘటించినా; ఈ విత్తనాలు నష్టదాయకమని, విష పూరితమని రుజువైనా; రైతుకు ఆదాయం కాదని రుజువైనా; రైతులపక్షం కాక గుత్త కంపెనీల తరుపున వాదించాయి. ఈ దుర్మార్గ వైఖరిని ఈ సదస్సు ఖండిస్తున్నది.

వ్యవసాయ రంగంలో పేటెంట్ల భావనను అంగీకరించరాదనీ, విత్తనాలపై హక్కు రైతాంగానిదేనని ఈ సదస్సు నొక్కి వక్కాణిస్తోంది. గుత్త కంపెనీలకు అనుకూలమైన ధృవీకరణ జీవోను ఉపసంహరించుకోవాలనీ; విత్తనరంగంపై ప్రభుత్వం అదుపు వుంచి నకిలీ హానికర విత్తనాలను అరికట్టాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తుంది. సాధ్యమైనంత వరకూ రైతులే విత్తనాలను పరిరక్షించుకుంటూ, విత్తనంపై రైతాంగానికి పూర్తి హక్కుకై పోరాడాలని పిలుపునిస్తున్నది.

5. దేవాలయ భూములను భూమిలేని నిరుపేదలకు యివ్వాలి.

రాష్ట్రంలో అనేక దేవాలయాలకు సంబంధించిన భూములు వున్నాయి. ఈ భూములు గత అనేక సం॥రాలు ఆయా ప్రాంతాల లోని భూస్వామ్య, పెత్తందార్లు ఎండోమెంటు అధికారులతో కుమ్మక్కై; అతి తక్కువ లీజ్ చెల్లిస్తూ అనుభవించడం జరుగుతున్నది. ఈ మధ్య ప్రభుత్వం ఒక ఆర్డర్ ద్వారా, బహిరంగ వేలాల ద్వారా తిరిగి భూస్వామ్య పెత్తందార్లకు అప్పజెప్పడం జరుగుతున్నది. ఆ జీవోను రద్దు చేసి, దేవాలయ భూములన్నీ భూమిలేని నిరుపేదలకే యివ్వాలని ఈ సదస్సు డిమాండు చేస్తున్నది.

6. జార్ఖండ్ ఆదివాసులపై నిర్బంధాన్ని ఖండిస్తూ .....

జార్ఖండ్ రాష్ట్రంలోని సంతాల్ పరగణా లోని మసాలియా, కుందాహిత్, రానేశ్వర్, డంకా

ప్రాంతాల ఆదివాసులు భూమికోసం; పంటలో సరైనవాటా కోసం; కనీస వేతనాలకోసం పోరాడుతున్నారు. పోరాడుతున్న గిరిజనులపై జూన్ 17 నుంచి పోలీసులు, జార్ఖండ్ ముక్తి మోర్చా నాయకులుగా ఉన్న భూస్వాములు తీవ్ర నిర్భంధాన్ని, మహిళలపై మానభంగాలు, అత్యాచారాలను సాగించారు. భూస్వాముల అమానుష అత్యాచార సంఘటనలను సదస్సు తీవ్రంగా ఖండిస్తూ, సంతాల్ పరగణా ఆదివాసీ ప్రజలకి సంఘీభావం ప్రకటిస్తున్నది

7. ప్రభుత్వం అమలుచేస్తున్న నిర్భంధాన్ని ఖండిస్తూ, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపునిస్తూ

నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల అమలులో భాగంగా పాలకులు అంతకంతకూ తీవ్ర నిర్భంధకాండపై ఆధారపడుతున్నారు. రాష్ట్ర వ్యాపితంగా విత్తనాల మోసాలకి వ్యతిరేకంగా, నీటిపారుదల సౌకర్యం కోసం ఆందోళన జరుపుతున్న రైతాంగంపై ఎన్నో ప్రాంతాలలో లాఠీచార్జీలు, పోలీసుకాల్పులు సాగించారు. నానాటికీ పెరుగుతున్న ప్రజల సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం వీధులలోకి వస్తున్న కార్మిక, మహిళా, ప్రజాతంత్రశక్తులపై నిర్భంధం ద్వారానే విరుచుకొని పడుతున్నది. ప్రభుత్వ నిర్భంధకాండను ఖండిస్తూ, సమైక్యంగా జీవించే హక్కుకోసం, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాలని సదస్సు పిలుపునిస్తున్నది.

8. కార్మికుల-ఉద్యోగుల హక్కులను కాలరాచే కోర్టు తీర్పును పునఃసమీక్షించాలని

తమిళనాడు ఉద్యోగులు సమ్మెచేసిన సందర్భములో ఉద్యోగులకు సమ్మెహక్కు లేదని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమైందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా సమ్మెల గురించి సుప్రీంకోర్టు వ్యాఖ్యలు కూడా దోపిడీ పాలనకు, పరిశ్రమాధిపతులకు అనుకూలంగా చేయబడ్డవే. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల, ఉద్యోగుల సమ్మె హక్కును సుప్రీంకోర్టు తీర్పు కాలరాస్తుంది. ఉద్యోగులు-కార్మికుల హక్కును కాలరాసే ఈ తీర్పుని పునఃసమీక్షించాలని ఈ సదస్సు కోరుతున్నది.

9. స్కాంలపై

32 వేల నకిలీస్టాంపుల కుంభకోణం స్కాంల చరిత్రలో మొదలు కాదు, చివరాకాదు. ప్రజాధనాన్ని "చట్టబద్ధంగానే" కాక చట్ట విరుద్ధంగా కూడా దోచే పాలక వర్గాల విధానం యొక్క అమలు మాత్రమే.స్కాంలలో పాల్గొన్న వారు దాస్తున్నది ప్రజల ఆస్తి. మొదట వారి ప్రమేయం ఉన్న ప్రజాధనాన్ని మొత్తం స్వాధీన పర్చు కోవాలని; స్కాంల పాత్రధారులను, సూత్ర ధారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నది.

10. గొత్తికోయలపై నిర్భంధాన్ని ఖండిస్తూ

ఖమ్మం జిల్లా భద్రాచలం పరిధిలో వందలాది గొత్తికోయ ఆదివాసీ కుటుంబాలు 1980కి ముందు నుండీ నివశిస్తున్న పరిస్థితి ఉంది. ఆంధ్ర, బస్తర్ అనే విభజన లేని కాలం నుంచి దండకారణ్య ప్రాంతంలో నివసిస్తున్న ఆదిమ తెగలలో గొత్తికోయలు ఒక తెగ. వీరిని బస్తర్ నుంచి వచ్చారనే పేరుతో పోలీస్, ఫారెస్ట్ యంత్రాంగం ఇళ్ళు, పంటలు తగలపెట్టడం; బలవంతంగా గెంటివేయటం జరుగుతున్నది. గొత్తికోయల గ్రామాలను తగలబెట్టరాదనే హైకోర్టు ఆదేశాలను సైతం ఫారెస్టు, పోలీసు అధికారులు లెక్క చెయ్యడం లేదు. అడవితల్లి బిడ్డలను అక్రమ వలసదారులుగా పరిగణించి, వారి గ్రామాలను తగుల బెడుతున్న ప్రభుత్వ వైఖరిని సదస్సు ఖండిస్తున్నది.

11. 1/70 చట్టాన్ని సక్రమంగా అమలుజరపాలి

అటవీ ప్రాంతంలోని గిరిజనుల భూములను స్థానిక - స్థానికేతర భూస్వాములు, సంపన్న వర్గాలు వివిధ మోసపు పద్ధతుల్లో కాజేశారు. తమ భూములు, అటవీసంపదపై హక్కు తమకే ఉండాలని; గిరిజనులు బ్రిటిష్ కాలం నుండి అనేక మిలిటెంట్ పోరాటాలు చేసిన ఫలితంగా, పాలకులు అనేక చట్టాలు తీసుకొని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందులో భాగమే 1/70 చట్టం. ఈ చట్టం ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతంలోని భూములు, అటవీ సంపదలతో పాటు సమస్తం గిరిజనులకే చెందుతాయి. గిరిజనుల ఈ హక్కు ను హరించి, గిరిజనులను అడవి నుండి గెంటి వేయటానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పూను కొంటున్నాయి. గిరిజనులను అడవి నుండి గెంటివేసే చర్యలను విడనాడాలని, 1/70 చట్టాన్ని సక్రమంగా అమలు జరిపి, గిరిజన భూములు గిరిజనులకే పంచాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తున్నది.


12. భారీగా పెంచిన మెడికల్, ఇంజనీరింగు విద్య ఫీజులు ఉపసంహరించాలి. ఇందు కోసం పోరాడుతున్న విద్యార్థులపై పోలీసు నిర్భంధాన్ని ఖండిస్తూ....

'ఒకే చదువుకు ఒకే ఫీజులు' అన్న సుప్రీం కోర్టు తీర్పు అమలు పేరిట ప్రభుత్వం ఇంజనీరింగు, మెడికల్ విద్యకు భారీ ఫీజులు నిర్ణయించింది. పేదకుటుంబాల సంగతటుంచి మధ్య తరగతి ప్రజలు కూడ ఇవి భరించలేనివి. దీని పర్యవసానం అత్యధిక ప్రజానీకపు బిడ్డలకు ఈ చదువుల అర్హత లేకుండా చేయడమే. భారీగా పెంచుతున్న ఈ ఫీజులను పూర్తిస్థాయికి తగ్గించాలని సదస్సు డిమాండ్ చేస్తోంది.

మెడికల్ ఫీజుల పెంపును నిరసిస్తూ, కౌన్సిలింగ్ సెంటర్ల వద్ద ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసు నిర్భంధాన్ని సదస్సు తీవ్రంగా ఖండిస్తోంది.

13. గిరిజనులపై బనాయించిన అక్రమకేసులు ఎత్తివేయాలని

ప్రజలను మోసగించటానికి, మాయజేయటానికి చంద్రబాబు నాయుడు జన్మభూములు నిర్వహిస్తున్నాడు. ఇటీవల కాలంలో 19వ విడత జన్మభూమి 'మహిళ, రైతు జన్మభూమి' ని నిర్వహించాడు. కడుపు మండిన రైతన్నలు, గిరిజనులు ఈ జన్మభూమిలో పాలకులను ప్రశ్నించారు. దేనినీ సహించలేని చంద్రబాబు ప్రభుత్వం విజయనగరం జిల్లా దుగ్గేరులో గిరిజనుల పైన, గిరిజన నాయకులపైన తప్పుడు కేసులు పెట్టారు. అక్రమంగా బనాయించిన ఈ కేసులను ఎత్తివేయాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తున్నది.



రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు మూలం ఏమిటో లోతుగా అధ్యయనం చేయండి!

కా॥ ఝాన్సీ, అధ్యక్షులు;
రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)



ఈ రోజు, రేపు నిర్వహిస్తున్న సదస్సుకు విచ్చేసిన మిత్రులకు, ప్రజలకు, పాత్రికేయులకు, మేధావులకు స్వాగతం...

రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు మూలం ఏమిటి? దీనికి పరిష్కారం ఏమిటి? అనే విషయాన్ని సీరియస్‌గా చర్చించుకోవడానికే మనం ఇక్కడికి వచ్చాం. వేసవికాలం వస్తే నీళ్ళు వుండడం లేదు. వ్యవసాయానికి నీళ్ళు లేవు. కల్తీ విత్తనాలు, పురుగుమందులు - వీటి వల్ల పురుగులు చావకపోగా రైతుల ఆత్మహత్యలకు బాగా పనికొస్తున్నాయి. గిట్టుబాటు ధరలు లేవు. తీవ్రమైన కరువు, రైతాంగం ఏమి చెయ్యాలో దిక్కుతోచని స్థితిలో వున్నారు. ఈ కరువుకు కారణం ఎవరు? మొత్తం ప్రతిపక్ష పార్టీలన్నీ అధికారంలో వున్న పార్టీయే కారణం అంటున్నారు. అసలు కారణాలు, మూలాలు మనం తెలుసుకుందాం. గత పరిస్థితుల నుండి మొత్తం క్రమాన్ని పరిశీలిద్దాం. బ్రిటీషువాడు 200 సం॥లు పరిపాలించాడు. మన స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థికవ్యవస్థను నాశనం చేసాడు. వాడికి అనుకూలమైన పంటలు పండించాడు. ఫలితంగా తిండిగింజలు లేక పూర్తి పరాధీనంగా మారి, తీవ్ర కరువు వందల సార్లు మన దేశాన్ని చుట్టుముట్టింది. ఈ 200 సం॥ల కాలంలో; ఉదా॥ బెంగాల్ క్షామంలో లక్షలాదిమంది ఆకలి చావులకు బలయ్యారు. స్వా(హా)తంత్ర్యం వచ్చింది. అధికారం నల్లదొరల చేతిలోకి వచ్చింది. మరి వీళ్ళు చేసిందేమిటి? దళారీ పాలకులు కనుక ప్రాజెక్టులను పక్కన బెట్టారు. రైతాంగానికి సబ్సిడీలను పక్కన పెట్టారు. పేరుకు పైరుపచ్చ 'విప్లవం' అని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ, అందులో భాగంగా సామ్రాజ్యవాదుల షరతుల కను గుణంగా యంత్రాలను తీసుకు వచ్చి పేద రైతుల చేతుల్లో భూమిని లాగేసుకున్నారు. గ్రామాల్లో పంటలు లేవు, పనులు లేవు. రైతులు, కూలీలు పస్తులతో దిక్కుతోచక గ్రామాలు ఖాళీ చేసి వలసలు పోతున్నారు. కనీసం త్రాగునీరు కూడా లేక అలమటించి పోతున్నారు.

చంద్రబాబు గారు జన్మభూమిలో పనికి ఆహారపథకాన్ని ప్రవేశపెట్టారు. కానీ ఎక్కడా ఈ పథకం అమలు కాలేదు. తిరిగి ఆ పథకం కింద వున్న ఆహారం అంతా పాలకవర్గాల చేతుల్లోకి చేరింది. మన పాలకులంతా ఏం చేస్తున్నారు? స్టాంపుల కుంభకోణం నుండి తెల్ల కాగితాలు, మందులు, స్కాలర్‌షిప్‌లు... అన్ని రకాల కుంభకోణాల్లో, నల్లడబ్బు పోగేసుకోవడంలో మునిగి తేలుతున్నారు. ప్రజల్ని ప్రశ్నించనీయకుండా అణచివేస్తున్నారు. రామ జన్మభూమి లాంటి మత్తుల్లో ముంచడానికి ప్రయత్నిస్తున్నారు.

రైతుకూలీ సంఘంగా మన కర్తవ్యం ఏమిటి? సమస్యలపై అధ్యయనం చేసిన మేధావుల, పెద్దల సలహాలను, అభిప్రాయాన్ని తీసుకొని మరింత లోతుగా సమస్యలను అర్థం చేసుకొని ముందుకు వెళ్ళాలి.

ఒక మన్యం వీరుడు, శ్రీకాకుళం గిరిజన వీరుడు, రైతు, కూలీ, కార్మికుడు ఎవరైనా ఎర్రజెండా నీడ క్రింద పోరాటాలు చేసారు. చేయవలసిన అవసరం వుంది. గిరిజనులు, రైతులు, కూలీలు ఐక్యంగా పోరాటాలు చేయాలి. సంఘాలు పెట్టుకొని సమస్యలు సాధించుకోవాలి. మనం ఏదైనా సాధించుకోవాలంటే సంఘాలు పెట్టుకొని రైతులు, కూలీలు, కార్మికులు, మేధావులు అందరూ ఐక్యంగా పోరాడాలి. మన భూముల్ని మనం దక్కించుకోవాలి. మన రాష్ట్రాన్ని మనం కాపాడుకోవాలి. సమస్యలతో పోరాడాలే కాని, ఎక్కడికో వలసలుపోయి దిక్కులేని చావు చావాల్సిన అవసరం లేదు. మనకు సంఘం వుంది. సంఘం నాయకత్వాన పోరాటాలు నిర్వహించి కరువును, పాలకుల విధానాల్ని ఎదుర్కొందాం. పోరాటం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని చెబుతూ ముగిస్తున్నాను. ✦

క్లాస్ థీవ్స్

- కందుకూరి శ్రీరాములు

నా పల్లెను
ఎవడి సామ్రాజ్యంలోనో
కలిపే హక్కు ఎక్కడ వుంది

నా రక్త నరాలు - నా పల్లె
ఆ మట్టిలో ఆడుతూ పాడుతూ
మొలకలై మొలుస్తున్నాను
కొమ్మలై లేస్తూ ఎగురుతూ
గాలులై వీస్తున్నాను

ఎండా వానా గాలీ నింగీ నేలా
ఏ ఒక్కదాని మీద
ఏ ఒక్కరికీ అధికారముండొద్దు
ప్రకృతి మీద వికృతాకార
పాదమెందుకు?

తొండాల దాహం ఖండాలు
దాటి పోతుంటే
ఖండించటమే కాదు పనిముట్టుకు పనితనం
ఎలుకల మీద ఏనుగుల సవారి
ఎవరూ క్షమించరు

అసలు ఈ చెలాయించడమనే దానిని
చెలామణిలోకి తెచ్చింది
ఎవడు నేర్పిన విద్య

నా బాల్యం నాది కాకుండా
నా అన్నం నాది కాకుండా
నా భూమి నాది కాకుండా
మతమో సామ్రాజ్యమో
గాడిదమోత వద్దు నా మీద


పల్లె ఊపిర్లమీద
పంజరాలు విసిరి
పక్షులు గొంతు పిసికి
రక్తాన్ని తాగటం రాక్షస కృత్యం

మానవులకైతే మనసుంటుంది
సామ్రాజ్యవాదులు
దానవులని చరిత్ర చెబుతుంది

క్లాస్‌థీవ్స్
సామ్రాజ్యవాద మత్తేభాల్లారా !
పేదవాణ్ణి చూసి పెదవి విరిచినా ఫరవాలేదు
పెత్తనం చెలాయించాలని చూశారా
చిన్నవైన చిరుతపులులు
ఎగిరి పంజాలు విప్పి
ఏనుగుల కుంభ స్థలాల్ని తింటాయి.

"సామ్రాజ్యవాదానికి, రుణభారానికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడండి!"

డా॥ బి.డి. శర్మ
అధ్యక్షులు; భారత్ జన్ ఆందోళన్



రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలన్నింటి నుండి వచ్చిన ప్రతినిధులందరికీ వందనం. ఈ రోజున మీరు గ్రామీణ ప్రాంతాల్లో ఋణభారం, నీటి ప్రైవేటీకరణ మొ॥ ముఖ్య అంశాల గూర్చి ఈ సదస్సును జరుపుకుంటున్నారు. నేను ప్రారంభంలో వీటికన్నింటికి మూలమైన సమస్య గూర్చి మాట్లాడదల్చుకున్నాను. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచే కాకుండా, బ్రిటీషు కాలం నుండీ అవలంభిస్తూ వస్తున్న కొన్ని విధానాల గూర్చి చెప్తాను.

నీటి ప్రైవేటీకరణ అన్నది నూతన ఆర్థిక విధానాల ప్రవేశం తర్వాత వచ్చింది. ఇక్కడ నీరే కాకుండా మొత్తం వ్యవసాయ రంగాన్ని ఒక జీవన విధానంగా గుర్తించకుండా, అదొక వ్యాపార రంగంగా వీళ్ళు గుర్తించారు. దాన్నుంచే నీటి ప్రైవేటీకరణ అనే అంశం ముందుకు వస్తోంది. దేశం స్వాతంత్ర్యాన్ని పొందిన తర్వాత, పొందక ముందు ఉన్న అంశం పాలకులు వ్యవసాయాన్ని ఒక విధానంగా అంగీకరించి ముందుకి తీసుకొచ్చారు. అదే సమయంలో ఆనాడు భూమి కోసం, భూమి మీద హక్కు కోసం అనేక పోరాటాలు ముందుకు వచ్చాయి. ఈరోజు పాలక వర్గం మరొక వైఖరిని తీసుకొంది. 2000 సం॥ వచ్చే సరికి ఇక్కడ వీరు చెప్తున్న దేమిటంటే భూమి, వ్యవసాయం ఒక వాణిజ్యమైన కార్యకలాపం. దీనికి పెట్టుబడి కావాలి. ఈ పెట్టుబడి రైతుల వద్ద లేదు. ఈ పెట్టుబడి ప్రభుత్వం వద్ద లేదు. ఈ పెట్టుబడిని ఒక పెట్టుబడిదారుడు, ఒక ధనికుడు మాత్రమే పెట్టగలరు. కాబట్టి వ్యవసాయాన్ని ధనికులకి, పెట్టుబడి పెట్టగల వ్యాపార శక్తులకి అప్పగించాలి. మొత్తం వ్యవసాయ విధానం ఒక జీవన విధానం అన్న దాన్నుంచి ప్రభుత్వం వైదొలిగిన అంశం ఇది. వైదొలిగిన అవగాహన ఇది. ఇలా చెప్పటానికి ప్రభుత్వానికి ఉన్న హక్కు ఏమిటి?

ఏ హక్కుతో ఈ ప్రభుత్వం డబ్బున్న వాడికి భూమి వెళ్ళిపోవాలని చెప్తుందనేది ప్రధానప్రశ్న?. ఇక్కడ మనం గమనిస్తే డబ్బున్న వాడి చేతుల్లోకి భూమి వెళ్ళిపోవాలి అంటున్న ఈ ఆర్గ్యుమెంట్ వెనకాలకి వస్తే మామూలు ప్రాంతాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ఈప్రశ్నని అనేక మంది మర్చి పోయారు. అయితే చాలా మంది– ఏదైతే గిరిజనులు ఆదివాసీ ప్రాంతాల నుండి వచ్చారో, ఈ ప్రశ్న ఎంతో కాలం క్రితమే వారు లేవనెత్తారు. బ్రిటీష్ పాలకులు ఈ దేశం నలుమూలలకి చొచ్చుకు వస్తున్న కాలంలోనే తానాభగత్ ఈ ప్రశ్న వేసాడు. ఈ భూమి మీద హక్కు ప్రజలదా? ప్రభుత్వానిదా? ప్రజలదైతే దానిని ఎవరికీ అప్పజెప్పే హక్కు ప్రభుత్వానికి లేదు. ప్రభుత్వానిదైతే దానిని ఎవరికైనా అప్పజెప్పే హక్కు ఉంది. ఇది ప్రజలది అని అంగీకరిస్తే అది ఏరకంగాను ధనవంతులది కాదు. అది ప్రజలందరి హక్కుగా ఉంటుంది.

బ్రిటీష్ వలస పాలకులు తమ యూరప్‌లోని ఫ్యూడల్ విధానాలను ఈ దేశం మీద రుద్దారు. దాని అవగాహన ప్రకారం ఈ దేశంలోని సహజ వనరుల్ని, భూమిమీద కొద్ది మందికి అధికారాన్ని కట్టబెట్టే అవగాహన అది. అలా బ్రిటీష్ పాలకులు ఫ్యూడలిజాన్ని ఈ దేశం మీద రుద్దటం వల్ల ప్రభుత్వానిది అధికారం అయ్యింది. అధ్యక్షురాలు చెప్పినట్లు చంద్రబాబు "భూమిపై అధికారం ప్రభుత్వానిదే" అని చెప్తున్నాడంటే దాని వెనక ఉన్న అవగాహన ఉన్నతాధికారం ప్రభుత్వానిది. భూమి మీద, సహజవనరుల మీద అధికారం ప్రభుత్వానిదన్న అవగాహన దీని వెనకాల ఉంది. **సహజవనరుల మీద, భూమి మీద అధికారం ప్రజలది కాదు; ప్రభుత్వానిది అన్న ఈ అవగాహనని ప్రశ్నించకుండా; ఈ అధికారాన్ని మనం ఎదుర్కోకుండా నీటి ప్రైవేటీకరణ అనే సమస్యను ఎదుర్కోలేం.**

సహజ వనరులపై అధికారం ఎవరిది? అన్న సమస్య ఒక్కటే మిళితమై ఉంది. బ్రిటీష్ వాడికి ముందు ప్రజలే గ్రామసభలు, వ్యవహారాలు చూసుకొనే వారు. బ్రిటీష్‌వారు వచ్చిన తర్వాతనే వాడు వీటిని మొత్తాన్ని రద్దుచేసి, పోలీసు వ్యవస్థను ఏర్పరచి; ప్రజలకాళ్ళు, చేతులు కట్టి వేసి దేశాన్ని దోచుకోవడం మొదలుపెట్టారు.

స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. స్వేచ్ఛా వచ్చిందన్నారు.కానీ ఆ గ్రామం మాత్రం బానిసగానే మిగిలిపోయింది. ఏ సామ్రాజ్యవాద వ్యవస్థ, వలస వ్యవస్థ ఐతే తమ సమిష్టి వ్యవహారాలని సమిష్టిగా నిర్వహించుకోలేకుండా వారిని బానిసగా మార్చిందో; ఆ వ్యవస్థ స్వాతంత్ర్యం వచ్చిందన్న తర్వాత కూడా కొనసాగింది. అదే గ్రామ వ్యవస్థ బానిసగా నిలబడి పోయింది. ఆ బానిస విధానమే ఈ రోజుకీ కొనసాగుతోంది. కనుకనే చంద్రబాబులాంటి వారు ఏం చెయ్యదలచుకొంటే అదే చేయగలుగుతున్నారు. గ్రామాలు వలస విధానం నుండి తమను తాము రక్షించుకోలేక పోతున్నాయి. కనుక చంద్రబాబుకు గ్రామాలను తమ గుప్పెట్లో పెట్టుకోవడం సులువవుతుంది. వాడికి అనుకూలమైన విధానాలన్నింటినీ ఇంప్లిమెంట్ చెయ్యించుకోగలుగుతున్నాడు.

గ్రామం ఒక బానిసగా మిగిలిపోయింది. ఇదే ప్రధాన అంశం. ఈ రోజు మీరు ఇక్కడ రైతాంగం ఎదుర్కొంటున్న, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చిస్తున్నారు. ఈ సమస్యలకి మూలాలు తెలుసుకోవాలంటే "గ్రామవ్యవస్థ బానిస అవ్వటం" అన్న ఈ అంశం దగ్గర నుంచి మన విశ్లేషణని ప్రారంభించుకోవాలి. బ్రిటీష్ పాలకులు ఈ దేశంలోకి వచ్చినపుడు ఈ దేశం మీద వాళ్ళు ఒక వ్యవస్థని రుద్దారు. భూమి శిస్తులు వేసి, అప్పులు ఇచ్చి, వాటిని బలవంతంగా వసూలు చేస్తూ, శిస్తు కట్టని వారిని అరెస్టు చెయ్యొచ్చనే చట్టం చేసారు. రైతుల్ని జైళ్ళల్లో తోసి భూముల్ని లాక్కున్నారు. మొత్తం దోచుకున్న సొమ్మునంతా తీసుకువెళ్ళి ఇంగ్లండ్‌లో పరిశ్రమలను అభివృద్ధి చేసుకున్నారు. ఇది బ్రిటీష్ వాడి కాలంలో జరిగింది.

ఇంగ్లండ్‌లో డబ్బులు పోగుబడటానికి, సంపద పెరగటానికి భారత రైతుల్ని దోపిడీ

చేసారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అధికారం లోకి వచ్చిన కొత్త పాలకులు రైతాంగం మీద, భారత గ్రామీణ ప్రజల మీద ఈ దోపిడీని ఆపుతారని ఎవరైనా ఆశిస్తారు. కానీ ఈ కొత్త పాలకులు అవే దోపిడీ విధానాల్ని ఈదేశంలో అనుసరించారు, కొనసాగించారు. గ్రామాల్లో రైతులను దోచి సంపాదించిన డబ్బుతో నగరాలను అభివృద్ధి చేస్తున్నారు. వాస్తవంగా గ్రామాల్లో పేదల మీద దోపిడీ జరుగుతుంది. గ్రామీణ పేదలు నిరంతరం దోపిడీకి గురి అవుతుంటే, ఆ దోపిడీ నుంచి నగరాల్లో అభివృద్ధి కేంద్రీకృతం అయ్యింది. "రైతులు టాక్స్ కట్టడం లేదు. అనేక సబ్సిడీలు కోరుతున్నారు. మేం నగరాల్లో ఉన్న వాళ్ళమే కడుతున్నాం." అంటు న్నారు. కాని ఇది అబద్దపు వాదన. వాస్తవానికి ఈ గ్రామీణ వ్యవస్థ మీద జరుగుతున్న దోపిడీ నుంచే ఆ నగరాల అభివృద్ధి జరుగుతున్నది. గ్రామీణులపై దోపిడీ జరుగుతోందనే దాన్ని కూడా ఈ వ్యవస్థ గుర్తించడం లేదు. ఆమోదించడం లేదు. అదే కీలకమైన, ముఖ్యమైన అంశం.

గ్రామీణ వ్యవస్థను దోపిడీ చేస్తున్న క్రియ లేంటి? అనే విషయాన్ని మనం పరిశీలించాలి. ఏ విధంగా గ్రామీణ ఆర్థిక వ్యస్థని దోపిడీ చేసుకుంటున్నారో చూడాలి. గతంలో సం॥ క్రితం గుంటూరులో మన మిత్రులందరం కలసి సమావేశం అయ్యాం. మనవాళ్ళందరూ గ్రామాల్లో రైతుల సమస్యలపై సర్వే చేసి తీసుకువచ్చారు. దీని ప్రకారం గ్రామాల్లో రైతులు కష్టపడితే రోజుకు 30రూ॥ కూలీ గిడుతుంది. దాదాపు 80% రైతు-కూలీల పరిస్థితి ఇదే. 80% రైతాంగానికి ఆదాయం ఏమీ మిగలటం లేదు. వాళ్ళ ఖర్చులకి సరిపోవటం లేదు. రైతు రోజంతా పొలంలో కష్టపడి పనిచేస్తే అతనికి, ఆ రైతులకి వస్తున్న ఆదాయం 30 రూ॥లు. ప్రభుత్వ ప్యూనుకి రోజుకు 100-150 రూ॥, ఐ.ఎ.ఎస్. అధికారికి రోజుకు 1000 రూ॥, సుప్రీంకోర్టు లాయరు ఒకరోజుకు1 లక్ష రూ॥ చార్జి వేస్తాడు. ఎందుకని ఈ తేడా వచ్చింది? ఈ దేశానికి తిండిపెడుతున్న రైతుకి 30 రూ॥ ఆదాయం ఏమిటి? " దేశానికి అన్నం పెట్టే రైతు కన్నా ఒక లాయరునైన నాకు ఎందుకు ఎక్కువ జీతం ఉండాలి?" అని గాంధీ ప్రశ్నించారు. మేం ఆయన అనుచరులం అని చెప్పుకొనే వారందరూ ఈ ప్రశ్నను వదిలి వేసారు. వాళ్ళు చెప్పేది "నువ్వు అమాయ కుడివి, నీకు చదువు రాదు, నీకు నైపుణ్యం లేదు. కాబట్టి నీకు వచ్చే జీతం అంతే.నేను లా చదివాను, నేను సుప్రీంకోర్టులో వాదిస్తాను. కాబట్టి నాకు రావల్సింది 10 వేల ఆదాయం." ఎవరి శ్రమతో అయితే మనం బ్రతుకు తున్నామో, తిండి తింటున్నామో ఆ రైతుకు 30 రూ॥; అతని మీద ఆధారపడి బ్రతికే వారికి వేల రూ॥ జీతాలు ఎందుకు వుండాలి? వారు చెప్తున్నారు. నీకు నైపుణ్యం (Skill) లేదు కనుక, నీ కూలీ అంతే. నేను చదువుకున్నాను, నైపుణ్య వంతున్ని కనుక నేను నీశ్రమను దోచుకుంటా నని నిర్భయంగా ప్రకటించుకుంటున్నారు. మన తాతలు, తండ్రులు అనుసరిస్తూ వచ్చారు. నిజమే కాబోలు అనుకున్నారు. జరుగుతున్న దేమిటంటే ఈ దేశానికి తిండిపెట్టేది, ఈ సమాజం మనుగడ అయ్యేది రెండు అంశాల మీద. 1. సహజవనరుల మీద, 2, ఆ సహజ వనరులని వినియోగించుకోవడానికి మానవ శ్రమశక్తి అవసరం. ఆ శ్రమశక్తి, సహజ వనరులే ఈ సమాజాన్ని బ్రతికిస్తున్నాయి. ఆ సహజ వనరులను ఉపయోగించుకొని శ్రమి స్తున్న రైతులకి 30రూ॥, మిగిలిన వారికి ఎందుకు10వేల రూ॥ఆదాయం? అని ప్రశ్నిస్తు న్నాను. గ్రామవ్యవస్థ ఎలా దోపిడీ చేయబడు తుంది?ఎక్కడ దోపిడీ కీలకం ఉంది? అన్న అంశాన్ని మీరు స్పష్టంగా అర్థం చేసుకో గలరనుకుంటున్నాను.

ఒకప్పుడు చర్చలు జరుగుతున్నప్పుడు మహా మేధావులు వున్నారు. ప్రధాన మంత్రి వున్నారు. అప్పుడు నేను ఒక ప్రశ్నవేసాను. ఎందుకు ఈ దేశంలో వేతనాలను నిర్ణయించడంలో రెండు రకాల పద్ధతులనుసరిస్తున్నారు? సంఘటిత రంగంలో అతని కుటుంబం మొత్తం జీవించ డానికి అవసరమైనదిగాను, అసంఘటిత రంగం లో కుటుంబంలో ఇద్దరూ శ్రమ చేస్తేనే కుటుంబం గడిచే విధంగా ఎందుకు నిర్ణయిస్తున్నారు? ఎందుకు ఈ దేశానికి తిండి పెడుతున్న రైతు శ్రమను నైపుణ్యం లేనిదిగా, తేలికగా చూస్తున్నారు? వ్యవసాయంలో ఇక్కడే ఒక ప్రశ్న ఎదురవుతోంది. వాళ్ళది నైపుణ్యం లేని శ్రమగా! మరి వీళ్ళకంటే ఎవరికి నైపుణ్యం ఉంది? ఒక అగ్రికల్చర్ బి.యస్.సి. స్టూడెంట్‌ని నేను అడుగుతున్నాను. అతను నాగలికి ఎద్దులను కట్టగలడా? దున్నగలడా? నాటగలడా? మరి ఆ పనిని అలవోకగా చేసి, పంట పండించే రైతు శ్రమ పట్ల చిన్నచూపు ఎందుకు చూస్తు న్నారు? అంటే ఒక వృత్తిని, ఈ దేశానికి తిండిపెడుతున్న ఒక వృత్తిని, శ్రమని విలువ లేనిదిగా గుర్తించి తక్కువ విలువ కడుతున్నారు. ఇదే దోపిడీకి మూలం. దేశ సంపదను తర లించుకుపోతున్నారు. ఇదే దోపిడీకి ప్రధానమైన విషయం.

ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి నూటికి 70% వ్యవసాయంపై, 30% ఇతర వృత్తులపై ఆధార పడుతున్నారు. ఈనాటికీ కొద్దిపాటి తేడాతో అదే పరిస్థితి కొనసాగు తోంది. మహా అయితే 68%,69% మధ్య వ్యవసాయం మీద ఆధారపడుతుండగా; 31, 32% ఇతర వృత్తుల మీద ఆధార పడుతున్నారు. 68,63% జాతీయ ఆదాయం వస్తోంది. అది అవతల పక్క 33,34% ఇతర వృత్తులలో నుంచి జాతీయ ఆదాయంలో వస్తోంది. 80% ఉన్న మొత్తం ఉత్పత్తిలో నుంచి వస్తున్న జాతీయ ఆదాయం 24%. 70% మంది వ్యవసాయం మీద ఆధారపడి బ్రతుకుతున్నది. వాళ్ళకి తిరిగి అందుతున్నది 24% మాత్రమే. ఒక ప్రక్క ధనవంతులైన 10% పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు వీళ్ళందరికీ వస్తున్న ఆదాయం 55%. వాళ్ళ వృత్తి ద్వారా వస్తున్న ఆదాయం దేశ జాతీయ సంపదలో 15% మించటం లేదు. అయిన ప్పటికీ వాళ్ళ ఆదాయం 55%. అంటే దేశంలో జరిగిన ఉత్పత్తి మొత్తంలో సగానికి పైగా వాళ్ళ చేతుల్లోకి వెళుతోంది. ఇక్కడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దోపిడీ చేయబడి సంపదలు ఒక ప్రక్క పోగుపడుతున్నాయి. మన దేశంలో స్వాతంత్ర్యం సంపాదించామని చెబుతున్న ఈ పాలనలో ఎందువల్ల ఆదాయాల్లో ఈ వ్యత్యాసం ఉంటుంది? ఈ ప్రశ్నను ఎవరూ ఎందుకు అడగరు. ఒక యూనివర్శిటీలో నేను ఈ ప్రశ్నను అడిగితే అంతా నిశ్శబ్దంగా వున్నారు. ఒక నిశ్శబ్దమైన కుట్ర ఈ దేశంలో జరుగుతోంది. దీన్ని అమలు జరపాల్సిన వర్గాలే, 10% ఉండీ ఆదాయాన్ని సంపాదించుకుంటున్న వర్గాలే బయటికి ఎన్నైనా మాట్లాడతాయి. కాని ఆచరణ లోకి వచ్చేసరికి ఇలాంటి ప్రశ్నలు లేవనెత్తకుండా నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారు. ఇదే జరుగుతున్న కుట్ర. ఇదే దోపిడీలో ఒక ముఖ్యమైన అంశం.

ఈ విధానం వెనుక కుట్ర ఏమైనా వుందా? ఆ కుట్ర ఏమిటో పరిశీలిద్దాం ఈ రోజు ప్రపంచానికే నాయకుడిగా చెప్పుకుంటున్న అమెరికా గురించి ఉదాహరణగా తీసు కుందాం. 1931లో అమెరికా ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకొంది. రైతుల్ని తిరగలి వంటి

విధానాల్లో వేసి తిప్పి పక్కన పడేయ దలచు కుంది. ఆ తిరగలి ఏమిటి? వ్యవ సాయానికి అవసరమైన వస్తువుల ధరలు పెంచటం ఇదొక రాయి, దాని మీద వ్యవసాయ ఉత్పత్తులకి ఇచ్చే రేట్లన్నీ తగ్గించి వేయటం రెండవది. ఈ రెండు రాళ్ళ మధ్య వేసి రైతాంగాన్ని నలిపివేసి నాశనం చెయ్యాలనే ఒక నిర్ణయాన్ని ప్రభుత్వం ఒక విధానంగా తీసుకుంది. ఇవ్వాళ 2000 సం॥ వచ్చే సరికి పరిస్థితి ఏమిటి? అమెరికా జనాభా లెక్కలు పరిశీలిస్తే ఆ జనాభా లెక్కల్లో నీ వృత్తి ఏమిటి? అనే ప్రశ్న దగ్గర రైతు అనే వృత్తి లేదు. ఆ జనాభా లెక్కల్లోంచి రైతు అనే వృత్తి చేస్తున్న వాళ్ళు లేకుండా పోయారు. ఈ రోజు అమెరికాలో పేదరైతు అంటే 10 వేల ఎకరాలు కలిగిన వాడు. భూమి మొత్తం, అమెరికాలోని 80% భూమి నాలుగు పెద్ద కంపెనీల చేతుల్లోకి పోయింది. పెద్ద పెద్ద కార్పోరేట్ సంస్థల పరం అయిపోయింది. ప్రజల చేతుల్లో ఏం లేదు. 1931లో అమెరికా తీసుకున్న నిర్ణయం భూమి నుంచి రైతాంగాన్ని బలవంతంగా బయటికి నెట్టివేసి, వ్యవసాయాన్నంతా పెద్ద పెద్ద కార్పోరేట్ సంస్థలకి ఇవ్వటం ఈ రోజున అమెరికాలో కన్పిస్తున్నది.

స్వతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ దేశంలో ఏం జరిగింది.? పశ్చిమ దేశాల్లో ఏ విధానాలైతే అమలు చేసారో, అవే విధానాలు అవలంభించ బడ్డాయి. దేశంలోని సహజ వనరులను ప్రజలం దరికీ అందుబాటులోకి తీసుకు రావటానికి బదులు కొంతమంది చేతుల్లోకి పరిమితం చేసారు. వ్యవసాయ రంగానికి సంబంధించి చూస్తే మనం ఏం చేయగలిగే వాళ్ళం? మన దేశంలో సహజవనరులు అపారంగా ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తీసుకురాగలిగిన శ్రమశక్తి కూడా అపారంగా వుంది. కాబట్టి మనం ఈ దేశంలో అభివృద్ధి అంటే శ్రమ శక్తిని వినియోగించుకోవటం అనే వ్యూహం తోటి అభివృద్ధిని సాధించాలి. దీనికి ప్రతిగా ఇలా చేయకుండా పాలక వర్గాలు పెట్టుబడి పెట్టటం అనే అంశాన్ని తీసుకు వచ్చారు. ఈ దశలో వాళ్ళు పైరుపచ్చ విప్లవం అనే దాన్ని అమలు జరిపారు. పైరుపచ్చ విప్లవం పేరుతో, "యంత్రాలు తెచ్చి ఎక్కువ పెట్టుబడి పెట్టండి. ఎక్కువ లాభం పొందండి. అందుకు ఎక్కువ శాతం భూముల్ని చేతుల్లో పెట్టుకోండి." అన్నారు. దీన్ని రైతాంగం అమల్లో పెట్టడం కోసం సబ్సిడీలు ఇచ్చారు. ట్రాక్టర్లు ఇచ్చారు. తక్కువకి ఎరువులు ఇచ్చి దీన్ని వాళ్ళు ఆమోదించేట్లు చేసారు. కాని ప్రపంచంలోని అనుభవాలు ఏమిటి? అన్ని అనుభవాల్ని మనం పరిశీలిస్తే ప్రపంచవ్యాప్తంగా చిన్నకమతాల్లో అధిక దిగుబడి వస్తుందనేది రుజువైన వాస్తవం. దీన్ని ప్రక్కన పెట్టి పైరు పచ్చ విప్లవం పేరుతో భూముల్ని కొంతమంది చేతుల్లోకి కట్టబెట్టారు. ఫలితంగా మార్కెట్ వారి చేతుల్లోనే కేంద్రీకృతమై వుంది.

పంజాబ్‌లో ఈ రోజు చూస్తే ఎడ్లబండి, నాగలి కనబడదు. మొత్తం ట్రాక్టర్ల రైతు స్వంతం గా ఏమీ చెయ్యలేని దుస్థితి; రైతు కరెంట్ మీద, డీజిల్ మీద, ఆధారపడాలి. యంత్రాల మీద ఆధారపడాలి. మల్టీనేషనల్ కంపెనీల నుంచి వస్తున్న విత్తనాల మీద ఆధారపడాలి. ఎరువుల మీద ఆధారపడాలి. రైతు తను సొంతంగా చెయ్యలేని స్థితి ఏర్పడింది. స్వతంత్ర ఆర్థికస్థితి అనేది మిగల్లేదు. ఇప్పుడు ఈ రకంగా రైతులకి సబ్సిడీ రూపంలో పైరుపచ్చ విప్లవాన్ని అలవాటు చేసి, వారిని ఈ రకంగా పరాధీనులని చేసిన తర్వాత డబ్ల్యు.టి.ఓ. ప్రవేశించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ వచ్చింది. "సమానత్వం తీసుకు రావాలి కనుక మీరు సబ్సిడీలు ఇవ్వదు. మేం ధరలు ఇవ్వద్దు. అందరం కలిసి ఓపెన్‌గా మార్కెట్లో పోటీపడి సరుకులు అమ్ముకుందాం" అని చెబుతున్నది. లక్షలాది ఎకరాలు కలిగిన ఒక పెద్ద కంపెనీ పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తుంటే; 2 ఎకరాలు, 1ఎకరం కూడా లేని రైతులు వాళ్ళతో ఎలా పోటీ పడగలరు? ఈ పోటీలో మనం ఇప్పటికే ఓడిపోయాం. అమెరికాలో గోధుమ ఉత్పత్తి ధర రైతుకి 2 రూ. పడుతోంది. మనం ఆ స్థాయిలో ఉత్పత్తి చేయలేం. ఒకసారి ఆంక్షలన్నీ తొలగించి సమానంగానే వాణిజ్యం చేసుకుందామనంగానే మనం దీంట్లో ఓడి పోయాం. యుద్ధం ప్రారంభం కాకుండానే మనం ఓడిపోయాం. ఈ అంశాన్ని భారత పాలకులు గుర్తించటం లేదు. డబ్ల్యు.బి., డబ్ల్యు.టి.ఒ.లు కలిసి ఈ సబ్సిడీలను ఎత్తేయండి అనగానే భారత ప్రభుత్వం వాటిని ఎత్తేయటానికి పూనుకుం టోంది. ఈ రకంగా "ఈ రైతుల దగ్గర పెట్టుబడి లేదు. కనుక వీళ్ళని ప్రక్కన పెట్టేయాలి. తమలో ఎవరైతే డబ్బు పెట్టుబడి పెట్టగలిగి, ఎక్కువ ఉత్పత్తి చేస్తారో వాళ్ళకే ఈ భూముల్ని అప్పజెప్పాలి" అని వాళ్లు చెప్పిన మాటలని వీళ్ళు అనుసరిస్తూ వస్తున్నారు. కాబట్టి ఈ రోజున డబ్ల్యు.టి.ఒ.తోపాటే వెనకాల విదేశీ బహుళ జాతి కంపెనీలు, పెద్ద పెద్ద కంపెనీలు ప్రవేశి స్తున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లోకి ప్రవేశిస్తున్నాయి. క్రమంగా భూమిని ఆక్రమించుకుంటున్నాయి. రైతుల్ని భూమి నుంచి తరిమి వేస్తున్నాయి.

కనుక ఈ మొత్తం విధానం ఢిల్లీలో కూర్చొన్న వాజ్‌పేయిగారు, హైద్రాబాద్‌లో ఉన్న చంద్రబాబు చేస్తున్నదిగా మనం చూడలేము. ఇది విశ్వవ్యాపితంగానే జరుగుతున్న ఒక కుట్ర. ఈ కుట్ర వెనకాల సామ్రాజ్యవాదం ఉంది. కనుక సామ్రాజ్యవాదాన్ని పారద్రోలకుండా మన రైతాంగ సమస్యలు పరిష్కారం కావు.

ఇక్కడ 3వ అంశం ఒకటి ఉంది. అది గ్రామీణ రుణభారం. ఉత్తర ప్రదేశ్‌లోని చెరుకు పండించే ఒక గ్రామంలో, అది చాలా ధన వంతమైన గ్రామం అని పేర్కొంటారు. ఆ గ్రామంలో రైతులతో నేను మాట్లాడాను. చాలా విషయాలు చెప్పారు. నేను చివరికి ఒక ప్రశ్న అడిగాను. మీ రుణభారం ఏమిటి? మీ అప్పు లేమిటి? ఇహ మొత్తం అసలు విషయాలు అన్నీ బయటకి వచ్చాయి. 15సం॥రాల క్రితం గ్రామంలో ఏ ఒక్క రైతుకి అప్పు లేదు. అతను అప్పుపడి లేడు. ఎలా? ఈ దేశంలో అప్పులు లేని, అప్పు చెయ్యని రైతు అంటూ లేడు అనే అంతగా అప్పుల భారంలో కూరుకుపోయాడు. మీకు తెలిసే వుంటుంది. పంజాబ్‌లోని ఒక గ్రామం బయట బోర్డు పెట్టారు. "ఈ గ్రామం అమ్మ కానికి వుంది. కొనే వాళ్ళు ఎవరైనా వుంటే కొనుక్కోండి" అనే పరిస్థితి ఏమిటి? 50% భూమి అమ్మేసుకొని వాళ్ళు వెళ్ళిపోయారు. మిగతా 50% జనం వాళ్ళ భూమిమీద ఎకరం మీద 5 లక్షలదాకా అప్పుల్లో మునిగిపోయి ఉన్నారు. ఇవ్వాళ వాళ్ళు ఏం శ్రమపడు తున్నారు? అంటే ఇవ్వాళ వాళ్ళు కట్టుబానిసల స్థితిలో నిలబడిపోయారు. వాళ్ళు ఉత్పత్తి చేస్తున్నది బ్యాంకులకి, ఇతర అప్పుల వాళ్ళకి, షావుకార్లకి తిరిగి చెల్లించటం కోసమే. భూమి లో పనిచేయాల్సిన కట్టుబానిసలుగా అయి పోయారు. అతని పేర పట్టా ఉండవచ్చు. కాని అప్పు ఇచ్చిన బ్యాంకులోనో, ఆ షావుకారి దగ్గరో ఆ పట్టా ఉంది. వాళ్ళ అప్పులకి వడ్డీలు కట్టటానికి మాత్రమే శ్రమ చేయాల్సిన స్థితి వచ్చింది. ఆ విధంగా రుణభారం ఈ దేశ రైతాంగాన్ని కట్టుబానిసల స్థాయికి దిగజార్చింది.

నేను ఒక కథ చెబుతాను. అది జరిగిన కథే. జార్ఖండ్ రాష్ట్రంలో జరిగింది. సీతారాం అన్నరైతు బ్యాంకు నుండి 11,000రూ॥ అప్పు

తీసుకున్నాడు. అతని కొడుకులు ఆస్థి అంతా అమ్మి 11,000లకి ఎలాగన్నా కాని 13,000 రూ. తిరిగి చెల్లించారు. 1990లో దేవీలాల్ గారు వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడు "వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తాం. 10,000 రూ॥ల వరకి" అని చెప్పాడు. 10,000రూ॥ వ్యవసాయ మాఫీ కలుపుకుంటే ఆయన బ్యాంకుకి చెల్లించింది 23,000రూ॥. ఆయన తీసుకున్నది 11,000 రూ॥, ఆయన తిరిగి చెల్లించింది 13,000రూ॥ ప్రభుత్వం మాఫీ క్రింద 10,000 రూ॥ ఇచ్చింది. అంటే 23,000 రూ॥ బ్యాంకుకి చేరింది. 1998 వచ్చే సరికి రూ॥54,766, నువ్వు బకాయి వున్నావని బ్యాంకు నుంచి నోటీసు వచ్చింది. ఈ మధ్యలో ఇంకొకటి జరిగింది. ఈ 10,000 రూ॥ ఋణాలు మాఫీకి ముందు ఆయన్ని జైల్లో పెట్టారు. 15 ఏళ్ళు జైల్లో ఉన్నాడు. ఆ 10,000 మాఫీ అయిపోయింది. ఆ సీతారాం గారు "ఇహ ఇంతటితో అయిపోయింది. నా ఋణం తీరి పోయింది" అనుకున్నాడు. కాని 1998 వచ్చే సరికి ఆయనకి బ్యాంకు నుంచి నోటీసు వచ్చింది. 54,766 రూ॥ నువ్వు బకాయి వున్నావు అని. ఆ బకాయి వసూలు చేసుకోవడానికి ఆ సీతారాం గారి ఇద్దరు కొడుకులూ అధికారులందర్నీ బతిమాలుకున్నారు. మా నాన్న వృద్ధుడు అయి పోయాడు. అతన్ని అరెస్టు చేయకండి అని. కాని అతన్ని జైల్లో పెట్టారు. వీళ్ళు అతన్ని విడిపించు కోవడానికి 54,000 రూ॥ కట్టలేరు గనక; వారానికో, పది రోజులకో తండ్రిని జైల్లో చూసి తిరిగి వస్తూ వున్నారు. ఒకరోజు మీ తండ్రికి జబ్బు చేసింది. హాస్పిటల్ లో పెట్టాము అని చెప్పారు. వాళ్ళు హాస్పిటల్‌కి వెళితే తండ్రి చచ్చి పోయి 4 రోజులు అయ్యింది. "అయ్యా! ఎవరూ వచ్చి అడగలేదు. అనాధ ప్రేతంగా భావించి అవతల పారవేసాం" అని చెప్పారు. 11.000 రూ॥ బ్యాంకు నుంచి అప్పు తీసుకొని 23,000 రూ॥ చిల్లర చెల్లిస్తే, అతను ఇంకా 54,000 రూ॥ బాకీ ఉన్నాడని చెప్పి జైల్లో పెట్టారు. అతను చనిపోతే అనాధప్రేతంగా అవతల పారేసారు. ఇది న్యాయం అంటున్నారు. ఇదే రైతాంగానికి జరుగుతున్న అన్యాయం.

ఇక్కడ ప్రధానమైన ఒక అంశాన్ని చెప్పాల్సి వస్తుంది. రైతులకి జరుగుతున్న అన్యాయం ఏమిటో ఇందాక సీతారాం ఉదా॥ చెప్పాం. బ్రిటీషుపాలన కాలంలో ఏమి జరిగింది? వ్యవసాయాన్ని, రైతాంగాన్ని దోపిడీ చేసు కుంటున్నారు. ఆ దోపిడీ వల్ల రైతాంగంలో అనేక చావులు ఎదురయ్యాయి. ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటోంది. దాంతో బ్రిటీషు పాలకులు అనేక కమీషన్లు వేసారు. ఆ సమస్యల ప్రకారం చట్టాలనుచేసారు. వ్యవసాయ అభివృద్ధికి చట్టం ఒకటి, రైతు రుణ పరపతి చట్టం ఒకటి. ఈ చట్టాల్లో అంగీకరించింది ఏమిటంటే వ్యవ సాయానికి రుణాలు ఇచ్చేటప్పుడు ఆ రుణాల మీద చక్రవడ్డీని వసూలు చెయ్యరాదు. తిరిగి ఈ రుణాలు ఇచ్చేటప్పుడు ఆ రుణాల తిరిగి వసూలుని 30సం॥రాలకు పైగా తిరిగి వసూలు చేసుకోవాలి తప్ప 2 లేక 5సం॥ల్లోనో తిరిగి వసూలు చేయకూడదు. ఈ రెండు చట్టాలని ఆ ప్రభుత్వం చేసింది. కాని స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత పాలకులు ఈ రెండు మౌళికమైన అంశాలను వదిలివేసారు. కో-ఆపరేటివ్ బ్యాంకుల దగ్గర నుంచి, చివరికి నాబార్డు దాకా కూడా ప్రజల దగ్గరనుంచి చక్రవడ్డీ వసూలు చేస్తున్నారు. చక్రవడ్డీ అంటే అసలులోకి మళ్ళీ నెలవడ్డీనో, 3 నెలల వడ్డీనో దాంట్లో కలిపేసి, నెలల వడ్డీకి కూడా వడ్డీ వేసి చేసేపని. దాని వల్ల 1000 రూ॥ అప్పు తీసుకొంటే 10000 రూ॥. సీతారాంకి 11,000 రూ॥కి 23,000 చెల్లించినా 54,000 రూ॥ అప్పు అయ్యింది అంటే ఈ చక్రవడ్డీ మూలంగానే. ఇలా గంతులేసే చక్రవడ్డీతో వ్యవసాయం చెయ్యలేరు. అలా వ్యవసాయ ఉత్పత్తి 20 నుంచి ఒక్కసారి 40 బస్తాలకి గంతు వెయ్యలేదు. అలా గంతు వెయ్యాలంటే దీర్ఘకాలం పడుతుంది. అందుకే ఈ మౌళికమైన అంశాన్ని, ఈ పాలకులు మర్చిపోయారు. రైతాంగం మీద చక్రవడ్డీ మోపుతున్నారు. మన సాంప్రదాయంలోను, భారత సాంప్రదాయంలోను కలిసి వస్తున్న మరొక అంశం కూడా వుంది. ఆ అంశం ఏమిటంటే అసలుకిమించి వడ్డీలు ఎప్పుడూ ఎక్కువ ఉండకూడదు. ఈ సూత్రాలు గతం నుంచి అనుసరిస్తూ వస్తున్నది. ఈసూత్రాన్ని కూడా భారత పాలకులు మర్చిపోయారు. 1000 రూ॥ అప్పు తీసుకొంటే దాని మీద వడ్డీ ఎప్పుడు 1000రూ దాటిపోకూడదు. సీతారాం ఉదా॥ లోచూసుకొంటే 11,000లకి వడ్డీ మీద వడ్డీపడి 54,000 రూ॥ ఇంకా మిగిలిపోయింది. అంటే ఈ రెండు సూత్రాలని వదిలివేసారు. వీళ్ళు అనుసరించింది రైతాంగం మీద చక్రవడ్డీ భారం మోపడం. రైతాంగం మీద అసలుకి మించి చక్రవడ్డీ భారం మోపడం వల్ల రైతాంగం కృంగి కృశించి పోయే అవకాశం ఏర్పడింది.

వలస పాలకులు అనుసరించిన ప్రతి చట్టాన్ని, విధానాన్ని భారత పాలకులు అను సరించారు. పోలీసులు, అధికార యంత్రాంగం, రెవిన్యూ శిస్తు అన్నింటినీ; వలస పాలకులు అమల్లో పెట్టిన ప్రతిచట్టాన్ని భారత పాలకులు తు.చ. తప్పకుండా అమలు జరిపారు. మరి రైతులకి రక్షణ కల్పించే చక్రవడ్డీ వసూలు చేయరాదన్న చట్టాన్ని మాత్రం ఎందుకు మర్చి పోయారు?. ఎందుకు అమలు జరపటం లేదు? ఇది ప్రధానమైన అంశం. దీన్ని లోతుల్లోకి వెళ్ళి గమనిస్తే భారతపాలకులు ఈ చట్టాలని ప్రక్కన పెడుతూ వచ్చారు. దీనికి చక్రవడ్డీ వసూలుని అమలు చేసుకుంటూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించిన మరొక అంశాన్ని పేర్కొనాలి. మద్రాస్ ప్రెసిడెన్సీలో ఆంధ్రరాష్ట్రం ఒక భాగంగా వుండేది. మద్రాసు ప్రెసిడెన్సీ ఆరోజున 1918లో "చక్రవడ్డీ అన్నది రైతాంగాన్ని దోపిడీ చేసే చర్య. దాన్ని అనుమతించరాదు" అని ఒక చట్టం చేసింది. ఆ చట్టం ఈ రోజుకీ అమల్లో వుంది. అమల్లో వున్నట్లే లెక్కకాని ఈ పాలకులు పట్టించు కోవటం లేదు. ప్రభుత్వరంగ సంస్థలే రైతాంగం దగ్గర చక్రవడ్డీని వసూలు చేస్తున్నాయి.

నా వయస్సు వారందరికి బాగానే గుర్తుండ వచ్చు. 1935 ఇండియా చట్టం ప్రకారం 1937 లో మొట్టమొదటి సారిగా ఎన్నికైన శాసన సభలు ఏర్పడ్డాయి. శాసనసభలో మొట్ట మొదటిగా చేసిన చట్టాలు ఏమిటి? వ్యవసాయ రంగంలో రుణ పరపతి రంగానికి సంబంధించిన అంశంలో ఇవి చట్టాలు చేసినవి. ఆరోజున వచ్చిన అనేక నవలలు, సాహిత్యంని మనం చూసుకొంటే వలస పాలకులు ఒక శత్రువే. వలసపాలకులతో పాటు భూస్వాములు ఒక శత్రువు. వడ్డీ వ్యాపారి మరొక శత్రువుగా రైతాంగ జీవితంలో ఎలా ఉన్నారో ఆ సాహిత్యాన్ని చూస్తే మనకు తెలుస్తుంది. కాబట్టి ఆనాటి పాలకులు శాసనసభలో వెంటనే కొన్ని చట్టాలు చేసారు. వచ్చిన ఆ శాసనసభ ఏం చేసింది? అంటే "వ్యవసాయ రంగానికి ఇచ్చే పరపతి సౌకర్యా లలో చక్రవడ్డీ ఎలాంటి పరిస్థితు లలోను అనుమతించరాదు.అలాగే అసలును మించి వడ్డీ ఏనాడు వసూలు చెయ్యరాదు" అని రెండు చట్టాలు చేసింది. 1937లో, 1939లో జరిగిన ఒక విషాదమైన విషయం ఏమిటంటే ఆ రోజు దేశం స్వతంత్రమైంది కాదు. బ్రిటీషు పాలకుల క్రింద వుంది. కాని స్వతంత్రం అయిన తర్వాత బీహార్ గవర్నర్ ఈ చట్టం పరిధిలోకి ప్రభుత్వ బ్యాంకులుగాని, కో-ఆపరేటివ్‌లు గాని రావు అని పేర్కొన్నాడు. దీని ఫలితం ఏమి

అయ్యింది? చక్రవడ్డీ వసూలు చేసి, ఆ చక్రవడ్డీ కట్టలేక రైతు అప్పుపడిపోతే అతన్ని బ్యాంకు అరెస్టు చేసి జైల్లో పెట్టిస్తుంది. రైతు ఒక ప్రైవేటు వ్యాపారి దగ్గర వడ్డీకి అప్పు తీసుకొంటే, తిరిగి చెల్లించ లేకపోతే అతన్ని జైల్లో పెట్టలేదు. పైపెచ్చు ఈ చట్టం ప్రకారం అతను చక్రవడ్డీ వేసాడు కాబట్టి ఆ కంప్లైంట్ చేసి ప్రైవేటు వడ్డీ వ్యాపారిని జైల్లో పెడుతుంది. వ్యవసాయ పరపతికి సంబంధించి ఈ రెండు రకాల వివక్షాపూరితమైన చర్యలు ఏంటి? చట్టం ఒకటి ఉంటే, ప్రభుత్వ రంగసంస్థ అప్పు ఇస్తే వాడు రైతుని జైల్లో పెట్టిస్తాడు. ప్రైవేటు వడ్డీ వ్యాపారి అదే వడ్డీకి అప్పు ఇస్తే అక్కడ ప్రైవేటు వడ్డీ వ్యాపారిని జైల్లో పెట్టిస్తారు. వడ్డీ వ్యాపారులు కాగితాల్లో దొరక్కుండా రైతులను వడ్డీల మీద వడ్డీలు వసూలుచేస్తుంటే అతనిపై ఎటువంటి చర్య వుండదు. అంటే రైతు నాబార్డు కావచ్చు, కో – ఆపరేటివ్ కావచ్చు, స్టేట్ బ్యాంకు కావచ్చు లేదా ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాల పై ఆధారపడి బ్రతకాల్సి వుంటుంది. ఇక్కడ వ్యవసాయ రంగానికి పరపతి సౌకర్యంలో రెండు రకాల విధానాలను అనుసరించినందువల్లే రైతాంగ రుణభారం పెరిగిపోతూ వస్తోంది.

ఇది ప్రభుత్వం చేస్తున్న ఒక దుర్మార్గం. ప్రభుత్వం చేస్తున్న ఒక మోసం. ఒకేరంగానికి రుణపరపతి సౌకర్యానికి రెండు రకాల చట్టాల ను చేసి పాలకులు చేస్తున్న మోసం. ముఖ్యంగా రైతాంగాన్ని రుణభారంలోకి కృంగదీస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్ని మోసం చేస్తున్నాయి. రైతుల రుణాల్ని మాఫీ చేస్తున్నాం అంటున్నాయి. ఇది ఒట్టి మోసం. మనం కట్టిన డబ్బులనే చక్రవడ్డీల క్రింది లెక్క కట్టి మన మీద వేసిన అప్పులోంచే 10రూ॥లు తీసివేసి వడ్డీ మాఫీ అని ప్రకటించడం కేవలం కాగితాలపై అంకెల మార్పిడీయే తప్ప వాస్తవం కాదు. వడ్డీ మాఫీ అక్కరలేదు. రైతులకు నామ మాత్రపు వడ్డీతో రుణాలను ప్రభుత్వం ఇస్తే రైతు మీద భారంపడదు.

జార్ఖండ్ రాష్ట్రంలో భారత్ జన్ ఆందోళన్ తరపున జార్ఖండ్ ఎమ్.ఎల్.ఎ.లకి అందరికి ఒక లేఖ రాసాం. "ఈ మోసం విషయంలో ఎమ్.ఎల్.ఎ.లుగా, ప్రజాప్రతినిధులుగా మీ బాధ్యతను మీరు నిర్వర్తించాలి. మనీలెండర్ ప్రభుత్వ వడ్డీ వ్యాపారికి ఒక చట్టం, ప్రైవేటు వడ్డీ వ్యాపారికి ఒక చట్టం ఉండటం అన్యాయ మైంది. ఇది ప్రజల ప్రయోజనాల్ని, రైతాంగ ప్రయోజనాల్ని నష్టపరుస్తోంది. ఇది ప్రజా స్వామ్యం అని చెప్పుకోటానికే సిగ్గు పడాల్సినది. కనుక మీరంతా ప్రభుత్వ వడ్డీ వ్యాపారాన్ని చట్టం పరిధిలోకి రాకుండా వాళ్ళు చక్రవడ్డీ వసూలు చేసేందుకు వీలుగా ఈ చట్టం మార్పుని రద్దు చేసి; మొత్తం వ్యవసాయ రంగానికి చక్రవడ్డీ వుండకూడదు; అసలుకి మించి వడ్డీ ఉండ కూడదు అన్న చట్టం కోసం మీరు కృషి చేయండి. అలా లేకపోతే జార్ఖండ్ రాష్ట్రంలో రైతాంగం కరువులలో కూరుకు పోతారని, మనం ఆ తర్వాత ప్రజాస్వామ్యం అని చెప్పుకోవడానికి కూడ సిగ్గుపడాల్సి వస్తుందని" అంటూ మేం విజ్ఞప్తుల్ని పంపించాం.

ఈ చక్రవడ్డీ వసూలు చేయటం వెనకాల రాష్ట్ర ప్రభుత్వం ఒకటే లేదు. దీని వెనకాల కేంద్రప్రభుత్వం ఉంది. దానికి వెనకాల సామ్రాజ్యవాద డబ్ల్యూ.టి.ఓ.,డబ్ల్యూ.బి. సంస్థలు వున్నాయి. ఇవన్నీ కలిసి దోపిడీ కోసం దీన్ని అమలు జరుపుతున్నాయి. కనుక వీటన్నింటికీ వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం వుంది. చంద్రబాబు నాయుడు 40,000 కోట్ల రూ॥లు అప్పు తెచ్చాడు. అంటే ఈ దేశపు భూమిని, ఈదేశపు నీటిని వాళ్లకు తాకట్టుపెట్టాడు. వాడికి ఏ అధికారం ఉందని మన భూమిని, మన నీటిని వాళ్ళకు తాకట్టుపెట్టాడు? అని మనం ప్రశ్నించాల్సి ఉంటుంది. కాబట్టి వీరందరి ఈ దోపిడీ కోసం ఇది నిలబడి ఉంది. **ఒకసారి సామ్రాజ్యవాదం ఉచ్చులో కూరుకుపోయిన తర్వాత మనకు మిగిలేది రెండే రెండు మార్గాలు. మనం తలెత్తుకు నిలబడి, ఎదురొడ్డి నిలబడి, ఖచ్చితంగా ఈ అప్పులను మేం చెల్లించం అని తిరస్కరించి, వాటిని బయటకు తరిమివేసే ఒక మార్గం. లేదా తలొంచుకొని నిలబడితే మన ఆర్థిక సహజ వనరులన్నింటిని వాడు కొల్లగొట్టుకుపోతాడు. ఇక్కడ ఒట్టి పిప్పిని మాత్రం మిగులుస్తాడు.** లాటిన్ అమెరికాలో జరిగింది ఇంతే. మనకి రేపు జరగబోయేది అదే. కనుక మనం అంతా ఏం చెయ్యాలి?. జ్ఞార్ండ్‌లో 3,000 చిల్లర గ్రామాలు మాకున్నాయి. ప్రతి గ్రామంలోను గ్రామ సభలు సమావేశం వేసి "1937 నాటి ఆ చట్టాన్ని తిరిగి పునరుద్ధరిం చేందుకు చర్యలు తీసుకోవాలి". అని ఆ గ్రామ సభలు తీర్మానాలు చేసి వాళ్ళ ఎమ్.ఎల్.ఎ.లకి పంపిస్తాయి. " మీరు వెంటనే దానికి చర్యలు తీసుకోండి" అని తెలియజేస్తాయి. ఇది ఒక మార్పును తీసుకువచ్చే ఒక చర్య. మీరు, నేను కూడా, ఈ దేశంలో ఉన్న 7 లక్షలు గ్రామాలు అన్నీ కలిసి ఇలాంటి తీర్మానం చేస్తే మొత్తం ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించడానికి కొత్త పోరాటాలని నిర్మించుకోవడానికి కొత్త మార్గాలని తెరుస్తుంది అని ఆశిస్తున్నాను. మీ కృషి ఆ వైపు సాగుతుందని కూడా నేను ఆశిస్తున్నాను.

ఈ పాలకులు వలస పాలకుల నాటి నుంచి భారత ప్రజలను విభజించి పాలించే విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రజల మధ్య తగాదాలు పెట్టి, వారి మధ్య వైషమ్యాలు రేపి తమ విధానా న్ని వాళ్ళు నెట్టుకొంటూ వస్తున్నారు. భారత పాలకులు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా దీన్ని ఉపయోగిస్తున్నారు. అనేక విధాలుగా ప్రజల మధ్య తగాదాలు పెట్టడం; గ్రామాలకి వస్తే వ్యవసాయ కూలీలకి, రైతులకి మధ్య తగాదాలుపెట్టడం; వారు ఐక్యం కాకుండా ఉండడం అనేది చేస్తున్నారు. ఏ ఒక్కరో ఇద్దరికో అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. కాబట్టి మిగతావాళ్ళతో చేరకుండా చేస్తున్నారు. వారి ద్వారా తగాదాలు సృష్టిస్తున్నారు. గ్రామంలో మనం ఒకే మాట మీద నిలబడాలి. సామ్రాజ్య వాదం వీటన్నింటి వెనకాల ఉంది. ఈ సామ్రాజ్యవాద దోపిడీని మనం వెనక్కి నెట్టాలి. అంటే మనం ఒక అంశాన్ని తీసుకొని సామ్రాజ్యవాదం మీద నిజంగా పోరాటానికి జవసత్వాలని చేకుర్చాలి. సామ్రాజ్యవాదులు చేసిన రుణాలని తిరిగి మనం చెల్లించటం విధానం కాదు. వాటిని మనం తిరస్కరించాలి. ఎవరి అనుమతి అడిగి ఈ చంద్రబాబు, వాజ్‌పేయ్‌లు అప్పు తీసుకొచ్చారు? ఎవరి అనుమతి అడిగి ఈ డబ్బును ఎవరికోసం ఖర్చుపెట్టారు? హైద్రాబాద్ నగరంలో ఫ్లైవోవర్ లకో, రోడ్ల వెడల్పుకో, అందమైన బంగళాలు నిర్మించడానికో ఖర్చుపెట్టిన ఈ అప్పు మనం ఎందుకు తీర్చాలి? సామ్రాజ్య వాదాన్ని తిరస్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దానికోసం మనం ఐక్యంగా నిలబడాలి. గ్రామం అంతా ఐక్యంగా నిలబడి ఈ రుణ వ్యవస్థ చట్టాలని మార్చటం ద్వారా సామ్రాజ్య వాదం అనుసరిస్తున్న విధానాలకి మనం అడ్డుకట్ట వేయాల్సి వుంది. మొదట్లో నేను చెప్పినట్లు ఈ వనరుల మీద, ఈ గ్రామ జీవితం మీద వ్యవహారాలు నిర్వహించుకోవటం మీద అధి కారం ఎవరిది? అన్న ప్రశ్న కూడా మనం లేవనెత్తాలి. ఈ అధికారం ప్రజలది; సమిష్టిగా

(తరువాయి 14వ పేజీలో..) →

రుణభారాన్ని పెంచి రైతాంగాన్ని దివాళా తీస్తున్న ప్రభుత్వ విధానాలు

కా॥ పి. జస్వంతరావు, ఎడిటర్;జనశక్తి



గ్రామీణ రుణభారం అన్న సమస్యపై ఇప్పుడు మనం చర్చించుకుంటున్నాం. గత మూడు నెలల్లోనే కర్ణాటకలో జరిగిన రైతుల ఆత్మహత్యలు ఈ సమస్య తీవ్రతను తెలుపు తున్నాయి. ఏప్రిల్ నెల నుండి అక్టోబరు వరకు కర్ణాటకలో 478 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వ్యవసాయకంగా వెనుకబడిన జిల్లాల కంటే వ్యవసాయకంగా అభివృద్ధి చెందా యన్న జిల్లాల్లోనే ఎక్కువగా రైతుల ఆత్మహత్యలు జరగటం గమనించవలసిన అంశం. పత్రికా వార్తలూ, ఇతర పరిశీలకుల అభిప్రాయం ప్రకారం అప్పులు తీర్చే మార్గం లేక రైతాంగం ఆత్మహత్యల నెంచుకున్నారు. అప్పుబారిన పడని రైతు లేడనీ, కొన్ని సందర్భాలలో తమ ఆస్థుల విలువను మించి అప్పులలో మధ్య తరగతి, పేద రైతాంగం కూరుకుపోయారనీ పరిశీలనలు తెలుపుతున్నాయి. గత ఏడాది రైతుల ఆత్మహత్య లకు వ్యక్తిగత విషయాలే కారణమనీ, వారికి నష్టపరిహారమిస్తే, దానికోసం ఆత్మహత్యలు చేసు కుంటారనీ ప్రభుత్వం వితండవాదం చేసింది. ఈ ఏడాది ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే ఆత్మహత్యలు సాగటంతో పాలకులు మొసలి కన్నీరు కార్చటం ప్రారంభించారు. ఆత్మహత్యలు చేసుకోవద్దు, నాతో చెప్పుకుంటే పరిష్కరిస్తా నంటూ, మరణించిన వారి కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటించాడు. 478 కేసులలో 179 నష్టపరి హారానికి అర్హమైనవిగా గుర్తించి, 116 కేసులకు మాత్రమే చెల్లించాలని ఉత్తర్వులిచ్చారు. వీరిలో కూడా ఎంతమందికి వాస్తవంగా చెల్లింపు జరిగిందో తెలియదు.

రైతాంగపు ఆత్మహత్యలు దేశమంతటా జరుగుతున్నాయి. వీటికి తక్షణ కారణం పెరిగి పోయిన రుణభారం. అయితే రైతాంగాన్ని పట్టి పీడిస్తున్న వ్యాధి లక్షణమే రుణభారం తప్ప అదే వ్యాధి కారకం కాదు. సామ్రాజ్యవాదుల కనుసన్నలలో నడుస్తున్న భారత పాలకులు వ్యవసాయ రంగాన్ని వారి దోపిడీకి వనరుగా మార్చే విధానాలను అనుసరిస్తున్నారు. రైతుకు అంతర్జాతీయ మార్కెట్టు రేటు సాధిస్తామంటూ, వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసి లాభాలు గడించండంటూ రైతాంగానికి ఆశలు చూపారు. ఆపేరిట నీటి తీరువానూ, విద్యుత్తు చార్జీలనూ పెంచారు. సబ్సిడీల వల్ల ఆర్థిక భారం మోయ లేనిదయిందంటూ, ఎరువులు, పురుగుమందుల ధరలు పెంచివేశారు. పంటల రవాణాపై ఆంక్షలు తొలగిస్తే, మంచి ధర వస్తుందంటూ మార్కెట్టు రక్షణలను తొలగించారు. ప్రభుత్వ కొనుగోలు సంస్థలను రంగం నుండి తప్పించి, కనీస మద్ధతు ధరల ప్రకటన తప్ప అమలు జరుపకుండా ఊరుకుని, మార్కెట్టును వ్యాపార వర్గాలకు వదిలివేశారు. రైతాంగానికి విస్తరణ సేవల విభాగాన్ని క్రమంగా రద్దు చేసే వైపుగా చర్యలు తీసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరి జ్ఞానాన్ని వాడుకోవాలంటూనే, అది రైతులకు అందించకుండా, యూజర్ చార్జీలు చెల్లించి పొందమని చెప్పారు.

ఫలితంగా వ్యవసాయంలో మదుపులు పెరిగి పోయాయి. ఏ పంట వేసినా మార్కెట్టు గిట్టు బాటు ధరలేదు. దీనితో రైతాంగం నష్టపోయి, పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు పెరిగిపోయి వడ్డీలతో తడిసి మోపెడయ్యాయి. దిక్కుతోచని స్థితిలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

కనుకనే, రైతాంగాన్ని ప్రత్యక్షంగా భూమి నుండి తరిమి వేసే పద్ధతి కాకుండా, ఆర్థిక విధాన మాటలతో వారిని దివాళా తీయించి, వారిని భూముల నుండి బేదఖలు చేసే విధానాన్ని పాలకులు అనుసరించారు. కనుకనే, ఈ విధానా లను ప్రారంభించిన నాటి నుండి, రైతాంగం తమ భూములను వదిలి వేసుకోవాల్సి వచ్చే కాంట్రాక్టు ఫార్మింగు, కార్పోరేటు ఫార్మింగులను పరిష్కారంగా పాలకులే రైతుల ముందుంచుతూ వచ్చారు. వ్యవసాయం లాభసాటిగా లేదు గనుక రైతులు కంపెనీలకు భూమి నివ్వటమో లేదా కంపెనీ చెప్పిన పంట వేసి వారికే అమ్మాలని సలహాలిస్తున్నారు. వీటిలో ఏ పద్ధతయినా రైతు తన భూమిలో తానే పాలేరుగా మారిపోతాడు.

ఈ విధానంలో భాగంగానే రైతాంగానికి ప్రభుత్వం వైపు నుండి రుణపరపతి సౌకర్యాన్ని కుదించి వేస్తూ వచ్చారు. వ్యవసాయ రంగపు రుణ పరపతి అవసరాలెంతవుంటాయో ఒక అంచనా లేకుండా చేశారు. జాతీయ బ్యాంకు లు, గ్రామీణ బ్యాంకులు, సహకార సంస్థలు అన్నీ కలిసి కూడా రైతాంగ అవసరాల కొరకు ప్రైవేటు వడ్డీ వ్యాపారులపైనే రైతాంగం ఆధారపడేట్లు చేశాయి. దీనిలో కూడా పేద, మధ్య తరగతి రైతాంగానికి సహకారిగా వుండే స్వల్ప కాలిక రుణాలను (తక్కువ లేదా క్రాప్ లోను) తగ్గించి, భూస్వామ్య ధనిక రైతులను బలపర్చే దీర్ఘకాలిక రుణాలనుపెంచుతున్నారు. అభివృద్ధి చెందాయంటున్న పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ఖమ్మం జిల్లాల్లో రుణ సంస్థలన్నీ కలిసి లక్ష్యంగా నిర్దేశించుకున్న క్రాప్ లోన్సులో 45శాతం మాత్రమే అంద జేసాయి. కాగా అవే బ్యాంకులు దీర్ఘ కాలిక (తోటలు, బిందు సేద్యం, ట్రాక్టర్లు తదితరులు) రుణ లక్ష్యాలను సాధించాయి. రైతాంగం రుణంలో కూరుకుపోయే, ధనిక భూస్వామ్య వర్గాలు బలపడే రుణపరపతి విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తూ వచ్చింది.


ఇంతకు ముందే బి.డి. శర్మ గారు చెప్పారు. పరాయి పాలకుడు చేసిన ప్రతి చట్టాన్ని ఔదల దాల్చిన పాలకులు బ్రిటిషు వారు చేసిన రుణ విమోచన చట్టాలనెలా అమలు జరపటంలేదో వివరించారు. చట్టాన్నతిక్రమించి బ్యాంకులు రైతుల నుండి చక్రవడ్డీ వసూలు చేయటాన్ని, రుణ వసూళ్ళ కోసం జప్తులు చెయ్యటాన్ని ఆయన వివరించారు. వ్యవసాయం రైతాంగా నికి ఒక జీవన విధానమనీ, వ్యాపార కార్యక లాపం కాదనీ వివరించారు. రైతాంగ రుణాల మాఫీ అంటూ పాలకులు రైతులను చేస్తున్న మోసాన్ని వివరించారు.

రైతాంగానికి తక్షణ ఉపశమనం కలిగిం చాలి. రైతాంగ రుణభార సమస్య ఈనాడు సమస్యగా ముందుకు వచ్చింది. రైతాంగాన్ని ప్రస్తుత దుర్భర పరిస్థితి నుండి బయట పడవేసే ప్రాథమిక చర్యగా రుణభార తగ్గింపు వుంది. కనుకనే రైతాంగానికి సంస్థాగత రుణ సౌకర్యాన్ని విస్తరించాలనీ, చక్రవడ్డీ వసూలు

(తరువాయి 14వ పేజీలో..) →

నీరు వ్యాపార సరుకు కారాదు!

ప్రా॥ సి. రామచంద్రయ్య, (సెస్)



అధ్యక్షత వహించిన కామ్రేడ్స్, వేదిక మీద ఉన్న ఇతర పెద్దలు, సభకు విచ్చేసినటువంటి రైతు కూలీ మిత్రులారా!

గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన రైతులు, కార్మికులు ఎక్కువ కనబడుతున్నారు. భూగోళం మీద జీవనం సాగాలి అంటే మంచి నీళ్ళు అవసరం. గత 10 సం॥ల్లో ప్రపంచంలో జరుగుతున్న మార్పుల వల్ల, భారతదేశంలో, ఆంధ్రరాష్ట్రంలో ఉన్న మార్పుల వల్ల వచ్చే రోజుల్లో ఒక గ్లాసు నీళ్ళు త్రాగాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి. ఉన్న నీళ్ళని ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా పరిపాలన సాగాలి. అలా జరగనపుడు మనం పోరాడి సాధించుకోవాలి.

గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఉచితంగా లేదా చౌకగా మంచి నీళ్ళు అందజేయాలనే పద్ధతి కొనసాగుతూ వస్తుంది. గత10 సం॥ల్లో ప్రపంచ బ్యాంకు ఆదేశాలలో భాగంగా ఈ రోజు ప్రభుత్వాలు తాము బాధ్యతగా చెయ్యవలసిన పనిని కూడా వెలకట్టి వసూలు చెయ్యడం ప్రారంభమైంది. ప్రతి మనిషి జీవనానికి అత్యవసరమైన నీటిని డబ్బుపెట్టి కొనుక్కోవాలి, లేకుంటే లేదు అన్న పరిస్థితి సరళీకృత ఆర్థిక విధానాల వలన ఏర్పడింది.

సరైన మంచి నీళ్ళు తాగకపోతే 21 రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. ఇండియాలో 15 లక్షల మంది ప్రజలు నీరు సరిగా లేనందు వలన చనిపోతున్నారు. ప్రపంచం మొత్తంలో 10 బహుళజాతి కంపెనీలు మంచినీటిని సప్లై చేస్తున్నాయి. వీటితో ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. బిల్లు కట్టకపోతే కరెంట్ కనెక్షన్ కట్ చేసినట్లు, మంచినీటి కనెక్షన్ కూడా కట్ చేసే పరిస్థితి ఈ రోజు ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో ఏర్పడింది. త్వరలో మనదేశంలో కూడా రాబోతోంది.

బొలీవియా దేశంలో కుచమాంబ అనే చిన్న నగరంలో మంచి నీటి చెరువును ప్రభుత్వం ప్రైవేటీకరించింది. ఈ రోజు అక్కడ ఆ అమెరికన్ ప్రైవేట్ కంపెనీ వర్షపు నీటిని కూడా ప్రజల్ని పట్టుకోవద్దని శాసించే స్థితికి ఎదిగింది. ప్రజలు పెద్ద ఎత్తున తిరగబడ్డారు. కాల్పులను సహితం ఎదుర్కొన్నారు. చివరకు ఆ కంపెనీ దేశం వదిలి వెళ్ళక తప్పలేదు. ఆ కంపెనీవాడు ఆ దేశంపై 200 కోట్ల రూ. నష్టపరిహారం చెల్లించాలని దావా వేసాడు.

బొలీవియా చాలా వెనుకబడిన పేద దేశం. మన రాష్ట్రంలో అనంతపురం, మహబూబ్‌నగర్ జిల్లాల వలె ఉంటుంది. ఐ.ఎమ్.ఎఫ్; డబ్ల్యు.బి.లు అప్పులు ఇచ్చి, వాటితో పాటు అనేక షరతులు కూడా విధిస్తున్నాయి. బొలీవియా లాంటి దేశాలు ఈ షరతులకు ఒప్పుకొని అప్పులు తెచ్చి, వాటిని ప్రజలపై రద్దుతున్నాయి. ఆఫ్రికా దేశాల్లో ఈ రోజు మన హైద్రాబాద్‌లో కంటే నీటి ఛార్జీలు చాలా ఎక్కువ.

ఏ ప్రభుత్వాలు తాము రాజ్యాంగ బద్ధంగా వున్నామని అనుకొంటున్నారో, ఆ రాజ్యాంగంలోని కనీస హక్కుల్ని కూడా లేకుండా చేస్తున్నాయి. ప్రజలకు త్రాగునీటిని అందించే బాధ్యత ప్రభుత్వాలపై ఉంది అని, అది ప్రజల జీవించే కనీస హక్కు అని, సుప్రీంకోర్టు గత 5,6 సం॥ల్లో అనేక సార్లు తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం బహుళ జాతి సంస్థలతో దొడ్డిదారిన ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. గంగానదిని ప్రైవేటీకరించి ఢిల్లీకి మంచినీటిని సరఫరా చేస్తున్నారు.

ప్రభుత్వం వ్యవసాయాన్ని, ఇరిగేషన్‌ను ప్రక్కకు నెట్టుచున్నది. పట్టణాలలో మున్సిపాలిటీ ప్రజలకు మంచినీరును అందించవలసిన అవసరం వున్నది. కాని మున్సిపాలిటీ వారు ప్రజలలో అనుమానాలను కలిగించి మున్సిపాలిటీ నీరు త్రాగకుండా చేస్తూ, మార్కెట్‌లోని మంచినీరు కొనుక్కోమని ప్రోత్సహించారు.

ఈ విధంగా బహుళజాతి సంస్థలు మంచి నీటి వ్యాపారాన్ని పెంపొందించుచున్నాయి. ప్రజలకు అందించవలసిన మంచి నీటిని ప్రజలకు అందించకుండా ప్రైవేటు సంస్థలకు తక్కువ ధరకు అమ్ముతూ, వారి వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

ఈనాడు కోకో - కోలా కంపెనీ రాష్ట్రంలో వివిధ చోట్ల బోర్లు త్రవ్వి మంచినీటి వ్యాపారాన్ని చేస్తున్నది. ప్రజలకు ఉచితంగా అందించవలసిన మంచినీరును వ్యాపారంగా మార్చుతున్నారు.

ఈనాడు హైదరాబాద్‌కు మంచినీరు అందించే మంజీరానదిని ప్రైవేటుపరం చేయు చున్నారు. ఈనాడు ప్రజలు మంచినీరు దొరకక చనిపోవు చున్నారు. ఈ మంజీరా నీటిని రోజుకు 10 లక్షల లీటర్ల నీటిని, లీటరు 2.50రూ.చొప్పున కోకో-కోలా కంపెనీకి మన ప్రభుత్వం ఇస్తే; వాళ్ళు ఆ నీటిని బాటిల్‌లో పోసి మనకు లీటర్ 12 రూ॥లకు అమ్ముతున్నారు. ఇంతకు ముందు రాజకీయ అధికారం కోసం పోరాడాం. కాని ఇప్పుడు మనం బ్రతకటం కోసం పోరాడాల్సి వస్తోంది. ఈనాడు ప్రపంచంలోని ఐదు కంపెనీలు ప్రజలను శాసించే స్థాయికి చేరుకున్నాయి. మనం అనేది లేకుండా పోతోంది ఈరోజులలో. **విత్తనాలు మొదలుకొని, పంటను అమ్మేవరకు రైతులను శాసించే స్థాయికి బడాప్రైవేటు కంపెనీలు చేరుకున్నాయి. నీటి మీద, విత్తనం మీద అధిపత్యం ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి వెళితే ఇక మనది అంటూ ఏమి మిగలని పరిస్థితి ఏర్పడుతుంది.**

ప్రజలని పోరాటాల్లోకి రాకుండా చేయడానికి ఎన్నిరకాల ప్రయత్నాలు చెయ్యాలో, అన్ని రకాల ప్రయత్నాలు ఈ ప్రభుత్వాలు చేస్తున్నాయి. ఈ సమాజం గురించి ఆలోచించ వద్దు. మీ గురించి మీరు ఆలోచించుకోండి అని చెబుతున్నాయి. ఈనాడు ప్రభుత్వం వివిధ చర్యలను చేపడుతున్నది. ఇవన్నీ బహుళజాతి కంపెనీల ప్రయోజనాలనే కాపాడుతున్నాయి. రైతుల ప్రయోజనాలను కాపాడుకోవటానికి మన మందరము కలసి పోరాడుదాం. భవిష్యత్తులో కోకో-కోలా, పెప్సీలాంటి బహుళజాతి సంస్థలకి వ్యతిరేకంగాను; వాటిని ప్రోత్సహిస్తూ, సామాన్య ప్రజల జీవితాలను ఇంకా దుర్భారం చేసేటువంటి ఈ ప్రభుత్వాల సరళీకృత విధానా లకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది. ఆ పోరాటాలు- భవిష్యత్‌లో ఈ రైతు కూలీ సంస్థ ఇతర సంఘాలతో కలసి ఐక్య పోరాటం చేస్తుందని, విశాలవేదికలో ఇంకా విషయాలు తెలుస్తాయని ఆశిస్తూ.... ✦

నీటి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్యాచరణకు పూనుకోవాలి !

డా॥పి.వి.ఆర్ భాస్కరరావు(పీమ్)



నీటిని ప్రైవేటీకరణ చేయడం అన్న ఆలోచనే రాక్షసపుటాలోచన అనడంలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు. కలియుగంలో రాక్షసప్రవృత్తి చిందులు తొక్కుతుందనడానికి ఇదొక నిదర్శనం. ఈ ఆలోచన ద్వారా నీటిని ప్రైవేటీకరణ చేస్తున్నవారికి రాజకీయ లబ్ధికాని, మరి ఇతర స్వలాభాలు కాని వున్నాయనవచ్చును. దేశంలో అన్ని నదుల్ని కలపాలన్న పథకంకూడా నీటి ప్రైవేటీకరణలో ఒక భాగమే. ఈ నీటి ప్రైవేటీకరణ అనే మంత్రాన్ని వివిధ దేశాల్లోనూ, వివిధ రాష్ట్రాలలోనూ ప్రవేశపెట్టి తన ప్రియమైన శిష్యులచేత వల్లె వేయించడమే కాకుండా, ప్రజానీకానికి ఎన్ని కష్టాలు కలిగినా ప్రైవేటీకరణ పథకాల్ని అమలు చేస్తున్న ప్రపంచ విఖ్యాత పరమ గురువు "ప్రపంచ బ్యాంకు" అని అందరికీ విదితమే.

అసలు నీటిని ప్రైవేటీకరణ చేయడానికి హక్కెవరికీ లేదు

నీటిని తన ఇష్టాను ఇష్టాల ద్వారా వేసిన పథకాల ద్వారా ఎవరికో ధారాదత్తం చేయడానికి కాని, ప్రైవేటీకరణ చేయడానికి కాని, అమ్మడానికి కాని ఈ ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య ప్రభుత్వానికీ హక్కు లేదు. నీరు ఎవ్వరి స్వంత ఆస్తికాని, సొమ్ము కాని కాదు. మన అదృష్టవశాత్తు వాజ్‌పాయిగారి స్వంత ఆస్తికాదు, చంద్రబాబు నాయుడు గారి ఆస్తికాదు. నీరు, గాలి, సూర్యరశ్మి, అడవులు ఇత్యాదులు సహజ వనరులు. నీరు మనుష్యులదే కాకుండా సమస్త జీవరాశిది కూడాను. మనుష్యులది, జంతువులది, చెట్లు, చేమలది. వీరందరికి ప్రకృతి ప్రసాదించిన వరం. నీరు ప్రాణానికి అత్యవసరం. నీరు లేకపోతే మనుష్యులు, జంతువులు, చెట్లు, పంటలు అన్నీ కూడా ఎండి ప్రాణాల్ని కోల్పోతాయి. ప్రకృతి ప్రసాదించిన ప్రాణశక్తికి మూలమయిన సమస్త జీవజాలం వాటికి కావలిసినంత, అవసరమయినపుడు ఏ ఆటంకాలు లేకుండా పొందగల హక్కు వుంది. ఇది అన్ని ప్రభుత్వాలు తలఒగ్గి గౌరవించవలసిన ప్రకృతి న్యాయం. అంతేకాకుండా ఈ ప్రకృతి ప్రసాదించిన వరాన్ని రాజకీయ దురహంకారంతో ఇష్టం వచ్చినట్లు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తే అది ప్రకృతి దృష్టిలో చేయకూడని నేరమే అవుతుంది.

మనదేశ అంతర్జాతీయ చట్టాలు - వివిధ వేదికల నిర్ధిష్ట అభిప్రాయాలు

ప్రకృతి న్యాయమే కాకుండా, మనదేశంలోని అత్యున్నత న్యాయస్థానమే కాకుండా, అంతర్జాతీయ చట్ట వివిధ వేదికలు నీరు సహజ వనరులలో అత్యంత ప్రధానమైనదంటూ దృఢమైన అభిప్రాయాలు వెలిబుచ్చడం జరిగింది. నిజంగా ప్రపంచబ్యాంకు ఈ భూమి మీద అడుగుపెట్టే వరకు జీవులందరూ సహజంగా నమ్మిన సత్యమే ఇది.

మనదేశ రాజ్యాంగం - సుప్రీంకోర్టు తీర్పులు

రాజ్యాంగంలో ఎన్నో విధాలుగా ప్రజల్ని కాపాడుతూ అధికరణలో పొందుపరచబడ్డవి. దేశ రాజ్యాంగం 21వ అధికరణ ప్రకారం ప్రజలందరికీ గౌరవంగా జీవించే హక్కుంది. దీని మూలంగా ప్రజలందరికీ కావలసిన ఆరోగ్యం, నీరు వారియొక్క హక్కని కూడా ప్రతిపాదించబడింది. నీరు ప్రజలందరికి చెందిన సహజవనరని అందరు నమ్మినా కూడా, కొన్ని ప్రభుత్వాలు ప్రైవేటీకరణకు సంబంధించిన పథకాల్ని చేపట్టాయి. అసలు నీటిని ప్రైవేటీకరణ చేయడం వల్ల దేహానికి కావలసినంత నీరు పొందలేని ప్రజలు గౌరవంగా బ్రతకడం మాటటుంచి ఆరోగ్యం దెబ్బతిని, ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి నీటి ప్రైవేటీకరణ పథకాలే కాకుండా, నీటిని సీసాల ద్వారా అమ్ముతున్న కార్యకలాపాలన్నీ కూడా రాజ్యాంగ విరుద్ధచర్యలే అని చెప్పాలి.

కనీసం నాల్గు సుప్రీంకోర్టు తీర్పులు: నీరు, సూర్యరశ్మి, సముద్రం లాంటి సహజ వనరులు ప్రజలకు చెందిన ఆస్తులని; వాటిని ప్రైవేట్ యాజమాన్యానికి అప్పజెప్పడానికి ప్రభుత్వానికి ఏ మాత్రం హక్కు లేదని; దేహానికి తగినంత అవసరమయినపుడు నీటిని పొందడం ప్రజల ప్రాథమిక హక్కని; ఇది మానవహక్కని తీర్పులివ్వడం జరిగింది. ఇక్కడొక విషయం గమనించాలి. నీరు మన అందరి ఆస్తి, మీ ఆస్తి, నా ఆస్తి అన్నపుడు ఈ ఆస్తిలో మనమందరం భాగస్వాములే అన్నమాట. మనందరికీ దేశ సహజవనరులలో భాగం వుంది. అటువంటప్పుడు మనభాగం మనకివ్వకుండా ప్రైవేటు పెద్దలకు ధారాదత్తం చేయగల హక్కెవరికీ లేదు. ఇది ఉమ్మడి ఆస్తి. దీని మీద సంపూర్ణాధికారం ప్రకృతికే వుంది.

అంతర్జాతీయ సంస్థలు - ఐక్యరాజ్యసమితి, మానవహక్కుల అంతర్జాతీయ వేదిక, మానవ పర్యావరణ వేదిక, అంతర్జాతీయ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక వేదికలు - ఇలా ఎన్నో ప్రాథమిక వేదికలు- "నీరు ప్రజలయొక్క ప్రాథమిక హక్కు, సర్వవేళలా అవసరాలను బట్టి నీరు పొందడం ప్రజల హక్క "ని దృఢమైన అభిప్రాయాలు వెలిబుచ్చాయి.

వీటన్నింటి యొక్క సారాంశం ఏమిటంటే

ఎ. నీరు దేహ అవసరాల కోసం సర్వవేళలా పొందడం ప్రజల ప్రాథమిక హక్కు

బి. నీరు ఏ ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించడానికి ఏ ప్రభుత్వానికీ హక్కులేదు.

సి. నీరు అమ్మబడే వస్తువు కాదు.

నీటి ప్రైవేటీకరణ మూలంగా కలిగే దుష్పరిణామాలు

1. నీటి చార్జీలు విపరీతంగా పెరుగుతాయి. ఇప్పటికే పెరిగిన చార్జీలు 4-5 రెట్లు పెరుగుతాయి. ఎందుకంటే నీటి చార్జీలను వసూలు చేసుకొనే హక్కు ప్రైవేటు కంపెనీలు పొందిన మూలంగానే, ప్రజల క్షేమం ఏమాత్రం ఖాతరు చేయని కంపెనీలు లాభాపేక్షే ధ్యేయంగా వ్యవహరిస్తాయి.

2. ప్రైవేటీకరణ కారణంగా కాస్తో కూస్తో రుసుము చెల్లించకుండా నీటిచుక్క కూడా లభ్యమవదు. ఆ మాత్రం కూడా చెల్లించని బీదలు ఎక్కడైనా కనిపించిన మురికి గుంటల నీరు త్రాగి దాహం తీర్చుకోవలసిన పరిస్థితి

ఎదురవుతుంది. దీని పర్యవసానం విడమర్చి చెప్పనక్కర్లేదు.

3. నీటి సప్లైను గురించి కాని, నీటియొక్క శుభ్రతను గురించి కాని, చార్జీల గురించి కాని, మోటార్ల గురించి కాని, ప్రైవేటు కంపెనీ ప్రజలకే మాత్రం జవాబుదారి కాదు. ప్రజల ఆరోగ్యం గురించి కంపెనీలు స్పందించవు.

4. వ్యవసాయం, ఉత్పత్తిరంగం, విద్యుచ్ఛక్తి, ఇలా దేశ ఆర్థిక పరిస్థితికి మూలమైన నీటిని ప్రైవేటు పరం చేయడం ద్వారా ఆర్థిక పరిస్థితి తద్వారా దేశ భద్రత, సార్వభౌమత్వం ప్రైవేట్ కంపెనీల గుప్పెట్లో బిగించబడి వుంటాయి.

5. ప్రైవేటీకరణలో ఒక కంపెనీతో పాటు ఇంకొక కంపెనీలు పోటీలు పడడం, దానిలో భాగంగా సాగే లావాదేవీల ద్వారా లంచగొండి తనం ఎక్కువవక తప్పదు.

ప్రైవేటీకరణ పథకాలను ప్రభుత్వాలు ఎందుకు ఆచరిస్తున్నాయి?

ప్రపంచబ్యాంకు మిలియన్ల కొద్దీ అడిగినదే తడవుగా దేశానికి,అందులో ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రానికి ఇస్తూ ఆ డాలర్ల ఎరజూపడం వల్ల ప్రభుత్వం ప్రపంచబ్యాంకు విధానానికి దాసోహ మంటున్నది. బ్యాంకు ఆదేశం ప్రకారమే నీటి ప్రైవేటీకరణ కొనసాగుతున్నది. ఇది ప్రజా వ్యతిరేకచర్య అని అందరికీ తెలిసినదే అయినా బ్యాంకు వేస్తున్న బిచ్చంకోసం, బ్యాంకు చెప్పిన ప్రకారం ఎటువంటి రాక్షసకృత్యమైనా చేయ డానికి ప్రభుత్వం నీటిని ప్రైవేటీకరణ చేయ డానికి నడుంకట్టనున్నది. ప్రాణానికవసరమైన వాటిని ప్రైవేటుపరం చేస్తున్నప్పుడు ఉధృతమైన ఉద్యమాన్ని రాజకీయ పార్టీలు చేపట్టకపోవడం దురదృష్టకరం. నీటి సమస్యను ఒక జీవన్మరణ సమస్యగా తీసుకొని ప్రజలే కార్యచరణకు పూనుకోవాలి.

స్వచ్ఛంద సంస్థలు

నీటి సమస్యను తీసుకొని పనిచేసే స్వచ్ఛంద సంస్థలు మన రాష్ట్రంలో 4-5 ఉన్నాయి. కాని వీరందరు కూడా వ్యాసాలు రాయడంలోను, వేదికపై నిలబడి అనర్గళంగా ఉపన్యాసాలి వ్వడంలో మట్టుకే శ్రద్ధ చూపిస్తూ కాలం గడుపు తున్నారు. ఒక్కొక్కసారి అవార్డు కూడా పొందవచ్చును. కాని ఒక నిర్దిష్ట కార్యా చరణను రూపొందించుకొని ఈ సమస్యను తుది మొదలుగా పోరాడితేనే ప్రైవేటీకరణకు గండికొట్టవచ్చును. ✦

(10వ పేజీ తరువాయి..)

గ్రామ సభది అన్న అంశాన్ని మనం ముందుకు తీసుకురావాలి. ఇప్పుడే, ఇక్కడే ప్రజల జీవితాల్ని నిర్ణయించే అధికారం ప్రభుత్వానిది అన్న దాన్ని నిలువు లోతున పాతిపెట్టటానికి మనం పూనుకోవాలి. ఈ రకంగా నేను ఈ సభ ముందు ఈవైపుగా ఆలోచించి తగిన చర్యలు తీసుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, రైతాంగ రుణభారానికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాల్సిన అవసరం వుందని తెలియజేస్తున్నాను. ✦

(11వ పేజీ తరువాయి....)

చేయరాదనీ, డిమాండు చేయవలసి వుంది. వడ్డీ ఏనాడూ అసలును మించిపోరాదనీ, రైతాంగం చేసిన అప్పులకు తిరిగి చెల్లింపులను మొదట అసలులో మినహాయించాలనీ, అప్పుల వసూలుకు రైతుల భూమి, వ్యవసాయ పరికరాలను జప్తు చేయరాదనీ డిమాండు చేయాలి.

ఈ తక్షణ డిమాండ్లతో పాటుగానే, వ్యవసాయ సంక్షేమానికి కారణమైన విధానాల ఉపసంహరణ కొరకు ఉద్యమించాల్సిన అవసరం వుంది. దీనితో పాటుగానే **భారతసమాజం అభివృద్ధికి ఆటంకంగా నిలిచిన** భూస్వామ్య వ్యవస్థను రద్దుపరచి దున్నే వానికే భూమి కేంద్ర నినాదంగా వ్యవసాయ విప్లవోద్యమాన్ని నిర్మించవలసిన అవసరం కూడా వుంది. ✦

ప్రత్యక్ష సాక్షి కథనం

– కోడూరి విజయకుమార్

ఎన్నని జెప్పమంటవ్ నాయినా?
మా గోస యేమని రాసుకుంటవ్ నాయినా
మా పానాలే మా చేతుల్లల లెవ్వనుకున్నోళ్ళం
మా వోట్లు మా చేతులల్లుంటయ్యని యెర్కలే నాయినా !
బాగుపడేదెవలో?.... బంగ్లాలు గుట్టుకునేదెవలో?
బుక్కెడు బువ్వకోసం రగతం చెమట చేసుకునేటోళ్ళు
యెవల మతలబేందో యెట్ల సమజైతది నాయనా?
మాపటీలి వోట్లెయ్యద్దని వాళ్ళు జబర్దస్తు జేసే
పాదుగాల వోట్లెయ్యాలని వీళ్ళు జులుం జేసే
బందూకుల నడ్మ బతుకైంది బాంచేను
మా మగపోరగాండ్లు ఆగమైపోయిండ్లు
వీళ్ళకేం జెప్పిండ్లని వాళ్ల గొట్టీ వాళ్ల జాడ జెప్పమని వీళ్ళు సావగొట్టీ
వున్నోళ్ళనే పరాయి దేశమోళ్ళమైనం
రజాకార్ జమాన్ల గుడ గింతన్నాయం లేదు కొడుకా!
ఊళ్ళెకు రోడ్డు లేదన్నామా?... పాలాల గ్గాదు
మాకు దూపైన నీళ్ళు లెవ్వన్నమా?
తిండికి తండ్లాడతానమని, టికాన లేదని
లొల్లి జేసినమా?
పానముండీ లేనోల్ల లెక్కనె వుంటిమి గద
మీ లెక్కలల్ల వున్నమో లేమో అన్నట్టే వుంటిమి గద
జరంత నువ్వన్న జెప్ప బాంచను
నివద్దిగ మా వోట్లు మా చేతుల్లనే వున్నయ్యా?

నీళ్ళకోసం ఉద్యమం

– మహమూద్

తల నుంచి వేరుచేయబడ్డ మొండాలను
కల నుంచి వేరు చేయబడ్డ హృదయాలను
జోడించే పని మొదలుపెట్టాలి
కరువులను కాటికి పంపే
నీళ్ళ కోసం ఉద్యమాలను నిదురలేపే
కార్యక్రమాలకు మన ఊపిర్లను వేదికలు చేయాలి
నీళ్లే సంస్కృతి .....
నీళ్లే చరిత్ర .....
నీరెండి పోయి పాయలు మిగిలిన
ఈ సీమ మీద
నీళ్ళ కోసం పారలమై
పాతాళాన్ని పై పైకి ఎగదోసుకొచ్చేట్టు
కదలికలు సృష్టించాలి
కష్టం మీద హక్కు మాదని
దుక్కి, దున్ని మీద హక్కు మాదని
సముద్రాల కోసం ఊవ్విళ్లూరే నదీ జలాలని
పాలాల్లోకి మరల్చేట్టు
హలాన్ని ఆయుధంగా మార్చే
పని మొదలు పెట్టాలి

కా॥ కోటయ్య, రాష్ట్ర కార్యదర్శి; రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)



అధ్యక్షా, మిత్రులారా !

మనకి నీటి ప్రైవేటీకరణ జరిగితే మన దేశం, మనజాతి, మనకు జరిగే నష్టాల గురించి మిత్రులు ప్రసంగించారు. గేదేపాలు, ఆవుపాలు అమ్ముకుంటే 10రూ॥లు వస్తే ఈనాడు గ్రామాల ప్రజలు బహుళజాతి కంపెనీల నీళ్ళ బాటిల్స్‌ను 12 రూ॥లకు కొనుచున్నారు. మన నీటిని తక్కువ ధరకు కొని వాటిని ఎక్కువ ధరకు ప్రజలకు అమ్ముచున్నారు.

రాష్ట్రాలలో, వివిధ ప్రాంతాలలో ప్రజలకు బహుళ జాతి కంపెనీల నీళ్ల వ్యాపారం ముందు మంచినీరు లేకపోవడం వలన ప్రజలు చనిపోవుచున్నారు.కలుషితమైన నీరు త్రాగుట వలన ప్రజలు వివిధ రోగాలతో బాధపడుతున్నారు. ఈనాడు విశాఖపట్టణంలో, శ్రీకాకుళంలో చక్కటి వర్షాలు పడతాయి. కాని, వీరు త్రాగటానికి నీరు వుండదు.


కా॥ తరిమెల నాగిరెడ్డిగారు ఏమన్నారంటే – బ్రిటీష్‌వారు తమ ఇంజనీరు రూపొందించిన విధానాలనే ఎందుకు ప్రక్కన పెట్టారంటే వివిధ ప్రాంతాలలో ప్రజలనుకూలీలుగా మార్చటానికి. బ్రిటీష్‌వారు గాని, నైజాం నవాబుకాని సమగ్రమైన నీటి పథకాల గురించి వారి ఆలోచనలలో గానీ, ఆచరణలోగానీ లేవు. మన ప్రభుత్వాలు విదేశాలలో ఆస్తులు దాచుకుంటూ ప్రజలకు సమగ్ర నీటి పథకం అమలుచేస్తే మాకెలాంటి లాభం అని ఆలోచిస్తున్నారు. ఈనాడు నల్గొండ, వరంగల్ జిల్లాలలో సాగునీటి ఉద్యమం మొదలైంది. దానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. నాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం, నైజాం ప్రభుత్వము నీటి సమస్యను తీర్చలేదు. ఈనాడు తుంగభద్ర మీద ప్రాజెక్టులు పూర్తి చేస్తే రాయలసీమలో కరువు ఉండేదికాదు. ఈనాడు గోదావరి, కృష్ణా నదుల మీద ప్రాజెక్టులను సక్రమంగా అమలు పరిస్తే గోదావరి, కృష్ణా డెల్టాలలో కరువు ఉండేది కాదు. ఈనాటి కరువుకు పరిష్కారం లేకపోవటం కాదు. ఉన్న నీటిని నిల్వ చేయలేకపోవడమే చేసిన తప్పు. ఏటా జరిగే ఎన్నికలలో తమ పార్టీలు గెలవటం కోసం ఈ ప్రభుత్వాలు వివిధ పథకాలు, శంకుస్థాపనలు చేస్తూ పబ్బం గడుపుతున్నాయి.

ఆంగ్ల దేశాలు గోధుమలు, వారి వస్తువులు, బట్టలు ఎలా అమ్ముడు పోవాలా? అని ఆలోచిస్తూ అవన్నీ ఇండియలో అమ్ముడవ్వాలనుకుంటున్నారు. వీటి కోసం ధనిక దేశాలు ప్రపంచబ్యాంకును, ఐ.ఎమ్.ఎఫ్ ను ఉపయోగించుకుంటున్నాయి. స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేసి ప్రపంచబ్యాంకు షరతులను అమలు పరచుచున్నారు. ఈనాడు ప్రతినిధులలో చాలామంది యువకులు ఉన్నారు. ఉద్యోగాలు దొరకటం లేదు. ఈనాడు మనను దివాళాతీసి, మన ఆస్తులను అమ్మివేస్తున్నారు. నీటిని ప్రైవేటీకరణ చేస్తున్నారు. వారు అవలంభిస్తున్న పథకాలు రాజకీయ నాయకులు, వారి బంధువులకు ఉపయోగపడుతున్నాయి.

కులతత్వాన్ని, మతతత్వాన్ని ఉపయోగిస్తున్న భూస్వామ్య ప్రభుత్వాన్ని అణచాలంటే మనమందరం ఉద్యమించాలని కోరుకుంటున్నాను. ✦

కా॥ మానం రామారావు

రాష్ట్ర ఉపాధ్యక్షులు, రైతు కూలీ సంఘం (ఆం.ప్ర)



మిత్రులారా ! రాష్ట్రం నలుమూలల నుండి వందలాది మంది రైతుకూలీలు, గిరిజనులు కదిలి రావడం సంతోషంగా ఉంది. మీరంతా రైతాంగ సమస్యల్ని చర్చించుకోవడానికి, పరిష్కార మార్గం కోసం వచ్చారు. రైతాంగం జీవనం కోసం, భూమికోసం, సాంఘిక విముక్తి కోసం తెలంగాణా, నక్సల్బరీ, తెభాగా, వర్లీ, పున్న ప్రవాయలార్, కొండమొదలులో సాహసోపేతం గా పోరాడారు. ఈరోజు దుగ్గేరులో రైతాంగ ఉద్యమం సాగుతున్నది. ఇవన్నీ కష్టజీవుల రాజ్యం కోసం, దున్నేవానికే భూమి కావాలనే లక్ష్యంతో సాగిన పోరాటాలు. ఈ పోరాటాలు అనేక ఒడుదుడుకుల్ని, పెడ ధోరణుల్ని ఎదుర్కొన్నాయి. ఈరోజు పాలకులు అనుసరిస్తున్న భూస్వామ్య, సామ్రాజ్యవాద అనుకూల విధానాలు రైతాంగానికి, కూలీలకు, గిరిజనులకు, ఇతర ప్రజానీకానికి వ్యతిరేకమైనవి. వాళ్ళ జీవితాల్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల్ని ఎదిరించి నిలబడాలి. రైతాంగ పోరాటాలు సాగడాన్ని ఎవరూ ఆపలేరు. పోరాటాల ద్వారానే ప్రజలు తమ హక్కుల్ని సాధించుకోగలుగుతారు. ✦

నాకు నీళ్ళు కావాలి

– యస్. మునిసుందరం

నాకు నీళ్ళు కావాలి
ఈ మట్టి మనిషికిన్ని నీళ్ళు కావాలి.
నీళ్ళంటే జీవనం
నీళ్ళంటే బ్రతుకు నందనవనం
నాగరికతలు నీళ్ళతోనే ప్రవహిస్తాయి
చరిత్రలు యేటి అలలేరాస్తాయి
అందుకే నాకిన్ని నీళ్ళు కావాలి
నా తల్లి కన్నీళ్ళు తుడవాలి
ఎడారి దాహం నాది
తడారిన గొంతు నాది
తరతరాల పరితాపం నాది
యుగయుగాల శాపం నాది

గడ్డి గోసె రాజయ

– భూపాల్

కోడుల దొకా బుర్దమీల
అడుగు దీసీ ఏయలేక
ఒంగి ఒంగీ మెదలుగోసీ
ఒక్కసోయిన యెదల దమ్మకో
ఒడ్డుకొచ్చీ పడ్తిరా గడ్డిగోసె రాజయా
గోడ్డు యాతన పడ్తిరా ఎడ్డి బతుకూ రాజయా

విత్తనహక్కు రైతుదే! భారత్ WTO నుండి బయటకి రావాలి!!

ప్రొ॥ కె.ఆర్. చౌదరి, వ్యవసాయ ఆర్థికశాస్త్రవేత్త

ఈ సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర అధ్యక్షులు, సోదరీ, సోదరులారా! ఈ సదస్సుకు రాష్ట్రం నలుమూలల నుండి భారీ సంఖ్యలో వచ్చారు. అనేక కష్టనిష్టూరాల కోర్చి రావడాన్ని నేను అభినందిస్తున్నాను. భారత వ్యవసాయం - రైతాంగం చిన్నాభిన్నం అయ్యింది. రైతులు గిట్టుబాటు ధరలు లేక, అప్పులను తీర్చలేక నానా బాధలుపడుతున్నారు. ప్రధానంగా ఆదివాసీ గిరిజనులు, దళితవర్గాల ప్రజలు, వ్యవసాయంలో మహిళలు ఎక్కువ శ్రమ చేస్తున్నారు. వారికి తగిన కూలీ లేదు. పేదరైతు - కూలీలు తట్టా, బుట్టా పట్టుకొని వలసలు పోతున్నారు. సుదూర ప్రాంతాలకు మహిళలు కూడా పోతున్నారు. బ్రతుకుదెరువు లేక ఆఖరికి ఎంతోమంది తల్లులు, చెల్లెళ్లు, అక్కలు వ్యభిచారవృత్తిలోకి దించబడటం సిగ్గుచేటైన విషయం. దేశంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో ప్రధాన స్థానంలో వుందని చంద్రబాబు ప్రకటిస్తున్నాడు. అభివృద్ధి ఉందో, లేదో తెలియదుగాని; గోవా పోయినా, బొంబాయి పోయినా, కలకత్తా పోయినా ఎక్కడైనా ఈ ఆంధ్రప్రదేశ్‌లోని మహిళలే వ్యభిచారంలో మొదటిస్థానంలో వున్నారు. ఎందులో అంటే వ్యభిచారంలో రాష్ట్రం ప్రధమ స్థానంలో వుందనేది వాస్తవం. ఇది ఎంత నీచమైనది! ఇది ఎంత హేయమైన విషయం! దీనికి కారణం ఎవరు? అంటే రాష్ట్ర ప్రభుత్వం అని చెప్పక తప్పదు.

విత్తనాలను గురించి తెలుసుకోవలసిన అవసరంవుంది. గతంలో పంట నుండే రైతులు విత్తనాలు తయారుచేసుకొనేవారు. ఈరోజు ఆ అవకాశం లేదు. రైతులు విత్తనాలు కొనుక్కోవలసి వస్తుంది. దీని వెనుక చాలా సామాజిక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలు ముడిపడి వున్నాయి. విత్తనాలు లేకపోతే పంటలేదు, ఆహారం లేదు. విత్తు కొద్దీ పంట అనేది మీకు తెలుసు. విత్తనం నాణ్యం లేకపోతే పంట నాణ్యత ఉండదు. విత్తనాలు నాణ్యంగా వుంటే అధిక దిగుబడి వస్తుంది. పెట్టుబడి పెరుగుతుంది. కాబట్టి నాణ్యమైన విత్తనాలు అవసరం. వీటి కోసం రైతులు నానాఅగచాట్లు పడుతున్నారు. ఎందుకంటే విత్తనాలరంగంలో



కూడా సంక్షోభం వుంది. విత్తనాల కరువు; విత్తనాల ధరలు ఎక్కువగా వున్నాయి. విత్తనాల నాణ్యత సరిగాలేదు. ఇవి ప్రధాన సమస్యలు. మార్కెట్లో విత్తనాల కొరత తీవ్రంగా వుంది. రైతులకు అందడం లేదు. గత సం॥ ప్రభుత్వం వద్ద విత్తనాలు కావల్సినన్ని వున్నాయి. మేం పంపిణీ చేస్తాం అన్నారు. ఆచరణలో అందలేదు. విత్తనాల పంపిణీలో అవినీతి, అవకతవకలు జరిగాయి. కర్నాటకకు తరలించారు. లారీ, లారీల లోడ్‌లను పట్టుకొని అనంతపూర్‌లో ధర్మవరం, రాయదుర్గం, కణేకల్లు ఇటువంటి ప్రాంతాలలో రైతాంగానికి వేరుశెనగ విత్తనాలను పంచమంటే, అవినీతి అధికారులు వ్యాపారస్తులకి ఇచ్చారు. వాళ్ళు శెనక్కాయల మార్కెట్‌లో అమ్ముకున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్‌లలో వరి విత్తనాలను అధికారులు, వ్యాపారస్తులు కుమ్మక్కై అమ్ముకున్నారు. చేవెళ్ళ, దుర్గి, తదితర ప్రాంతాల్లో రైతులు విత్తనాల కోసం ఎగబడ్డారు. కొన్నిచోట్ల విత్తనాలు అడిగినందుకు రాష్ట్ర ప్రభుత్వం లాఠీలతో, తూటాలతో సమాధానం చెప్పింది.

ఎందుకు విత్తనాల సమస్య వచ్చింది?

గత 2,3 సం॥లలో కరువు వల్ల, వర్షాలు లేక పంటలు సరిగా పండలేదు. రైతుల వద్ద విత్తనాల కొరత ఏర్పడింది. దీనిని ప్రభుత్వం ముందుగానే గ్రహించి జాగ్రత్త పడాల్సింది. నాణ్యమైన విత్తనాలను అందించే బాధ్యత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వానికి ఉంది. కాని ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరించింది. విత్తనాలను నిలువచేసుకోవడంలో సాంప్రదాయ పద్ధతుల్ని రైతులు అనుసరించేవారు. దీని వలన విత్తనాల కంపెనీలు, ఏజెన్సీల పైన ఆధారపడవలసిన అవసరం ఉండేది కాదు. 1965లో సస్య విప్లవం వచ్చింది. ఇందులో ప్రభుత్వం" రైతులు విత్తనాలు నిల్వ చేసుకోనక్కర లేదు. మీకు మేలైన విత్తనాలను ప్రభుత్వమే అందజేస్తుంది. అధిక దిగుబడి వస్తుంద"ని కావాలనే ప్రచారం చేసి రైతుల అలవాటును, సాంప్రదాయాన్ని మాన్పించింది. విత్తన కంపెనీలు నేడు పెద్ద ఎత్తున తమ విత్తనాల ప్రచారం చేస్తున్నాయి.

రైతుల నిస్సహాయ పరిస్థితిని ఆసరా చేసుకొని విత్తనాలను అప్పుగా కూడా సరఫరా చేస్తున్నాయి. కంపెనీలు హైబ్రీడ్ రకం విత్తనాలను సరఫరా చేస్తున్నాయి. వీటిని రైతులే తయారు చేసుకోవచ్చు. అదివారికి చేతకానిదిగా, కంపెనీల ప్రత్యేకతగా ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వం కూడా ధనిక విత్తన కంపెనీలకి మేలుచేసే విధంగా వ్యవహరిస్తుంది. 1 కే.జీ విత్తనం తయారు కావాలంటే 10రూ॥లు ఖర్చు అయితే, కంపెనీ వారు రూ.100,200,300 వరకు కూడా అమ్మిన సందర్భాలు ఉన్నాయి. IAH కంపెనీ వాళ్ళు 1 కె.జీ. మిరప విత్తనాలు 30,40 వేల వరకు అమ్మారు. టమోటా కె.జీ విత్తనం 50వేలు, 1 కే.జి. బొప్పాయి విత్తనాలు 1లక్షా 80 వేలు అమ్మారు. అంతరేటు పెట్టి రైతులు కొనగలరా? బహుళజాతి కంపెనీల నుండి రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలు మన రాష్ట్ర రైతాంగాన్ని భ్రష్టు పట్టించాయి. వరంగల్ జిల్లాలోని లక్ష్మీపురంలో ఎక్సెల్-35 అనేరకం ప్రత్తి విత్తనాలు ఇచ్చారు. చెట్లు ఏపుగా పెరిగాయి. కానీ పూత లేదు, కాయలేదు. రైతులు ఎకరాకు 8,10వేలు ఖర్చుపెట్టారు. జక్కరాజు పల్లె, లక్ష్మీపురం ప్రాంతాల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసే బాధ్యత ప్రభుత్వానిదే. కానీ ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించింది. పాలకుల నుండి అధికారుల వరకు విత్తన కంపెనీలతో కుమ్మక్కై రైతులకు ఘోరమైన అన్యాయం చేసింది. ఇంతవరకు ఎందరు అవినీతిపరుల్ని, విత్తనాల కల్తీకి కారకుల్ని అరెస్టు చేసారు? శిక్షించారు? అని నేను ప్రశ్నిస్తున్నాను. దీని మీద ఈ రైతుకూలీ

సంఘాలు పోరాటం చేస్తే ప్రభుత్వం విత్తన కంపెనీలతో ఒక అవగాహన ఒప్పందం చేసుకున్నారు. విత్తనాలు నకిలీ అయితే రైతుకు విత్తనాలరేటు తిరిగి ఇస్తారట. మరి రైతు శ్రమకి విలువ ఏది? ఒక విత్తనాన్ని విడుదల చెయ్యాలంటే దాన్ని కనీసం వ్యవసాయ యూనివర్శిటీ అనేక చోట్ల వేసి పరీక్ష చెయ్యాలి. కనీసం 3 సం॥లు పరీక్షచేసి భూమిలో వేసి పరిశీలించాలి. కానీ ప్రైవేటు కంపెనీలు అటువంటి విధానాలు వేటినీ అవలంభించడం లేదు. ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తుంది. అన్ని రంగాలతో పాటు విత్తనాలను కూడా ప్రైవేటీకరించారు. విత్తనాల సమస్యకు ప్రభుత్వ బాధ్యతారాహిత్యం, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు కారణం. 1991 నుండి నూతన ఆర్థిక సంస్కరణలు అమల్లో ఉన్నాయి. ఇవి మనందరికీ తెల్సిన డబ్ల్యు.టి.ఓ., డబ్ల్యు.బి.లు అనేక రూపాల్లో అప్పులు ఇచ్చి అన్ని రంగాలపై షరతులు విధిస్తున్నాయి. అందులో విత్తనాలు ఒకటి. గతంలో మనదేశంలో విత్తనాల కార్పోరేషన్ లుండేవి. ఎ.పి. సీడ్స్ టెడ్ వగైరా. కానీ నేడు డబ్ల్యు.టి.ఓ. విత్తనాలలో ప్రభుత్వ భాగస్వామ్యం రద్దుచేసుకొమ్మన్నది. అరుణ్ జైట్లీగారు దీన్ని అంగీకరించారు. "కూరగాయల రంగంలో విత్తనాల తయారీ ఆపెయ్యండి. ప్రైవేటువారి వద్దనుండి కొనుక్కోవా" లని ఆదేశించింది. డబ్ల్యు.బి. ప్రైవేటుసంస్థల్లో, ఫలానా దేశ కంపెనీల విత్తనాలు నాణ్యమైనవి అవే కొనుక్కోమని చెప్తుంది. జపాన్ నుండి దిగుమతి అయ్యే 1 కేజి విత్తనం 15 వేల రూ॥లు పెట్టి కొనవలసి వస్తుంది. ఈ ప్రైవేటు సంస్థలు కనీసం 80% విత్తనాలను సరఫరా చేస్తున్నాయి. ఇవి సూటిరకం విత్తనాలను తయారుచేయవు. వాళ్ళు హైబ్రిడ్‌రకాన్నే ఉత్పత్తి చేస్తారు. వాళ్ళు ఆహారపంటను కాకుండా వాణిజ్యపంటకు కావల్సిన విత్తనాలనే పంపిణీ చేస్తారు. ప్రైవేటుసంస్థలు విత్తన రంగంలో కూర్చొన్నందు వలన విత్తనాలలో నాణ్యత తగ్గిపోయింది. వారికి లాభాపేక్ష తప్ప ప్రజల శ్రేయస్సు అవసరం లేదు. ప్రభుత్వం కనీసం ఈ కంపెనీలపై అడ్డూ, అదుపు చెయ్యలేక పోతున్నది. ప్రైవేటీకరణ వలన అనేక నష్టాలు అనుభవిస్తున్నాం. దీన్ని వ్యతిరేకించాలి.

చివరిది: ప్రపంచీకరణ, బహుళజాతి కంపెనీలు, సామ్రాజ్యవాదం గూర్చి మన వాళ్ళు అనేక విషయాలు చెప్తుంటారు. అసలు సామ్రాజ్యవాదం అంటే ధనిక దేశాలు చిన్న దేశాలలో చొరబడి, వాటిని దోచుకొని, తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటుంటే అదే సామ్రాజ్యవాదం. ప్రపంచీకరణ వలన పేద దేశాలు తీవ్రంగా నష్టపొయ్యాయి. పెద్దదేశాలు మరింత అభివృద్ధి చెందాయి. ఈ 10,15సం॥ల్లో పేద దేశాల్లోని విత్తనాల మీద గుత్తాధిపత్యం ఈ బహుళజాతి కంపెనీలది.

చట్టపరమైన విధానాలు

డబ్ల్యుటివో అనేది కొన్ని ఒప్పుందాలు, చట్టాలు చేసింది. దానికి అనుకూలంగానే పేద దేశాలు తమ చట్టాలు చెయ్యాలి. పేటెంట్ చట్టం చెయ్యమని డబ్ల్యుటిఒ మన దేశానికి చెప్పింది. మొదట మనదేశం ఒప్పుకోలేదు. ఈ చట్టానికి వ్యతిరేకంగా 50 మంది మేధావులు గతంలో ఒక విజ్ఞాపనను రాష్ట్రపతికి అందించారు. అందులో మొదటి సంతకం చేసినవారు వాజ్‌పేయి, అద్వానీ, మురళీ మనోహర్ జోషి, ఫెర్నాండేజ్. వీళ్ళే ఈ రోజు పేటెంట్ చట్టాన్ని చేసారు. దాన్ని వుపయోగించుకుంటున్నారు. ఈ పేటెంట్ చట్టాన్ని ఉపయోగించుకొని సామ్రాజ్యవాద దేశాలు మనదేశాన్ని దోచుకుంటున్నాయి. సామ్రాజ్యవాదులు మొత్తం పేద దేశాల్ని అన్ని రకాలుగా దోచుకుంటున్నారు. బిటి పత్తి లాంటి అనేక విత్తనాలను సామ్రాజ్యవాద దేశాలు పెరిగిన తమ టెక్నాలజీని వుపయోగించుకొని తయారు చేసారు. అలాగే టెర్మినేటర్ విత్తనాలని కూడా. సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచీకరణను వుపయోగించుకొని మరింత అభివృద్ధి చెందుతున్నాయి. మోన్‌శాంటో కంపెనీ వచ్చింది. ఇది మనదేశంలోని మహికో, ఐ.టి.సి., వగైరా చిన్న కంపెనీలను మింగి వేసింది. సామ్రాజ్యవాదుల అండతో గుత్త కంపెనీలు ఏర్పడ్డాయి. పేటెంట్‌చట్టం అంటే ఒక కంపెనీ ఒక వస్తువును తయారుచేసి పేటెంట్ తీసుకుంటే, ఆ వస్తువును మరెవరూ 20 ఏళ్ళవరకు తయారు చెయ్యకూడదు. అమ్మకూడదు. గతంలో వ్యవసాయ రంగంలో పేటెంట్ లేదు. ప్రస్తుతం ఆఖరికి జన్యురంగంలో కూడా పేటెంట్‌చట్టం పనిచేస్తున్నది. మన శాస్త్రవేత్తలు 3 వేల రకాల కొత్త వంగడాలను కనిపెట్టారు. కానీ నేడు ఈ పేటెంట్ చట్టం వలన అలా చెయ్యలేక పోతున్నారు.

మనదేశంలో సస్యశ్యామలమైన భూములున్నాయి. నీటివనరులున్నాయి. కొత్త విత్తనాలు తయారుచేసుకోగల శక్తి ఉండి కూడా వేటినీ వినియోగించుకోలేక పోతున్నాం. విత్తనాల రంగంలో కంపెనీల గుత్తాధిపత్యం పెరిగిపోతున్నది. సామాన్య రైతులు విత్తనాలు కొని పంట పండించలేని పరిస్థితి ఏర్పడుతుంది. రైతులు ఈ కంపెనీల మీద ఆధారపడటం మొదలు పెడితే రైతులకు చాలా దారుణమైన పరిస్థితి వస్తుంది. కంపెనీలు మొత్తం వ్యవసాయాన్ని, మార్కెట్‌ను తమ గుప్పెట్లో పెట్టుకొనే పరిస్థితి వస్తుంది. దీని వలన మొత్తం మన ఆహార భద్రతకే ముప్పు వస్తుంది. దీని వలన ప్రధానంగా మహిళలు, పిల్లలే ముందు నష్టపోతారు.

సామ్రాజ్యవాద దేశాలకు కావల్సింది మార్కెట్. మనదేశంలో వ్యవసాయం నాశనమయితే, అప్పుడే వారి ఉత్పత్తుల్ని మనం కొంటాం. అందుకోసం మన దేశాన్ని వారి గుప్పెట్లో పెట్టుకొని మన వ్యవసాయాన్ని అస్తవ్యస్తం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నది. కావున జీవ వైవిధ్యాన్ని, జన్యు సంపదను నాశనం చెయ్యడానికి వీరు ప్రయత్నిస్తున్నారు. **ఆదివాసీలు జీవవైవిధ్యాన్ని, జన్యుసంపదను రక్షించారు. కాని ఈ సామ్రాజ్యవాదులు దాన్ని నాశనం చేసారు. ఒక జాతికి ముఖ్యమైన జీవ వైవిధ్యాన్ని కూల్చే దుర్మార్గమైన కుట్ర సామ్రాజ్యవాదులు చేస్తున్నారు. దీనిని మనమందరం గట్టిగా ఎదుర్కోవలసిన అవసరం ఉంది.**

బిటి పత్తి విత్తనం అనేది మోన్‌శాంటో అనే సామ్రాజ్యవాద కంపెనీది. ఇది మన రైతులకు పెట్టుబడిని పెంచింది. ఎరువులు, పురుగు మందులను ఎక్కువగా వినియోగించాల్సి వచ్చింది. దిగుబడిని పరిశీలిస్తే ఏమాత్రం దిగుబడి పెరగలేదు. బిటి పత్తి మన రైతుల్ని నష్టపర్చింది. ఎన్.జి రంగా యూనివర్శిటీ వాళ్ళు, అగ్రికల్చర్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు అంతా కలిసి ఈ పత్తిని బ్యాన్ చెయ్యమని చెప్పారు. కాని ప్రభుత్వం చెయ్యలేదు. టెర్మినేటర్ విత్తనాలు వచ్చాయి. అంటే పునరుత్పత్తి శక్తిలేని విత్తనాలు. ఇలాంటి విత్తనాలు వస్తే మన జన్యుసంపద, జీవ వైవిధ్యం నాశనం అవుతుంది. బహుళజాతి కంపెనీలు పెద్ద ఎత్తున విత్తనరంగంలో ప్రవేశిస్తున్నాయి. దీని వలన మన దేశంలోని చిన్న కంపెనీలన్నీ మూతపడతాయి. గుత్తాధిపత్యం ఏర్పడుతుంది. వీరుకొన్ని షరతులు పెడుతున్నారు. " మీరు మీ దేశం కంపెనీలకు సబ్సిడీలు ఇవ్వకూడదు, ప్రోత్సహించకూడద"ని. ఇదే జరిగితే సామ్రాజ్యవాద కంపెనీల పట్టు మన దేశంలో పెరిగి మన వ్యవసాయ రంగాన్ని, మన రైతాంగాన్ని దోపిడీ చేయటానికి, లూటీ



చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. మన దేశం, మన రైతులు-అన్నీ కూడా పరాధీనత లోకి వెళ్ళిపోతుంది. మనకు స్వావలంబన అనేది ఏ మాత్రం ఉండదు. మొత్తం మన సార్వభౌమత్వానికి ముప్పు వాటిల్లుతుంది. రైతులు, కూలీలు వాళ్ళ జీవన భద్రతనుకోల్పోతారు.

కాబట్టి రైతులు సూటి రకాలనే వాడాలి. బహుళజాతి, విదేశీ విత్తన కంపెనీలపై ఆధారపడ కూడదు. హైబ్రీడ్ విత్తనాల తయారీకి తగిన శిక్షణ రైతులకు ప్రభుత్వమే ఇవ్వాలి. **రైతాంగానికి విత్తనాలను తయారు చేసుకొనే హక్కు వుంది. అది అమలు చెయ్యాలి. విత్తనరంగంలో ప్రైవేటు కంపెనీలను నియంత్రించడానికి ప్రభుత్వం ఖచ్చితంగా చట్టాలు చెయ్యాలి, వాటిని అమలు చెయ్యాలి.** మన ప్రభుత్వం చట్టాలను అమలు చేసే పరిస్థితిలో లేదు. చట్టాలు పాలకుల చుట్టాలుగా మారాయి. **మనం చట్టాలు చేసేవైపుగా పోరాడాలి. బహుళ జాతి కంపెనీలను తరిమికొట్టాలి.** కరువు కాలంలో మనకు సీడ్ బ్యాంకు ఉండాలి. **విత్తనాలకు, వ్యవసాయరంగానికి ఎంతో నష్టం చేస్తున్న డబ్ల్యు.టి.వో నుండి మనదేశం బయటకు రావాలి.** దోపిడీ వ్యవస్థ మారాలి. అందుకోసం సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన దీర్ఘకాలికపోరాటాలు రావాలి. ప్రజలందరికీ చెందిన వ్యవస్థ సోషలిస్టు వ్యవస్థలోనే ఇది సాధ్యమవుతుంది.

అటువంటి వ్యవస్థకోసం, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా సాగే దీర్ఘకాలిక పోరాటాలలో మనమందరం కలిసి భాగస్వాములమవుదాం. ✦

విధ్వంసక జన్యువు

- ఎమ్వీ రామిరెడ్డి

ఆఖరికి వెన్నెముక మూలానికే ఎసరుపెట్టారు
పంట నుంచి పంట దాకా ప్రయాణించే స్వేచ్ఛ
మళ్ళీ తెల్లోడి చేతుల్లో బందీ అయింది
మట్టి మనిషికున్న ఒకే ఒక్క విత్తనోత్పత్తి సదుపాయమూ
'బలవంతులు' ప్రకటించిన నేరాల లిస్టులో చేరిపోయింది
మట్టిపొరల అట్టడుగున మొదలైన ఆదిమస్వప్నం
చడీ చప్పుడు లేకుండా ఖండాంతరాలకు తరలిపోయింది.
రైతునీ రైతునీ కలిపి నడిపిస్తున్న విత్తన మార్పిడి సూత్రం తెగిపోయింది.
మారుమూల గ్రామాల్లోకి వీస్తున్న సస్య విప్లవగీతం మూగపోయింది
నిండు చెరువుల్లాంటి జీవన ప్రవాహాలకు
గండి కొట్టిన 'గాట్' వెలితి ఇప్పటికే వెక్కిరిస్తోంది
డంకెల్ రంకెలు పాలాల మీదుగా శ్మశానాలు దాకా ఘీంకరిస్తున్నాయి.


పాలానికీ మూలానికీ ఇప్పటిదాకా
పేటెంట్ ఇనపతీగ చుట్టకపోవటమొక్కటే ఆర్థిక వెసులుబాటు
ఇప్పడిక 'టెర్మినేటర్ టెక్నాలజీ' ముళ్ళ కిరీటం
అభివృద్ధి చెందిన దేశాల అరాచక పెట్టుబడి
అత్యంత తెలివైన అమెరికా మూర్ఖుడా !
అధికదిగుబడీ తెగుళ్ళ నిరోధక శక్తి సృజనాత్మక ప్రతీకలని
మురిసిపోతున్న అజ్ఞానీ !
ఆధునిక పరిశోధనాలయాల్లో మెదణ్ణి సాగుచెయ్యటం గొప్పకాదు
కోటి పంటల పాటలు వినిపించగల విత్తనాన్ని
ఏకగీత రచనకే పరిమితం చెయ్యటం గొప్పకాదు
విధ్వంసక జన్యువుతో విత్తనాన్ని నిర్వీర్యం చెయ్యటం
నీ ఆలోచన్ల వెనక మరుగుతున్న అసలైన కుట్ర
పరపరాగ సంపర్కాలతో భారతక్షేత్రాన్ని పీల్చిపిప్పి చేసి
సాంప్రదాయిక పునరుత్పత్తి సామర్థ్యాన్ని పరిహరించటం
వ్యాపార విస్తరణ కుతంత్రం

బాస్మతి బియ్యం బిర్యానీ రుచిమరిగిన వాడు
పేటెంట్ హక్కుల కత్తుల బావిని పేర్చటంలో ఆశ్చర్యమేముంది ?

నువ్వు చరుచుకునే జబ్బ ఎవరిదిరా ?
వేలసంవత్సరాలుగా గొర్రు కర్రుకు తెగిపడుతున్న
మట్టి పెళ్ళల్లోంచీ ఊపిరిపోసుకున్న ఆకుపచ్చని లోకానిది
దద్దమ్మలా నోటకరుచుకొని పోయిన రకరకాల గడ్డిపూల పరిమళానిది
'భిక్షాందేహీ' అంటూ అడుక్కుపోయిన
విభిన్న ధాన్యాల మూలాధార జన్యువుల మొక్కల దేహానిది
వంధ్యత్వపు తుఫాన్ని విత్తనంలో కేంద్రీకరించి
తృతీయ ప్రపంచదేశాల పత్రహరితాలపై విషం ఉమ్మావ్
ఇవ్వాళ్ళ పత్తిమొక్కను కొల్లగొట్టిన నువ్వు
రేపువరినీ పాట్టు ఒలుస్తావ్ .... గోధుమనీ పిండి చేస్తావ్
మొత్తంగా 140 కోట్ల వెన్నెముకల్లో
ఆకలి నుడిగుండాలు సృష్టిస్తావ్
అప్పడింక నీ బహుళజాతి వేషంతో 'వర్థమాన' మార్కెట్లను
వేల కోట్ల వ్యాపారాన్ని కీలల్తో కబళించవచ్చు
నువ్వు దయతో విదిల్చే బీజాల్లోని జీవపదార్థాన్ని
పరీక్షించే 'క్వారంటైన్' సదుపాయమైనా లేని వాళ్ళం
ఇందులో నువ్వొక్కడివేనా నేరగాడివి?
విసురుతున్న కోరల్ని వింతగా చూస్తున్న
దళసరి శరీరాల మా పాలకులూ ముద్దాయిలే
'ప్లాంట్ వెరైటీ ప్రొటెక్షన్ చట్టాన్ని పార్లమెంటు దాకా నడిపించలేని-
బిల్లు ఆకారం కల్పించలేని ప్రజా ప్రతినిధులూ నిందితులే

నువ్వు కనిపెట్టిందే ప్రపంచానికి 'బీజ' గణితమనుకోకు
మేమో సరికొత్త వంగడాన్ని మట్టిలోంచే సృష్టిస్తాం
నువ్వు ప్రకటించిన జీవ సాంకేతిక యుద్ధాన్ని తిప్పికొడతాం
నీ అత్యాధునిక శాస్త్ర దుర్మార్గాన్ని నాగలితోనే తుదముట్టిస్తాం.

కా॥ కిషోర్‌బాబు,
రాష్ట్ర సహాయకార్యదర్శి, రైతు కూలీ సంఘం ఆం.ప్ర.



అధ్యక్షా! మిత్రులారా!

ఒక మౌళిక అంశం ఏంటంటే వ్యవసాయం అభివృద్ధి కావాలి. వ్యవసాయం ప్రజల కడుపుని నింపే విధంగా చర్యలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వాలకుంటుంది. వ్యవసాయానికి భూమి కీలకమైంది. భూమి ఈరోజున భూస్వాముల చేతుల్లోనే కేంద్రీకృతమైవుంది. నీటి మీద అధికారం కూడా ప్రైవేటు గుత్త కంపెనీలకు అప్పజెప్పారు. ఛత్తీస్‌ఘడ్‌లో ఒక ప్రాజెక్టును ప్రైవేటు వారికి అప్పజెప్పారు. నాగిరెడ్డిగారి జీవితచరిత్రలో కూడా మనం చూసాం. నీటి మీద అధికారం ఆరోజు భూస్వాములదైతే ఈ రోజు గుత్త కంపెనీలది. మరో ముఖ్యమైనవి విత్తనాలు. వ్యవసాయంలో ఆధునిక పరిశోధనలు జరిగాయి. అందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయాలు వచ్చాయి. రైతాంగానికి ఉపయోగపడే సాంప్ర దాయక వ్యవసాయ విధానాలు అమలైతే అందరం సంతోషిస్తాం. పైరుపచ్చ విప్లవం పేరుతో ఈ దేశంలోకి వచ్చిన విధానాలు అమెరికా వాళ్ళు, పెద్ద కంపెనీలు తమ ట్రాక్టర్లను, ఎరువుల, పురుగు మందులను అమ్ముకోవడానికి తెచ్చినవే. అదే విధానం విత్తనాల రంగంలో కూడా నెలకొన్నది. విత్తనాలు సరైనవా, కావా? ఎవరుచెప్పాలి? వ్యవసాయ రంగంలో విత్తనాలపై పర్యవేక్షణ సవ్యంగా వుందా? నేను ఒక విత్తనాల సర్టిఫై అధికారిని కలిసాను. అతను చెప్పాడు. విత్తనాల కంపెనీలు సర్టిఫై చెయ్యించుకోవాలనే చట్టం ఏదీ లేదు. కొన్ని కంపెనీలు "ప్రభుత్వంచే గుర్తింపు పొందినది" అని ప్రచారం చేసుకొని అమ్ము కోవడం కోసమే ఈ సర్టిఫైలు జరుగుతున్నాయి. విత్తనాలు నకిలీవని తేలితే ఆ కంపెనీపై ఎటు వంటి చర్యలు తీసుకోగల రంటే-ఐ.పి.- 420 క్రింద ఛీటింగ్ కేసుపెట్టగలం అన్నారు. అంటే వాటిపై విత్తనాల, బహుళజాతి కంపెనీల ఒత్తిడి, ప్రభావం తీవ్రంగా వుంది. కంపెనీలు పనిగట్టుకొని తమ ఎరువులు, తమ పురుగు మందులు అమ్ముకోవడం కోసం విత్తనంలోనే పురుగుల్ని ఆకర్షించే జీన్స్‌ను చొప్పిస్తున్నాయి. పురుగు మందులు ఎక్కువగా ఒక్కపత్తిలోనే అమ్ముడవు తున్నాయి. ప్రతి 100 కేజీల పురుగు మందులో 50కేజీలు ఒక్క ప్రత్తి పంటకే అమ్ముడవుతున్నాయి. అంటే దాన్ని వ్యాపారమయంగా చేసారు. 1988 లో రాజీవ్‌గాంధీ హయాంలో కొత్త చట్టాన్ని తెచ్చింది. అంతకుముందు విధానం ఏంటంటే విత్తన కంపెనీ ఒక కొత్త విత్తనాన్ని తయారు చేస్తే, దాన్ని కొంతకాలం క్వారంటైన్‌లో పెట్టాలి. తర్వాతనే దాన్ని విడుదల చేస్తారు. కాని ఈ రోజు అటువంటి నియంత్రణ ఏదీ లేదు. 1988 చట్టం వల్ల విదేశాల నుండి నేరుగా విత్తనాలు వచ్చి పడుతున్నాయి. వాటికి ఈ నిబంధనలు ఏవీ వర్తించవు. భారతీయ శాస్త్రవేత్త ఒకాయన చెప్తాడు. "మనం బాంబులనైనా అమెరికాలోకి తీసుకెళ్ళగలం కానీ ఒక్క విత్తనాన్ని తీసుకెళ్ళలేం." అన్ని రకాలుగా పరిశోధనలు చేస్తేనే వారు దాన్ని రానిస్తారు. అదే మనదేశంలో అటువంటివేవీ జరగవు. నేరుగా విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చిపడు తున్నాయి. ఇదేంటి? అని ప్రశ్నిస్తే సమాధానం చెప్పడానికి వారికి ధైర్యం లేదు.

1990లో పేటెంట్ చట్టాలు, అంతర్జా తీయ చట్టాల కనుగుణంగా మనదేశ చట్టాల్లోమార్పులు చేసారు. ఉదా: పారాసిటమాల్ మందులను ఎవరూ తయారుచెయ్యడానికి వీల్లేదు. పత్తిలో కాయతొలిచే పురుగు వస్తుంది. దానికి పురుగుమందు చల్లాలి. అయితే ఇప్పుడు ఒక కంపెనీ చెప్తుంది: పురుగుకు మందు చల్లడం కన్నా అసలు ఆ పురుగులే రాకుండా జీన్‌ను విత్తనంలోనే ప్రవేశపెడతా మని చెప్పి బోల్‌గార్డ్ విత్తనాలను తెచ్చారు. టెర్మినేటర్ విత్తనాలను ప్రవేశపెట్టారు. ఇవి విషపూరితమైనవి. అయినా కూడ వాటికి ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చింది. మోన్‌శాంటో కంపెనీ విదేశీ గుత్తకంపెనీ. ఇది విత్తనాలను పంపిణీ చేస్తుంది. మహికో అనే కంపెనీ మన దేశంలో మహారాష్ట్రకు చెందిన కంపెనీ. ఈ కంపెనీని కూడ కొనేసి పెద్ద గుత్త కంపెనీలుగా మారి చిన్న కంపెనీలను మింగేస్తున్నాయి. ప్రభుత్వం యొక్క కర్తవ్యం ప్రజలకు నాణ్య మైన, పోషకవిలువలు గల ఆహారాన్ని అందించడం. కానీ ఈ రోజు అంతా కల్తీ. మన పాలకులు చేస్తున్నది ఏమిటంటే - సజ్జలు, జొన్నలు లాంటి ముతక ధాన్యాల నుంచి కూడా సారాయి తయారుచేయటానికి అనుమతి నిస్తున్నారు. ఆహారాన్ని అందించక పోగా సారాలు, మత్తు మందులు తయారుచేసి ప్రజలకు అందిస్తున్నారు. ప్రజలకు చెందాల్సిన ఆహారాన్ని విదేశాలకు తరలిస్తున్నారు. మొత్తం విత్తన రంగాన్ని బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టే విధానాల్ని ప్రభుత్వం చేపడుతుంది. దీనికి వ్యతిరేకంగా, కల్తీ విత్తనాల రద్దు కోసం చట్టాలు తీసుకువచ్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. అందరం పోరాడాలి. రైతు వ్యతిరేక చట్టాలని ఉపసంహరించుకొనే దాకా మనం మన పోరాటాల్ని సాగించాలి. ✦

విత్తనం మొలకెత్తదు


- భగ్వాన్

విత్తనాలు చేలో కాదు
గుండెల్లో చల్లుకునే వాడు
రైతును మోసం చేస్తారా...
గుప్పెడు విత్తనాల్లోంచి
బేలుడు దూది ఏకేవాడు
రైతుకు ద్రోహం చేస్తారా...
క్రిములూ క్రిమి సంహారిణిలూ
టెర్మినేటర్ టెక్నాలజీలూ
రైతు బతికి బట్టకడతాడా....
రైతు శవం మీద కప్పే
తెల్లనిగుడ్డనికూడా
తెలివైన బహుళజాతి మూషికాలు
కంప్యూటర్ల కోరలతో కొరుకుతాయి

విత్తనం మీద హక్కును కబళించేవాడు
ఎప్పుడైనా చేలో విత్తనం నాటాడా
దూదిని పేర్చి బేళ్ళు కట్టాడా
విత్తనాన్ని చంపడమే
వ్యాపార విజ్ఞానమనుకునే వాడు
విత్తు మొక్కయ్యే పరమాద్భుత దృశ్యాన్ని
రైతు కళ్ళతో చూసాడా
వస్త్రాలకు బదులు ప్రజలకు
వయాగ్రాలనిచ్చే తెల్ల మేధావులారా
ఎప్పటికీ
చేను రైతుదే విత్తనమూ రైతుదే
మట్టిలోంచి విత్తనాన్ని సృష్టించే
హక్కూ రైతుదే.....

చేలో పడి మేసే
పశువుల్ని తోలాలి
రైతు చేతికర్రేదీ....

కా॥ జి. విజయకుమార్, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు




కామ్రేడ్స్! మనముందు ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొనివుంది.


నాతరం పుట్టి ఊహ సాధించుకుంటున్న దశలో ప్రపంచంలో దోపిడీ, అసమానతలు లేని సమాజం ఏర్పడుతుంది, అటువంటి సమాజాన్ని చూస్తామనే ఆశలు కలిగాయి. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో అటువంటి ఊహలు కలగడం సహజం. ఈ 20సం॥ల కాలంలో ఊహించని అనేక మార్పులు జరిగాయి. తరిమెల నాగిరెడ్డి గారి పైన ఎ.పి. ప్రభుత్వం కుట్రకేసు బనాయించింది. విచారణ సాగి, శిక్షలు పడ్డాయి. టిఎన్ గారు ఈ సందర్భంగా ప్రభుత్వానికి సరైన సమాధానం చెప్పాలనే ఉద్దేశ్యంతో స్టేట్‌మెంట్ తయారుచేసి కోర్టులో ప్రవేశపెట్టారు. దానినే మనం " తాకట్టులో భారతదేశం"గా తీసుకువచ్చాం. ఇందులో మార్క్స్ చెప్పే ఒక మాటను ఉదహరిస్తూ ఒకమాటను చెప్పాడు. "ప్రపంచం మొత్తం ముందుకు పోవాల్సింది. తాత్కాలికంగా వెనక్కిపోతోంది. కృతయుగం లాంటి పరిస్థితుల్లోకి పోతోంది" అని. విచిత్రంగా 40 సం॥ల తర్వాత ఈ రోజు ప్రపంచం మొత్తం అదే పరిస్థితిలో వుంది.

1947 తర్వాత నుంచి ప్రపంచవ్యాప్తంగా దేశాలు స్వతంత్ర్యాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాయి. అనేక మార్పులకోసం తగిన ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో అమెరికా దేశాలను కబళించడానికి ప్రయత్నం చేస్తోంది. మెక్సికోలో 'నాఫ్తా' అనే ఒప్పందాన్ని అమెరికా చేసుకుంది. ఈ ఒప్పందాల ఫలితంగా తమ ఉత్పత్తులకు మార్కెట్ లేకుండాపోతుందని 1994 లో మెక్సికోలో రైతులు, ఆదివాసీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసారు. అర్జెంటీనాలో రైతులు ఆందోళన చేస్తున్నారు. ఉడ్రోవిల్సన్ " అమెరికా అంతా అమెరికన్లదే" అనే నినాదం ఇచ్చారు. దానికి అనుగుణంగా అనేక దేశాలపై పెత్తనం చేస్తున్న అమెరికాకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాట్లు చేస్తున్నారు. "ఈ దేశం మాది, ఇక్కడ మాకు కావలసిన వ్యవస్థలు ఏర్పచుకొనేహక్కుమాకుంద"ని చెప్పి ఆయుధాలు పట్టి పోరాటంలోకి దిగుతున్నారు. మనదేశంలో కూడా, మన రాష్ట్రంలో కూడా ఇదే పరిస్థితులు తలెత్తుతున్నాయి. సామ్రాజ్యవాదులు హైదరాబాద్ వచ్చి సచివాలయంలో కూర్చొని ఏ రంగంలో ఎలాంటి విధానాలు అవలంభించాలో మన ఐ.ఎ.ఎస్ అధికారుల చేత రూపొందించి, దగ్గరుండి అమలు చేయిస్తున్నారు. వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాదుల పట్టు తీవ్రంగా వుంది. పార్ట్‌నర్‌షిప్ సదస్సులు జరుగుతున్నాయి.

ఆంధ్రదేశంలోకి కొత్తగా వచ్చిన పరిశ్రమలు లేవు. కొత్త పెట్టుబడులు లేవు. ఉన్నవి మూతపడుతున్నాయి. వ్యవసాయ రంగం నాశనం అవుతుందని ప్రొఫెసర్లు మొత్తుకుంటున్నా, అభివృద్ధికి చర్యలు లేవు. ప్రజల్ని మభ్యపెట్టడానికి కావల్సిన చర్యల్ని మాత్రం తీసుకుంటున్నారు. ఎక్కడ ఐఎమ్ఎఫ్, డబ్ల్యు.టి.ఒ.లు అడుగుపెడతాయో అక్కడ అన్ని రంగాలు ప్రపంచీకరణలో భాగంగా నిర్వీర్యమౌతాయి. సామ్రాజ్యవాదుల పాదాక్రాంతమవుతాయి. దీన్ని ఎదుర్కోవాలంటే సంఘటిత పోరాటాలు అవసరం. ప్రభుత్వం పోరాటాలను అణచివేయడానికి తీసుకోవాల్సిన అన్ని పద్ధతుల్ని అవలంభిస్తున్నది. అయినాసరే వెరవకుండా అందరం కలిసి పోరాడితేనే దీన్ని ఎదిరించగలుగుతాం. మీరు ఈ సదస్సు సందర్భాన్ని బలమైన పోరాటాలను రూపొందించుకునే వేదికగా, అవకాశంగా వుపయోగించుకుంటారని; కార్మికులు కూడా మీతో భుజం, భుజం కలిపి పోరాటాలకు సిద్ధమౌతారని తెలియజేస్తున్నాను. ✦



కా॥ జ్వాలాముఖి



గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన రైతు కూలీలకి, అందరికీ నమస్కారం.

ఒక నది పుట్టిన చోట కొండల మీద చుక్కలు, చుక్కలుగా వుంటుంది. అది కొండ నుండి క్రిందకు ధారగా మారుతుంది. మైదానం లోకి వచ్చేసరికి కాలువగా అవుతుంది. అక్కడ నుండి అది ఉపనది అవుతుంది. అనేక కాలువల్ని, ఉపనదుల్ని కలుపుకొని మహానది గా మారుతుంది. చివరకు ఒళ్ళు విరుచుకొని సముద్రంలో కలుస్తుంది.

మానవుడు-ప్రకృతి మూడు ముఖ్య అంశాల పై ఆధారపడి వున్నాయి. అవి నీరు- నిప్పు- నేల. పెద్ద కంపెనీలు తాగు, సాగు నీటిని ప్రైవేటీకరిస్తున్నారు. ఇది వ్యవసాయరంగానికి తీవ్ర ఆటంకమయినది. రైతుల బిడ్డలు పట్టణా ల్లో కూలీలుగా మారుతున్నారు. మనం మన భూముల్లోనే కూలీలుగా బ్రతకాల్సి వస్తుంది. మొత్తం మన జీవితమే ప్రైవేటుపరం కాబోతుంది. అనేక వాదాలు, వేర్పాటువాదాలు ఎన్నివున్నా అందరం కలిసి పోరాడాలి. ఐదువేళ్ళు విడిగా వుంటే ఉపయోగం లేదు. అవి కలిస్తే కనపడేది పిడికిలి. దానికి బలం ఎక్కువ. ఆ పిడికిలి ఆవిర్భావం కోసం ఆశపడుతూ.....శెలవు.. ✦

పురుగులన్నం

- గద్దర్

పొద్దుగల్ల పరమాన్నం
పగటికి మెత్తన్నం
పొద్దుగూకితే పులిసిపోయినన్నం
తెల్లారితే పురుగులన్నం
ఆ పురుగులన్నం పక్షులకు పరమాన్నం
కాలమిది
సమయమిది
పగిలిన తెలంగాణ కవి కంఠమిది

ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సు

" మెజారిటీ ప్రజల మనుగడను కాపాడే వ్యవసాయ రంగాన్ని కాపాడటమే నిజమైన దేశభక్తి"

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో 2003, జూన్ 22న తేదీన విశాఖపట్నంలో జరిగిన ఉత్తరాంధ్రజిల్లాల సదస్సులో పి.సాయినాథ్ ఉపన్యాస సారం.



వ్యవసాయరంగ సంక్షోభం మొత్తం సమాజ సంక్షోభానికి దారితీస్తుంది. భారత దేశంలో ఈనాటివరకు ఉపాధికల్పన 64శాతం నుండి 66శాతం వరకు వ్యవసాయ రంగంలోనే ఉంది. మన జనాభాలో నాల్గింట మూడువంతులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యవసాయరంగంపై ఆధారపడి వున్నారు. 75% ప్రజానీకం వ్యవసాయరంగంపై ఆధారపడి వున్నప్పుడు, ఉపాధికల్పనలో 66% వ్యవసాయరంగంలోనే ఉన్నప్పుడు, భారతదేశ వ్యవసాయరంగం కీలకమైన ప్రభావాన్ని కలిగి ఉంటుంది. కానీ ఈరోజు జాతీయాదాయంలో కనీసం నాలుగవ వంతు వ్యవసాయరంగానికి రావటం లేదు. వ్యవసాయ రంగంపై ప్రజలు అత్యధికంగా ఆధారపడటం జరుగుతున్నది. కాని దేశం ఆదాయంలో వ్యవసాయరంగం వాటా పడిపోతున్నది. దీనిని బట్టి మనం అర్థం చేసుకోవాల్సిన అతిసాధారణ విషయమేమంటే అత్యధిక ప్రజల ఆదాయాలు పడిపోతున్నాయి. వ్యవసాయ రంగంపై ఆధారపడి వున్న 64% ప్రజల జీవనోపాధి, వారి కొనుగోలు శక్తి తగ్గిపోయి, వ్యవసాయరంగం సంక్షోభంలో పడినపుడు, దాని ప్రత్యక్ష ప్రభావం అన్ని రంగాలపై ఉంటుంది. దేశంలో పరిశ్రమలు ఉత్పత్తి చేసే సరుకులను కొనుగోలు చేయలేరు. సహజంగానే పారిశ్రామిక వస్తువుల డిమాండ్ పడిపోతుంది. అందువలన వ్యవసాయానికీ, భారత ఆర్థిక వ్యవస్థకూ, సమాజానికీ వున్న కీలకమైన సంబంధాన్ని మనం అర్థం చేసుకోవాలి.

ఒక రోజు నేను ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో వున్నాను. ఆరోజు పేపరు చూసాను. వ్యవసాయ కార్మికులు వేతనాలు పెంచమని సమ్మె చేస్తున్నారు. "వ్యవసాయకూలీల సమ్మెకు వర్తకసంఘం మద్దతు" అని పేపరులో చూసాను. నాకు అర్థం కాలేదు. వ్యవసాయ కూలీల సమ్మెకు వర్తకసంఘం ఎందుకు మద్దతునిస్తున్నది? వారి వర్గరీత్యా వ్యవసాయ కూలీ సమ్మెకు, బంద్‌కు వీరు దూరంగా ఉంటారు. నేను వాళ్ళ నాయకులను అడిగాను. ముందు వర్తకసంఘం సమావేశంలో వ్యవసాయ కూలీల సమ్మెను ఎందుకు వ్యతిరేకించాలని అడిగాం. "ఈ సత్తుపల్లిలో 5వేలమంది కూలీలు వున్నారు. వీరందరిది రోజుకూలీ 15 వేల రూ॥లు పెరుగుతుంది. కనీసం ఏడాదికి వీరికి 15 లక్షల రూ॥లు ఆదాయం పెరుగుతుంది. ఈ 15లక్షల రూ॥లు తీసుకొని వెళ్ళి మేము స్విస్ బ్యాంకులో పెట్టుకోము. లేక స్టేట్‌బ్యాంకులో పెట్టుకోము. లేక స్టాక్ మార్కెట్‌లో షేర్స్‌కొనము. నీ కిరాణా షాపులోనే సరుకులు కొనుక్కుంటాము. మేము వెళ్ళి ఖమ్మం మార్కెట్‌లో కొనుక్కోము కదా! మాకు 15లక్షల ఆదాయం పెరిగిందంటే 15 లక్షల వ్యాపారం పెరిగినట్లేకదయ్యా! మరి మీరు లాభమో, నష్టమో తేల్చుకోండి" అని చెప్పాము. కరెక్టే అని కూలీల సమ్మెకు వర్తకసంఘం మద్దతు పలికింది. ఎందుకు ఈ చిన్న ఉదాహరణ చెపుతున్నానంటే ఈ రోజు వ్యవసాయ రంగంలోని ప్రజలపై మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థ ఆధారపడి వుందని తెలపటానికి.

వ్యవసాయరంగ సంక్షోభాన్ని పట్టించుకోకపోవటంతో దేశం మొత్తం ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే పరిస్థితి వచ్చింది. నేను ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో రాష్ట్ర సమాచారశాఖమంత్రి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి ఒక పానల్ డిస్కషన్‌లో పాల్గొన్నాను. ఆ డిస్కషన్‌లో ఆయన "మా తెలుగుదేశం ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ ఉత్పత్తి 2.5% నుండి 3.9% కు పెరిగింది. ఇది మా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన బ్రహ్మాండమైన కృషి" అన్నారు. నాకు ఏం మాట్లాడాలో అర్థం కాక కాదు కోపం వచ్చింది. "మీ లెక్కలు మాకు చెప్పకండి సార్! వరంగల్ జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న పత్తి రైతు భార్యకు చెప్పండి. అనంతపురంలో వేరుశెనగ పండించిన రైతుకు చెప్పండి. వాళ్ళు అంగీకరిస్తే నేను అంగీకరిస్తానండి" అన్నాను. వాస్తవంగా ప్రజల అభివృద్ధికి సంబంధంలేని ఒక అర్థ శాస్త్రాన్ని మనదేశంలో ఆవిష్కరిస్తున్నారు.

మన కేంద్రమంత్రి తన బడ్జెట్ ఉపన్యాసంలో "మా ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమానికి కట్టుబడి వుంది. అందుకే కూల్‌డ్రింక్స్‌పై సుంకాన్ని తగ్గిస్తున్నది." అన్నాడు. నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. సామాన్యుడికి, ఆ కూల్‌డ్రింక్స్‌కి సంబంధం ఏమిటని? సామాన్యుడు కూల్‌డ్రింక్స్ తాగుతారని వాళ్ల నమ్మకం. ఎందుకంటే మన పాలకులు సామాన్యుల మధ్యలో ఉండరు కనుక. ఫ్రెంచి విప్లవకాలంలో ఒక జోక్‌వుంది. ఫ్రెంచి విప్లవకాలంలో మేరి ఆంథోని రాణి మందిరాన్ని ప్రజలు చుట్టుముట్టారు. కోపోద్రిక్తులై నినాదాలు చేస్తున్నారు. రాణి బయటకి వచ్చి సలహాదారుని పిలిచి వాళ్ళు ఎందుకు గొడవపెడుతున్నారు అని అడిగారు. వాళ్ళకు బ్రెడ్‌ముక్కలు కూడా తింటానికి లేవు, అందుకే గొడవ చేస్తున్నారని అన్నారు. బ్రెడ్ లేకపోతే కేక్ తినమనండి అన్నది. అంటే బ్రెడ్‌ముక్కలు తింటానికే కనీసంగా లేనివాళ్ళు కేక్‌ముక్కలు ఎలా తింటారు? మేరీ ఆంథోని అర్థశాస్త్రం మన వాళ్ళకు బాగా ఎక్కింది. అందుకే సామాన్యుల సంక్షేమానికి పాటుపడుతూ కూల్‌డ్రింక్స్‌పై సుంకాలను తగ్గిస్తున్నామన్నారు. గత బడ్జెట్‌లో కూడా కార్లకూ, విదేశీ మద్యానికి సుంకాలను తగ్గించారు. కాని ఎరువుల ధరలు పెంచారు. ఈ ప్రభుత్వం ఎవరి పక్షం వుందో అర్థం చేసుకోవటానికి ఇంతకన్నా పెద్ద ఉదాహరణ ఏమి కావాలి? దీనిని అర్థం చేసు కోవటానికి ఆర్థికశాస్త్రం, సిద్ధాంతం ఏమి అవసరం లేదు. ఇది చాలా సామాన్యమైన అంశం.

చంద్రబాబునాయుడుగారు ఒక సమావేశంలో మాట్లాడుతూ అంటారు. "కోట్టిజం లేదు, కమ్యూనిజం లేదు, ఇక ఉన్నదంతా టూరిజమేనని." ప్రజల జీవన మనుగడకు సంబంధించి నటువంటి అతి కీలకమైన దాన్ని ఈ రోజు ప్రభుత్వం అశ్రద్ధ చేస్తున్నది. ఫలితంగా ఈ రోజు వ్యవసాయ రంగం పెద్ద సంక్షోభంలో వుంది. ఎందుకోసం ఇది చేస్తున్నది? ఏ వ్యవస్థను ఇది నాశనం చేస్తున్నది? వ్యవసాయ రంగానికి చెందిన అన్ని వ్యవస్థలను నాశనం చేయటానికి ప్రభుత్వాలు సిద్ధంగా వున్నాయి. ఉదాహరణకి నోబుల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ "భారత దేశంలో ఆఫ్రికా దేశాలలో లాగా, సోమాలియా, ఇథియోపియా దేశాలలో లాగా హృదయ విదారకమైనటువంటి ఆకలి క్షోభకు గురైన వాళ్ళు కనిపించకపోవచ్చును. కాని మన ప్రజలు కనిపించని ఆకలితో, అదృశ్యంగా వుండే ఆకలితో బాధపడుతున్నారం"టారు.

కనిపించని ఆకలితో ప్రజలు ఈనాడు అందరికీ కనపడే రీతిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరోవైపు ఎన్నో లక్షల టన్నుల ఆహారధాన్యాలు FCI గోడౌన్లలో మురిగిపోతున్నాయి. వీటిని ఆకలితో అలమటించే ప్రజలకు అందేరీతిలో ఖర్చుపెట్టాలని ప్రభుత్వాలు ఆలోచించటం లేదు. ఆర్థికమంత్రి పార్లమెంట్‌లో అంటాడు "ఈ దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఆకలి కాదు. అతిపెద్ద సమస్య ఆహార ధాన్యాల నిల్వల యాజమాన్యమే" అని. ఆహార ధాన్యాలు పేరుకుపోతున్నాయి. FCI గోడౌన్‌లలోని మనుషులు తినే ఆహారధాన్యాలు ఎలుకలు తింటున్నాయి. అందువలన మన దేశంలో మనిషై పుట్టటం కంటే ఎలుకై పుడితే పౌష్టికాహారం లభిస్తుందంటారు. ఈ దేశంలో ధాన్యాలు మురిగిపోవటానికి పెట్టే ఖర్చు రైతుకు పెడితే ప్రజలకు ఆహార ధాన్యాలు లభిస్తాయి. అందుకు ప్రభుత్వాలు సిద్ధంగా లేవు. నిరుపేదలకు ఖర్చు పెట్టటానికి సిద్ధంగా లేరు. కానీ పెప్సీ కంపెనీకి నిరుపేదల కంటే తక్కువ ధరలకు ఇస్తామంటున్నారు.

దాదాపు వెయ్యిమంది వడదెబ్బకు చనిపోయారు. ఎండకు చంద్రబాబునాయుడు కేబినేట్‌లో ఏ మంత్రి చనిపోలేదే ? మా ఉస్మానియా యూనివర్శిటీలో ఏ ప్రొఫెసర్ చనిపోలేదే? నాకెపుడూ సన్ స్ట్రోక్ రాలేదే? సన్ స్ట్రోక్‌కు అంబానీ కంపెనీల్లో, టాటా కంపెనీల్లో ఎవరూ చనిపోలేదే? ప్రత్తి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కాని ప్రత్తిగింజల కంపెనీల వాళ్ళెవరూ ఆత్మహత్యలు చేసుకోలేదే? ఈనాడు ఏ ప్రకృతి వైపరీత్యమైనా, ఆకలికి అలమటించే వాడికే నష్టం జరుగుతున్నది. ప్రాణాలు పోతున్నాయి. అందువలన ఈ రోజు ఎండ వేడిమికి ప్రజలు చనిపోయారు. మాతప్పేమిటని పాలకులు అంటున్నారు. ఇది ప్రకృతి వైపరీత్యం కాదు. మనం చేసుకుంటున్న నిర్వాకం తప్ప మరొకటి కాదు. ఎందుకు 6 కోట్ల టన్నుల ఆహారధాన్యాలని నేను ఇంతకు ముందు చెప్పినట్లు ఎలుకలకు పెట్టటానికైనా సిద్ధమే కాని, ప్రజలకు ఇవ్వటానికి సిద్ధంగా లేరు. పెప్సీ కంపెనీకైనా ఇస్తారు కాని ఆకలితో అలమటిస్తున్న ప్రజానీకానికి ఇవ్వటానికి సిద్ధంగా లేరు. ప్రపంచబ్యాంకు అర్థశాస్త్రం "ఆహారాన్ని చౌక ధరలకు ఇవ్వద్దు" అని చెపుతున్నది. మనకు ఆశ్చర్యాన్ని కలిగించేదేమిటంటే ప్రపంచబ్యాంకు క్యాంటిన్‌లో సబ్సిడీ ధరలకు అమ్ముతున్నారు. ప్రపంచ బ్యాంకు ఉద్యోగస్తులకు - అంటే 50వేలు జీతాలు వచ్చే వారికి సబ్సిడీకి ఆహారధాన్యాలను ఇస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో ఆకలితో అల్లాడుతున్న వారికి చౌక ధరకి ఆహారాన్ని ఇవ్వటానికి సిద్ధంగా లేరు. మనం ఇక్కడ అర్థం చేసుకోవాల్సింది ఈ ప్రభుత్వ ఆర్థిక విధానాలు, వ్యవసాయరంగంలో అమలుచేస్తున్న విధానాలు ప్రజల ఆకలి తీర్చటానికి కాదు. బహుళజాతి కంపెనీలకు లాభాలను చేకూర్చటానికి ఈ అర్థశాస్త్రం వుంది.

ఆహారధాన్యాల నిల్వలను చూపెట్టి ఆహార ధాన్యాల సేకరణ నుండి ప్రభుత్వం వైదొలగాలని చెపుతున్నారు. డబ్ల్యూ.టి.ఒ. ఒప్పందంలో ఆహార సేకరణ, ఆహారాన్ని నిల్వచేసుకోవటం, ఆహారాన్ని పంపిణీ చేయటం,ఈ రంగాలనుండి ప్రభుత్వం పూర్తిగా వైదొలగాలని చాలా స్పష్టంగా చెప్పారు. రాష్ట్రప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలలో కూడా స్పష్టంగా చెప్పారు. ఆహార పంపిణీ, ఆహార సేకరణ రంగాలనుండి ప్రభుత్వం పాత్రను కుదించి వేయాలని చెపుతున్నారు. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్‌లో జోక్యం చేసుకోవటంలేదు. ఇప్పటికే కొద్దిమంది వర్తకుల చేతుల్లో మార్కెట్ యార్డులు బంధీలై వున్నాయి. రైతులు దళారుల చేతుల్లో మోసపోతున్నారు. మనం ఆందోళన చేస్తుంటే, మరొక ప్రక్క ప్రభుత్వ సంస్థలు రద్దు చేయబోతున్నారు. "ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాని, స్టేట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాని, స్టేట్ ట్రేడింగ్ కార్పోరేషన్‌ను రద్దు చేయండి, ప్రభుత్వం వ్యవసాయరంగంలో జోక్యం చేసుకొనే సంస్థలన్నింటినీ రద్దు చేయండి" అని ఈనాడు ప్రపంచబ్యాంకు సంస్థలన్నీ చెపుతున్నాయి.

1947లో బెంగాల్ క్షామం ఏర్పడింది. స్వతంత్ర భారతదేశం సాధించిన ఘనవిజయం ఒకటి వుంది. అదేమిటంటే క్షామాన్ని ఎదుర్కోవటంలో గొప్ప విజయాన్ని సాధించిందని అంటారు. దానికి కారణం అనేక రూపాలలో ఉండేటటువంటి ప్రజాపంపిణీ వ్యవస్థ దేశంలోని నిరుపేదలకు ఉపయోగపడింది. కనీసం ఆ ప్రజాపంపిణీ వ్యవస్థ ఉన్నా ఈరోజు ప్రజలకు ఉపయోగపడేది. ఆ ప్రజా పంపిణీ వ్యవస్థ నాశనం కావటానికి ఈ ప్రభుత్వ విధానాలు ఉపయోగపడుతున్నాయి. అందువలన తెలుగు దేశం ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉపయోగపడే అన్ని సంస్థలను రద్దు చేస్తున్నది. బ్యాంకింగ్ వ్యవస్థను చూడండి: ఈ రోజు గ్రామీణ బ్యాంకులను దివాళా తీస్తున్నారు. అసలు బ్యాంకింగ్ రంగాన్నే ప్రైవేటీకరిస్తున్నారు. 40% ప్రాధాన్యత రంగాలకు రుణాలివ్వాలి. అందులో 18% వ్యవసాయరంగానికి రుణాలివ్వాలి. ఇది ప్రభుత్వరంగ బ్యాంక్‌ల విధానంగా ఉండేది. కాని ఈ రోజు భారత వ్యవసాయరంగానికి సంస్థాగత రుణ సదుపాయం లేదు. అంటే భారతదేశంలో వున్న రైతాంగం వడ్డీ వ్యాపారుల కబంధహస్తాలలో చిక్కుకుపోతున్నారు. వ్యవసాయరంగంలో పెడుతున్న పెట్టుబడులలో కనీసం 10% కూడా లేదు. కాని ఆ వున్న బ్యాంకింగ్ వ్యవస్థను నాశనం చేస్తున్నారు.

మీరు వినే వుంటారు. పెద్ద పెద్ద బ్యాంకులకు కోట్ల రూ॥లను ఎగగొట్టే పెద్దమనుషులు వున్నారు. అలాంటి మొండిబాకీలకు ఇంగ్లీష్‌లో ఒక ముద్దుపేరు పెట్టారు. 'నాన్‌ఫెర్‌ఫార్మింగ్ ఎసెట్స్' - పనిచేయని ఆస్తులట. పనిచేయని ఆస్తులు, వేలకోట్ల రూ॥లు ప్రభుత్వరంగానికి బాకీలు ఎగ్గొట్టే పారిశ్రామిక వేత్తలు చాలా మంది వున్నారు. ఆ భారత పారిశ్రామిక వేత్తల పేర్లు చెప్పండని పార్లమెంటులో మంత్రిని అడిగితే, ఆ పెద్దమనిషి అది వాణిజ్య రహస్యం చెప్పరాదంటాడు. విశాఖపట్నం బస్‌స్టాండ్‌లో ఒకడు పిక్ పాకెటింగ్ చేస్తే ఫోటో బస్‌స్టాండ్‌లో

పెడతారు. (జేబుదొంగ) అని. ఎకనమిక్స్‌లో ఒక సామెత ఉంది. వంద రూ॥లు అప్పు తీసుకుంటే అది తీసుకున్నవాడి బాధ, లక్ష రూ॥లు తీసుకుంటే అది ఇచ్చినవాడి బాధ. ఎందుకంటే కట్టేది లేదు. ఈ రోజు పెద్ద ఎత్తున బ్యాంకులకు మొండిబాకీలుగా వున్నాయని ప్రభుత్వమే లెక్కలు చెపుతున్నది.

మూడు ప్రభుత్వరంగ బ్యాంకులను అధ్యయనం చేయటానికి ఒక కమిటీ వున్నది. ఆ కమిటీ ఒక నివేదిక సమర్పించింది. "ఆ మూడు ప్రభుత్వరంగ బ్యాంకులు అప్పులను రికవరీ చేసుకోవటం లేదు. అందుకని దివాళా తీసినాయి" అని. నివేదిక సమర్పించిన తరువాత ఆ బ్యాంకులు ఒక ప్రకటనను ఇచ్చాయి. "నిజమే, మేము బాకీలను వసూలు చేసుకోలేక పోతున్నాము. దివాళా తీస్తున్నాము. కాని ఇచ్చింది ఎవరికి? మేజర్ ఇండస్ట్రీస్‌లో వున్న పెద్దలకే ఇచ్చాము. మీ బడా పారిశ్రామికవేత్తలకు ఇచ్చాము. వాళ్ళు కట్టడం లేదు. వాళ్ళు కట్టక పోతే ఏం చేయమంటారు?" అని అడిగితే ఆ బడా పారిశ్రామికవేత్తల సంస్థ కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆ నివేదికను ఒప్పుకోము అని చెప్పాయి. చూడండి! ఎంతటి సిగ్గుచేటైన విషయం.

ఒకాయన బ్యాంకుకు 300 కోట్ల రూ॥లు ఎగనామం పెట్టాడు. ఆయన్ని ఏమీ అనరు. మొండిబాకీ అంటూ ఆ పద్దును మూసి వేస్తారు. ఇలా మొండి బాకీలతో బ్యాంకులు దివాళా తీస్తుంటే, పేద రైతు వెయ్యి రూ॥లు కట్టకపోతే వాడి ఆస్తులను వేలం వేస్తాడు. మంగళ సూత్రాలను వేలం వేస్తారు. అనంతపురంలో 3వందల రూ॥లు అప్పు చేసిన రైతు, వడ్డీతో 2 వేల అయిదు వందల రూపాయలు అప్పుకట్ట లేకపోతే వాళ్ళ భార్య మెళ్ళో మంగళ సూత్రం వేలం వేసారు. 'ఈనాడు' పేపర్‌లో ప్రకటన వేసారు.

రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటే అందుకు సైక్రియాట్రిస్టును పంపిస్తామన్నారు. అంటే మానసిక తత్వశాస్త్రజ్ఞులను పంపుతాం. వాళ్ళకు మానసిక సమస్యలు వచ్చాయన్నారు. మెంటల్ ప్రాబ్లమ్ వచ్చింది రైతాంగానికి కాదు. పాలిస్తున్న వాళ్ళకు. అమెరికాలో పెద్ద పత్రిక ఎడిటర్ జనార్ధన్ హైదరాబాద్ వచ్చినపుడు నాతో అన్నాడు "ఎక్స్‌గ్రేషియా కొరకు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంట కదా!" "జనార్ధన్ బ్రహ్మాండంగా చెప్పావు! నీకు కోటి రూ॥లు ఇస్తాను. ఆత్మహత్య చేసుకో! జీవితంలో సంపాదించలేవు కదా" అన్నాను. అదేమిటి సార్ అన్నారు. "వాళ్ళు వంద రూ॥ల కైతే నీవు కోటి రూ॥లకు చేసుకో బాబూ, నీకు నీ భార్య బిడ్డల మీద ఎంత ప్రేమ వుంటుందో, వాళ్ళకూ అంతే ప్రేమ ఉంటుంది. లక్ష రూ॥లకు ఎవరూ ఆత్మహత్య చేసుకోరు. ఎవడో ఒకడు వుంటే వుండవచ్చును." కాని ఈ రోజు ఇవి పెద్ద ఎత్తున సాగుతున్నాయి. కరువు పీడితప్రాంతాల వాళ్ళే ఆత్మహత్యలు చేసుకొంటున్నారంటే పొరపాటు.పంజాబ్ ముఖ్యమంత్రి అమరేందర్ సింగ్ చెప్పాడు. గత ఏడు వాళ్ళ రాష్ట్రంలో 600మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని. హరిత విప్లవం (గ్రీన్ రివల్యూషన్) వచ్చిన రాష్ట్రంలో, పంజాబ్ అంటే 5 నదులు మధ్య వున్న డెల్టా ప్రాంతం. స్వాతంత్ర్యం వచ్చే నాటికే పంజాబ్ రాష్ట్రంలో సగానికి సగం ఇరిగేషన్ అయింది. నీటి పారుదల సౌకర్యం వున్న ప్రాంతం. ఆ రాష్ట్రంలో ఇప్పటికే 600 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దాని గురించి మనం ఏమని అర్థం చేసుకుంటాం? ఆత్మహత్యలు కరువు వున్న జిల్లా ల్లోనే కాదు. అతి సంపన్న వంతమైన ప్రాంతాలలో కూడా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

పరపతి వ్యవస్థని నాశనం చెయ్యటం, ప్రైవేటు వడ్డీవ్యాపారుల కబంధ హస్తాల్లో రైతాంగం చిక్కుకు పోవటం, వివిధ గ్రామ సీమల్లో అప్పుల భారంతో కూరుకుపోవడం కారణం. ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తివేసి, "ప్రపంచంలోనే సబ్సిడీల పాత్ర అతి దుర్మార్గమైనది. ఇంక ఎంత కాలమని ఈ సబ్సిడీల మీద బ్రతుకుతారు" అని అంటున్నారు. పేదవాడికి ఇచ్చేది సబ్సిడీ అంటాం. అదే బడా పెట్టుబడిదారుల కిస్తే ప్రోత్సాహం అంటాం. రెండింట్లో ఏదన్నా ఒకటే. కానీ మనకేం చెప్తున్నారు? ఈ రోజు బడా పారిశ్రామికవేత్తలకు వేల కోట్ల రూ॥లు సబ్సిడీ ఇస్తున్నారు. కొత్త పరిశ్రమ పెడితే 10 సంవత్సరాల వరకు పన్నులు కట్టవలసిన అవసరం లేదు. దిగుమతి చేసుకున్న వస్తువులపై ఇలా వేల కోట్ల రూ॥లు బడా పారిశ్రామిక వేత్తలకు రాయితీలు ఇస్తున్నారు. కానీ రైతాంగానికి నేడు సబ్సిడీలు లేవంటున్నారు. ఈ రోజు అమెరికాలో రైతాంగానికి మనకన్నా ఎక్కువ సబ్సిడీలు ఇస్తున్నారు. అమెరికాలో ఒక ఆవుపైన రోజుకు రెండు డాలర్లు సబ్సిడీ వుందట. మనదేశంలో లక్షలాది మంది రైతాంగానికి రోజుకు కనీసం రెండు డాలర్ల ఆదాయం కూడా లేదు. కాని అక్కడ అవు మీద సబ్సిడీ వుంది. అమెరికాలో పంట పండిస్తే సబ్సిడీ ఇస్తారు. ఇక 3సం॥రాలు ఏమీ పంట పండించలేదనుకోండి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది.

యూరోపియన్ యూనియన్ ప్రపంచంలో అత్యధిక అభివృద్ధి అయిన దేశాల కూటమి. ఈ దేశాల కూటమి 2001లో 37, 400 కోట్ల రూ॥లు సబ్సిడీలు ఇచ్చారు. ఇది సరిపోదనుకుని, ఇది పెంచాలని అమెరికన్ పార్లమెంట్‌లో కొత్త సబ్సిడీ బిల్లు ప్రవేశపెట్టారు. అమెరికాలో ఒక వస్తు ఉత్పత్తి కంటే, వ్యవసాయ ఉత్పత్తి పైన రైతు 100రూల॥ ఖర్చుపెడితే అందుకు ప్రభుత్వం ఏదో ఒక రూపంలో 45రూ॥ ఖర్చు పెడుతున్నది. కెనడాలో ప్రభుత్వం ఏదో ఒక రూపంలో 66రూ॥లు ఖర్చుపెడుతున్నది. యూరోపియన్ యూనియన్‌లోరైతు 100 రూ॥లు ఖర్చుపెడితే ప్రభుత్వ ఏదో ఒక రూపంలో 55రూ॥లు సబ్సిడీ ఇస్తున్నది. జపాన్‌లో రైతు100రూ॥లు ఖర్చు పెడితే 90 రూ॥లకు పైగా ఖర్చు పెడుతున్నది. ఈ రోజు మన ప్రభుత్వం రైతులకు సబ్సిడీలు ఇవ్వవలసిన అవసరం లేదని చెబుతున్నది. ఎరువులపై సబ్సిడీలు ఎత్తి వేస్తున్నారు.ఎరువులపై సబ్సిడీలను ఎత్తివేయటంతో వరంగల్ జిల్లాలో ఏం జరుగుతున్నదో చూస్తున్నాం. పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అనేక ప్రాంతాలలో అసలు విత్తనాలు దొరకటం లేదు. మోన్‌శాంటో సంస్థవాళ్ళు క్లెయిమ్ చేస్తున్నారు. "మీరు పెద్ద ఎత్తున మా బి.టి. విత్తనాలను కొనండి. ఎక్కువ పంటలు పండుతా"యని మోన్‌శాంటో కంపెనీ దేశం మీద పడి ఎడ్వర్‌టైజ్ మెంట్ చేస్తున్నారు. ఆరోజే వ్యవసాయ శాస్త్రవేత్తలు, అనేక రైతు సంఘాలు కలిసి వ్యవసాయ శాస్త్రవేత్తల తోటి, అర్థశాస్త్ర వేత్తల తోటి కలిసి కమిటీ వేస్తే ఇది ఉపయోగపడదని చెప్పారు.

కానీ ఈ రోజు సాక్షాత్తు ప్రభుత్వమే చెబుతున్నది బి.టి. విత్తనాలు ఉత్పత్తిని పెంచలేదని. కానీ బి.టి. విత్తనాలు వేయాలా? వద్దా? రైతాంగమే నిర్ణయించుకోండి,మాకు సంబంధం లేదు అంది. ఒకవైపున నీవు అనుమతించావు. అనుమతించిన తర్వాత మాకు సంబంధం లేదంటున్నావు. చెరువులో ఒక పిల్లవాడిని

వదిలి వేసి నాకు సంబంధం లేదు, బలం వుంటే ఈత కొట్టుకొని వస్తాడు అంటున్నారు. బలం లేని వాడిని తీసుకుపోయి నీవు ఎందుకు చెరువు లో వేసావన్నది ప్రశ్న. దానికి సమాధానం లేదు. ఈ రోజు విత్తనాల మార్కెట్ పెరిగింది. ఈ రోజు 1% అగ్రికల్చర్ ప్రొడక్షన్‌లో 10% పెరిగింది. విత్తనాలరేటులో 20% రేట్లు పెరిగాయి. దీనికి ఏ కరువు కారణం కాదే! ఎరువులపై సబ్సిడీ ఎత్తివేయటానికి ఏ కరువు కారణం కాదు. మార్కెటింగ్ వ్యవస్థ నాశనం కావటానికి ఏ కరువు కారణం కాదు. ప్రభుత్వ పరపతి వ్యవస్థ నాశనం కావటానికి ఏ కరువు కారణం కాదు.

ఈ రోజు కరువు వచ్చింది. ప్రకృతి వైపరీత్యం యేం చేస్తామంటున్నారు. ఈ రోజు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మేము ఏమీ చేయ లేమంటున్నారు. పంటల మార్పిడి చేపట్ట మంటున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు గారితో కలిసి టి.వి. డిస్కషన్‌లో పాల్గొన్నాను." రైతాంగం చాలా సంక్షోభంలో వుంది. అందుకై రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాము, పంటల మార్పిడి చేపట్టాల" న్నారు మంత్రిగారు. నేనన్నాను "ఏ పంటలు మార్చు కోవాలో మీరే చెప్పండి. ఏ పంట మార్చితే రైతుకు ఆదాయం వస్తుందో మీరు చెప్పండి, అదే వేస్తారు"అని. కానీ దేనికీ ధరలు లేవు. గోధుమలకు ధరలు లేవు. వరికి ధరలు లేవు. మన విశాఖ పట్నం ప్రాంతంలో కాఫీ, జీడిపప్పు పంటలకు ధరలు లేవు. ఈ రోజు ప్రభుత్వం వ్యవసాయానికి సహాయం చేసే అన్ని వ్యవస్థలను రద్దు చేస్తున్నది.

ఈ రోజు వ్యవసాయ రంగాన్ని ఎగుమతి ప్రధానంగా వుండే విధంగా మారుస్తామంటు న్నారు. 'ఎక్స్‌పోర్ట్ ఓరియంటెడ్ అగ్రికల్చర్' అంటున్నారు. 'గ్రేట్ లిబరలైజేషన్' అంటు న్నారు. ఈ అగ్రికల్చర్ గ్రేట్ లిబరలైజేషన్‌లో రెండు పనులు చేస్తున్నారు. వ్యవసాయ వాణిజ్య సరళీకరణ ఈ గ్రేట్ లిబరలైజేషన్‌లో ఒక పని. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని, భారతదేశ వ్యవసాయ రంగాన్ని ఎగుమతి ప్రధాన వ్యవసాయ రంగంగా మారుస్తున్నారు. ఆహార ధాన్యాల పంటలను ప్రక్కకు పెట్టి వాణిజ్య పంటలను పండించమంటున్నారు. అత్యంత ఎక్కువ మంది వాడేటటువంటి రాగులు కానీ యండి, మొక్క జొన్నలు కానీయండి పండిం చడం తగ్గించి వేస్తున్నారు. ఫలితంగా ఈరోజు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు వాడే వాటిలో పోషక విలువలు పడిపోతున్నాయి. పోషక విలువలు పడిపోవటంతో అనేక రకాల అనా రోగ్యాలు ముందుకు వస్తున్నాయి. ఈ పరిస్థితి ఏర్పడుతుందంటే ప్రభుత్వం ప్రధానంగా ఎగుమతి ఓరియంటెడ్ పేరిట వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తున్నారు.ఒకప్పుడు కరువు వచ్చిందంటే తాము పండించిన పంటలు గోధుమలో, ధాన్యమో తిని బ్రతికేవారు. ఇప్పుడు అవి పండించకుండా ప్రత్తి, పొగాకు, కాఫీ పండిస్తే, ఆకలితో అలమటిస్తుంటే, ఇంట్లో పంట వుండి కూడ ఏమీ చేయలేని పరిస్థితి. కనీసం రైతులకు గిట్టుబాటు ధరలేదు. గోధుమ లు అమ్ముకోలేరు. మొక్కజొన్నలను అమ్ము కోలేరు. గతంలో కనీసం తన ఇంట్లో వాళ్ళన్నా కడుపు నిండా తినేవాళ్లు. ఇపుడు తన ఇంట్లో ప్రత్తి వుంటే అమ్ముకోలేడు. (గిట్టుబాటు ధర లేక) అది తిని బ్రతకలేడు.

భారతదేశ చరిత్రలో, స్వతంత్ర భారత దేశ చరిత్రలో తొలిసారిగా ఆహారధాన్యాల ఉత్పత్తి రేటు పెరుగుదల జనాభా రేటు పెరుగుదల కన్నా తక్కువుంది. అంటే ఈ దేశంలో జనం ఎక్కువ పుడుతున్నారు. ఆహారాన్ని తక్కువ పండిస్తున్నారు. జనం ఎక్కువ పుట్టి, ఆహారాన్ని తక్కువ పండిస్తే ఏమవుతుందండీ? తలసరి ఆహారధాన్యాల అందుబాటు తగ్గిపోతుంది. 1948 నవంబర్, డిసెంబర్‌లో భారతదేశంలో క్షామం వచ్చింది. ఈ క్షామం వేలాదిమందిని, లక్షలాదిమందిని పొట్టన పెట్టుకున్నది. 1939-44 మధ్యలో భారతదేశంలో సగటు ఆహార ధాన్యం 148 కిలోలు తలసరి ఉండేది. 1944 లో బెంగాల్ క్షామం వచ్చి కొన్ని కోట్ల మంది చనిపోయిన రోజుల్లో, ఈ రోజు ఆశ్చర్యాన్ని కల్గించేదేమి టంటే తలసరి ఆహార అందుబాటు అంతకన్నా తక్కువ కూడా 141 కిలోలకు పడిపోయింది. 1990-1992లో 171 కిలోల తలసరి ఆహారం అందుబాటులో వుండేది. ఈపదేళ్ళకాలంలో మనం సరళీకరణ, ప్రైవేటీ కరణ, ప్రపంచీకరణలు గొప్పగా సెలబ్రేట్ చేసు కుంటున్నాము. ఈ దశాబ్దంలో సగటు ఆహార ధాన్యాల అందుబాటు పడిపోయింది. అంటే ప్రజలకు దక్కే ఆహారం పడిపోయింది.

అయితే ప్రభుత్వాలేమి చెబుతున్నాయి? దారిద్ర్యం తగ్గిందని, తలసరి ఆదాయం పెరిగిందంటున్నాయి.

అసలు తలసరి ఆదాయపు లెక్కలే తప్పు. భారతదేశంలో అంబాని ఆదాయం + ఒక బిచ్చ గాడి ఆదాయం తీసుకొని తలసరి ఆదాయంగా లెక్క కడతామా? ఈ రోజు భారత దేశంలో తలసరి ఆదాయం పడిపోతుంది. ప్రజలకు ఈ రోజు ఆహారం దొరకటం కష్టమై పోతున్నది.

అందువలన ఈ రోజు వ్యవసాయ రంగం సంక్షోభంలో వున్న ఒక ప్రమాదం. ఆహారో త్పత్తులు తగ్గిపోవటం అంటే ఆహారధాన్యాల ఉత్పత్తి ఒక్కటే పడిపోవటం కాదు. ఆహార ధాన్యాల ఉత్పత్తి పడిపోవటం అంటే ఈ రోజు వ్యవసాయ కూలీలకు పనికూడ తగ్గినట్టే లెక్క. అందువలన ఈ రోజున అనేక ప్రాంతాల నుంచి వలసలు వెళుతున్నారు. మన ఆంధ్రప్రదేశ్ నుండే మహబూబ్‌నగర్ జిల్లా నుండి ఏటా 6 లేక 7 లక్షల మంది వలసలు వెళుతున్నారు. ఈ రోజు బొంబాయిలో కూడ ఆంధ్రప్రదేశ్ కూలీలు పనిచేస్తున్నారు.

ఉదాహరణకు మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల ప్రాజెక్టులో పనిచేసే కూలీలంతా బీహార్ నుండి, ఒరిస్సా నుండివచ్చిన వారే. అదే విధంగా బొంబాయి కార్ఖానాల్లో పనిచేసే వారంతా మహబూబ్‌నగర్ నుండి వలస వెళ్ళిన కూలీలే. మరి వీరు జూరాల ప్రాజెక్టులో ఎందుకు పనిచేయరు? అటువాళ్ళు ఇటు, ఇటు వాళ్ళు అటు ఎందుకు పనిచేస్తున్నారు?. జూరాల ప్రాజెక్టు కాంట్రాక్టర్ " మేము మహబూబ్‌నగర్ జిల్లా కార్మికులను పనిలో పెట్టుకోము" అని చెపు తున్నారు. ఎందుకు ఈ విధంగా చేస్తారంటే వాడు చావుకు ఇంటికిపోడు. అమ్మను, అయ్యను చూడటానికి పోడు. పిల్లలను చూడటానికి పోడు. వాడు జీతం పెంచమని అడగడు. యూనియన్ పెట్టడు. చెప్పినట్లే వింటాడు.వాడు 8 గంటలే కాదు, 16 గంటలు పనిచేస్తాడు. ఒకరికొకరు మాట్లాడుకోవటం ఉండదు. ఇన్ని లాభా లున్నాయి. లోకల్‌గా రైతుకూలీ సంఘం వాళ్ళు మీటింగుపెడితే వాడుపోడు. ఎందుకంటే వాడికి తెలుగు రాదు. రైతుకూలీ సంఘం నాయకులకు ఒరియా రాకపోతే, ఇన్ని లాభాలు పెట్టుకుని పెట్టుబడిదారులు వలస కూలీలనే పెట్టు కుంటారు. వ్యవసాయరంగంలో కాంట్రాక్ట్ రంగం పద్ధతిని ప్రవేశపెడుతున్నారు. ఇది వ్యవసాయ రంగానికి చాలా ప్రమాదకరంగా మారింది. హక్కుల కోసం కూలీలు పోరాడకుండా ఒక విధానాన్ని ఈ ప్రభుత్వాలు తీసుకొని వస్తున్నాయి. వ్యవసాయ రంగానికి సంబంధించి జరుగుతున్న మరొక ప్రమాదం ఈ రోజు వ్యవసాయానికి సంబంధించిన అన్ని రంగాలను ప్రైవేటీక రించటం-విత్తనాల రంగంలో ప్రైవేటీకరణ,

పరపతి రంగంలో ప్రైవేటీకరణ, ఎరువుల రంగంలో ప్రైవేటీకరణ, మార్కెట్ ప్రైవేటీకరణ, పురుగుల రంగంలో ప్రైవేటీకరణ, ఆఖరికి మన రాష్ట్రంలో అగ్రికల్చరల్ రంగంలో పరిశోధనా రంగాన్ని కూడా ప్రైవేటీకరిస్తున్నారు. మన రాష్ట్రంలో మీరు చూసే వుంటారు. వ్యవసాయ యూనివర్శిటీ పేరు మీదనే వుండవచ్చును. కాని హరిత విప్లవం ఆమేరకు విజయవంతం అవటానికి కారణమేమంటే విత్తనరంగంలో హైబ్రీడ్ విత్తనాలు అనేక రకాలు వచ్చాయి. ఇక ఈ రోజు వ్యవసాయయూనివర్శిటీస్ ఉండవు వ్యవసాయ విస్తరణ అధికారులు ఉండరు. ఇక కన్సల్‌టెంట్స్ ఉంటారు. రైతు ఒక కన్సల్‌టెంట్ దగ్గరకు వెళ్ళి నా పొలంలో ఏపంట వేయాలో చెపుతావా, ఏ విత్తనాలు వేయాలో చెపుతావా? అని అడిగితే కన్సల్‌టెంట్ ఫీజు తీసుకొని పొలం చూసి వచ్చి సలహా యిస్తాడు.

వ్యవసాయ పరిశోధన, విస్తరణ రంగంలో ప్రైవేటీకరణ ప్రవేశించిన తర్వాత వ్యవసాయం ప్రజల అవసరాల కోసం ఉండదు. ప్రపంచ బ్యాంకు తన నివేదికలో చెప్పింది. "అందంగా కనబడే టమాటోల మీద రీసెర్చ్ జరుగుతున్నది. కాని పోషక విలువలున్న గోధుమల మీద రీసెర్చ్ జరగటం లేదు" అని. ఇవి నేను అన్న మాటలు కాదు. ప్రపంచబ్యాంకు అన్న మాటలు. రాబోయే కాలంలో వ్యవసాయరంగ పరిశోధనలు విత్తన రంగాన్ని ప్రైవేటీకరించటం వలన జరగవు. ప్రజలకు పోషక విలువలు ఇచ్చే ఆహారోత్పత్తుల మీద పరిశోధనలు జరగవు. దేని మీద పరిశోధన జరుగుతుంది? లిప్టింగ్‌లకు వాడే, బ్యూటీపార్లర్‌లలో వాడే పంటలపై పరిశోధన జరుగుతుంది. అందంగా కనపడే టమాటోల మీద పరిశోధన జరుగుతుంది. కాని ప్రజలకు పోషక విలువలనిచ్చే ఆహారోత్పత్తుల మీద పరిశోధనలు జరగవు. ఈ రోజు అగ్రికల్చరల్ పరిశోధన సంస్థలను, యూనివర్శిటీలను ప్రైవేటీకరణ చేయటమనేది కేవలం రైతాంగానికే నష్టం కాదు. ఈదేశ ప్రజల ఆహార అవసరాలను దెబ్బతీసే పరిస్థితికి దారి తీస్తుంది. వ్యవసాయ పరిశోధన రంగాలను ప్రైవేటైజ్ చేయటమంటే భారతదేశ వ్యవసాయరంగ స్వావలంబనని దెబ్బతీయటం; భారతదేశ ప్రజల ఆహార అవసరాలను దెబ్బతీయటం అని మనం అర్థం చేసుకోవాలి.

ఈ రోజు అనేక దేశాల నుండి ఉత్పత్తులు మన దేశంలోకి వస్తున్నాయి. వాటి ప్రభావం ఏమిటి? 1990లో వంటనూనెలను మనం దిగుమతి చేసుకోలేదు. ప్రస్తుతం భారతదేశంలో వంటనూనెల అవసరాలన్నింటికీ మనమే ఉత్పత్తి చేసుకుంటున్నాం. అంతేకాదు, రీసెర్చ్ కూడా చేస్తున్నాం. కాని ప్రపంచ బ్యాంకు మన ప్రభుత్వాలకు ఒక సలహా ఇచ్చింది. " మీరు వంటనూనెలు ఎందుకు ఉత్పత్తి చేస్తున్నారు? వంటనూనెల ఉత్పత్తి మానేయండి. కాటన్ ఉత్పత్తి చేయండి. దానిలో ఎక్కువ లాభాలు వస్తాయని" చెప్పారు. వంటనూనెల ఉత్పత్తిని ఆపి వేయమని వంటనూనెలు దిగుమతి చేసుకుంటున్నాం. కొన్ని వేల టన్నుల పామాయిల్ నూనె దిగుమతి చేసుకుంటున్నాం. సుమారు 9వేల కోట్ల నుండి 10 వేల కోట్ల రూ॥ల విలువైన వంట నూనెలను మనం దిగుమతి చేసుకుంటున్నాం. ఇంత విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చుపెడుతున్నాం. ఫలితం ఏమిటి? అనంతపురంలో వేరుశనగ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వేరుశనగ నూనె ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. పనిలేక కార్మికులు వీధినపడ్డారు. మన పంట ఉత్పత్తులను మనం నాశనం చేసుకుంటున్నాం. కేరళలో కొబ్బరి నూనెకి గిట్టుబాటు ధరలేక రైతాంగం బాధపడుతుంటే మన పాలకులు వాటిని దిగుమతి చేసుకుంటున్నారు.

కేరళలో రబ్బరు పంటకు గిట్టుబాటు ధరలేక రైతాంగం బాధపడుతుంటే, టైర్ల పరిశ్రమాధిపతుల ఆదేశాల మేరకు రబ్బరును దిగుమతి చేసుకోవడానికి మన ప్రభుత్వం అనుమతించింది. మన కాఫీ గింజలకు గిట్టుబాటు ధరలు లేవు. కానీ విదేశాల నుండి కాఫీని దిగుమతి చేసుకుంటున్నాం. మనదేశం లో టీ సగానికి సగం విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాం. మన దేశంలో సగానికి సగం టీ ఉత్పత్తి అయ్యేది అస్సాంలో. ఈరోజు టి.వి.లలో రిపోర్ట్స్ ఇస్తున్నారు. అస్సాం టీ కంపెనీలలో కనీవినీ ఎరుగని సంక్షోభం వుంది. ఈ రోజు విదేశీ వస్తువులను ఇష్టం వచ్చినట్లు దిగుమతి చేసుకోవడం ద్వారా వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నాం. మన ప్రభుత్వం చింతపండు, బఠాని, కేరట్ దిగుమతులను ప్రోత్సహిస్తున్నారు. ఎందుకు? ఈ దేశంలో వున్న కొద్దిమంది భోగవిలాసాలకు మనం దిగుమతి చేసుకుంటున్నాం. మన దేశంలో చింతచెట్లు లేవా? మన చింతపండు పుల్లగా వుండదా? అమెరికన్ చింతపండుకన్నా పుల్లగా వుంటుంది. అదే హైబ్రిడ్ టమాటో తినండి, దేశవాళీ టమాటో తిని చూడండి. దేశవాళీ వంకాయ తినండి, హైబ్రిడ్ వంకాయ తినండి. ఏది టేస్ట్‌గా ఉంటాయో నేను మీకు చెప్పవలసిన అవసరం లేదు. ఈ రోజు డబ్బున్నవాడి పరిస్థితి ఏమిటి? వాడు బంగారం తినలేడు. అమెరికా చింతపండు కొనుక్కొని సాంబార్ చేసి తాగుతాడు. విదేశీ వస్తువులను మన దేశంలో ఇష్టం వచ్చినట్లు దిగుమతి చేసుకుంటున్నారు. మరొక ప్రక్క ఈదేశ రైతాంగానికి గిట్టుబాటు ధరలు లేక మన దేశ వ్యవసాయరంగం వెన్నెముక విరగగొట్టే పరిస్థితిని తీసుకువస్తున్నారు. వ్యవసాయ పరిశోధన శాస్త్రాన్ని ప్రైవేటీకరించటం వలన ఇంకో ప్రమాదం కూడ జరుగుతున్నది. అగ్రికల్చర్‌లో బయోటెక్నిక్ దెబ్బతింటోంది. ఇప్పటికే రైతులు భారతదేశంలో వున్న వ్యవసాయంలో వందలవేల రకాలుగా ఉన్న వంగడాలు 5 లేక 3 రకాలు మాత్రమే వున్నవి. జీవ సాంకేతిక పరిజ్ఞానం పేరిట వాటిని నాశనం చేస్తున్నారు. జీవ సాంకేతిక పరిజ్ఞానానికి ఎవరూ వ్యతిరేకం కాదు. వాస్తవంగా భారతదేశంలో రైతు ఈ జీవసాంకేతిక పరిజ్ఞానంతో వందల వేల రకాల విత్తనాలను తయారు చేస్తాడు.

గులాబి పువ్వు వుందండి. గులాబి పువ్వుకు తెలుగుపదం లేదు. హిందీ పదం లేదు. భారతీయ భాషల్లో అసలు పదమేలేదు. చాలా మందికి తెలియదు. టర్కీ దేశరాయబారి మొగల్ రాణి ముక్తఫాకు ఒక అందమైన పూవును బహుమానంగా ఇస్తూ ఇది "మా దేశ భాషలో 'గులాబి' అంటారు" అని చెప్పారు. ఆ దేశరాణి ఈ గులాబిని అనేక రకాల వంగడాలుగా మార్చి గులాబిని గుబాళించింది. ఈరోజు గులాబి భారతదేశం పువ్వు కాదని అంటే ఒప్పుకుంటారా! ఒక జీవ శాస్త్రవేత్త అంటాడు. రామాయణ, మహాభారత కాలంలో రాముడు, సీతా మహాలక్ష్మి వివాహంలో జనకమహారాజు ఇచ్చిన డిన్నర్‌లో బంగాళా దుంపలు కాని, టమాటోలు కాని, ఉల్లిగడ్డలు కాని, పచ్చి మిరప కాయలు కాని, ఉన్నాయా అండీ? శ్రీ కృష్ణుడి వివాహం అంటే గాంధర్వ వివాహం. ఆయనకు డిన్నర్ లేదనుకోండి! శ్రీ కృష్ణుడి డిన్నర్‌లో కూడ లేదు. ఎందుకంటే పోర్చుగల్ వాళ్ళు టమాటాలను, పచ్చిమిరప కాయలను ఉల్లిగడ్డలను మన దేశానికి ప్రజెంట్ చేసారు. బయోటెక్నాలజీ వలననే ఇవన్నీ మనకు దొరుకుతున్నాయి.

ఈ జీవసాంకేతిక పరిజ్ఞానానికి మన మేమి వ్యతిరేకం కాదు. కాని ఒక్క మొక్క జొన్నగింజలో 12 వేల జన్యువులుంటాయి. ఇందులో నీటి ఎద్దడిని ఎదుర్కోగల్గే ఒక్క జన్యువును ప్రవేశపెట్టి వాటినన్నింటిని కార్పోరేట్ కంపెనీలు లాగేసుకున్నాయి. నీవు ఒక జన్యువును ప్రవేశపెట్టావు కదా! ఇంకా 11 వందల 99 వున్నాయి కదా! మరి వాటి ప్రొప్రయిటర్ సమాజం కదా? అంటే సమాధానం లేదు. కార్పోరేట్ బయో టెక్నాలజీస్ సృష్టిస్తున్న మోసం ఏమిటంటే, వ్యవసాయ వనరులైన వ్యవసాయ జన్యువులను ఒక వ్యాపార వస్తువుగా మారుస్తుంది. అగ్రికల్చరల్ జీన్‌ని ఒక కమర్షియల్ కమోడిటీగా మారుస్తున్నది. ఫలితంగా వ్యవసాయరంగం, ఫుడ్ మార్కెట్ బహుళ జాతి సంస్థలైన మోన్‌శాంటో వంటి కంపెనీల చేతుల్లోకి నెట్టబడింది.

అగ్రికల్చరల్ రీసర్చ్, అగ్రికల్చరల్ బయో టెక్నాలజీ వాళ్ళ చేతుల్లోఉంది. కనుక అగ్రికల్చర్ ప్రొడక్షన్ దెబ్బతింటుంది. ఒక్క చిన్న పురుగు సోకటం జరిగితే వ్యవసాయం మొత్తం దెబ్బతినే పరిస్థితి వస్తుంది. ఒక్క చీడ వున్నా పంట మొత్తం నాశనం అవుతుంది. జీవ సాంకేతిక విప్లవం పేరిట ఈ దేశ వ్యవ సాయానికి ప్రమాదం తెస్తున్నారు. బి.టి కాటన్‌ను మనం చూసాం. ఈ బి.టి. విత్తనాలను 8 ఎకరాలలో వేసి రెండు ఎకరాలలో మరో విత్తనాలు వేయాలి. అంటే ఈ బి.టి విత్తనాలలోవున్న పురుగులు బయటకు వచ్చి దానిలోకి వెళతాయి. ఇది అమెరికాలో సాధ్యం. ఎందుకంటే ఒక్కొక్కరైతుకు 20 ఎకరాలు వుంటాయి. కనుక ఈ దేశంలో రైతాంగానికి ఒకటి లేక రెండు ఎకరాలు వుంటాయి. వీడు ప్రత్తి వేస్తాడు. ప్రక్కవాడు వరి వేస్తాడనుకోండి. ఈ బి.టి. విత్తన పురుగులు వెళ్ళి ఆ వరి పంట మీద పడితే ఒక వికృత పంట

ఎలుతున నే నెలుతున

- భూపాల్

ఎకరభూమి ఉందని - నే
నెంతో మురిసిపోతినీ
ఒంటి అరక నమ్మితి - నా
కంటి ఎలుగె నంటినీ
ఆరునెల్ల కష్టం - ఆ
అప్పులోని కిస్తీనీ
ఆకలని పేగులంటె
గంజి అడిగిపోస్తినీ

వస్తుంది. కనుక ఈ వికృత పంటకు దారి తీసే నూతన వ్యవసాయరంగం వస్తుంది.

నేను ఇంతకు ముందే ప్రపంచ బ్యాంకు నివేదిక చెప్పాను. అందంగా, ఆకర్షణీయంగా వుండే టమాటాల మీద పరిశోధన జరుగుతున్నది. కాని పోషక విలువలున్న గోధుమల మీద ప్రయోగం జరగటం లేదు. వ్యవసాయ జీవ వనరులు కార్పోరేటు రంగం సొత్తుగా మారుతున్నవి. నీవు రైతువయితే ఉద్యమాల్లో సంఘటి తమవ్వాలి. రచయితవైతే ఈ విధానాలకు వ్యతిరేకంగా వ్యాసం వ్రాయండి. నీవు గాయకుడవైతే గేయం పాడు. నీవు కవివైతే కవితరాయి. చివరకు నీవు మానవుడివైతే విశాఖలో జగదాంబ సెంటర్‌లోనో, సముద్రపు బీచ్‌లోనో ప్లేకార్డు పట్టుకొని నిరసన తెలియజేయండి. మన దేశాన్ని, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవటం మన బాధ్యత. అందుకే దేశభక్తి అంటే హిమాలయ పర్వతాలు కాదు. దేశభక్తి అంటే బంగాళాఖాతం కాదు. దేశభక్తి అంటే అరేబియా సముద్రం కాదు. దేశభక్తి అంటే వింధ్యపర్వతాలు, గంగా, యమునా నదులు కాదు. దేశభక్తి అంటే ఈ దేశంలో వున్న మెజారిటీ ప్రజల మనుగడను కాపాడే వ్యవసాయ రంగాన్ని కాపాడటమే నిజమైన దేశభక్తి. ✦


కరువు కెరటం


- సూర్యసాగర్

రాయలసీమా ! మా తల్లి !
తటుకు నీరులేక తడారిన
నీ ఎరఎర్రని నేలల మీద
నల నల్లని రేగడి మీద
బొంత జెముడు కూడా వగర్చుతున్న కరువు నీది
పదిమట్ల బావులు కూడా
బావురు మంటున్న వెతనీది
సుగ్గిలో కూడా అకలి తీరని అభాగ్యం నీది
కరువుతో కాగిపోయిన నీ జీవిత భాండంలో
మొండిధైర్యం తప్ప పిరికితనం లేదని తెలిసి
కన్నీళ్లతోనే నవ్వాము నిండుగా -

బక్కెద్దులతో బక్కరైతులతో
ఎడారిని దున్నుతున్న సాహసం నీది
ఇసుకతిన్నెల మీద కూర్చొని కూడా
నిబ్బరం కోల్పోని
తాత్విక దృక్పథం
మా తల్లిది రాయలసీమదని తెలిసి
ఎంత గర్వించాము

మగ్గిన జీవితాల సెగల్లోంచే
బండబారిన బతుకు బీళ్ళలోంచే
నీ మీద సాగుతున్న అన్యాయం మీద
తిరుగుబాటు కెరటాలుగా లేస్తాం
ఎర్రనేలలనే జెండాలుగా ఎగరేస్తాం
ఎండిన పైరు మొక్కల్ని
నిప్పనాల్కలుగా మేల్కొల్పుతాం
అకుపచ్చని పాలాలమై మొలుస్తాం
అమ్మా !
నువ్వు ఎండి ఎండి ఎడారివి కాకూడదు
నీవు మండి మండి తిరగబడతావు
అమ్మా !
నీవు మండి మండి తిరగబడతావు





ప్రత్యేక వ్యాసాలు

మార్క్స్ వివరించిన స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ

- కామ్రేడ్ సి.వి.

(భారత సామాజిక వ్యవస్థ పరిణామక్రమంలో స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ గురించి, అందులో ఉత్పత్తి సంబంధాలు, సాంఘిక సంబంధాలు, వ్యక్తులు, కులాలు, మతాలు, ఇవన్నీ ఆవిర్భవించిన పరిస్థితుల్ని ఈ వ్యాసం వివరించేదిగా వుంది. శ్రద్ధపెట్టి అధ్యయనం చెయ్యవలసిన వ్యాసమిది).

- సంపాదకులు

బ్రిటీష్‌వారు మనదేశంలో ప్రవేశించు నాటికి అమల్లో వున్న భారత సామాజిక వ్యవస్థను, "ఆసియాఖండ వ్యవస్థ" (ఏషియాటిక్ సొసైటి) అని మార్క్స్ అభివర్ణించారు. అడుగున ఆదిమ కమ్యూనిస్టు చిహ్నాలు గల గ్రామీణ నిర్మాణం వుండగా, పైన- నిరంకుశ ప్రభుత్వ ముండే వ్యవస్థను, మార్క్స్ " ఏషియాటిక్ సొసైటీ" యని అన్నాడు.

" స్వల్పమైన, అత్యంత పురాతనమైన ఈ ఇండియన్ కమ్యూన్‌లు (జనపదాలు) కొన్ని నేటికీ కొనసాగుతూనే వున్నవి. ఉమ్మడి భూమి (Collective Land) వీటికి పునాదిగా వుండేది. వ్యవసాయం, చేతిపనులూ పెనవేసుకొని వుండేవి. మార్చడానికి వీల్లేని శ్రమవిభజన పై ఇవి ఆధారపడి వుండేవి. ఎప్పుడైనా వొక కొత్త జనపదం ఏర్పడితే, దానికి గూడా ఇదే- నమునాగా వుండేది. నూరు నుండి కొన్నివేల ఎకరాల దాకా వుండి, ప్రతీ జనపదం తనకి కావలసిన వాటినన్నింటినీ ఉత్పత్తి చేసుకొనేది."

(మార్క్స్-కేపిటల్)

ఉమ్మడి వ్యవసాయం

ఈ గ్రామాల్లో వ్యవసాయం ఉమ్మడిగా సాగుతుండేది. వ్యవసాయ సౌలభ్యం కోసం, ఉమ్మడి కుటుంబాలు వేర్వేరు క్షేత్రాలు సాగుజేసినా, ప్రతి ఐదేళ్ళ కొకసారి, ఈ కటుంబాల మధ్య భూమి మార్పిడి జరుగు తుండేది. మార్క్స్ ఈ గ్రామీణ వ్యవస్థను ఈ విధంగా వర్ణించాడు "ఇండియాలోని వివిధ ప్రాంతాల్లో ఈ పురాతన జనపదాల నిర్మాణం భిన్న భిన్నంగా వుండేది. వీటన్నింటిలో అతి సామాన్య పద్ధతిలో వ్యవసాయం ఉమ్మడిగా సాగుతుండేది. ఫలసాయం సంఘ సభ్యుల మధ్య పంచబడుతుండేది. ప్రతి కుటుంబంలోనూ, ఉపపరిశ్రమగా వడకటం, నేయటం వుండేది. ఈ విధంగా ప్రతి కుటుంబం ఒకే పనిని కొన సాగిస్తుండేది. గ్రామంలో న్యాయ వ్యవహర్తగా, (జడ్జి) పోలీస్‌గా, పన్ను వసూలుజేసే అధికారిగా వ్యవహరించే గ్రామాధికారిగా ఒకడు వుండే వాడు. వ్యవసాయిక లెక్కల్ని రాసి, అందుకు చెందిన పద్దుల్ని నిర్వహించే కరణం వుండేవాడు. నేరస్థుల్ని పట్టుకొని, బాటసారుల్ని రక్షించి, వారిని భద్రంగా పొలిమేరలు దాటించేందుకు ఒక అధికారి వుండేవాడు. పొరుగు గ్రామాల వారి అతిక్రమణల నుండి పొలిమేరల్ని కాపాడే కాపలాదారు వుండేవాడు. సాగుకోసం ఊరి చెరువునించి నీటిని సక్రమంగా సరఫరాజేసే ఓవర్సీర్ (నీరడి) వుండేవాడు. మత కర్మకాండను నిర్వహించే పురోహితుడుండే వాడు. ఇసకపై రాయడం, చదవడం నేర్పే బడిపంతు లుండేవాడు. ఊడ్పులూ, కోతలూ మొదలైన వ్యవసాయ పనులన్నింటికీ, మంచి- చెడు కార్తెల్ని చెప్పే పంచాంగం బ్రాహ్మణు డుండే వాడు. వ్యవసాయ పనిముట్లను జేసే కమ్మరి; వడ్రంగి; గ్రామాని కవసరమైన కుండల్ని తయారు జేసే కుమ్మరి; ఊరి వారందరికీ గొరిగే మంగలీ, బట్టలుతికే చాకలీ, కంసాలీ, మరికొన్ని చోట్ల కంసాలికి బదులు కమ్మరీ, అక్కడక్కడా వొక కవీ వుండేవారు. ఈ పన్నెండు వృత్తుల వారూ గ్రామ ఉమ్మడి ఖర్చుపై పోషింపబడే వారు. జనాభా పెరిగితే, బంజరులో మరో కొత్త జనపదం వెలిసేది. ఇది - సరీగ్గా పాత దానివలెనే ఏర్పడేది."

" ఈ జనపదాలు నిరంతరం ఈ రూపం లోనే పునరుత్పత్తియవుతూ వుండేవి. ఎప్పుడైనా యాదృచ్ఛికంగా నాశనమైనా, తిరిగి అవే చోటులో, అదే పేరుతో ఆ గ్రామం ప్రభవించేది. ఇవి స్వయంపోషక సముదాయాలుగా వుండేవి. ఆ విధానంలోని అతిసామాన్యతయే ఈ ఆసియా ఖండ వ్యవస్థలో మార్పు లేకుండా కొనసాగడానికి కీలకం. ఆసియా ఖండంలో రాజ్యాలు నిరంతరం విచ్ఛిన్నమవుతూ తిరిగి తలయెత్తుతోన్నా, రాచ కుటుంబాలు తరచు కూలిపోతున్నా, ఈ గ్రామీణ వ్యవస్థ మారకుండా వుండడానికి గల కీలకం ఇదే. రాజకీయ ఆకాశంలో ఎన్ని తుఫాన్‌గాలులు వీచినా, సమాజం యొక్క ఆర్థిక జీవన కట్టడం మాత్రం స్పృశించబడలేదు."

(మార్క్స్ - కాపిటల్ - 1వ వాల్యూం - 14వ అధ్యాయం - 4వసెక్షన్)

అయితే, ఆదిమ కమ్యూనిజం చిహ్నాలున్న ఈ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఉత్తమమైందిగా మార్క్స్ భావించలేదు. పైగా సమాజాభివృద్ధికి ఇదే పెద్ద గుదిబండగా, పెద్ద అడ్డుగోడగా వుందని ఆయన భావించాడు. బ్రిటిష్ వలస విధాన ఫలితంగా నాశనమైపోయిన ఈ గ్రామీణ వ్యవస్థను గురించి, ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించాడు :

" పితృస్వామ్య సమాజానికి చెందిన యీ గ్రామాలు, లక్షలాదిగా విచ్ఛినమై చిన్న చిన్న కణాల్లా విడిపోవడం చూస్తోంటే, విచార సాగరంలో మునిగిపోవడం చూస్తోంటే, సంఘం లోని సమస్త సభ్యులూ సాంప్రదాయ సిద్ధంగా వొస్తోన్న జీవనాధారాన్ని కోల్పోవడం చూస్తోంటే, మానవ హృదయానికి ఎంతో బాధ కల్గించి నప్పటికీ, పరమ అమాయకంగా నిరపరాధంగా కన్పించే ఈ పల్లెపట్టులే, ప్రాచ్యఖండ నిరంకు శత్వానికి పునాదిగా వున్నాయనే విషయాన్ని సైతం మనం మరిచిపోగూడదు. మానవ మేధస్సును అత్యంత సంకుచితమైన పరిధిలో యిమిడ్చి, తత్ఫలితంగా అంధ విశ్వాసాలకే మాత్రం ప్రతి ఘటన లేకుండా ఆ మేధస్సు తలవొంచేట్లు చేసి సాంప్రదాయక నియమనిబంధనల సంకెళ్ళతో బంధించి, ఆ గ్రామసీమకు మహోన్నత చారిత్రక శక్తులు లేకుండా చేసి, వాటిని బంధించి వేశాయనే అంశాన్ని మనం మరిచిపోగూడదు."

" అత్యంత క్షుద్రమైన చారెడు భూమిపై తన దృష్టినంతా కేంద్రీకరించి దాన్ని పట్టుక వేళ్ళాడే యీ అనాగరిక అహంకారం, సామ్రాజ్యాల వినాశనాన్నీ- వర్ణించనలవిగాని క్రౌర్యాల్నీ- మహానగరాల్లోని జనాన్ని ఊచకోత కోయడాన్నీ కళ్లప్పగించి చూస్తూ ఊరుకొంది. ఇవేవో

సహజమైన ఘటనలుగా పరిగణించి, వాటిని గూర్చి కించిత్తు గూడ పట్టించుకోకుండా ఉదాసీనంగా నిశ్చింతగా చూస్తూ గమ్మున ఊరుకొంది. తన వేపు కన్నెత్తి చూసిన ప్రతి దురాక్రమణదారుని చేతిలోను, నిస్సహాయంగా తనకితానే చిక్కుకొనే యీ స్వార్థపరత్వాన్ని మనం మరచిపోగూడదు. ఎదుగూ బొదుగూ లేని, క్షుద్రమైన, సాధువైన, ఈ జీవితం నిష్క్రియాపరమైన ఈ జీవితం, ఇందుకు పూర్తిగా భిన్నమైన-దౌర్జన్యయుతమైన, లక్ష్యశూన్య మైన-అనంత విధ్వంసకర శక్తులకి ప్రేరకమైందనీ, నరహత్యను ఇండియాలో వొక మతకర్మకాండగా యిది తయారు జేసిందనే వాస్తవాన్ని మనం మరిచిపోగూడదు."

గ్రామసీమల్లో అంధ విశ్వాసాలు

" క్షుద్రమైన ఈ పల్లెపట్టులు, కుల వివక్షత తో-బానిసత్వంతో కలుషితమయ్యాయనీ, బాహ్య పరిస్థితులపై మానవుడు సార్వభౌమాధి కారం చలాయించడానికి బదులు, ఆ పరిస్థితులకే అతడు లొంగిపోయేట్లు యివి చేస్తున్నాయనీ; స్వీయాభి వృద్ధిని చెందే సాంఘిక పరిస్థితిని, ఎన్నడూ మారని ప్రకృతి విధిగా యివి మార్చుతున్నాయని; ప్రకృతి శక్తుల పూజను పాశవికం చేస్తున్నాయనీ, ప్రకృతికి అధినాథుడైన మానవుడు హనుమాన్ పేరిట కోతిని-శబల పేరిట ఆవునీ భక్తి శ్రద్ధల్తో మోకరిల్లి పూజించే హీనస్థితికి దిగజార్చి వేశాయనే విషయాన్నీ మనం మరవగూడదు."

(మార్క్స్ - ఇండియాలో బ్రిటిష్ పాలన)

చక్రవర్తులు మారినా, రణరంగాల్లో రక్త వాహినులు పారినా, ఈ గ్రామాల్లోని ప్రజలకు ఏ మాత్రం పట్టలేదు. దేశంలో ఏమి జరిగినా, వారికి చీమ సైతం కుట్టలేదు. బావిలోని కప్పల్లా, మురుక్కాలవలోని పురుగుల్లా తరాలు గడిచినా, ఎదుగూ బొదుగూలేని వారి జీవిత విధానం అలాగే వుండిపోయింది. బ్రహ్మ జెముళ్ళలాంటి మూఢనమ్మకాలు వారి మానసిక ప్రపంచాన్ని అన్నివేపులనించీ పూర్తిగా మూసివేయగా, శారీరక బానిసబంధాలు వారి మూల్గుల్ని పీల్చివేయగా, కుక్కలూ కుందేళ్ళలా పిల్లల్ని కని, చచ్చేంతదాకా బతికి, ఆ తర్వాత దిక్కులేని చావు చావడం మినహా, ఈ గ్రామ వ్యవస్థలో ఏ సౌభాగ్యాన్నీ-ఏ ఆనందాన్నీ-ఏ మానవ జీవన స్వేచ్ఛనీ-ఏమానసిక స్వాతంత్ర్యాన్నీ-మనం చూడలేం. పాత రాతి యుగం నాటి మానవుడు కాయాకసురూ తిని జంతుచర్మాన్ని కప్పుకొన్నా, కనీసం ప్రకృతి ప్రసాదించిన స్వతస్సిద్ధమైన జీవితానందాన్ని అనుభవించగల్గాడు. కాని **ఈ గ్రామీణ వ్యవస్థలోని వాడు కులానికి గులాం-మతానికి గులాం-దేవునికి గులాం-ఆచారానికి గులాం- విశ్వాసానికి గులాం-పురోహితవర్గాల చంకలు నాకే పాలకులకి గులాం-ఆధ్యాత్మిక దోపిడీగాళ్ళకి గులాం. ఈ గులాంగిరియే స్వర్గానికి నిచ్చెన మెట్లు వేస్తుందనీ, ఈ శూద్ర - పంచమ - బానిసల చాకిరీయే ధర్మరక్షణకు బాటలు తీస్తుందనీ, మతమూ దాని బాకాలైన పురోహితవర్గమూ రాత్రింబవళ్లూ ప్రచారం జేశారు. చెవిలో యిల్లుగట్టుక రొదబెట్టారు. ఇదే ప్రాచీన భారతంలోని స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ యొక్క విసర్గ సుందరమైన స్వరూపం:**

ఇండియా గురించి కేపిటల్‌లో 50 సార్లు ప్రస్తావించిన మార్క్స్

అహోరాత్రాలూ శ్రమించి సోషలిస్ట్ ఆర్థిక శాస్త్ర విజ్ఞాన సర్వస్వంగా " కేపిటల్" మహా గ్రంథాన్ని మార్క్స్ తీర్చిదిద్దాడు. ఈ గ్రంథ రచన కోసం ఆయన - మనుస్మృతిని గూడా అధ్యయనం చేసిన విషయాన్ని మనం తెలుసు కొన్నప్పుడు, మనకు ఎంతో ఆశ్చర్యం వేస్తుంది. మనువు రాసిన ధర్మశాస్త్రానికి, వర్ణవ్యవస్థ - గుండెకాయ. మనుధర్మశాస్త్రానికి మేధాతిథి భాష్యం రాశాడు. కుళ్ళుకభట్టు వ్యాఖ్యానం చేశాడు. ఆది శంకరుడు తన మహాభాష్యానికి మనుస్మృతి వరవడిలో రూపకల్పన జేశాడు.

ఇండియాలో మనిషి కన్న ఎద్దు మిన్న

ఇండియాలో వొక మనిషి చనిపోతే, ఆ స్థానంలో మరొకణ్ణి భర్తీచేయడం చాలా సులభం. కాని వొక ఎద్దు విషయం మాత్రం అలా కాదు-అని చెప్పిన ఈస్టిండియా కంపెనీ రిపోర్టుపై మార్క్స్ యిలా వ్యాఖ్యానించారు :

" రైతు - వ్యవసాయదారుడు వొకవేపు ఆకలితో అలమటిస్తోంటే, మరోవేపు పశు గణాలు మాత్రం వర్ధిల్లుతుంటాయి. దేశంలో వాన జల్లులు పదే పదే పడుతుంటాయి. పశు గ్రాసం పుష్కలంగా వుంటుంది. బలిసిన ఎద్దు వొక ప్రక్కన వుండగా, హిందూరైతు మాత్రం అన్నం లేక ఆకలితో అలమటించి అంతరించి పోతాడు. మూఢనమ్మకాలు సూచించే నివార ణోపాయాలూ, మనిషిపట్ల మహాకిరాతకం ప్రదర్శించేవిగా వుంటాయి. సమాజాన్ని అభివృద్ధి నిరోధక ధోరణికి గురిజేస్తాయి. పనిపాటలకు పశుగణాల రక్షణ, భవిష్యత్తులో వ్యవసాయం పనులు సాగించడానికి ఉపయోగ పడుతుందనీ, భావి సంపదకు ఆధారభూత మవతుందన్నదే వీరి ప్రధానమైన దృష్టి. ఈ మాటలు ఎంత కర్కశకఠోరమైనవైనా, ఎంత విషాదకరమైనవైనా వీటిని చెప్పక తప్పదు. ఈ మాటల్ని మనుధర్మ శాస్త్రంలోచెప్పిన సూత్రాల తో పోల్చి చూడండి. అందులో యిలా వుంది."

" ఎలాంటి ప్రతిఫలాన్నీ కోరకుండా హీనకులాలకు చెందినవాడు గో-బ్రాహ్మణుల రక్షణ కోసం ప్రాణాత్యాగం చేస్తే, అట్టి వాడికి స్వర్గం తప్పక లభిస్తోంది."

(కేపిటల్ - రెండవ వాల్యూం -241 వపేజి)

"బ్రాహ్మణార్థేన్ గవార్థేన్ వాదేహత్యాగోనుపస్కృతః
స్త్రీ బాలాభ్యుపపత్తౌచ బాహ్యానాం సిద్ధికారణమ్."
(మనుస్మృతి-10 వ అధ్యాయం-62 వ శ్లోకం)

బ్రాహ్మడు, గోవు, స్త్రీ, బాలుడు - వీరిని రక్షించడానికై, డబ్బు తీసుకోకుండానే హీన కులాల వారు ప్రాణం అర్పిస్తే, వారికి స్వర్గం లభిస్తుంది - అని పై శ్లోకానికి అర్థం.

మానవ ప్రాణం కన్న గోవు ప్రాణమే ఉత్కృష్టమైనది - అనే భావం ఎలా వొచ్చింది? పశువుకున్న విలువగూడా మనిషికి లేకుండా చేసిన భావం, హిందూమత విశ్వాసాలు- మూఢ నమ్మకాలు-పరమ కిరాతకమైన ప్రాచీన సాంఘిక ధర్మాల వల్లనే కల్గింది. ఇలాంటి సాంఘిక ధర్మాల్నే, మార్క్స్ అత్యంత విషాద భరిత దృష్టితో గుర్తించాడు. కుల మత ఛాందస భావాలు ఇండియాలో ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి ఏ విధంగా ఆటంకంగా తయారైందీ ఆయన కోట్ చేసిన మనుధర్మశాస్త్ర శ్లోకాన్ని బట్టి మార్క్స్ మనకు అత్యంత ప్రతిభావంతంగావివరించాడు.

అమెరికాలోని "న్యూయార్క్ డెయిలీ ట్రిబ్యూన్" పత్రికకు 1853 జూన్ 10వ తేదీన, 1853 జులై 22వ తేదీన, "ఇండియాలో బ్రిటిష్ పాలన - దాని భావి ఫలితాలు " గూర్చి మార్క్స్ రెండు వ్యాసాలు రాశాడు. ఆయన యీ వ్యాసాల్లో మనదేశపరిస్థితుల్ని అత్యంత ప్రతి భావంతంగా వర్ణించాడు. దాదాపు నూట ముప్పయ్ ఏళ్ళు గడిచినా, మార్క్స్ ప్రస్తావిం చిన యీ అంధ విశ్వాసాలూ, యీ కుల-మతతత్వాలూ నేటికీ అలాగే వున్నాయి. ఇంకా చెప్పాలంటే, కొత్త ముసుగులో మరింత నగ్నం గా - మరింత కిరాతకంగా నేడు యివి తాండ వమాడుతోన్నాయి. వాటిని గూర్చి ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించాడు.

హిందూమతాని కున్న రెండు ముఖాలు

"భోగలాలస - శోకపూరిత ధోరణుల సమ్మేళనం యొక్క బీజాలు, ప్రాచీన భారత మతసాంప్రదాయాల్లోనే గర్భీకృతమై వున్నాయి. ఒక వేపు ఇంద్రియలోలత్వం, మరో వైపు - శరీరాన్ని భీకర చిత్రహింసల పాల్జేసే సన్యాసత్వం. ఈ విధంగా హిందూ మతానికి రెండు ముఖాలున్నాయి. ఒక వేపున ఈ మతం లింగాన్ని పూజిస్తుంది. అదే సమయంలో జగన్నాధ రధాన్ని కొలుస్తుంది. సర్వసంగ పరిత్యాగం జేసిన బైరాగినీ ఈ మతం పూజిస్తుంది. అదే సమయంలో ఈ మతం వేశ్యనీ ఆరాధిస్తుంది.

ఇండియాలో సాంఘిక విప్లవం

" ఇండియాలో సాంఘిక విప్లవం సంభవించేట్లు చేయడంలో, ఇంగ్లండు పరమనీచమైన స్వార్థప్రయోజనాల్ని మాత్రమే దృష్టిలో పెట్టుకుని, వాటిని అమలు జరిపే పద్ధతిలో బుద్ధి మాంద్యాన్ని బయట పెట్టుకొన్న దనడం సత్యమే. అసలుప్రశ్న ఏమంటే- ఆసియా సామాజిక వ్యవస్థలో మౌలిక విప్లవం జరగకుండా, మానవాళి తన కర్తవ్యాన్ని నిర్వర్తించ గల్గుతుందా? అలా నిర్వర్తించ లేక పోతే, ఇంగ్లాండ్ చేసిన నేరాలు ఎలాంటి వైనా, ఇండియాలో ఈ సాంఘిక విప్లవాన్ని సఫలీకృతం గావించడంలో, తాను ఎరగ కుండానే ఇంగ్లాండ్ చరిత్ర చేతిలో వొక సాధనంగా పనిచేసింది."

"ఇండియాపై నా అభిప్రాయాల వివరణను ఈ లేఖలో పూర్తి చేస్తాను. ఇండియాలో ఆంగ్ల సార్వభౌమాధికార స్థాపన ఎలా జరిగింది? మొగల్ పాదుషా అధికారాన్ని మొగల్ సుబేదార్లు భగ్నం చేశారు. మొగల్ సుబేదార్ల అధికారాన్ని మహా రాష్ట్రులు విచ్ఛిన్నం చేసారు. మహారాష్ట్రుల అధికారాన్ని ఆఫ్ఘనులు ధ్వంసం చేశారు. వీరంతా వొకరితో వొకరు పోట్లాడుకుంటున్న సమయంలో బ్రిటీష్‌వాడు వీరి మధ్య జొరబడి వీరినందరినీ అణచివేయ గల్గాడు. ముస్లిమూ-హిందువూ - భేదం వల్లనే గాక, తెగ తెగకీ, కులానికి కులానికీ మధ్యనున్న వ్యత్యాసంతో పూర్తిగా చీలిపోయిన దేశం. సంఘ సభ్యులందరి మధ్యనున్న ఒంటెత్తు తత్వం ఫలితంగా ఏర్పడిన అస్తిపంజరాన్ని కలిగియున్న సమాజం. ఇలాంటి దేశం, ఇలాంటి సమాజం విజేతల పాల్పడి తీరడమే దాని నిర్నీతఘటనగాక మరేమవుతుంది?"

(మార్క్స్ - బ్రిటీష్ రూల్ యిన్ ఇండియా - ప్రోగ్రెస్ పబ్లిషర్స్ - మాస్కో)

తరతరాల గ్రామీణ వ్యవస్థ

ప్రాచీన భారతంలో గ్రామనిర్మాణం వొక విశిష్టమైన వ్యవస్థ.

ఆర్యులకు పూర్వం భారతదేశంలో వేల సంవత్సరాలనించి నివసించిన ద్రావిడులూ - కొలేరియన్లూ యిత్యాదులు వున్న కాలంలోని గ్రామ నిర్మాణం గూర్చి మనం ప్రత్యేకంగా అధ్యయనం జేయాల్సిన అవసరముంది.

వైదికయుగంలో (1) సభ (2) సమితి (3) రాజన్ (4) పురోహిత (5) గ్రామణి వుండేవారు. వీరి పుట్టుపూర్వోత్తరాలూ, వీరి విధులు గూర్చి గూడా అధ్యయనం చేయాలి.

గ్రామణి-అంటే గ్రామాధికారి. ఇతడు వొక విధంగా గ్రామ నాయకుడు. ఇతడు ప్రభుత్వంచే నియమింపబడక, గ్రామ సంఘంచే నియమింప బడేవాడు. "ఈ నియామకం గ్రామ సంఘంచే స్థిరపరుపబడి గానీ, లేదా వంశపారంపర్యంగా గాని వుండేది." అని రైస్‌డేవిడ్స్ అన్నాడు. (Buddist India - పేజి- 48) "కొన్ని సందర్భాల్లో ఈ ఉద్యోగం వంశపారంపర్యంగా, కొన్ని సమయాల్లో ఎన్నుకోవడం ద్వారా, మరికొన్ని సందర్భాల్లో ప్రభుత్వ నియామకం ద్వారా అమల్లో వుండేదని ప్రొఫెసర్ మాక్డోనల్ చెప్పాడు. (Vedic India - పేజి- 247)

గ్రామాధికారి

"గ్రామస్యాధిపతిం కుర్యాద్దశ గ్రామపతిం తధా
వింశ తీశం శతేశంచ సహస్రపతి మేవచ
గ్రామే దో షాన్ సముత్పన్నాన్ గ్రామికశ్శతకై స్వయం
శంసేద్యామ దతేశాయ దశేశో వింశతీ శినే
వింశతీశస్తు తత్కర్వం శతేశాయని వేదయేత్
శంసేద్యామశతేశస్తు సహస్రపతయే స్వయం."

(మనుధర్మం - 7-115, 116, 117)

ఒక గ్రామానికి అధిపతి, పది గ్రామాలకి ఒక అధిపతి, ఇరవై గ్రామాలకి ఒక అధిపతి, నూరు గ్రామాలకి వొక అధిపతి, వేయి గ్రామాలకి ఒక అధిపతి వుంటారు. ఈ నిచ్చెన మెట్లలో, వేయి గ్రామాల అధిపతియే అందరి కన్న మిన్న. ఆయా గ్రామాధిపతులు తమ తమ గ్రామాల్లో జరిగే తగాదాలను విచారిస్తారు. నేర తీవ్రతను బట్టి వీరు నూరు గ్రామాల అధిపతి దగ్గరికి గాని, వేయి గ్రామాల అధిపతి వొద్దకు గానీ, నేరస్తుల్ని పంపుతారు. న్యాయాధిపతులూ, గ్రామాధిపతులూ నేరం జరిగిన చోటుకి వెళ్ళి విచారణ జేసి, తీర్పుచెప్పాలని మనువు అన్నాడు.

పది గ్రామాలపై పన్ను వసూలుచేసే ఉద్యోగి -100 గ్రామాలపై మరో ఉద్యోగి - వెయ్యి గ్రామాలపై పన్ను వసూలు చేసే మరో పెద్ద ఉద్యోగి-యిలా పన్నులు వసూలు చేయాలని మనువు తన ధర్మశాస్త్రంలో చెప్పాడు. "ఈ విధంగా ఉద్యోగులకు అధికారాలు సమకూర్చడం ద్వారా, ఫ్యూడల్ వ్యవస్థలో వీరే ప్రధాన అంగాలుగా తయారయ్యారు" అని మార్క్స్ వ్యాఖ్యా నించాడు.

(మార్క్స్, ఎంగెల్స్‌ల ఉత్తర ప్రత్యుత్తరాలు - మొదటి వాల్యూం - 589 పేజి)

ప్రతి గ్రామానికి వొక్కో అధికారి వున్నట్లే, పది-నూరు-వెయ్యి-గ్రామాలకు గ్రామాధికారు లుండాలని, విష్ణుస్మృతికర్త చెప్పాడు. "పది గ్రామాల్ని రక్షించేందుకు నియమించబడిన వాడు నాయకుడనీ, నూరు గ్రామాలపై స్వతంత్రాధికారం గలవాడు సామంతుడనీ, వెయ్యి గ్రామాల్ని పాలించేందుకు రాజుచే నియమింపబడిన వాడు గూడా సామంతుడనీ, శుక్రనీతిసారం చెప్పింది.

(శుక్రనీతిపారం - ప్రధమాధ్యాయం)

కౌటిల్యుని అర్థశాస్త్రంలో గ్రామ నిర్వచనం ఈ విధంగా వుంది. "రెండు మైళ్ళ విస్తీర్ణ ముండి, వెయ్యి వెండి కర్షములు ఆదాయం వొచ్చే ప్రదేశాన్ని గ్రామమనీ; అర్థకోశం విస్తీర్ణ ముండి ఐదు వందల వెండి కర్షముల ఆదాయం వొచ్చే ప్రదేశాన్ని పల్లెయనీ; నాలుగు ఫర్లాంగుల విస్తీర్ణ ముండి 250 వెండి కర్షముల ఆదాయం వొచ్చే స్థలాన్ని గుంభమనీ" వర్గీకరణ జేశారు.

నాటి మారకం విధానం

వెండి కర్షమంటే వొక వరహా అని అర్థం. మహావీరాచార్యుడు తన గణితసార సంగ్రహంలో నాటి మారకం విధానాన్ని వివరించాడు.

"చతుర్భిర్గండ కైర్గుంజా
గుంజాः పంచ పణోచ్యతే
ధరణం ధరణేకర్షः
పలం కర్ష చతుష్టయం."

నాలుగు గండకాలు వొక గుంజ. (గురి వింద గింజ) ఐదు గింజలు ఒక పణం. ఎనిమిది పణాలు ఒక ధరణం. రెండు ధరణాలు ఒక కర్షం. నాలుగు కర్షాలు ఒక పలము. కర్షము-నాలుగు రూపాయిలైతే, ధరణం రెండు రూపాయ లవుతుంది. పణ మంటే నాలుగణాలు, (పాతిక

పైసలు) ఎనిమిది పణాలకు రెండు రూపాయలు. పావలాలో ఐదో వంతు పరిమాణం గలది గుంజ. వొక గుంజ - అంటే ఐదు పైసలు. ఆనాడు వొక గురివింద గింజ ఖరీదు ఐదు పైసలన్నమాట. గురివింద గింజతో, నాటి మారకం ప్రారంభమయ్యేది.

గ్రామాధికారి విధులు

గ్రామ సరిహద్దులు నిర్ణయించడం, గ్రామ కంఠాల్ని భాగాలు వేయడం, ఆయకట్టులో చేర్చబడ్డ భూముల్ని-సాగుచేయబడ్డ భూములూ -సాగుకాని భూములని విభజించడం; పూల తోటలు, కూరగాయల తోటలు, మైదానాలు, వ్యాయామ ప్రదేశాలు, యాత్రా స్థలాలు, స్మశాన భూములు, పచ్చికబీళ్ళు, ధర్మ గృహాలు (సత్రవలు?), నివాస గృహాలు (కాపురం జేసే ఇళ్ళు), గుళ్లు, వీటిని పుస్తకంలో చేర్చడం; వేలాలు-ధర్మాలు-పన్ను చెల్లించు సుంకములు, భూముల ధరలు ఉదహరించడం, కులాల ప్రాతిపదికపై కాపరంచేసే వారి సంఖ్యను నిర్ధారణ జేయడం; వర్తక వ్యవసాయాలు, చేతిపనులు, కళలు, పశువుల బీళ్ళు, ప్రతివాని ప్రవర్తన, వాని ఆదాయ వ్యయాలున్న పుస్తకాల్ని వుంచడం - అని కౌటిల్యుని అర్థశాస్త్రం చెప్పింది. (2వ అధ్యాయం) మౌర్యచక్రవర్తుల కేంద్రీకరణ పాలనలో గ్రామసభ - (గ్రామ పంచాయితీ) తన అధికారంలో చాలా భాగం కోల్పోయింది.

గ్రామసభ

ఈ సభను గ్రామవృద్ధుల సభ, లేదా గ్రామపెద్ద సభయని పిలిచే వారు. (Village Elders Council)

"నిత్యం నైమిత్తికం కామ్యం శాన్తికం పౌష్టికం తథా
పౌరాణం కర్మ కుర్యుస్థే సంధిగ్ధే నిర్ణయం తథా"

(బృహస్పతి)

నిత్య నైమిత్తిక కామ్యకర్మలు అనుష్టించినపుడు గ్రామప్రజలకి తోడ్పడం, దైవిక విపత్తులు తొలగిపోవడానికి, శాంతి సౌఖ్యాలు కలగడానికి సాధనాలైన కర్మలను చేయించడం, సందిగ్ధంగా వున్న మత విషయాల్లో తమ అభిప్రాయం తెలియజేయడం, రాజుచే నియమింపబడ్డ గ్రామపెద్దల విద్యుక్తధర్మం. సకల కళావిశారదులైన బ్రాహ్మణుల్ని వీటిలో సభ్యులుగా నియమించి, మత సంబంధమైన కార్యాలకీ, లౌకిక వ్యవహారాలకీ మధ్య ఏ సంబంధం చూడకుండా వుండడం రాజధర్మం.

"గ్రామ శ్రేణీ గణానాంచ సంకేతః సమయక్రియా
బాధాకాలేతు సాకార్య ధర్మకార్యే తదైవచ
బాధచోర భయేబాధాః సర్వసాధారణాః స్మృతాః"
"తత్రోపశమనం కార్యం సర్వం నైకేనకేనచిత్
సభా ప్రపాదేవ గృహ తటాకారామ సహాకృతిః
తధానాధ దరిద్రాణాం సంస్కారో యజనక్రియా."
"కులాయన నిరోధశ్వ కార్యమస్మాభరం శతః
యావైత ల్లిఖితం పత్రే ధర్మ్యాసా సమయక్రియా."

అందరికీ సమంగా ప్రమాదం వొచ్చినపుడు పట్టణ-నగరవాసులు, వర్తకులు, బ్రాహ్మలు, మతభ్రష్టులు, కర్మపరులు మొదలైన వారంతా ఏకంగా తమ లౌకిక - పారమార్థిక వ్యవహారాలు యధావిధిగా నడవడానికీ; వ్యాపారం, వృత్తులు చెడకుండా ధర్మం సమయానుకూలంగా నడవడానికి; అంగీకారపత్రం రాసుకొని ఆ నిబంధనలకు బద్ధులై వుండాలి. చలిపందిరులు, సభా భవనాలు, వాపీ కూప తటాకారామములు (బావులు -చెరువులు- తోటలు), దేవాలయాల్ని రక్షించడం, మరమ్మతు చేయించడం, దరిద్రులకు, అనాథలకు ప్రేత సంస్కారం చేయడం, కరువు కాటకాల్లో ప్రజలకు అన్నదానం చేయడం, వీరి ధర్మాలు.

ఈ గ్రామ సభలకు సివిల్ - క్రిమినల్ వివాదాల్ని పరిష్కరించడానికి అధికారాలు గూడా వుండేవి. అప్పుతీసుకున్నవారు 15%- నూటికి పదిహేను చొప్పున వడ్డీ యివ్వాలి. కూలివాడు తన నియమం అతిక్రమించి పూర్తిగా పనిచేయకపోతే కూలి ఇవ్వాల్సిన అవసరం లేదు. పరువు నష్టానికి పన్నెండు పణాలు (మూడు రూపాయలు) జరిమానా విధించే వారు. గాయపడేట్లు కొడితే నూరు పణాలు జరిమానా. దొంగతనం చేస్తే జరిమానా. వ్యభిచారానికి మరణశిక్ష; కాని మామూలుగా జరిమానా విధించేవారు. ("కురళ్" అనే తమిళ గ్రంథాన్ని చూస్తే, రెండువేల సంవత్సరాల క్రితం ఈ గ్రామ పరిపాలన అమల్లో వున్నట్లు తెలుస్తోంది. క్రీ.శ 9, 10 శతాబ్దాల్లో చోళ పరిపాలనలో ఇలాంటి గ్రామ సంఘాలు 120 వున్నట్లు చరిత్ర చెపుతోంది.)

రెండు గ్రామాల పొలిమేరలను గూర్చి వొచ్చిన తగాదా, ఇరుగు పొరుగు గ్రామాల్లోని పెద్దల వల్ల పరిష్కరించబడుతుండేది. గ్రామాధికారి గ్రామ సభలకు అధ్యక్షత వహించేవాడు. జారులు, చోరులు యిత్యాది వారిని; గ్రామం నించి వెళ్లగొట్టగల అధికారం సైతం గ్రామాధికారికి వుండేది. భూమిశిస్తు, ఇతర సుంకాల నించి ఈతడు ప్రతిఫలం అనుభవిస్తోండేవాడు. శిస్తు లేకుండా గ్రామకంఠభూమిని, స్వంత ప్రయోజనాలకై వినియోగించుకొనేవాడు. ఇతడు తన ఉద్యోగ బాధ్యత నిర్వహణ సమయంలో చేసిన ఖర్చులకు, గ్రామప్రజలు కొంతవరకు సహాయం జేసేవారు. ఇతడు గాక, సాహసాధిపతి, లేఖకుడు, శిస్తువసూలు చేయువాడు, (మోతాదు) కావలివాడు అనే నలుగురు గూడా వుండేవారని శుక్రనీతి చెప్పింది. "గ్రామ ప్రజల ఆంతరంగిక భద్రతకు గ్రామోద్యోగులు బాధ్యత వహించేవారు. గ్రామంలో దొంగలు పడితే గ్రామోద్యోగులు దొంగల్ని పట్టుకోవాలి. ఆ విధంగా పట్టుకోలేకపోతే, దొంగిలించబడ్డ సొమ్ముకి విలువ కట్టి యిచ్చేవారు అని ఆపస్తంబుడు చెప్పాడు.

గ్రామసభలో బ్రాహ్మణాధిక్యత

సంఘసభ్యులుగా వుండేవారు 5 ఎకరాలకి మించి భూమి, ఇల్లు, సొంత స్థలం కలిగి వుండాలి. 30 ఏళ్ళు మొదలు 70 ఏళ్లు దాటని వయస్సు కలిగి వుండాలి. మంత్రాలు, బ్రాహ్మణములు తెలిసి వుండి, వ్యవహారజ్ఞానం, న్యాయదృష్టి, సుగుణసంపత్తి కలిగి యుండాలి. బ్రహ్మ హత్య, (చౌర్యం) దొంగతనం, సురాపానం, గురుభార్యతో వ్యభిచరించడం యిత్యాది దుర్మార్గపనులు చేసినవాడు, సభ్యత్వానికి అనర్హుడు. దీన్ని బట్టి నాటి గ్రామాల్లోని పురోహిత వర్గానికి చెందినవారే, అత్యధిక సంఖ్యలో ఈ గ్రామ సభల్లో తిష్టవేసే వారని మనం సులభంగానే అర్థం చేసుకోవొచ్చు. మంత్రాలు, బ్రాహ్మణాలకు చెందిన పరిజ్ఞానం, బ్రాహ్మలకి తప్ప ఆనాడు వేరే వారికి వుండడం సాధ్యంగాదు గదా?

భూమిశిస్తు

వ్యవసాయదారులు తమ పంటలో ఆరో వంతుగానీ, ఎనిమిదోవంతు గానీ, పన్నెండో వంతుగానీ, రాజుకు పన్ను రూపంలో చెల్లించాలని గౌతముడు తన ధర్మసూత్రాల్లో చెప్పాడు.

పశువుల సంఖ్యలో యాభయ్యో భాగం, బంగారంలో యాభయ్యో భాగం, పంటలో ఆరో భాగం, ఎనిమిదో భాగం, పన్నెండో భాగాన్ని రాజు వసూలుచేయవచ్చునని మనువు చెప్పాడు. (మనుధర్మశాస్త్రం-6-130). చెట్లు, తేనె, వెన్న, ఓషదులు, పూలు, వేర్లు, పళ్ళు, ఆకులు, తోటకూరలు, పచ్చిక, మాంసం, చర్మాలు, పేము, మట్టిపాత్రలు, గాజు పనిముట్లపై ఆరో వంతును పన్నుగా రాజు వసూలు చేయవచ్చునని మనువు చెప్పాడు. (మనుధర్మశాస్త్రం 131, 132.) పంటలో ఆరోభాగాన్ని పన్నుగా రాజు వసూలు చేయవచ్చునని భారతంలో సూచించ

బడింది. (మహాభారతం–శాంతిపర్వం 70వ అధ్యాయం – పదవశ్లోకం) మహాకవి కాళిదాసు తన అభిజ్ఞానశాకుంతలం నాటకంలో, పంటలో ఆరోవంతును రాజు పన్ను రూపంగా వసూలు చేయాలని సూచించాడు.

మౌర్యచంద్రగుప్తుని ఆస్థానంలోని గ్రీకు రాయబారియైన మెగస్తనీస్, భూమిపన్ను నూటికి పదివంతులని చెప్పాడు. మౌర్యుల కాలంలో సుంకాలు నూటికి పదినుండి ఇరవై వంతుల దాకా వుండేవి. అగ్నిపురాణం, భూమి పన్ను నూటికి యిరవై వంతులని చెప్పింది. దేవపూజా ద్రవ్యాలూ, పెళ్ళికి చెందిన వస్తువుల పై సుంకం లేదు. ఈ సుంకాలు సంతల్లోనూ, రహదారి ప్రదేశాల్లోనూ, వసూలు చేయ బడేవని శుక్రనీతి చెప్పింది.

నాటి బ్రాహ్మణులు వ్యవసాయ – వాణిజ్యాలు చేయగూడదని, మనుధర్మశాస్త్ర కారుడు శాసించాడు. అయినా ఈ నిషేధాన్ని నాటి బ్రాహ్మలు ఖాతరు చేయకుండా, వ్యవసాయం చేసినట్లు కన్పిస్తోంది. బ్రాహ్మణ వ్యవసాయ దారుని నుండి పంటలో ఆరోవంతు పన్నును వసూలు చేసిన రాజు, దోషిగా పరిగణింపబడ్తా డని పరాశర స్మృతిలోని రెండో అధ్యాయంలో స్పష్టంగా చెప్పబడింది. కౌటిల్యుడు తన అర్థ శాస్త్రంలో సన్యాసులపై గూడా పన్ను వేయాలని చెప్పాడు. ధర్మనిష్టను బ్రాహ్మడు పన్నుగా చెల్లిస్తున్నాడు గాబట్టి, అతని వొద్ద నుండి సుంకం వసూలు చేయగూడదని మనువు చెప్పాడు.

మొత్తం మీద మన ప్రాచీన ధర్మశాస్త్రవేత్తలంతా, పంటలో ఆరో భాగాన్ని శిస్తుగా వసూలు చేయాలని కొద్ది తేడాల్తో సూచించారు. భూసారాన్ని బట్టి సుంకం విధింపబడాలని, ఊసరక్షేత్రాల కన్న సారవంతమైన భూములపైనే ఎక్కువ పన్ను వేయాలనీ, మొక్కలకి నొప్పి కలగకుండా తోటమాలి ఏవిధంగా పూలు కోస్తాడో, అట్లే రాజు సైతం సుంకం వసూలు చేయాలని శుక్రనీతి సూచిం చింది. బావులు, చెరువులు, కాలవల ద్వారా సాగయ్యే భూముల పై మూడోవంతునూ–వాననీటిపై ఆధారపడే భూములపై నాలుగోవంతును–ఆనకట్టల ద్వారా సాగయ్యే భూములపై అర్ధభాగాన్ని సుంకంగా వసూలు చేయాలని శుక్రనీతి సారం చెప్పింది. బ్రాహ్మలు తమ భూములకి చెల్లించవలసిన పన్నులు చెల్లించవలసిన అవసరంలేదని ఆప స్తంబుడు చెప్పాడు. (ఆపస్తంబసూత్రాలు 1,10.)

శూద్ర పంచమ బానిసత్వం

శూద్రులు, కాయకష్టంపై బ్రతికే యితరులూ నెలకొక రోజు, వారు చెల్లించవలసిన పన్నులకి బదులు, తమకి చేతనైన చాకిరీని రాజుకి చేసి తీరాలని, విష్ణుపురాణం చెప్పింది. ఈ విధంగానే మను ధర్మశాస్త్రమూ శాసించింది.

ఇండియాలో బానిసత్వం లేదని మెగస్తనీస్ రాశాడు. ఈ సర్టిఫికెట్ చూపెట్టి, మన బూర్జువా చరిత్ర పండితులు నిలువెల్లా పొంగి పోతున్నారు. అయితే, రోమన్ – గ్రీక్ – బానిసత్వం లాంటి దాన్ని అతడీ దేశంలో చూడని మాట నిజమే కాని అంతకన్నా దుర్భరమైన, అంతకన్న దారుణ మైన, అంతకన్నా నిగూఢమైన, అంతకన్నా కిరాతకమైన శూద్ర, పంచమ బానిసత్వం స్వరూప స్వభావాలు అతనికి అర్థం గాలేదు. అతని మనోనేత్రానికి గోచరించలేదు.

భూమిపై రాజుకు హక్కు వున్నాదా?

భూ కామందుగా (Owner of the Land) రాజుఎన్నడూ పరిగణింపబడినట్లు కన్పించదు. భూమిపై తనకు హక్కున్నదని రాజు భావించినట్లుగానీ, కన్పించదు. పంటలో తనకు రావలసిన భాగం వరకే రాజు దృక్పథం పరిమిత మైనట్లు తోస్తోంది. "నభూమి స్వాత్సర్వా న్ప్రత్య విశిష్టత్వాత్" అని పూర్వ మీ మాంస కర్తయైన జైమిని చెప్పాడు. (పూర్వమీ మాంసం–ఆరో అధ్యాయం–7వ పాదం–3వసూత్రం) అంటే –ప్రజలకు భూమి స్వాధీన మైంది. గాబట్టి, రాజుకు భూమిని దానంచేసే అధికారం లేదు" అని అర్థం.

"తత్రైవమాహ భూమిర్దేయానశేతి సంశయే
సార్వభౌమస్య విద్యమాన స్వత్యత్యాగ సంభవార్దేయతి

బహిః పూర్వపక్షే సిద్ధాంత మహానేతి స్పష్టార్థః" అని పూర్వ మీమాంస రచయితలలో చివరివాడైన రామేశ్వరి సూరి రాశాడు. అంటే సార్వభౌమత్వం అనుభవించదగిందే గాని, అన్యాక్రాంతం చేసే శక్తి నివ్వదు. వ్యవసాయ దారులు పండించిన దాన్ని శత్రువులు తీసుకు పోకుండా కాపాడడం, పంటలో తనకు రావలసిన భాగానికి మాత్రమే రాజుకి అధికార ముంది గాని, భూమిపై ఎట్టి అధికారం లేదు. భూమి–రాజు యొక్క సొత్తు కాదు. అంచేత, రాజుకి భూమిపై హక్కున్నట్లు కన్పించదు. బంజరు భూముల్ని బాగు జేసినవాడు, రాజు దగ్గర నుండి భూమి తీసుకున్నవాడు, నిర్ణయించిన పన్నుల్ని మాత్రం రాజుకి చెల్లించాలి. అట్టివాడు భూమిపై తనకున్న హక్కును అమ్ము కొనవచ్చును. రాజుకు ఆ భూమి ధరతో సంబంధం లేదు. భూమిని కొన్నవాడే రాజుకు పన్ను చెల్లించాలి. భూమి ఎవరి చేతిలోంచి ఎవరి చేతిలోకి మారినా, రాజుకు మాత్రం పన్ను చెల్లించాలి. రాజుకు రాజ్యంపై గాని, మండలాధిపతికి మండలంపై గానీ, సంపూర్ణమైన హక్కున్నట్లు కన్పించదు. శాంతి భద్రతలు కాపాడడానికి రాజుకు అందరిపై అధికార ముందేమోగాని, ప్రజల భూమిని తీసుకోవడానికి మాత్రం కాదు. అట్టి అధికారమే వుంటే ప్రజలు నివసించే గృహాలూ, వారి భూములూ, రాజుకు చెందాలి. సుంకం పుచ్చుకునే అధికారం మాత్రమే రాజుకున్నట్లు జైమిని అంటున్నాడు. యజ్ఞయాగాలూ, దాన ధర్మాలూ మొదలైనవి రాజుకు చెందిన సొంతఖర్చులని కౌటిల్యుడు చెప్పాడు.

చాపరాయి శాసనం : గ్రామ ప్రభుత్వం

క్రీ.శ. 1026–1042 వరకు సింహళాన్ని పాలించిన నాల్గవ మహీందుని – దేవలకాటీయ చాపరాయి శాసనం నాటి గ్రామ ప్రభుత్వానికి చెందిన వివరాల్ని విశదీకరించింది. ఈ శాసనంలో "దశగామ" అనే గ్రామం ఉటంకించ బడింది. ఈ గ్రామంలో గౌరవ కుటుంబీకులూ, గ్రామాధికారి, సాంఘిక న్యాయస్థానాన్ని ఎంతో జాగ్రత్తగా నడిపే వారని చెప్పబడింది. గ్రామసభ చట్టాన్ని అతిక్రమించిన వారిని విచారించి, వారికి తగిన శిక్షలు విధిస్తుండేది. నిర్ణీతకాలం లోపున ఈ గ్రామ ప్రజలు, నేరం చేసిన వారి నుంచి జరిమానా వసూలు చేసే బాధ్యత, ఆ నేరం రుజువు కానప్పుడు దానికి సంబంధించిన జరిమానా సొమ్మును గ్రామమంతటిపై విధించే బాధ్యతను గూర్చి ఈ శాసనంలో వివరించ బడింది. నేరస్తుల్ని, నలభైయైదు రోజుల్లో కనుక్కొని, ఈ గ్రామ ప్రజలు వారికి తగిన శిక్ష విధించాలి. నేరస్థుల్ని పట్టుకోలేకపోతే ఈ గ్రామ ప్రజలు ప్రభుత్వానికి నూట ఇరవై ఐదు కాలందముల పరిమాణం గల బంగారాన్ని జరిమానా సొమ్ముగా చెల్లించాలి.

గ్రామంలోని వివిధ వృత్తులు-మాన్యాలు

గ్రామం మధ్యన వొక దేవాలయముండేది. బారులు తీర్చిన వీధులూ, రెండువైపులా యిళ్ళూ వుండేవి. ఊరి బయటవున్న పచ్చిక బీట్లో అందరి గొడ్లు మేపుకోవడానికి వీలుగా పశువుల బీడు వుండేది. ఈ బీడులో (గోభూమి) గ్రామం లోని పశువులన్నీ సాముదాయకంగా మేసేవి.

గ్రామంలో కమ్మరి, కుమ్మరి వడ్రంగి, చాకలి, మంగలి, గొల్ల, మాల, మాదిగ యిత్యాది వృత్తులకి చెందిన వారుండేవారు. వీరు గ్రామమాన్యాలు (మేరలు) అనుభవిస్తూ, గ్రామంలోని వారికి ఏడాది పొడుగునా అవసరమయ్యే పనిముట్లను చేసి యిచ్చేవారు. గ్రామానికి ఉమ్మడిగా చెందిన అడవుల్ని గ్రామ ప్రజలంతా సాముదాయకంగా వాడుకోవచ్చు. గ్రామంలోని పశువులు, గ్రామ పొలిమేర దాటకుండా జాగ్రత్త పడడం, కావలివాని విధి. తప్పిపోయిన పశువుల్ని పట్టి తెచ్చి ,తిరిగి వాటి యజమానులకు అప్పగించడం అతని బాధ్యత. ఆ పశువు దొరక్కపోతే, దాని విలువను కావలివాడే యిచ్చుకోవాలి.

వ్యవసాయానికి అవసరమైన నాగలి, కొర్రు, బండిచక్రాలు, యింట్లో వాడుకొనే బల్లలూ, కావిడి పెట్టెలూ మొదలైనవాటిని వడ్రంగి తయారుచేసి యిచ్చేవాడు. ఊరివారికి కావలసిన కుండలూ చట్లూ యిత్యాదుల్ని కుమ్మరి చేసి యిచ్చేవాడు. బిందెలూ, చెంబులూ, గ్లాసులూ మొదలైనవాటిని కమ్మరి తయారుచేసేవాడు.

చేటలూ, బుట్టలూ, జల్లలూ, గంపలూ, మొదలైనవాటిని మేదరి తయారుచేసి యిచ్చే వాడు. ఇంటి యజమానికి, పాలేరుతో సహా ఇంట్లోని వారందరికీ వొక్కో చెప్పుల జత చొప్పున యివ్వడం, చనిపోయిన గొడ్లను తీసు కెళ్ళడం, యిత్యాది పనుల్ని మాదిగ చేసేవాడు. చచ్చిన పశువుల చర్మాల్ని వొలిచి భద్రం చేసి, వాటి మాంసాన్ని ఆహారంగా గూడా ఈతడే వినియోగించేవాడు. రుగ్వేద కాలంలో యజ్ఞాలు చేసేప్పుడు, రకరకాల పశువుల్ని యజ్ఞ సమయం లో బ్రాహ్మలు చంపి ఇంద్రునికి బలిగా సమర్పిం చేవారు. యజ్ఞం పూర్తిచేయ బడిన తర్వాత, చంపబడ్డ ఆ పశువు యొక్క మాంసాన్ని తిని, చర్మాన్ని వొలిచి, దాన్ని రక రకాల పనులకి వినియోగించేవారు. అంచేత వృత్తి రీత్యా ఇండియాలోని ఆది మాదిగలు- బ్రాహ్మలే.

ఊళ్ళో చాటింపు వేయడం, కాటిలో అంత్య క్రియలు జరపడం యిత్యాది పనుల్ని వెట్టి చేసేవాడు.

గొర్రెలూ మేకలున్న రైతులు, వాటిని గొల్లవానికి వొప్పచెప్పగా, ఈతడు వాటిని పచ్చిక బీళ్ళలో మేపేవాడు. ఈనిన తర్వాత పిల్లల్లో సగ భాగం గొల్లకీ, మిగతా సగం రైతుకీ చెందేవి.

గ్రామం మొత్తానికీ వొకటి రెండు చాకలి కుటుంబాలు వుండేవి. ఈ కుటుంబాలవారు గ్రామంలోని యిళ్ళు పంచుకొని పిల్లాజెల్లకి చెందిన బట్టలన్నీ ఉతికేవారు.

ఉదయం-సాయం సంధ్యల్లో ఊరి దేవా లయంలో కుంభహారతులిచ్చి పూజాపునస్కా రాది కర్మకాండలో పాల్గొనడం, ఉత్సవసమయా లలో గజ్జెకట్టి నాట్యం చేయడం, మొదలైన విధుల్ని దేవదాసీలు నిర్వర్తించేవారు.

ఊరి ఉమ్మడి జీవితానికి అవసరమైన పని ముట్లను తయారుచేసి యిచ్చినందుకు కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, సాలి, చాకలి, మంగలి, మాదిగలకు మేరలుండేవి. అంటే - పంటల కాలంలో ఈ వివిధ వృత్తులవారికి ఒప్పుకొన్న మేరకు, రైతులు తమ కల్లాల్లోని ధాన్యాన్ని యిన్ని బస్తాల చొప్పున యిచ్చేవారు. వాటితో పాటు మిరపకాయలూ, పెసలూ, మినుములూ, కందులూ,పొలంలో ఏవి పండితే వాటిని యిన్ని బుట్టల కింద లెక్క ప్రకారం యిచ్చేవారు.

మొత్తం ధాన్యం రాసిపోసి, దానిపై మూడు రాళ్ళు పెట్టి, తర్వాత కొబ్బరికాయ కొట్టి, పూజచేసి పొలి పెట్టేవారు. (అంటే పొలికేక వేసే వారు.) అనంతరమే వ్యవసాయం పనులు ప్రారంభించేవారు. ఇంటి మాదిగ కల్లం చేసేవాడు. ఇతడు చెక్కుతీసి, చదునుచేసి, నీళ్ళు జల్లి, కల్లం చేసేవాడు. ధాన్యం కొట్టేప్పుడూ, తొక్కేప్పుడూ, తూర్పారబట్టేప్పుడూ, చెరిగేప్పుడూ, ఇంటిమాదిగ అన్నిదశల్లోనూ రైతుకు సహకరిం చేవాడు. నూర్పిళ్ళ తర్వాత మిగిలిన కంకులూ, కిందపడ్డ పరిగగింజలూ, అన్ని యితనికే చెందేవి. ఇంటిపాతర ఇతడే తీసేవాడు. ధాన్యాన్ని పాతర్లో యితడే పోసేవాడు. ఈ రకమైన కులవృత్తుల నిర్వహణలో, ఆనాడు ప్రాంత ప్రాంతానికి తేడాలు గూడా వుండేవి.

పాతట్లో ధాన్యం పోసేప్పుడు, ఇంటి ఆడ పడుచులు ఎన్ని గింజలు మోయగల్గుతారో, అన్ని గింజల్ని-రైతు వారికిచ్చేవాడు. వీటినే తవ్వ గంపలు-అని పిలుస్తారు. ఈ గింజల్తో, ఇంట్లోని ఆడపిల్లలు గుడ్డలు కుట్టించుకొని, తినేవి కొనుక్కొనేవారు.

ధాన్యాన్ని ఇంతకి ఇంత చొప్పున యిచ్చి - లేదా-ఎత్తుకి ఎత్తువేసి, బెల్లం, చిలకడ దుంపలు, ఉల్లిపాయలు, దోసకాయలు యిత్యాది వాటిని కొనుక్కొనేవారు. జొన్నలు, పత్తి యిట్లాంటి వాటిని వస్తు మారకం చేసేవారు. (ఉదా॥ ఇన్ని శేర్ల జొన్నలకి, ఇన్ని వీశెల బెల్లం)

మాన్యాలు

క్రీశ. 16వ శతాబ్దంలో "దగ్గోజి" అను కమ్మరి పేరుతో "నాగోజి" అను వడ్రంగి పేరుతో పంచి యిచ్చిన భూముల పట్టాలున్నవి. వాటిలో ఇంత నంజ, ఇంత పుంజ అని చెప్పబడింది. ఈ గ్రామ మాన్యాలు పొందినందుకు, వీరు గ్రామంలోని ప్రజలకి నౌకరీ చేయాలి. కమ్మరికి కొంత పల్లపుభూమి, కొంత మెరకభూమి వుండేది. నాల్గు తూముల గింజలు జల్లేంత భూమి యివ్వబడేది. (తూము అంటే 32 మానికల గింజలు - ధాన్యం) పల్లపు భూమి కాలవ నీటి ద్వారా సాగుచేయబడేది.

"మార్పులేని వృత్తి విభజనకే అంకితమై, మత మౌఢ్యానికి కట్టుబడి, శతాబ్దాల సాంప్ర దాయిక నియమనిబంధనలకు లోబడి, ప్రాచీన భారత గ్రామీణవ్యవస్థ స్వీయశక్తి సామర్థ్యాల్ని కోల్పోయింది" - అని మార్క్స్ అన్నాడు. (మార్క్స్ - భారత దేశంపై వ్యాసాలు)

ప్రతి కులమూ వొక వృత్తికి కట్టుబడి వుండడమే కులవ్యవస్థలోని మూలతత్వం. ప్రతి కులమూ-ప్రధానంగా సంఘంలోని శ్రమ విభజ నను సూచిస్తుంది. ప్రతికులమూ చేతివృత్తులూ, వ్యవసాయం, యిత్యాది వాటి ద్వారా ఉత్పత్తి క్రమంలో తన భాగాన్ని తాను పొందింది. ఆ విధంగా అదే వృత్తికి ఆ కులం అంటిపెట్టుకొని పోయింది. ఈ క్రమంలో వినియోగించే ఉత్పత్తి సాధనాలు ఎలాంటివంటే, ఉత్పత్తిదారుడే స్వయంగా వాటిని వాడగలడు. తద్వారా అతడు గానీ, లేదా కుటుంబ పద్ధతిపై గానీ, అతడు సొంతం చేసుకుంటాడు. ఈ విధంగా ఉత్పత్తికి-కుటుంబమే ప్రాతిపదికగా తయారైంది. కాల క్రమేణా ప్రతివాడూ తన వృత్తిలో శారీరక-మేధో నైపుణ్యం సంపాదించాడు. దైనందిన శ్రమలో ఈ చేతి పనిముట్లను అదే పనిగా వాడడం వల్ల, ఈ నైపుణ్యం వొక తరం నించి మరో తరానికి సంక్రమించింది. ఈ నైపుణ్యం ఎంతగా పెరిగితే, అదనపు సంపద అంత (Surplus Produce) అధికంగా ఉత్పత్తి చేయబడింది. ఈ అదనపు సంపద బ్రాహ్మణ -క్షత్రియుల సంపదగా మారి, వారి భోగ భాగ్యాలకీ, విందులూ, జూదాలకీ, యుద్ధాలూ దండ యాత్రలకీ వినియోగించబడింది.

ఈ విధంగా ఉత్పత్తిదారునీ, అతని కుటుం బాన్నీ, జీవితాంతం వొకే కులవృత్తికి కట్టుబడి వుండేట్లు చేయడం; కుల కట్టుబాట్లకి అతడు విధేయుడుగా వుండడం; అతని గొడ్డు చాకిరీపై ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం; బ్రాహ్మలకీ, రాజులకీ, కులనాయకులకీ, సాంఘిక వ్యవస్థకీ అత్యవసరమైంది.

వేల ఏళ్ళ కులపద్ధతికి చెందిన ఉత్పత్తి క్రమంలో, ఉత్పత్తిసాధనాలు ముతకగానే వుండి పోయాయి. క్రమేణా వృద్ధిజెందే ఉత్పాదక శక్తీ వస్తు సౌందర్యమూ, తత్ఫలితంగా లభించే అదనపుసంపదా, ఉత్పత్తిదారుని నేర్పులో స్వతహాగా వున్నట్టివే. ఈ ఉత్పత్తి సాధనాలు ఆసియాలో గాని, ఇండియాలో గాని ఎలాంటి విప్లవకర మార్పునూ పొందలేదు. ఢక్కా- కాశ్మీర్ లోని సాలెవారి వేల్ళూ-గోళ్ళూ-వారి నైపుణ్యాన్ని పెంచాయి గాని; వారు ఉపయో గించిన మగ్గమూ, ఆసూ వారి నేర్పును ఏ మాత్రం వృద్ధిజేయలేదు. ఇలాంటి ఉత్పత్తి విధానం యూరప్‌లో గూడా వృద్ధి చెందింది. అక్కడ ఈ విధానం వృత్తి సంఘాల్ని అభివృద్ధి జేసింది. అయితే ఆ వృత్తి సంఘాలు ఇండియాలో మాదిరిగా కులాలుగా మారలేదు.

ఆనాడు భూమిపై యాజమాన్యం ప్రభుత్వం చేతిలోనే వుండేది. అంటే - ఆనాటికి భూమి స్వంత ఆస్తిగా మారలేదు. కుటుంబ శ్రమతో భూఖండాలు సాగుజేసినా, భూమి మాత్రం సమిష్టి గానే వుండేది. ఆ కుటుంబ కమతాలు గూడా పరిమితిలేని కుటుంబ ఆస్తిగా మారడం ఆనాడు సాధ్యంగాదు. జైమిని సూత్రాలూ, భాష్యాలూ, ఈ అంశం గూర్చి వివరించాయి. ప్రతి కుల - కుటుంబానికి తమ సాగుభూమి, వృత్తి పనివారికి చేతివృత్తి విధిగా ఉండేవి. ఈ సమిష్టి భూమి, వ్యవసాయ-చేతివృత్తుల వారి ఐక్యతా; వొక స్థిరత్వాన్నీ, అవిచ్ఛిన్నతనీ, నైపుణ్యాన్నీ, ఉత్పాదక శక్తినీ, కులవిభజన ప్రాతిపదికపై శ్రమవిభజననీ ప్రాచీన భారత సంఘంలో అవకాశం కల్గిం చాయి. కరువులూ, యుద్ధాలూ సంభవించినా, గ్రామాలకు గ్రామాలే మూలమట్టమైపోయినా, గ్రామంలోని సమస్త కులాలవారూ మరోచోటికి వలస పోయేవారు. బ్రాహ్మణ- క్షత్రియులూ, మిగతా కులాలవారూ, ఈ కొత్తచోట మళ్ళీ తయారయ్యేవారు; దారిద్ర్యం అంచు కింద నాటి వారు జీవించినా, ఈ రకమైన విధానంలో ఎవ్వరూ పనిలేక మాడి చచ్చేవారు మాత్రం కాదు.

నాటి గ్రామీణ జీవితాన్ని పటిష్టంగానే గాక, మరింత కర్కశంగా మార్చిన మరో ఆర్థిక సూత్రమేమంటే-ఏ కులవృత్తికి చెందిన వ్యక్తి ఉత్పత్తి చేసిన వస్తూవూ, వర్తకపు సరుకుగా మారి, ఆ ఊరు దాటిపోయేది గాదు. అయితే ఆ వస్తువులు విభిన్న కులవృత్తులకి చెందిన వారి మధ్య మారకమయ్యేవి. ఆనాటి వారు వస్తువుల్ని వాడకం కోసమేగాని, అమ్మకం కోసం ఎన్నడు తయారుచేసేవారు కాదు. బ్రాహ్మల యజ్ఞయాగాదికర్మ కాండ, (బ్రహ్మ కర్మ) " క్షత్రియుల" సంఘరక్షణ, (క్షత్ర కర్మ) నాటి సాంఘిక ఉత్పత్తి క్రమంలో ఎందుకూ ఉపకరించేవి కావు. అయితే సంఘం ఉత్పత్తి జేసిన మొత్తంలో వీరిద్దరికి వాటాలు పంచుకోవ డానికి మాత్రం హక్కు వుండేది. పీడిత కులాలు ఉత్పత్తి జేసిన అదనపు సంపదను, పీడక కులాలు యధేచ్ఛగా దోచుకతినేవి.

నాటి రుష్యాశ్రమాలు, సన్యాసానికి మాత్రమే కేంద్రాలు కావు. విపరీతంగా సంపద పోగుపడి నప్పుడు, బ్రాహ్మణ- క్షత్రియ అగ్రవర్ణాలకి చెందిన దోపిడీ పాలకవర్గాలు, వొకరి పశువుల మందల్ని మరొకరూ, వొకరి ఆహార నిల్వల్ని యింకొకరూ, అలాగే అటవీ సంపదల్ని- శూద్ర బానిసల్నీ కొల్లగొట్టడానికి బాహా బాహీ ముష్టా ముష్టి యుద్ధం జేసి, కాట్లకుక్కల్లా పోట్లాడుకునే వారు. హైహయ -ఫృధువైణ్యం- కార్త వీర్యార్జు నుల మధ్యనే గాక, బ్రాహ్మణ- క్షత్రియుల మధ్య గూడా సంపదను దోపిడీ జేసేందుకు భయంకర మైన యుద్ధాలు జరిగాయి.

వర్ణ వ్యవస్థపై ప్రధానంగా జరిగిన తిరుగు బాటే- జైన - బౌద్ధ- మతాల అవతరణ యని అనడం ఏ మాత్రం అతిశయోక్తి గాదు, బాని సత్వం పై సైద్ధాంతిక ప్రతిఘటన, ఈ మతాల్లో కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. ఉపనిషత్తులు బోధించిన ఆస్తికత్వాన్ని కొంతమేరకు తిరస్కరించి, భౌతికవాద ఆలోచనాధోరణిని ఈ మతాలు స్వీకరించాయి.

స్వయం సంపూర్ణ గ్రామ వ్యవస్థ, ఉత్పత్తి, విధానం యొక్క ప్రధమ దశలోనే నిలిచి పోయింది. వర్ణ వ్యవస్థ అంతరించాలంటే, స్వయం సంపూర్ణ గ్రామ వ్యవస్థ అంతరించాలి. ప్రధమ దశలోనే ఆగిపోయిన ఉత్పత్తి విధానం, యంత్ర సహాయం ద్వారా విస్తృతం కావాలి. ఇది జరిగినప్పుడు ప్యూడల్ - భూస్వామ్య వ్యవస్థ అంతరిస్తుంది. దానితో పాటు కుల వ్యవస్థ సైతం నాశనమువుతుంది.

బ్రిటీష్‌వారు మనదేశానికి వొచ్చి, మన చేతి వృత్తుల్ని నాశనం చేయడం ద్వారా, స్వయం సంపూర్ణ గ్రామవ్యవస్థనీ, దానితో పెనవేసుకొన్న వర్ణ వ్యవస్థన్నీ ధ్వంసం చేయడం వల్ల, వారు దేశంలో వొక విప్లవాన్ని తెచ్చి, ఇండియాకి మహోపకారం చేశారని మార్క్స్ అన్నాడు.

(మార్క్స్-ఎంగెల్స్‌ల ఉత్తర ప్రత్యుత్తరాలు- వాల్యుం.1. పేజీ 587)

ప్రాచీన భారతీయ సామాజిక పరివర్తనను గూర్చి మార్క్సిస్టు దృక్పథంతో ఇంకా సమగ్ర మైన పరిశోధన జరగలేదు. కొశాంబి వంటి పండితులు కొంత తడిమారు. కాని ఇందు కోసం మెసపొటేమియా, పెర్షియా, గ్రీస్ దేశాల సమాజ చరిత్రను కూడా అధ్యయనం చేయడం అవసరం. వీటి ప్రభావం మన దేశంపై, మన సమాజంపై ఎంత వరకు పండిందనేది చూడాలి. అప్పుడే మార్క్సిస్టు దృష్టితో పరిశీలించడం సాధ్యమవుతుంది.

సమాజ పరిణామాన్ని గూర్చి ఎంగెల్స్ యిచ్చిన వివరణ ప్రధానంగా యూరోపియన్ సమాజానికే వర్తిస్తుంది అని కొందరు అంటు న్నారు. భారతదేశంలో సమాజపరిణామం, యూరప్‌లో జరిగినట్లు జరగలేదు. అంచేతనే మార్క్స్ దీన్ని "ఆసియాఖండ వ్యవస్థ" (ఏషియా టిక్ సొసైటీ) అని అన్నాడు అంటూ కొందరు వాదిస్తున్నారు. గ్రామీణ స్వయంపోషక ఆర్థిక విధానమూ, చేతివృత్తులూ పునాదిగా గ్రామాలు వుండేవనీ; ఈ వృత్తులన్నింటిని గ్రామ సముదాయమే సమిష్టిగా పోషిస్తూ వుండేదని ఆయన చెప్పాడు. ఇదే - వేల ఏళ్ళుగా, ఆసియా ఖండవ్యవస్థ ఎదుగూ బొదుగూ లేకుండా వుండడానికి కారణమని మార్క్స్ అన్నాడు. "రాజకీయాకాశంలో ఎన్ని తుఫాన్ మేఘాలు కమ్మినా, సమాజం యొక్క ఆర్థిక జీవన కట్టడం మాత్రం వీటిచే స్పృశించబడలేదు" - అని ఆయన చెప్పాడు. ఇంతకు మించి ఆయన వివరాల్లోకి పోలేదు. ఇందుకోసం ఆయన ప్రయత్నం సైతం చేసినట్లు కన్పించదు. అసలు- ఏషియాటిక్ సొసైటీ అంటే ఏమిటి అనే అంశాన్ని గూర్చి ప్రస్తుతం సోవియట్ చరిత్ర కారులు గూడా చర్చిస్తున్నారు. మన దేశంలో గూడా యీ చర్చ ప్రారంభమైంది. ✦

మార్గం ఒక అగ్నిశిఖ

- ముత్యాల ప్రసాద్

పిడికెడు మట్టీ కడివెడు దుఃఖం
పేరుకున్న మార్గం అది
నిప్పులు రువ్వుతూ నిలబడ్డ సూర్యుడి
చిరునామా అది

ఈ మార్గం ఒక అగ్ని శిఖ
ఈ మార్గం ఒక జనసైన్యం
ఈ మార్గం నిత్య చైత్రగాత్రం
ఈ మార్గం నవ్య సృజన బీజం

స్వాతంత్రోద్యమ కాలంలో రైతు సంఘ ఆశయం - రైతు ఉద్యమ వ్యాప్తి

కా॥ వై.వి. కృష్ణారావు

రైతుసంఘ ఆశయం

మహాసభ ఆమోదించిన ప్రధాన తీర్మానం లో రైతుసంఘ ఉద్దేశాలు, లక్ష్యాలు నిర్వచించడం తో పాటు; తక్షణ, దీర్ఘకాల కార్యక్రమాన్ని వివరించడం జరిగింది.

" కార్మిక కర్షకులను ఏ విధమైన దోపిడీ చేయని సంపూర్ణ ఆర్థిక, రాజకీయ, స్వాతంత్ర్యం కావాలని కిసాన్ సభ తీర్మానించింది. ఉత్పత్తికి కారకులైన ప్రజానీకం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించుట ద్వారా; ఆర్థిక, రాజకీయ అధికారం కష్టించి పనిచేసే శ్రమజీవులు పొందగల్గుతారని తీర్మానించారు. ఈ ఆశయాన్ని నెరవేర్చుటకు దైనందిన ఆర్థిక సమస్యలపై పోరాడాలని స్పష్టం చేశారు. రైతులు, శ్రమజీవులు దైనందిన కోర్కెలు నెరవేర్చుకొనుటకు జరిపే పోరాటం దేశ స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా రూపొందుతుందని రైతు సంఘ ప్రణాళిక లో విశదీకరిం చారు. ఆనాటి ప్రభుత్వ యంత్రాం గంలో శ్రమజీవుల కోర్కెలు నెరవేరక పోవచ్చునని, అందువల్లవారు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటా రని స్పష్టం చేశారు. ఈ ప్రణాళికలో 37 కోర్కెలు రూపొందించి, 1936 సెప్టెంబరు 1వ తేదీన రైతాంగపు ఆమోదానికి పెట్టారు. ఆనాటినుండి సెప్టెంబరు 1వ తేదీ అఖిల భారత రైతు దినోత్సవంగా పరిగణింపబడుతోంది.

మహాసభలో రైతు సంఘ ప్రణాళికను రచించడానికి ఒక ఉపసంఘాన్ని నియమిం చారు. దానిని అటు తరువాత 1936 ఆగస్టులో జరిగిన ఎ.ఐ.కె.సి. సమావేశంలో ఆమోదించటం జరిగింది.

ఫెయిజ్‌పూర్ కాంగ్రెస్ మహాసభ ఆమోదిం చిన వ్యవసాయ కార్యక్రమాలపై రైతు సంఘ ప్రణాళిక ప్రభావం పడింది. లక్నో రైతు మహాసభ స్వామి సహజానందసరస్వతి అధ్యక్షుడుగానూ, యన్.జి.రంగాను ప్రధాన కార్యదర్శిగానూ ఎన్నుకొన్నది. వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో విస్తృతమైన ఎ.ఐ.కె.సి. ఎన్నుకోబడింది.

1937 జులైలో నియామత్‌పూర్‌లో జరిగిన ఎ.ఐ.కె.సి. సమావేశంలో ఎర్రజండా, అఖిల భారత రైతు సంఘ జండాగా ఆమోదించబడినది.

జాతీయ కాంగ్రెసు మహాసభ జరిగే సమయంలోనే 1936 డిశంబరు 25, 26 తేదీలలో ద్వితీయ అఖిల భారత రైతు మహాసభ ఫెయిజ్‌పూర్‌లో జరిగింది. ఆచార్య రంగా అధ్యక్షత వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ రైతు మహాసభకు హాజరై తన సందేశమిచ్చారు.

జాతీయ కాంగ్రెసు మహాసభ రైతాంగ కోర్కెల పై ఒక ముఖ్యమైన పత్రాన్ని ఫెయిజ్‌పూర్ మహాసభలో ఆమోదించింది. అటు తరువాత ప్రకటించిన ఎన్నికల ప్రణాళికలో ఈ కార్య క్రమంలోని ముఖ్యాంశాలు చేర్చబడ్డాయి.

(స్వాతంత్ర్యోద్యమ కాలంలో రైతుల సమస్యల గురించి, స్వాతంత్ర్యోద్యమం లో జతకలిసి రైతాంగాన్ని సంఘటిత పర్చడం గూర్చి వ్రాసిన వ్యాసమిది. సామ్రాజ్యవాదం, ఫ్యూడల్ జమిందారీ వర్గం రైతాంగాన్ని పీల్చిపిప్పి చేయడానికి వ్యతిరేకంగాను; కష్టజీవుల రాజ్యం సాధించాలనే లక్ష్యంతోను చేసిన కృషి ఈ వ్యాసంలో వివరించబడింది. అందులోంచి కొంతభాగాన్ని యిస్తున్నాం. ఈ వ్యాసం " రైతాంగ ఉద్యమాలు" నుంచి తీసుకోబడింది. శీర్షిక మాది-సంపాదకులు)

అయితే 1937 అసెంబ్లీ ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు మంత్రి వర్గాలు ఎన్నికల ప్రణాళికలలో రైతులకు వాగ్దానం చేసిన అనేక అంశాలను అమలుజరపడంలో ఘోరంగా విఫలమయ్యాయి.

మితవాదుల పోటీ సంఘాలు

అఖిల భారత రైతు సంఘ నాయకత్వాన దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ రైతు పోరా టాలు రావడం; రైతు సంఘ పలుకుబడి పెరగడం, కాంగ్రెసులోని సర్దార్ పటేల్, పురుషోత్తమదాస్ టాండన్‌లాంటి మితవాద వర్గానికి ఏమాత్రం గిట్టలేదు. రైతు సంఘ పలుకు బడిని దెబ్బకొట్టాలనే దుర్బుద్ధితో వీరిద్దరి నాయకత్వాన పోటీ రైతు సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తరప్రదేశ్ నాయకుడు పి.టి. టాండన్ నాయకత్వాన సంయుక్త కిసాన్‌సభ పేరుతో మరో పోటీ రైతు సంఘం స్థాపించబడింది.

అయితే ఈ రెండు సంఘాల ఆశయం రైతు పోరాటాలను నీళ్ళుగార్చడమే కాబట్టి, కొది కాలం తరువాత అవి పూర్తిగా రంగం నుండి అదృశ్యమయ్యాయి.

రైతు ఉద్యమ వ్యాప్తి

1936-39 సంవత్సరాలలో రైతు ఉద్యమం దేశంలోని నలుమూలలకు వ్యాపిం చింది. 1936 ఫెయిజ్‌పూర్ రెండవ మహా సభ, 1938 కొమిల్లాలో మూడవ మహాసభ, 1939 గయాలో నాల్గవ మహాసభ, 1940లో పలాసాలో 5వ మహాసభ జరిగాయి. ఈ కాలంలో రైతుసంఘం 18 లక్షల సభ్యత్వాన్ని కలిగి, అనేక రాష్ట్రాలలో బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిపింది.

1935 రాజ్యాంగ చట్టం ప్రకారం ఏర్పడిన మంత్రి వర్గాలపై ఈ ఉద్యమ ప్రభావం పడింది. కాంగ్రెసు మంత్రివర్గాలు కౌలుదారీ చట్టాలు తీసుకువచ్చాయి. కౌళ్ళరేట్లు తగ్గించుట, కొన్ని రకాల కౌలుదారులకు వంశపారంపర్య హక్కులు కల్పించుట కూడా జరిగాయి. బెంగాల్లో ఏర్పడిన ముస్లింలీగు మంత్రివర్గం, రైతాంగ పరిస్థితులను విచారించుటకై 'ఫ్లాడు' కమీషన్‌ను నియ మించింది. ఈ కమీషన్ తమ రిపోర్టులో జమీం దారీ విధానాన్ని రద్దు చేయాలని సూచించింది. రైతాంగం అనేక పోరాటాలు జరిపి ఈ ఫలితాల న్నింటిని సాధించింది.

ఈ కాలంలోనే కాంగ్రెసులోని మితవాదులు వర్గపోరాటం భారత సాంప్రదాయాలకే భిన్న మైనదని, ఎర్రజెండా భారతదేశంలో గందరగోళ పరిస్థితులు కల్పిస్తుందని వాదించారు. కిసాన్ సభ ఈ వాదనలను ఖండించింది. సామ్రాజ్య వాదాన్ని కూలదోయుటకు వర్గ పోరాటం తప్పనిసరి అని స్పష్టపరిచింది. కాంగ్రెస్ మిత వాదులు వేరుగా కిసాన్‌సభను నిర్మించుటవల్ల దేశంలో ఐక్యత దెబ్బ తింటుందనీ, జాతీ యోద్యమం బలహీనపడుతుందనీ కిసాన్‌సభ నాయకులు చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ కొంతకాలం నుండి చెపుతున్నట్లుగా కిసాన్‌సభను

కాంగ్రెస్‌కు అనుబంధశాఖగా చేర్చుకోవాలని కిసాన్‌సభ నాయకులు కోరారు. ఈ సమస్య లన్నింటిపై కిసాన్ సభ నాయకులు ఖచ్చితమైన సైద్ధాంతిక రాజకీయ వైఖరిని ప్రదర్శించుట వల్ల జాతీయోద్యమంలో భాగంగా గుర్తింపబడి, ఉద్యమానికి బాగా సహకరించింది.

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో రైతు ఉద్యమం తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. ప్రతి సంవత్సరం జరుపుకొనే సమావేశాలను రెండు సంవత్సరాల వరకూ జరుపుకొనలేకపోయింది. బ్రిటీషు సామ్రాజ్య వాదులు రైతునాయకులపై తీవ్రమైన దాడిని ప్రారంభించి, భారత రక్షణల చట్టం క్రింద అనేమంది రైతు నాయకులనుఅరెస్టు చేశారు. బెంగాల్, మరి కొన్ని యితర రాష్ట్రాలలో దారుణమైన కరువును ఎదుర్కొనవలసి వచ్చింది. ఈ కరువు వల్ల మొత్తం 30 లక్షల మంది మరణించారు. అవినీతి, దొంగ వ్యాపారం విలయతాండవం చేశాయి. గ్రామీణ జీవితం విచ్ఛిన్నమైపోయి కిసాన్ సభ కార్య కలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీనికి ప్రధానంగా రెండు కారణాలున్నాయి. మొదటిది- కిసాన్ సభలో భాగంగా ఉన్న కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, ఫ్యార్వర్డు బ్లాకు నాయకులు యుద్ధం పట్ల తీసుకొనవలసిన వైఖరిపై భేదించి కిసాన్‌సభను వదిలిపోయారు. రెండవది-కొంతమంది అతివాద కాంగ్రెస్ నాయకులు కూడా రైతు సంఘం వదలి వెళ్ళిపోయారు. ఈ రెండు చీలికల వల్ల రైతు ఉద్యమం కొంత బలహీనపడింది.

కిసాన్‌సభ నాయకత్వం అతి చాకచక్యంతో వ్యవహరించి, ప్రజలతో సంబంధాలు పెంచు కొని దైనందిన కార్యకలాపాలలో పాల్గొన్నారు. తిరిగి కిసాన్‌సభ మహాసభలు 1942, 1943, 1944 సంవత్సరాలలో వరుసగా జరిగాయి. 1944లో మహాసభ విజయవాడలో చాలా బ్రహ్మాండంగా జరిగింది. లక్షమంది ప్రజలు హాజ రయ్యారు. 1945లో జరిగిన మహాసభ నాటికి కిసాన్‌సభ సభ్యత్వం 8 లక్షలకు పెరిగింది.

యుద్ధానంతరం వెల్లువ

యుద్ధానంతరకాలంలో భూమికోసం, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యాల కోసం తీవ్రమైన రైతాంగపు పోరాటాలు జరిగాయి. బెంగాల్లో తెబాగా ఉద్యమం, బీహారులో బకాస్తు ఉద్యమం, పెప్సు పంజాబులలో కౌలుదారుల పోరాటం, మహారాష్ట్రలో వర్లీ గిరిజన రైతుల పోరాటం, తమిళనాడులో కౌలుదారుల పోరాటం, కేరళలో పునప్రవాయిలార్ పోరాటం, వీరోచిత తెలంగాణా సాయుధపోరాటం జరిగాయి. 20వ శతాబ్దంలో కల్లా బ్రహ్మాండమైన రైతు ఉద్యమాలు ఈ దశలో జరిగాయి. భూస్వామ్య విధానాల పునాదులు కదల్పబడ్డాయి. తీవ్రమైన భూసంస్క రణలు అమలు చేస్తామని ప్రభుత్వాలు వాగ్దానాలు చేస్తూ కొన్ని చట్టాలు చేయవలసి వచ్చింది. అత్యధికంగా నష్టపరిహారాలు చెల్లించి అయినా సరే చట్టపరమైన భూస్వామ్య విధానాన్ని రద్దు చేయవలసి వచ్చింది. ఈ పరిస్థితులను చూసి పాలక వర్గాలు భూదానోద్యమాన్ని ప్రారంభిం చాయి. 1948-51 మధ్య కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్‌సభ కార్యకర్తలపై దారుణమైన హింసాకాండను ప్రయోగించి వేల మందిని హత్యచేశారు. వేలమందిని నిర్భంధం లో వుంచారు. రైతు ఉద్యమాన్ని అణచడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. కాని చివరకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు భూగరిష్ఠ పరిమితి సూత్రాలను అంగీకరించక తప్పలేదు.

1954-64 వరకూ రైతు ఉద్యమం భూసంస్కరణల కోసం వ్యవసాయ భూము లకు గరిష్ఠ పరిమితి విధించుటకు కృషి చేసింది. దీనితోపాటు అధికపన్నుల భారానికి వ్యతిరేకంగా, రైతులకు గిట్టుబాటు ధరల కొరకు ఆందోళన చేసింది. ఆ ఆందోళనా కార్యకలాపాల వల్ల తిరిగి కిసాన్‌సభ తన స్థానాన్ని నిలబెట్టుకొని, 15 లక్షల సభ్యత్వాన్ని చేకూర్చుకొంది. 1946-47 సంవత్సరంలో సోషలిస్టులు కిసాన్ పంచాయత్‌ను ప్రారంభించారు. కాని అది గాలిబుడగలాగా అంతరించింది.

1961లో కేరళ రాష్ట్రంలోని తిరుచూరులో అఖిల భారత రైతుసంఘ రజతోత్సవ మహా సభ జరిగింది. భారత కమ్యూనిస్టుపార్టీతో తలెత్తిన విభేదాల ప్రభావం రైతు సంఘ కార్య కలాపాల పైన, నిర్మాణంపైన పడింది. ఈ కారణంగా తిరుచూరు మహాసభ తరువాత అఖిలభారత రైతు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంఘాన్ని సక్రమంగా పని చేయించలేదు.అఖిలభారత స్థాయిలో దాదాపు స్తంభించిపోయాయి.

1967 చివరలో అఖిలభారత రైతు సంఘాన్ని తిరిగి పనిచేయించడానికి ఎ.ఐ.కె.సి. లోని మెజారిటీ సభ్యులు పూనుకున్నారు. ఢిల్లీలో జరిగిన ఎ.ఐ.కె.సి. సమావేశంలో సంఘ వైస్ ప్రెసిడెంట్ ఆయిన శ్రీ వై.వి.కృష్ణారావును తాత్కాలిక అధ్యక్షుడుగాను, జడ్.ఎ. అహమ్మదు ను ప్రధాన కార్యదర్శిగాను ఎన్నుకోవడం జరిగింది.

1968లో 19వ కిసాన్ మహాసభ అమరావతిలో జరిగింది. తరువాత బరాసత్ లోనూ, భటిండాలోనూ కిసాన్ మహాసభలు జరిగాయి. 1979లో 22వ రైతు మహాసభ విజయవాడలో జరిగింది. సభ్యత్వం తిరిగి పునరుద్ధరించబడింది. ఈ కాలంలో కిసాన్ సభ అనేక పోరాటాలు జరిపింది. భూగరిష్ఠ పరిమితి అమలు జరుపుటకు, అదనపు భూమిని పంచుటకు తీవ్రమైన ఆందోళన చేసింది. 1970లో బంజరుభూముల ఆక్రమ ణోద్యమాన్ని నడిపింది.

గిట్టుబాటు ధరలకై పోరాటాలు

వ్యవసాయంలో ఈ కాలంలో పెద్ద మార్పులు వచ్చాయి. అర్ధఫ్యూడల్ దోపిడీ విధానాలు కొనసాగుతున్నాయి. అదే సమయం లో వ్యవసాయం అంతకంతకు వ్యాపారీకరణ గుణం సంతరించుకొంటున్నది. వ్యవసాయ పంటలు మార్కెట్టుకై ఉద్దేశించి పండించ బడుతున్నాయి.

గ్రామీణ మార్కెట్‌పై గుత్తవ్యాపారుల, పరిశ్రమాధిపతులు ఆధిపత్యం ఏర్పడింది. రైతు పంటలకు గిట్టుబాటు అయిన ధరను నిర్ణయించి, ఆ ధరలకు ప్రభుత్వమే కొనేపద్ధతి లేనందున, మార్కెట్టు ఒడిదుడుకులతో రైతులు దెబ్బ తింటున్నారు. రైతు పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. పెట్టుబడిదారీ మార్కెట్ సంబంధాలలో రైతులు నష్టపోతున్నారు. పారిశ్రామిక వస్తువుల ధరలకు, రైతు పంటల ధరలకు మధ్య వ్యత్యాసం బాగా పెరిగి పోయింది. గిట్టుబాటు ధరల సమస్య రైతులకు జీవన్మరణ సమస్యగా తయారైంది.

ఈ సమస్యపై 1979, 1980, 1981 సంవత్సరాలలో రాష్ట్ర వ్యాపిత ఉద్యమాలు అనేక రాష్ట్రాలలో నడిచాయి.

ఆంధ్రలో రైతుల వీరోచిత పోరాటాలు

1920 సహాయ నిరాకరణోద్యమంలో రైతాంగం అనేక రాష్ట్రాలలో పాల్గొంది. ఈ పోరాటాలు కొన్ని రాష్ట్రాలలో శిస్తు నిరాకర ణోద్యమంగా రూపొందాయి. అటు తర్వాత రైతు సంఘాల నిర్మాణం ప్రారంభమైంది.

ఆంధ్రప్రదేశ్‌లో 1923లోనే గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలో జిల్లా

సంఘాలు ఏర్పడ్డాయి. 1928లోనే రాష్ట్ర రైతు సంఘం ఏర్పడింది.

1931- 32 సంవత్సరాలలో కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలలో బ్రిటిష్ ప్రభుత్వం పెంచిన రీసెటిల్‌మెంటు రేట్లకు వ్యతిరేకంగా ఉద్యమం సాగింది. 1928 నుండి జమీన్ రైతుల ఉద్యమం సంఘటిత రూపం తీసుకున్నది.

1936లో అఖిల భారత కిసాన్‌సభ ఏర్పడిన తరువాత దేశమంతటా రైతాంగాన్ని స్వాతంత్ర్యపోరాటం కొరకు, వారి వర్గ హక్కుల సాధన కొరకు సమీకరించటం జరిగింది.

ఆంధ్రప్రాంతంలోని జమీందారు, మొఖాసాదార్ల దౌర్జన్యాలు, అక్రమాలకు వ్యతిరేకంగా; ఆ ఫ్యూడల్ వ్యవస్థ రద్దుకు అనేక పోరాటాలు జరిగాయి. వీటిలో మునగాల, కాశీపట్నం, గోపాలపురం, చల్లపల్లి, వెంకటగిరి, మందసా జమీందార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు ఎంతో ముఖ్యమైనవి.

ఆంధ్ర రైతు ఉద్యమ చరిత్రలో 1937లో ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు జరిగిన రైతు రక్షణయాత్ర చారిత్రాత్మకమైనదని చెప్పవచ్చు.

1944 విజయవాడలో జరిగిన అఖిల భారత రైతు మహాసభకు గల విశేష ప్రాముఖ్యాన్ని ఎవరూ విస్మరించలేరు.

అదే ఏడాది రాష్ట్ర రైతు సంఘ ఆధ్వర్యాన జరిగిన కృష్ణకాల్వల మరమ్మత్తులు, రాయల సీమ, ఉత్తర విశాఖలో జరిగిన కరువు నివారణ కృషి ప్రజానీకం మన్ననలు పొందాయి.

1948-51 మధ్యకాలంలో రాష్ట్ర రైతు సంఘాన్ని మద్రాసు ప్రభుత్వం నిషేధించింది. అనేకమంది రైతు కార్యకర్తలు జైళ్ళలో నిర్బంధించబడ్డారు. మరికొందరు రహస్య జీవితాన్ని గడపవలసి వచ్చింది. ఎంతోమంది తమ ప్రాణాలను బలిదానం చేశారు.

1951లో రాయలసీమలో వచ్చిన భయంకర కరువు సందర్భంలో 'ఐక్య క్షామ నివారణ కమిటీ' ని పెట్టి కరువునివారణ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం గణనీయమైన కృషి చేసింది.

కృష్ణా, పెన్నారు ప్రాజెక్టుల ద్వారా నదీజలాలను తమిళనాడులోని సుదూర ప్రాంతాలకు తీసుకెళ్ళడానికి ఆనాటి మద్రాసు ప్రభుత్వం తలపెట్టిన పథకాన్ని తెలుగు ప్రజానీకం వ్యతిరేకించింది.కృష్ణాజలాల సమగ్రాభివృద్ధికి సిదేశ్వరం, నందికొండ, పులిచింతల ప్రాజెక్టులను నిర్మించాలని బ్రహ్మాండమైన ఆందోళన చేసి విజయాన్ని సాధించింది.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రానికి, విశాలాంధ్ర నిర్మాణానికి సాగిన మహోద్యమంలో రైతు సంఘాలు సముచిత పాత్ర వహించాయి...

1956 ఆంధ్ర-తెలంగాణా ప్రాంతాలు కలిసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆ ఏడాదే రెండు ప్రాంతాలలోని రైతు సంఘాలు సంలీనమై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంగా ఏర్పడటం జరిగింది.

రైతు యాత్రలు

రైతు సంఘ ఆధ్వర్యాన ఆయా సమయాలలో శాసనసభ వద్దకు జరిగిన యాత్రలలో 1947లో (జమీందారీలు రద్దు) సమస్యపై మద్రాసు వెళ్ళిన రైతుయాత్రను; 1954లో అదనపు పన్నులకు వ్యతిరేకంగా, బంజరు భూముల పంపకం కోరుతూ కర్నూలులో శాసనసభ వద్దకు వెళ్ళిన రైతుకూలీల యాత్రను; 1962లో అదనపుశిస్తును వ్యతిరేకిస్తూ హైదరాబాదు శాసనసభ వద్దకు వెళ్ళిన రైతుల యాత్రను; 1972లో భూ సంస్కరణల సమస్యపై హైద్రాబాద్‌లో జరిగిన రైతు, కూలీల యాత్రలు ముఖ్యంగా పేర్కొనదగినవి.

1964లో అదనపుశిస్తు చట్టాన్ని ఉపసంహరించు కోవాలని రాష్ట్రంలోని, జిల్లా, తాలూకా ఆఫీసుల ముందు రైతుస్త్రీలు, పురుషులు, పెద్ద ఎత్తున సత్యాగ్రహపోరాటం చేసారు.

1970లో దేశవ్యాపితంగా జరిగిన భూ ఆక్రమణ పోరాటంలో అఖిల భారత కిసాన్ సభ, రాష్ట్ర రైతు సంఘం పాల్గొన్నాయి.

1979లో 22వ అఖిల భారత రైతు మహాసభను విజయవాడలో జయప్రదంగా నిర్వహించటం జరిగింది.

వ్యవసాయపంటల ధరలు బాగా పడిపోయి, రైతులు నానావస్థలు పడుతుంటే; ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ మర్రి చెన్నారెడ్డి వ్యవసాయ ఫలసాయంపై పన్ను వసూలు చేయాలని చూశాడు. ఈ పన్నులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్వహించి విజయం సాధించడం జరిగింది.

1980-81 సంవత్సరాలలో వ్యవసాయ పంటల ధరలు బాగా పడిపోయి, రైతులపై రుణభారం బాగా పెరిగిన సందర్భంలో గిట్టుబాటు ధరలకోసం, పేరుకుపోయిన అప్పుల రద్దుకు అఖిలపక్ష ఉద్యమంలో రైతుసంఘం ప్రధాన పాత్ర వహించి పోరాటం జరిపింది.

విద్యుచ్ఛక్తి యూనిటురేటు గాక, ఆశ్వికశక్తిని బట్టి రేటు విధించాలని పోరాడి విజయం సాధించటం జరిగింది.

తెలుగుదేశం ప్రభుత్వం తలపెట్టిన నీటి తీరువా హెచ్చరింపుకు వ్యతిరేకంగా ఈనాడు ఉద్యమం కొనసాగుతోంది.

రైతులు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలు

ఈనాడు కూడా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలలో గిట్టుబాటు ధరలు సాధించటం అనేది ముఖ్యసమస్యగా వుంది.

నూతన వ్యవసాయానికి పెట్టుబడులు అధికంగా కావలసి వస్తోంది. నూటికి 6వంతులకు మించని వడ్డీపై రైతుకు అవసరమైనంత పరపతి సంస్థాగతంగా లభించినప్పుడే ప్రయివేటు వడ్డీవ్యాపారుల దోపిడీ, బెడద తప్పుతుంది.

అలాగే ఇర్రిగేషన్ సదుపాయాలు లేనిదే వ్యవసాయానికి, వ్యవసాయ ఉత్పత్తులకు స్థిరత్వం ఏర్పడదు. ఈ నాటికీ దేశం మొత్తం మీద సాగుభూమిలో నూటికి 30 వంతులకే, సేద్యపు నీటిసదుపాయాలు ఏర్పడ్డాయి. మిగతా 70 వంతుల భూమి ఋతుపవనాల దయా దాక్షిణ్యాలపై ఆధారపడవలసి వస్తోంది. ఈ పరిస్థితి మారాలి. పంటభూములకు అవకాశాలున్నంత మేరకు సేద్యపు నీటి సౌకర్యాలు కలిగించాలి. అతివృష్టి, అనావృష్టి, తుఫాన్లు, మొదలగు ఈతి బాధల వల్ల పంటలుపోయి; రైతాంగంపై అప్పులు పేరుకుపోయి వున్నాయి. చిన్నకారు, సన్నకారు రైతుల అప్పులు పూర్తిగా రద్దుకావాలి. మిగతావాటిని తగ్గించాలి.

భూసంస్కరణ చట్టాలు సక్రమంగా అమలు జరుగలేదు. అందువల్లనే నేటికీ వ్యవసాయంలో ఫ్యూడల్, అర్ధఫ్యూడల్ దోపిడీ కొనసాగుతోంది.గ్రామీణ ఆర్థిక విధానంపై సంపన్న వర్గాలపట్టు ఏర్పడింది. భూసంస్కరణలను నిజాయితీతో సక్రమంగా అమలుపరచాల్సి వుంది.

ఈ సమస్యలన్నింటి పరిష్కారానికి రైతు సంఘాలు కృషి చేస్తున్నాయి. ప్రధాన రాజీవ్ గాంధీ స్వేచ్ఛామార్కెట్టు విధానాన్ని అనుసరిస్తున్నారు. సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలకు దేశ కవాటాలను బాహాటంగా తెరవడం జరిగింది. ఇతర ప్రజాస్వామ్య వర్గాలతో కలిసి ఈ వర్గాలకు వ్యతిరేకంగా రైతాంగం పోరాడవలసి వుంది.

(తరువాయి 43వ పేజీ...) →

రెండవ ప్రపంచ యుద్ధానంతరం రైతు పోరాటాల విజృంభణ

- కామ్రేడ్ వై. వి. కృష్ణారావు

(రెండవ ప్రపంచ యుద్ధానంతరం, ముఖ్యంగా సంస్థానాలలో పెల్లుబికిన రైతాంగ పోరాట వెల్లువల గురించి; ఆ పోరాటాలు సాయుధ గెరిల్లా పోరాట రూపం ధరించడం గురించి ఈ వ్యాసం వివరిస్తుంది.)

-సంపాదకులు

రెండవ ప్రపంచ యుద్ధానంతరం దేశ మంతటా సామ్రాజ్యవాదులకు, వారి తొత్తు లయిన సంస్థానాధీశులు, జమీందార్లకు వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ప్రజా పోరాటాలు విజృంభించాయి.

బెంగాలులో రాష్ట్ర వ్యాపితంగా కవులు, రైతాంగము సాగించిన బ్రహ్మాండమైన తెభాగా పోరాటం; హైదరాబాదు, మైసూరు, తిరువాన్కూర్, కొచ్చిన్ మొదలగు సంస్థానాలలో సంస్థాన ప్రజలు సాగించిన పోరాటాలు; అందరికీ తెలిసినవే. సామ్రాజ్యవాదులపై బొంబాయి నావికులు చేసిన తిరుగుబాటు చారిత్రాత్మకమైనది.

"రజాకార్ల దాడులకు వ్యతిరేకంగా, నైజాం నవాబు గద్దెదిగాలని, విశాలాంధ్రలో ప్రజా రాజ్యం ఏర్పడాలని, భూస్వామ్య విధానం రుద్దు కావాలని" తెలంగాణా ప్రజానీకం సాగించిన చరిత్రాత్మక సాయుధ గెరిల్లాపోరాటం 1946 లోనే ప్రారంభమయింది.

ఈ ప్రజావిజృంభణ, తిరుబాటులో భాగం గానే ఆంధ్రప్రాంతములో జమీందార్లు, మొఖా సాదార్లకు వ్యతిరేకంగా రైతులు పోరాటాలు చేశారు.

1946 ఎన్నికల తరువాత తిరిగి మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెసు అధికారంలోకి వచ్చింది. శ్రీ టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రిగా కాంగ్రెసు మంత్రివర్గం అధికారంలోకి వచ్చింది. 1946 ఎన్నికలలో వాగ్దానం చేసిన విధంగా జమీందారీ విధానాన్ని రద్దు చేయాలని రైతాంగం డిమాండు చేసింది.కాని ప్రకాశం మంత్రి వర్గం ఈ విషయంలో తటపటా యించడం జరిగింది. 1939లో రాజీనామా యిచ్చి అధికారంలో నుంచి దిగపోవడానికి ముందుగా జమీందారీ విచారణ కమిటీ సిఫార్సుల ఆధారంగా తయారుచేసిన బిల్లును చట్టంగా తీసుకువచ్చి జమీందారీల రద్దును వాయిదావేయజూసింది ప్రకాశం మంత్రివర్గం.

జమీందార్లు, మొఖాసాదార్లు, ఈనాందార్లు ఎటూ ఎస్టేట్లు రద్దు అవుతాయని; దీపముండ గానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే దుర్బుద్ధితో అనేక అక్రమచర్యలకు పూనుకొన్నారు. రైతాంగాన్ని భూముల నుండి బేదఖలు చేయడానికి; సాముదాయక భూములను ఆక్రమించి స్వంతసేరీలుగా చెలామణి చేయించుకోవడానికి; అడవులను అన్యాక్రాంతంచేసి వీలయినంత డబ్బు కాజేయడానికి జమీందార్లు పూనుకొన్నారు.

నజరానాలు, శిస్తు బకాయిల వసూళ్ళ పేరుతో గ్రామాలపైబడి రైతాంగంపై దౌర్జన్యాలు సాగించారు.

లోగడ జమీందార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, చైతన్యవంతులయిన రైతాంగం మరింతగా సంఘటితమైయున్న సందర్భంలో జమీందార్లు తమ అక్రమాలను, అన్యాయాలను కొనసాగించటం అంత తేలికయిన విషయం గాదు. జమీందార్ల దౌర్జన్యాలను చిన్నా, పెద్దా, ప్రతి ఎస్టేటులోనూ రైతాంగం ప్రతిఘటించింది.

ఈ విధంగా రైతాంగం రెండురంగాలలో పోరాటం చేయవలసి వచ్చింది. జమీందార్ల అక్రమాలను ప్రతిఘటిస్తూనే; జమీందారీల రద్దుసమస్యపై రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరికి రైతాంగహక్కులను బలపర్చడానికి బదులు, జమీందార్ల వైపు మొగ్గుజూపే ధోరణికి వ్యతిరేకంగా రైతులు పోరాడారు.

పై కారణాల వల్ల మద్రాసు రాష్ట్రమంతటా, ముఖ్యంగా ఆంధ్రప్రాంతములో అటు వెంకట గిరి ఎస్టేటు మొదలుకొని ఇటు మందసా ఎస్టేటు వరకు అన్ని ఎస్టేట్లలోనూ రైతు సంఘ ఆధ్వర్యాన పోరాటాలు జరిగాయి. ప్రతి ఎస్టేట్ ఒక చిన్నపాటి యుద్ధరంగంగా తయారయింద నుటలో అతిశయోక్తిలేదు. న్యాయమైన హక్కుల కై పోరాడుతున్న రైతులపై ప్రభుత్వాధికార్లు 1441, 45 సెక్షన్లు జారీచేయడం; 107 సెక్షన్ క్రింద వేలమందిపై సెక్యూరిటీ కేసులు బనాయించటం; ఎస్టేట్లలో రిజర్వు పోలీసు బలగాలను దించడం జరిగింది. వేలమంది రైతులపై అక్రమ కేసులను పెట్టడం, అరెస్టు చేయటం జరిగింది.

రైతాంగ విజృంభణతో ప్రభుత్వం ఎస్టేట్లలో "రైతుల, కవులుదార్ల రక్షణచట్టాన్ని", " అడవుల అన్యాక్రాంత నిషేధపు చట్టాన్ని" తీసుకు వచ్చింది. కాని ఈ రెండు చట్టాలు రైతుల ప్రయోజనాలను కాపాడలేకపోయాయి. జమీందార్లకు ప్రభుత్వ లొంగుబాటు వైఖరితో పాటు, అధికార యంత్రాంగమంతా జమీందార్ల కనుకూలంగా పనిచేయటం జరిగింది.

చల్లపల్లి రైతుల పోరాటం

కృష్ణాజిల్లాలో చల్లపల్లి, మునగాల, గంపల గూడెం, జయంతి, వుయ్యూరు, యలమర్రు, మీర్జాపురం మొదలైన ఎస్టేట్లలో జమీందార్లు రైతుల భూములను, సాముదాయక భూము లను కాజేయడానికి; స్వంత సేరీలంటూ అమ్మేయడానికి; అడవులు అన్యాక్రాంతాలు చేయడానికి, నరకడానికి పెద్దఎత్తున పూను కోవటం జరిగింది.

చల్లపల్లి ఎస్టేటులోని పొదప్రోలు గ్రామ చెరువును ఆక్రమించుకోవడానికి జమీందారు చేసిన దుష్టయత్నాలను ఎదిరించినందుకు 17గురు రైతులను అరెస్టు చేశారు. గ్రామస్థు లెవరూ చెరువులో చేపలు పట్టకూడదని 144 సెక్షన్ జారీచేయబడినది. రిజర్వు పోలీసుల లాఠీచార్జీలో 12 మంది గాయపడ్డారు.

చల్లపల్లి ఎస్టేటులోని నడకుదురు గ్రామం క్రింద లేతలంక, నిమ్మగడ్డ క్రింది సీత పెడలంక, వెలివోలు క్రిందనున్న సుబ్బయ్య దిబ్బ,కాకిదిబ్బ, మేకిదిబ్బ, వెంకయ్య దిబ్బలలో

అనాది నుండి గ్రామస్తులు పశువులను సాముదాయకంగా మేపుకొనే వారు. కాని జమీందారు ఈ భూములను కాజేయాలనే దురుద్దేశ్యంతో పై లంకలలోకి రైతుల పశువులు ప్రవేశించకుండా 144 సెక్షన్ జారీ చేయించాడు.

నడకుదురు శివారు పొట్టిలంకలో 70 ఎకరాల రైతుల భూమి లోగడ నదీపాతమై తిరిగి తేలింది. తేలినప్పటి నుండి రైతులే సాగు చేస్తున్నారు. జమీందారు ఏజెంటు వేములపల్లి వెంకటనారాయణ దౌర్జన్యంగా రైతులను భూముల నుండి బేదఖలు చేయజూచాడు.

23-11-47న జిల్లా కలెక్టరు లంకలకు వచ్చి విచారించినమీదట రెల్లు లంకలలో బీదలు పాదులు పెట్టుకోనివ్వమని, పచ్చికలంకలలో రైతుల పశువులను మేపుకోనివ్వమని ఎస్టేటు వారికి సలహా యిచ్చారు. కాని ఆ సలహాను జమీలవారు పాటిస్తేగా?

పోతార్లంక, కిష్కింధపాలెం, తిప్పల కట్ట, జూలపాలెం, ఆముదాల్లంక, గాజుల్లంక గ్రామాలలో రైతులు అనాది సిద్ధంగా సాగు చేస్తున్నారు. 1946 లో రైతుల, కౌలుదార్ల రక్షణ చట్టం వచ్చాక రైతులను భూముల నుండి వెళ్ళగొట్టి, వాటిని కాజేయడానికి పూనుకున్నాడు జమీందారు.

1864 ఉప్పెనకు మాజేరు, బోగిరెడ్డి పల్లె, యాదర వగైరా గ్రామాలలో చనిపోయిన రైతుల భూములను చల్లపల్లి జమీందారు ఆక్రమించి స్వంత కమతంలో కలుపుకున్నాడు.

అలాగే గాజుల్లంక, పోతార్లంక మొదలగు గ్రామాలలో రైతుల భూములు కృష్ణానదిలో కలిసిపోయి, తిరిగి తేలినప్పుడు ఆ భూములు ఆక్రమించి తమవేన్నాడు. ఈ విధంగా అక్రమంగా, దౌర్జన్యపద్ధతుల ద్వారా ఈ జమీందారు 17,000 యకరాలు స్వంత కమతంగా చేసుకున్నారు.

1946 నుండి రైతుల ఆధీనంలో నున్న భూములను కూడ కాజేయడానికి గూండాలతో దౌర్జన్యాలు చేయించాడు.

1908 నాటికి గాజుల్లంక గ్రామంలో జమీందారుకున్నది 15 ఎకరాలు మాత్రమే. కాని జమీందారు గ్రామంలోని భూమి అంతా తనదేనని వాదించాడు. పోతార్లంకలో రైతుల ఆధీనంలో భూములను అమ్మజూపాడు. రైతులు తమ హక్కులను కాపాడుకోవడానికి పూనుకుంటే, లంకలన్నింటిలోను రైతులపై 144 సెక్షన్ జారీ చేయించాడు. ఈ గ్రామాల నిండా రిజర్వు పోలీసులను దించారు.

గాజుల్లంకలో ప్రారంభములో 144 సెక్షన్ పెట్టినా, తర్వాత 145 సెక్షన్ పెట్టారు. అంటే జమీందారు కూడా ప్రవేశించరాదని. అయితే జమీందారు రిసీవరు నుండి తిరిగి పాట తనే కొట్టేయించుకొని ఫలసాయాన్ని అనుభవించాడు.

10-4-47 రాత్రి తమ భూములలోని రెల్లును కోసుకొస్తున్న గాజుల్లంక రైతులపై రిజర్వు పోలీసులు పడ్డారు. వీరనారి వియ్యమ్మ ను బయనెట్‌తో పొడిచి చంపారు. కాల్పులు జరిపి ముగ్గురిని తమ పొట్టన బెట్టుకొన్నారు.

1946 రైతుల, కౌలుదార్ల రక్షణచట్టం అక్టోబరు 31న అమలులోకి వచ్చిందని; సెప్టెంబరుకు ముందే జమీందారు భూములను ఆక్రమించుకున్నాడని; సాముదాయక భూము లను అమ్ముతున్నమాట నిజమేనని; రెవెన్యూ మంత్రి కరంతు అసెంబ్లీలో జవాబు చెప్పాడు.

దారుణమైన విషయం ఏమంటే ముఖ్య మంత్రి ప్రకాశం పంతులుగారు రైతులు, జమీందార్ల భూములు ఆక్రమిస్తున్నారని నిరాధారమైన నిందవేసారు. పోలీసు నిర్భంధ విధానాన్ని సమర్థించారు.

గాజుల్లంక గ్రామంలో పోలీసు కాల్పుల తరువాత రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడయిన గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు ఒక ప్రకటన చేస్తూ "145 సెక్షన్ జారీ చేసి, కొన్ని వేల లంక భూములు బీడుగా వుంచారని, 1946 రైతు రక్షణచట్టం ప్రకారం తమ న్యాయమైన హక్కును రైతులు కాపాడుకొంటుండగా, జమీందారు ఈ భూములనుండి రైతులను వెళ్ళగొట్టజూడటమే తగాదాలకు మూలమని; ఈ తగాదాలో చట్టప్రకారం రైతులకు సహాయ పడవలసిన అధికార్లు జమీందారీ వర్గానికి సహాయపడు తున్నార" ని విమర్శించాడు.

చల్లపల్లి ఎస్టేటులో ఒకవంక రైతాంగం తమ హక్కులకై ధైర్యంగా పోరాడుతున్న సమయం లోనే; లోగడ జమీందారు అక్రమంగా కాజేసి, స్వంతకమతంలో కలుపుకున్న భూములు తమకు చెందాలని కోరుతూ మంత్రిపాలెం, చిట్టూరు, అయ్యంకి, పెద్దముత్తేవి, కాజ, కోసూరు, యార్లగడ్డ, వక్కల గడ్డ మొదలగు గ్రామాలలోని వ్యవసాయకార్మికులు, పేద రైతులు భూములలోకి ప్రశేశించి గట్టు పెట్టుకొన్నారు. దీనినే చల్లపల్లి ఎస్టేటు గట్ల ఉద్యమం అంటారు.

ముక్త్యాల జమీందారు

జయంతి, దాచవరం, కంచల, చింతల పాడు, చెర్వుకొమ్ముపాలెం గ్రామాలలోని చెరువులను ముక్త్యాల జమీందారు దొంగ రికార్డు సృష్టించి, భార్య పేరపెట్టి స్వంత కమతం అని బుకాయిం చాడు. చెరువులోని తుమ్మ చెట్లను అమ్మపూను కున్నాడు. వీటిని రైతులు వ్యతిరేకించారు. జమీందారు జయంతిలో 24 గురు రైతులపై 144 సెక్షన్ జారీ చేయించాడు. 14 మందిపై తాత్కాలిక ఇంజెంక్షన్ తీసుకువచ్చాడు. మునగాల జమీందారు ఎస్టేటు లోని చెర్వు లోతట్టు తుమ్మ లను అమ్మి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నించాడు. దీనిని రైతులు ప్రతిఘటించారు.

మీర్జాపురం జమీందారు గోభూముల ఆక్రమణ

నూజివీడు తాలుకా మీర్జాపురం జమీలోని కొత్తపల్లి, మీర్జాపురం గ్రామాలకు చెందిన 200 యకరాలు గోభూమిని 2500/-లకు అమ్మి వేసాడు.

ఏనాటినుండో సేద్యము చేయుచున్న భూములకు కూడ నజరానాలు వసూలు చేస్తున్నారు. ఇవ్వనిచోట భూములనుండి వెళ్ళ గొట్టుటకు పూనుకొంటున్నారు. గంపల గూడెం ఎస్టేటులోని ఎరుకోపాడులో జమీందారు రైతులను భూముల నుండి తొలగించడానికి ప్రయత్నించాడు. రైతులపై అనేక సివిల్, క్రిమినల్ కేసులు పెట్టించాడు.

నూజివీడు తాలూకా అన్నవరంలో సుమారు 400 ఎకరములు గోభూమి వుంది. దానిలో అనాదిగా రైతు, కూలీలు తమ పశువు లను మేపుకొంటుండేవారు. అదీగాక 30 సంవత్సరాలకు పూర్వమే 50 ఎకరాలలో కొందరు రైతుల ఇళ్లు కట్టుకొని వెంకటాపురం అను పేరు పెట్టుకున్నారు. కాని వుయ్యూరు జమీందారు ఈ భూమిని కాజేయు దురుద్దేశ్యం తో ఆ గ్రామస్థులను బేదఖల్ చేయపూను కున్నాడు. అటవీ భూమి 250 ఎకరాలు 50 సంవత్సరాలకిందటే భార్యపేర పట్టాయిచ్చి నట్టు రికార్డు సృష్టించారు.

ఈ విధంగానే ఇతర ఎస్టేటు గ్రామాలలోను, మొఖాసా గ్రామాలలోను; రైతుల భూములను, సాముదాయిక భూములను కాజేయడానికి జమీందార్లు పెద్దఎత్తున ప్రయత్నించారు.

తిరువూరు తాలుకా కొండసర్వలో మొఖాసాదారు రైతులను భూమినుండి వెడల

గొట్టడానికి 144వ సెక్షన్ జారీ చేయించాడు. రైతులను అరెస్టు చేయించాడు. జమీందారు ఆ భూమిని కాజేయజూచాడు. అందులో 250 యకరాల అడవిని 50 సంవత్సరముల క్రిందటే భార్యపేర పట్టా యిచ్చినట్లు దొంగ రికార్డు సృష్టించాడు.

కోలంక ఎస్టేటులో సాముదాయక భూముల అన్యాక్రాంతం

పిఠాపురం తాలూకాలోని కోలంక ఎస్టేటు లో చెందుర్తి గ్రామంలో 900 ఎకరాల అడవి వుంది. దీనిలో అనాదిగా రైతు, కూలీలు పశువుల్ని మేపుకుంటూ అనుభవిస్తున్నారు. ఎస్టేటువారు ఈ 900 ఎకరాలను, రైతుల నుండి మోసగించి లాక్కొన్న భూమి సుమారు 550 ఎకరాలను, మొత్తం 1450 ఎకరాలను 2,75,000 రూపాయలకు మెక్‌లక్ కంపెనీకి అమ్మి వేసాడు.

అనకాపల్లి తాలుకా వెదురువర్తిలో ఈనాందారు రైతులపై 144 సెక్షన్ జారీ చేయించాడు. రైతుల ఇండ్లను తగులబెట్టి విపరీతంగా నష్టపర్చాడు.

పోతునూరు మొఖాసాదారు దుశ్చర్యలు

చింతలపూడి తాలూకా పోతునూరు మొఖాసాలో తరతరాల నుండి సాగుచేస్తున్న భూముల నుండి రైతులను తొలగించడానికి మొఖాసాదారు పూనుకొన్నాడు. 107 సెక్షన్ క్రింద రైతులపై సెక్యూరిటీ కేసు పెట్టించాడు. 54 గురు రైతులపై 144 సెక్షన్ జారీ చేయించాడు. రిజర్వు పోలీసులను క్యాంపు పెట్టించి, వారి సహాయంతో రైతుల భూముల లోని పంటను కోసుకెళ్ళాడు.

కానూరు, పెండ్యాల రైతుల పోరాటం

వుయ్యూరు, మీర్జాపురం, యలమర్రు జమిందార్లకు గోదావరి ఆనకట్టకు దిగువగా మద్దూర్లంక, వడ్లవాశిలంక, చిగుర్లంక, ఉత్తర్లంక, కాలంక, పురుషోత్తం పల్లి, పందల పర్రు, జీడిగుంట, పెండ్యాల, కానూరు మొదలగు లంకలున్నాయి. ఈ లంకలు ఏర్పడినది లగాయతు ఈ ప్రాంతపు రైతులు వాటిని సాగుచేస్తున్నారు. ఆనకట్టకు దిగువ నుండుట వల్ల 1860 నుండి ఈ లంకలు పెరుగుతూ వచ్చాయి. పెరుగుతున్న యావత్తు లంకలను జమీందార్లు తమవేనని ఆక్రమించుకొని, విపరీతమయిన శిస్తులు, మక్తాతో రైతులను పీడిస్తుండేవారు. 1911 తరువాత రైతులు జమీందార్లతో పోరాటం సాగించారు. జమీందార్లు రైతులపై విపరీతమైన దౌర్జన్యాలు, దురాగతాలు సాగించారు.

1946లో రైతులు, కౌలుదార్ల రక్షణచట్టం రావడంతో రైతుల బేదఖలుకు జమీందారు పూనుకొన్నాడు. రైతులు ప్రతిఘటించడంతో వారిపై 144 సెక్షన్ జారీ చేయించాడు.రైతులపై సెక్యూరిటీ కేసు పెట్టించాడు. రిజర్వు దళాన్ని దింపి, క్యాంపు పెట్టించాడు.రైతుల వాదన విన్న జిల్లా కలెక్టరు ఆ భూములపై 145 సెక్షన్ జారీ చేసాడు.

కోయ రైతులలోఅపూర్వ చైతన్యం

పశ్చిమ గోదావరి జిల్లా పోలవరంలో ఏజన్సీలోని గంగోలు ఎస్టేటుకు చెందిన జిల్లేళ్ళ గూడెం, కుంకాల, పేడ్రాల వగైరా గ్రామాల లోని కోయలు పోడుగొట్టి, భూములను సాగు లోకి తెచ్చారు. అనేక సంవత్సరాల నుండి పండించుకొంటున్నారు. కాని ఈ భూములను కాజేయాలని జమీందారు ప్రయత్నాలు సాగించాడు. అనేక దౌర్జన్యాలు చేసాడు.కాని కోయల ముందు ఈతని పప్పులుడకలేదు. రైతులు బుడమ పైరును కోసుకుంటూ వుండగా కొంతమంది పోలీసులతో, సర్కిల్‌ను వెంట బెట్టుకొచ్చాడు. జమీందారు పైరును కోస్తున్న చోరీ నేరానికి 16 మందిని అరెస్టు చేశానన్నాడు. దీనితో స్త్రీలు, పిల్ల, జల్లా అంతా వెళ్ళి తమను కూడా అరెస్టు చేయమన్నారు. చేసేదేమీ లేక అరెస్టు చేసిన వారిని విడిచి పెట్టాడు సర్కిల్ ఇన్‌స్పెక్టరు. మగవాళ్ళు వెదురు నరకడానికి పోయిన సమయం జూచి వేరుశెనగ, జొన్న పైర్లను దున్నివేయడానికి 400 మంది రౌడీలు 200 నాగళ్ళతో, 4గురు పోలీసులతో కోయ గ్రామాల మీదికి దండెత్తారు. కాని కోయ స్త్రీలంతా ఏకమై రౌడీలను ప్రతిఘటించగా, వారు పిక్కబలం చూపారు.

ఇక ఈ విధంగా తన ఆటలు సాగవని జమీందారు స్థానికోద్యోగులను కట్టుకున్నాడు. రైతుల భూములపై 145 సెక్షన్ తెచ్చారు. రిసీవరు వచ్చి ఎస్టేటువారి అతిథిగా వున్నాడు. వారితో మంతనాలు సాగించారు. కోయలు పాటకు వచ్చినా రూల్సు కూడా చెప్పకుండా, 300 ఎకరాలలోని పైరును ఎస్టేటు మేనేజరు కు రు. 8000 లకు కట్టబెట్టాడు.

బుచ్చంపేట హత్యాకాండ

సంజీవపురం, బుచ్చంపేట మొదలగు కోయ గ్రామాలు నందిగూడెం ఎస్టేటులో వున్నాయి. ఇచ్చట కూడ కోయలు పోడుగొట్టి అనాదిగా సాగుచేసుకుంటున్న భూములను జమీందారు దౌర్జన్యంగా కాజేయ జూశాడు. కాని కోయలు ఎప్పటికప్పుడు జమీందారు ఎత్తులను భగ్నం చేస్తూ వచ్చారు. కోవూరు తాలుకా కాంగ్రెసు నాయకులు డా॥ రఘు నాయకులు వగైరాలు, కమ్యూనిస్టులు, రైతుల న్యాయమైన హక్కులను బలపర్చారు. వారికి అండగా నిలబడ్డారు. ఇక లాభంలేదని జమీందారు 144సెక్షన్‌కు పిటీషను పెట్టాడు. సెప్టెంబరు నెలలో కోయలగూడెంకు సబ్ ఇన్‌స్పెక్టరు వచ్చి పై రెండు గ్రామాలలోని భూములను జూశారు. బుచ్చంపేటలో చేలల్లో పనులు చేసుకుంటున్న రైతులతో, మీ భూములు మీరు సేద్యం జేసుకుంటూ వుండండని చెప్పివెళ్లాడు. ఆ తరువాత సంజీవపురం భూములపై 145 సెక్షన్ ఇవ్వబడ్డా, బుచ్చంపేట భూములపై మాత్రం ఎట్టి సెక్షనూ రాలేదు. పైర్లు కోతకు రాగానే కోయలు మామూలు ప్రకారం మహసూలు ప్రారంభించారు. జమీందారు స్థానికాధికార్లను కట్టుకొని 145 సెక్షన్ తీసుకురావడం, రిసీవరు వచ్చి అతని యింట్లోనే వేలంపాట తతంగం జరిపి జమీందారు పేర కొట్టి వేయడం, ఎవరికీ తెలియకుండా గంటలమీద జరిగిపోయింది. నవంబరు 28న డిప్యూటీ కలెక్టరుకు, ఇతర అధికార్లకు జమీందారు ఇంట్లో టీపార్టీ జరిగింది. 29న సాయంకాలం తమ పొలాల నుండి తిరిగివస్తున్న అమాయక కోయలపై, పోలీసులు ముందుగానే వేసుకున్న ప్లాను ప్రకారం 60 రౌండ్లు కాల్చారు. ప్రజా ప్రభుత్వ హయాములో మర తుపాకి నుపయోగించి 5 గురు కోయరైతులను బలిగొన్నారు. 6 గురికి ప్రమాదకరమయిన గాయాలు తగిలాయి.

ఈ ఘోర హత్యకాండను అన్ని రాజకీయ పక్షాల వారూ తీవ్రంగా ఖండించారు. శాసన సభా సభ్యులైన మాగంటి బాపినీడు, అల్లూరి సత్యనారాయణ రాజు, గొట్టుముక్కల వెంకన్న గార్లు కాల్పులను విచారించి, పోలీసు చర్యలను ఖండిస్తూ, ప్రభుత్వానికి తమ నివేదికను అందజేసారు. మాజీ ప్రధాని ప్రకాశం పంతులు, బి.యస్.మూర్తి వగైరాలు కూడ స్వయంగా వచ్చి విచారించి వెళ్ళారు. కొంత మంది కాంగ్రెసు నాయకులు ముఠా రాజకీయాల దృష్టితో కాల్పులను సమర్థించబోయినా తమ తప్పును

గ్రహించారు. విచారణ కమిటీని వేయ తిరస్కరించిన ప్రభుత్వం దిగివచ్చి, జిల్లాజడ్జి తోనూ, యిద్దరు లాయర్లతోనూ కమిటీని నియమించింది.

రాజమండ్రి తాలూకా ములకల్లంక కౌలుదార్లను ప్రభుత్వ చట్టానికి వ్యతిరేకంగా తొలగించడానికి పిఠాపురం జమీందారు దౌర్జన్యాలు సాగించారు.జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శి శ్రీ నీరుకొండ రామారావుగారు, చిట్టూరి దుర్గా ప్రసాదరావుగారు, తాలూకా రైతు నాయకులు పై లంక వెళ్ళి కౌలుదార్ల రక్షణ చట్టం ప్రకారం రైతులకు న్యాయమైన హక్కులున్నాయని, తాము రైతులకండగా నిలబడతామని చెప్పారు. జమీందారు 20 మంది కాంగ్రెస్, కమ్యూనిస్టు,రైతునాయకులపై 144 సెక్షన్ తెచ్చాడు. లంకలో పోలీసు క్యాంపు పెట్టారు. రైతులకు ప్రభుత్వ చట్ట ప్రకారంగా భూములను చేసుకోడానికి హక్కున్నదనీ, 144 సెక్షన్ రద్దు చేయమని పిటీషన్ పెట్టబడింది. దీనిని విచారించకుండానే మేజిస్ట్రేటు 101 మంది రైతులపైన, కాంగ్రెసు, కమ్యూనిస్టు నాయకులపై 107 సెక్షన్ జారీ చేశాడు.

ఈనాం రైతుల తిరుగుబాటు

ఆంధ్రలో ఈనాములు ఎక్కువగానున్నది విశాఖజిల్లా. ప్రజలు బాగా వెనుకబడి వుండడం వల్ల ఈనాందార్లు నిలువుదోపిడి సాగిస్తున్నారు. రైతులకు పూరా ఈనాము గ్రామాలలో కూడ జిరాయితీ హక్కులు సంక్ర మింపకుండా చేస్తూ వచ్చారు. 1946 నాటికి కూడా రైతుల చేత వెట్టి చేయించు కొనేవారు. శృంగవరపుకోట, భీమిలిపట్నం తాలూకాలో బలమైన క్షత్రియ ఈనాందార్లున్నారు. వీరు రైతులను సాంఘికంగానూ, ఆర్థికంగానూ, దోచేస్తున్నారు. రద్దుబిల్లు వచ్చిన తరువాత రైతుల భూములు దౌర్జన్యంగా కాజేయ చూచారు. భీమిలిపట్నం తాలూకా లోని మజ్జి వల్సలో రైతును భూమి నుండి తొలగించ జూసాడు ఈనాందారు. రైతులు భూమిని కాపాడుతున్నారు. ఆ గ్రామంలో వెట్టి చేయడం మానివేసారు. దీని ప్రభావం చట్టుప్రక్క గ్రామాలకు ప్రాకింది. శృంగవరపు కోట తాలూకా ఆలమందలో కూడా క్షత్రియ ఈనాందార్లు రైతును భూమి నుండి వెడల గొట్టడానికి అనేక దౌర్జన్యాలు చేశారు. చివరకు దొమ్మీగా వచ్చి రైతులపై కాల్పులు జరిపారు. ఫలితంగా ఒక రైతు చనిపోయాడు. కొందరికి గాయాలు తగిలాయి. రైతులు మాత్రం భూములను కాపాడుకో నిశ్చయించారు. కాంగ్రెసువారు, సోషలిస్టులు అందరూ ఈనాం దార్ల దారుణచర్యను ఖండించి, ప్రభుత్వం తక్షణచర్య తీసుకోవాలని కోరారు.

ఇదే విధంగా రంపచోడవరం ఏజన్సీ ప్రాంతంలో కోయలు-రెడ్లు పోడుగొట్టి సాగులోకి తెచ్చినభూములను కాజేయాలని పిఠాపురం వగైరా జమీందార్లు ప్రయత్నాలు చేసారు. పిఠాపురం తాలూకాలో సాగు చెరవుల లోతట్టు భూమిని అన్యాక్రాంతం చేస్తూంటేనూ, చెర్వుగర్భాలను పైరు పంటలకు సాగుకిస్తుం టేనూ, అనేక గ్రామాల్లో రైతులు ప్రతిఘటిం చారు. చిత్తూరుజిల్లా పుంగనూరు వగయిరా ఎస్టేట్లలో చాలాకాలం నుండి రైతుల స్వాధీన హక్కు భుక్తములలో నున్న భూములను జమీందార్లు పెద్ద రెడ్లకు పట్టాలకిచ్చారు. కంభం తాలూకాలోని అనేక ఈనాము గ్రామాలలో రైతులు సాగుచేసుకుంటున్న భూములను పెద్ద భూస్వాములకు అమ్మారు. చల్లపల్లి, కాట్రావుల పల్లి, పిఠాపురం, ముక్త్యాల వగైరా అనేక ఎస్టేట్లలో అడవులను, పచ్చికబీళ్ళను బినామీ పట్టాలకిచ్చారు. లోగడనే ఇచ్చిన వాటిని అమ్ముకున్నారు.

ప్రజా ఉద్యమాలపై ప్రకాశం మంత్రివర్గం దాడి

ప్రకాశం మంత్రివర్గం ఉద్వేగంగా ఉరకలు వేసుకుంటూ వస్తున్న ప్రజావెల్లువను గమనించి వారి న్యాయమైన కోర్కెలు నెరవేర్చడానికి, ముఖ్యంగా ఎన్నికల వాగ్దానాలను అమలు పరచేందుకై చర్యలు తీసికొనేదానికంటే, ప్రజా ఉద్యమాలపై నిర్బంధ విధానాన్ని ప్రయోగిం చేందుకు పూనుకొన్నది. జమీందారీల రద్దుకు బిల్లును తెచ్చే దానికి కృషిచేయకుండా, దానిని వాయిదా వేయడానికి చూసింది. రైతుల, కౌలుదార్ల రక్షణకంటూ తెచ్చిన చట్టం రైతులను రక్షించ లేకపోయింది. మంత్రివర్గం, ప్రభుత్వ యంత్రాంగం రైతుల రక్షణకు నిలబడటం పోయి, జమీందార్ల కొమ్ముకాచే స్థితికి దిగజారటం జరిగింది.

అన్నింటికంటే దారుణమయింది 1947 జనవరి 23న ప్రజాశాంతి రక్షణ ఆర్డినెన్సును మద్రాసు గవర్నరు జారీ చేసాడు. 22 రాత్రే కమ్యూనిస్టుపార్టీ, రైతు సంఘం, ట్రేడ్ యూనియన్, వ్యవసాయకూలీ ఆఫీసులపై దాడి చేసి నాయకులను అరెస్టుచేయడం జరిగింది. రాష్ట్రమంతటా వందల మందిని డిటెన్యూలుగా బంధించటం జరిగింది. వందల మంది వారంట్లు తప్పించుకొని, రహస్యంగా వుంటూ, ఉద్యమాన్ని నడపవలసి వచ్చింది. ప్రకాశంగారు ఈ నిరంకుశ నిర్బంధ ఆర్డినెన్సును అసెంబ్లీలో సమర్థించుకొంటూ ప్రజా ఉద్యమాలపైన, రైతు ఉద్యమం పైన దాడి చేయటం జరిగింది. జమీందార్లను, మిరాసిదార్లను, జన్మీలను వెంటవేసుకొని రావటం జరిగింది.

ప్రకాశం మంత్రివర్గం పతనం

అయితే ప్రకాశం మంత్రివర్గం పదినెలలోనే పడిపోయింది. ఓమండూరు రామస్వామి రెడ్డియార్ మంత్రివర్గం వచ్చింది. రెవెన్యూ మంత్రిగా కళా వెంకట్రావు వచ్చాడు.

1947 శిస్తు తగ్గింపు చట్టం

ఎస్టేట్లలో శిస్తులను ప్రక్కనున్న రైత్వారీ రేట్లకు తగ్గించడానికి 1947లో ఒక చట్టం తీసుకురాబడింది. ఎస్టేట్ల రద్దుకు మరో బిల్లు ప్రకటించబడ్డది.

1947కు పూర్వం రెండు సంవత్సరాల శిస్తు చెల్లిస్తే, అంతకుముందు బకాయిలన్నీ రద్దవుతాయని చెప్పటం జరిగింది.

జమీందార్ల దాడి మరోసారి ప్రారంభ మయింది. ఎస్టేటురద్దు బిల్లును ఎగర గొట్టడానికి బినామీ అమ్మకాలకు పెద్ద ఎత్తున పూనుకున్నారు.

శిస్తు తగ్గింపు చట్టం ప్యాసయిందిగాని, కాంగ్రెసు ప్రభుత్వం దానిని వెంటనే అమలు చేయడానికి పూనుకోలేదు. ఆ మూల నుండి ఈ మూల వరకు జమీందార్లు మాత్రం వారి మందీ మార్బలంతో ఒక్కసారి గ్రామాలపై విరుచుకుపడ్డారు. చట్టం అమలులోకి వచ్చే లోపలే శిస్తుల బకాయిలు వసూలు చేసు కోవాలని ప్రయత్నించారు. ఇందుకు వారికున్న సాధన సంపత్తినంతా ఉపయోగించటమే గాక, దౌర్జన్యాలకు, దురాగతాలకు పూనుకొన్నారు.

రైతాంగం జమీందార్ల దౌర్జన్యాల గురించి ఎన్నో విజ్ఞప్తులు పంపుకోవటం జరిగింది. అయినా ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. పైపెచ్చు జమీందార్లకు శిస్తులు చెల్లించ వలసింది గానూ, శిస్తులు తగ్గించిన తరువాత హెచ్చుగా

చెల్లించిన శిస్తులు ముదరా యివ్వ బడతా యని, అర్థరహితమైన ప్రకటనలు ప్రభుత్వం చేసింది. జమీందార్లు ఒకసారి వసూలు చేసుకుపోయిన తరువాత, తిరిగి ముదరా వస్తుందంటే నమ్మే రైతు ఒక్కడు కూడా లేడు.

రైతాంగాన్ని సంఘటితపరచి, జమీందార్ల దౌర్జన్యాలను ఎదిరించడానికి రైతు సంఘాలు పూనుకొన్నాయి.

మందసా ఎస్టేటులో దురాగతాలు

మందసా ఎస్టేటులో బకాయిల వసూళ్ళ కని గ్రామాల మీద ఏనుగులతో దండెత్తడం జరిగింది. బాడతల్లి గ్రూపుకు చెందిన గ్రామాలలో ఏనుగులతో ఇండ్ల కప్పులు పీకించటం జరిగింది. తుపాకులతో ప్రజలను భయపెట్టి శిస్తులు వసూలు చేయటం జరిగింది. ఇదేమి అన్యాయమన్న రైతు నాయకులపై క్రిమినల్ కేసులు పెట్టటం జరిగింది. బాడపల్లి గ్రూపులో 22 మంది రైతుల మీద, రైతుసంఘ అర్గనైజర్ల మీద అక్రమకేసు పెట్టడం జరిగింది.

అమాని గ్రామాలలో పండిన పంటలో ముప్పాతిక జమీందారే కాజేస్తాడు.

జమీందార్లకు శిస్తులు చెల్లించవద్దని రైతు సంఘం పిలుపు

జమీందార్లు గ్రామాలపై శిస్తు వసూళ్లకు జరుపుతున్న దౌర్జన్యకాండను ఎదుర్కోవడమే గాక, అసలు జమీందార్లకు శిస్తులు చెల్లించ వద్దని, 1947 శిస్తు తగ్గింపు చట్టప్రకారం తగ్గిన రేట్ల ప్రకారం ప్రభుత్వానికే శిస్తులు చెల్లించాలని ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం రైతాంగానికి పిలుపుయిచ్చింది. ఈ పిలుపు రాష్ట్రంలో ఒక మూల నుండి మరొక మూలకు మెరుపు వేగంతో అందుకొన్నది. రైతులు ఈ పిలుపును వెంటనే ఆచరణలో పెట్టారు. అనేక ఎస్టేట్లు, మొఖాసాలలో రైతులు జమీందార్లకు శిస్తులు చెల్లించడాన్ని మానివేశారు. జాగృతి చెందిన రైతాంగం ముందు జమీందార్ల పప్పులు ఉడకలేదు.

150 సంవత్సరాలుగా జమీందార్ల దోపిడి, దౌర్జన్యాలతో నలిగిపోయిన రైతాంగంలో చైతన్యం పొంగుకొచ్చింది. తమ ప్రాణాలను సైతం లెక్కచేయక ధైర్యంగా నిలబడి తమ హక్కులకై పోరాడటానికి రైతులు ముందుకు వచ్చారు.

అనేక ఏండ్లుగా ఈనాందార్ల సాంఘిక, ఆర్థిక దోపిడీకి గురియైన భీమిలిపట్నం, శృంగవరపుకోట, టెక్కలి వగైరా తాలూకాలలో ఈనాం రైతులు జాగృతి చెందారు. తమ హక్కులకై పోరాడారు.

సీతారామరాజు విప్లవం తరువాత తిరిగి కోయలలో ఈ కాలంలో నూతన సంచలనం, వర్గ చైతన్యం వెల్లివిరిసాయి. గంగోలు, నందిగూడెం ఎస్టేట్లలోని కోయల వీరోచిత పోరాటాలు ఈ విషయాన్నే రుజువుచేసాయి.

వెంకటగిరి ఎస్టేటులో రైతుల తిరుగుబాటు

కనిగిరి, పొదిలి, దర్శితాలూకాలలో అత్యధిక భాగం గ్రామాలు వెంకటగిరి ఎస్టేటు క్రింద వుండేవి. ఈ జమీలో ఫ్యూడల్ దోపిడీ సాగేది. దారుణమైన పైరువారీ శిస్తులు వుండేవి. అష్టాది వర్ణాల వారు వెట్టి చేయవల సిందే. నీటి వనరులను అలక్ష్యం చేయడం తో రైతాంగ ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది.

జమీందారీ రద్దు బిల్లు, శిస్తు తగ్గింపు బిల్లు ప్రకటించబడిన తరువాత శిస్తు బకాయిల వసూళ్లకై అధికార్లు గ్రామాలపై ఒక్కుమ్మడిగా విరుచుకుపడ్డారు. కానిరైతాంగం వీరి ఆటలను సాగనివ్వలేదు.

రైతు దండు

జమీందారీ దౌర్జన్యాల ప్రతిఘటనకు రైతాంగాన్ని సంఘటిత పరచడానికి కనిగిరి తాలూకాలో శ్రీ గుజ్జుల యల్లమందారెడ్డి నాయకత్వాన రైతు దండును నడిపారు. ఈ దండుకు నాయకత్వం వహించినవారిలో యల్ల మందారెడ్డితో పాటు చాగం రెడ్డి నరసింహారెడ్డి, అమరజీవి కాకుమాని వెంకటేశ్వర్లు, శ్రీబాలు ఓబులరెడ్డి, మొదలగువారున్నారు. కనిగిరి నుండి ప్రారంభమైన రైతు దండు 50 మైళ్ళు నడిచింది. 20 ప్రధాన గ్రామాలకు వెళ్లింది.

రైతు ఉద్యమ చరిత్రలోనే ఈరైతు దండు చాలా ప్రధానమైనది. ఇందులో వేలమంది రైతులు పాల్గొన్నారు. ఈ దండు ఆఖరురోజున నేను కూడ పాల్గొన్నాను.

ఈ సందర్భంలోనే కనిగిరి తాలూకా నేరేడు పల్లిలో రైతు మహాసభ, రాత్రికి గొప్ప బహిరంగ సభ జరిగింది. వీటిలో నేను కూడా పాల్గొన్నాను. అటు తరువాత అనుమతిలేనిదే కనిగిరి తాలూకాలో ఉపన్యసించరాదని నాపై నిషేధపు టుత్తరువు జారీ చేయబడినది. జమీందారుకు వెట్టి చేయవద్దని, శిస్తులు చెల్లించవద్దని, కంచెలు పాడవద్దని ఈ మహాసభ రైతాంగానికి పిలుపు యిచ్చింది.

ఈ దండు కార్యక్రమంతో పై మూడు తాలూకాలలోని రైతాంగంలో అపూర్వ సంచలనం కలిగింది. అనేక గ్రామాలలో జమీందారీ ఉద్యోగులు, పోలీసులు కలిసి రైతులను బెదిరించారు. కొన్ని గ్రామాలలో రైతులను కొట్టారు. కొందరు రైతులను అరెస్టు చేసారు.

ఎంత నిర్భంధం సాగినా జమీందార్లకు శిస్తుకు చెల్లించలేదు. సాముదాయక భూముల లో పుల్లరి చెల్లించకనే రైతులు తమ పశువులను మేపుకొన్నారు. వెట్టిచాకిరి నిలిచిపోయింది.

విజయనగరం, మందసా, వెంకటగిరి, బొబ్బిలి, పిఠాపురం మొదలగు ఎస్టేట్లలో తమ అధికార బృందాన్నంతా గ్రామాల మీద కురిపించారు. చిల్లిగవ్వ కూడా రైతులు చెల్లించలేదు. తగ్గింపురేట్ల ప్రకారం ప్రభుత్వానికే చెల్లిస్తామన్నారు. పోలీసులను తెచ్చి, అరెస్టులు చేస్తామని బెదిరించారు. కాని ప్రయోజనం శూన్యం అయింది.

దీనితో జమీందార్లు తమ ఆటలు సాగవని గ్రహించారు. ప్రభుత్వమే శిస్తులు వసూలు చేసి పెట్టాలని మొరబెట్టుకొన్నారు. శిస్తుతగ్గింపు బిల్లులో ప్రభుత్వమే ఆ ఫసలీ నుంచి శిస్తులు వసూలు చేయడానికి మార్పు తీసుకురాబడింది. ఇది రైతాంగ ఆందోళనకు పెద్ద విజయం.

అమానీ గ్రామాల రైతులకు జరిగిన అన్యాయం

1947 శిస్తు తగ్గింపు బిల్లులో ప్రభుత్వం చేసిన మార్పులను పరిశీలిస్తే, అమానీ రైతుల కు చాలా అన్యాయం జరిగింది.

ధాన్యరూపంలో గాని, పాలంబారంలో గాని, పైరువారీగా గాని లేదా ధాన్యం విలువను బట్టి చెల్లించబడే శిస్తులు రైత్వారీ రేట్లకు తగ్గించ బడవని చెప్పడం జరిగింది.

ఇవి తాత్కాలికమేనని, రైత్వారీ సెటిల్ మెంటు జరిగిన తరువాత నిర్ణయించబడిన రేట్లకు వున్న తేడాను ముదరా చూసుకో వచ్చునని ప్రభుత్వం రైతులను ఓదార్చడానికి ఒక ప్రకటన చేసింది.

అయితే దీనికి వ్యతిరేకంగా రైతాంగం పోరాడింది. **ఖడే** వసూలు పద్ధతికి వ్యతిరేకంగా టెక్కలి తాలూకా రైతాంగం పోరాడి, ప్రక్కనున్న రైత్వారీ రేట్లకు శిస్తులు తగ్గించుకోవడం జరిగింది.

జమీందారీ రద్దు బిల్లునుండి ఈనాం ఎస్టేట్లను తొలగించడానికి జరిపిన కుట్ర

ఎస్టేట్ల రద్దు బిల్లునుండి ఈనాం గ్రామాలకు (ఎస్టేట్ల) దేవాదాయ, ధర్మదాయ ఎస్టేటు గ్రామాలను మినహాయించాలని ఈనాందార్లు, వారి వకాలతా పుచ్చుకొన్న వైద్యనాధ అయ్యర్ లాంటి అసెంబ్లీ సభ్యులు పెద్ద గగ్గోలు ప్రారంభించారు. ఈ విధంగా జరగడమంటే వేలాది ఈనాము గ్రామాలలోనున్న లక్షలాది రైతులకు, దేవాదాయ, ధర్మాదాయ ఎస్టేటు గ్రామాలలో నున్న రైతాంగానికి తీరని అపచారం జరుగుతుంది.

దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర రైతుసంఘ ఆధ్వర్యాన విస్తృతమైన, బ్రహ్మాండమైన ఆందోళన చేయబడింది. విజయవాడ నుండి మద్రాసుకు ప్రత్యేంగా అలకంరించబడిన కిసాన్ స్పెషల్‌లో రైతులు, వారి ప్రతినిధులు మద్రాసుకు యాత్రగా వెళ్ళారు. అసెంబ్లీ ముందు ప్రదర్శన చేయడం జరిగింది. వై.యం.సి.ఎ. హోలులో శాసన సభ్యురాలు శ్రీమతి వల్లభనేని సీతామహలక్ష్మమ్మ గారి అధ్యక్షతన సభ జరిగింది. అనేక మంది కాంగ్రెసు పెద్దలు రైతుల న్యాయమైన కోర్కెలను బలపర్చారు. ఆ సాయంత్రం మద్రాసు ట్రిప్లికేన్ బీచ్‌లో బ్రహ్మాండమైన రైతు సభ జరిగింది.

రైతాంగ ఆందోళనకు విజయం కలిగింది. ఈనాము ఎస్టేట్లను, దేవాదాయ, ధర్మాదాయ ఎస్టేట్లను కూడా జమీలతోపాటు రద్దు చేయడానికి కాంగ్రెసు శాసనసభా పార్టీ అంగీకరించింది. మొత్తం మీద చెప్పాలంటే రెండవ ప్రపంచ యుద్ధానంతరం పెల్లుబికిన రైతాంగ వెల్లువ అనేక విజయాలను సాధించింది.

ఎస్టేట్లలో పెచ్చు శిస్తులు రైత్వారీ రేట్లకు తగ్గించడానికి, జమీందార్లకు బదులు ప్రభుత్వమే శిస్తులు వసూలు చేయడానికి చట్టము తీసుకురాబడింది. అనేక ఎస్టేట్లలో జమీందార్ల దుర్మార్గాలను, బినామీ అక్రమ అమ్మకాలను రైతాంగం నిరోధించింది.

ఈనాము ఎస్టేట్లతో సహా అన్ని ఎస్టేట్లను రద్దు చేయడానికి ప్రభుత్వం అంగీకరించి బిల్లును, చట్టంగా చేయటం జరిగింది. రైతాంగ పోరాటా లలో అనేకమంది ఆహుతి అయ్యారు. వేలమంది పై 107,144 సెక్షన్‌లు జారీ అయ్యాయి. వందలు వేలు అక్రమ కేసులు బనాయించటం జరిగింది. వేలమందిని అరెస్టు చేయడం జరిగింది. అయినా ఉద్యమం వెనుకాడలేదు సరిగదా! ఉరకలు వేసుకుంటూ ముందుకు సాగింది. మారుమూల ప్రాంతాలకు రైతు ఉద్యమం వ్యాపించింది. ✦


(36వ పేజీ తరువాయి...)


ప్రపంచాన్ని అణుమారణహోమంలో ముంచాలని సామ్రాజ్యవాద శక్తులు చూస్తున్నాయి. ఈ కారణంగా ప్రపంచం అతి ప్రమాదకర పరిస్థితుల అంచులలో వుంది. ప్రపంచ శాంతి శక్తులు సామ్రాజ్యవాదుల ఎత్తుగడలను ఎదుర్కొనాలి. ప్రపంచశాంతికై అవిరళ కృషి సాగించాలి. యుద్ధోన్మాదుల ఆటలు కట్టించాలి.

అందువల్ల ఈనాడు బలమైన రైతు సంఘాల నిర్మాణం ఎంతో అవసరం అని వేరుగా చెప్పనవసరం లేదు. గ్రామ గ్రామాన రాజకీయ విబేధాలతో నిమిత్తం లేకుండా రైతులంతా సంఘాలలో చేరి తమ హక్కులకై పోరాడవలసి వుంది. బలమైన రైతు సంఘ నిర్మాణానికి, సమరశీల పోరాటాలకు ఆయత్తం కావడమే నేటి కర్తవ్యం.

1936లో సంఘస్థాపన సందర్భంగా నిర్వచించుకున్న ఆశయాలు, లక్ష్యాలలో కొన్ని నెరవేరాయి. కాని మరికొన్ని ఇంకా నెరవేరలేదు. ఆ ఆశయాల పూర్తికి, నేడు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యల పరిష్కారానికి ముందుకు సాగాలి. ఇందుకై రైతులు, రైతు కార్యకర్తలు స్వర్ణోత్సవ సందర్భంగా మరోసారి అంకితం కావాలి.

రైతు సంఘాలకు జై





మరణం : 9-5-1900

ఉల్గులాన్ ఉద్యమ నాయకుడు, ఆదివాసీ సమాజాల ఆదర్శయోధుడు

బిర్సాముండా

అల్లూరిని బ్రిటీష్ సామ్రాజ్యవాదం 1924 మే7న హత్య చేసింది.



నిజాంపాలనను ధిక్కరించి, పోరాడి అమరుడైన గోండు జాతి నాయకుడు

కొమరం భీం



మరణం : 1.9.1940

అమర వీరుల వర్ధంతి సభలు



2003అక్టోబరు 31న పార్వతీపురం ఏరియాలో జరిగిన శ్రీకాకుళ గిరిజనోద్యమ తొలి అమరులు
కామ్రేడ్స్ కోరన్న,మంగన్నల వర్ధంతి సభ: హాజరైన గిరిజనులు, రైతు కూలీలు



2003 మే 7న, పార్వతీపురంలో జరిగిన అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభలో పాల్గొన్న ప్రజానీకం.
'గిరిజన రైతు - కూలీ శ్రామిక నిలయం' ప్రారంభం సందర్భంగా ప్రసంగిస్తున్న ఒరిస్సా ఆదివాసీ, రైతు సంఘం నాయకులు కా॥ గణనాథ్ పాత్రో



దుగ్గేరు గిరిజనోద్యమ ముద్దు బిడ్డ కా॥ జన్ని తిరుపతి వర్ధంతి సభ; హాజరైన గిరిజనులు, రైతు కూలీలు

కరువు, రైతాంగ సమస్యలపై సదస్సులు



03-11-2002న శ్రీకాకుళంలో జరిగిన కరువు సదస్సు, సదస్సుకు హాజరైన రైతు కూలీలు

ప్రారంభోపన్యాసం చేస్తున్న ప్రా॥ కె.ఆర్. చౌదరి, వేదికపై ఎడమనుండి కా॥ ఝాన్సీ, ప్రా॥ సుబ్బారెడ్డి, ప్రా॥ చంద్రయ్య, కామ్రేడ్స్ వర్మ, ప్రకాష్, లక్ష్మణ్ రావు



29-05-2003న వెంకటగిరిలో జరిగిన రైతాంగ సదస్సు, ప్రదర్శన

ప్రారంభోపన్యాసం చేస్తున్న ప్రా॥ కె.ఆర్. చౌదరి, వేదికపై కామ్రేడ్స్ రమణయ్య, సునీత, ఝాన్సీ, కిషోర్



పాగాకు గిట్టుబాటు ధర కొనుగోలుకై ఒంగోలులో 10-02-2003న జరిగిన

పాగాకు రైతుల సదస్సు; ప్రసంగిస్తున్నవారు కా॥ కోటయ్య, ఇతర రైతు సంఘాల నాయకులు



కరువు సమస్యపై నందిగామలో జరిగిన కృష్ణా జిల్లా సదస్సు

ప్రారంభోపన్యాసం చేస్తున్న శ్రీ డి. సత్యనారాయణరెడ్డి, వేదికపై డి. హరనాథ్, పి. మురళీ కృష్ణ, కె. కోటయ్య, చంద్ర శేవయ్య, భార్గవశ్రీ

వివిధ జిల్లాల్లో సదస్సులు



2003 నవంబర్ 27న జరిగిన రాయదుర్గం ప్రాంత రైతు కూలీ సదస్సు, హాజరైన రైతు - కూలీలు
ప్రసంగిస్తున్న వారు ప్రా॥ కె. ఆర్. చౌదరి, వేదికపై కామ్రేడ్స్ నాగరాజు, కోటయ్య, తిమ్మారెడ్డి



పంటలకు గిట్టుబాటు ధరల కోసం, పనికి ఆహార పథకం అమలు కొరకు
28-1-2003 గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా



2002 డిసెంబర్ 9న పార్వతీపురం గిరిజన సదస్సులో
ప్రసంగిస్తున్న డా॥ బి.డి. శర్మ హాజరైన గిరిజనులు, రైతు కూలీలు



కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో
గిరిజన, వృత్తిదారుల నిరాహార దీక్ష



కరువు పనికి ఆహార పథకం తదితర సమస్యలపై 09-05-2003న జరిగిన
నిజామాబాద్ జిల్లా సదస్సుకు హాజరైన రైతుకూలీలు, ప్రతినిధులు

జిల్లాలో ధర్నాలు,ఇతర కార్యక్రమాలు



కరువు సమస్యపై గుంటూరు కలెక్టరేట్ వద్ద
07-04-2003న ధర్నా



కృష్ణా జిల్లా కలెక్టర్ ఆఫీసు వద్ద కరువు సమస్యపై
07-04-2003న జిల్లా స్థాయి ధర్నా



23-11-2002 న కొవ్వూరు ఆర్‌డిఒ ఆఫీస్ వద్ద ధర్నా



భూస్వామి, కాంట్రాక్టర్ దౌర్జన్యాలను ఖండిస్తూ ఆదివాసీ హక్కుల వేదిక
ఆధ్వర్యంలో రంపచోడవరంలో మానవ హారం



09-12-2002న గిరిజన సమస్యలపై
పార్వతీపురంలో జరిగిన ప్రదర్శన



దేవాలయ భూములు భూస్వాములకు కట్టబెట్టే 379 జీఒకు వ్యతిరేకంగా
గుంటూరు ఎండోమెంట్ ఎసి ఆఫీస్ ముందు 16-06-2003న ధర్నా

జిల్లాలలో వివిధ కార్యక్రమాలు



2003 డిసెంబర్ 19న వివిధ సమస్యలపై కొమరాడలో జరిగిన
సదస్సు సందర్భంగా ఊరేగింపు దృశ్యం



కృష్ణా జిల్లా కలెక్టరేట్ వద్ద 22-12-2003న తుఫాన్ బాధితులకు యుద్ధ
ప్రాతిపదికన సహాయక చర్యలను డిమాండ్ చేస్తూ ధర్నా




వెలుగోడులో కా॥ ఎం.ఎస్. స్థూపావిష్కరణ సందర్భంగా జరిగిన ప్రదర్శన



దుగ్గేరులో 25-08-2003న జరిగిన
మెడికల్ క్యాంప్‌కి హాజరైన గిరిజన మహిళలు




అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల కోసం 04-02-2002న
పార్వతీపురంలో జరిగిన ప్రదర్శన



పల్నాడు అభివృద్ధి - జల సాధన కమిటీ ఆధ్వర్యంలో 02-02-2003న
కారంపూడిలో జరిగిన సదస్సు

సంఘీభావ కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు



రాజమండ్రిలో ఆదివాసీ హక్కుల వేదిక ఆధ్వర్యంలో జరిగిన సంఘీభావ సదస్సు. ప్రసంగిస్తున్న వారు మేధా పాట్కర్



ఇరాక్‌పై అమెరికా దాడికి వ్యతిరేకంగా నరసన్నపేటలో సామ్రాజ్యవాది దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న దృశ్యం




హైదరాబాద్‌లో యుద్ధ వ్యతిరేకవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఇరాక్ సంఘీభావర్యాలీలో పాల్గొన్న రైతు కూలీలు; కళారూపం ప్రదర్శిస్తున్న అరుణోదయ కళాకారులు



ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా సామ్రాజ్యవాదుల దాడులను ఖండిస్తూ ఒంగోలులో బహిరంగ సభ. ప్రసంగిస్తున్న వారు కా॥జస్వంత రావు, వేదికపై కామ్రేడ్స్ పింజల సుబ్బారావు, యం.వి. కృష్ణయ్య, లలిత



2002 డిసెంబర్ 4న విజయవాడలో 'వార్షిక సంచిక-2002' ఆవిష్కరణ సభ.



హైదరాబాద్‌లో 'రైతుల కమీషన్ నివేదిక' పుస్తకావిష్కరణ

రైతు సేవలో

మార్కెటింగు శాఖ


1. ఆధునిక వ్యవసాయ పద్ధతులలో రైతులకు శిక్షణ ఇవ్వడం.
2. రైతులకు భూసార పరీక్షకు మార్కెట్ యార్డుల్లోనే భూసార పరీక్షా కేంద్రాల ఏర్పాటు
3. మార్కెట్ యార్డులో తక్కువ ధరలకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మకాలు
4. రైతులు తమ పంటలను మార్కెట్ యార్డుకు చేరవేసుకోవడానికి వీలుగా లింకు రోడ్ల నిర్మాణం
5. గ్రామీణ భండారన్ యోజన పథకం ద్వారా రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల్లోనూ గోదాముల నిర్మాణం
6. రైతుల పంటలను నిల్వ ఉంచుకోవడానికి 39 కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి సబ్సిడీ అందివ్వడం జరిగింది.
7. మార్కెట్ యార్డులో ఖచ్చితమైన తూకం కోసం ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జీలు, ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాల ఏర్పాటు.
8. మార్కెట్లో సరైన ధర రానప్పుడు రైతుబంధు పథకం ద్వారా రైతుల సరుకులను నిల్వఉంచి తక్షణం వాటి విలువలో 75శాతం రుణం మంజూరు, ఇట్టి రుణంపై 90 రోజుల వరకు ఎటువంటి వడ్డీలేదు.
9. మార్కెట్ యార్డుల్లో వ్యవసాయ శాఖ అధికార్లు, డాట్ కేంద్రాల ద్వారా వ్యవసాయ నిపుణులను తగు సలహాల నిమిత్తం రైతులకు అందుబాటులో ఉంచడం.
10. పత్తి సాంకేతిక మిషన్ సహకారంతో రాష్ట్రంలో పత్తి మార్కెట్ యార్డులను ఆధునికంగా తీర్చిదిద్దడం.
11. భూగర్భ జలవనరుల అభివృద్ధికై అమలు జరుపుతున్న "నీరు-మీరు" పథకానికి ఆర్థిక సహాయం అందించడం.
12. కంప్యూటర్ నెట్‌వర్క్ ద్వారా వివిధ మార్కెట్ల ధరలను ఏ రోజుకారోజు సేకరించి మార్కెట్ యార్డుల్లో దృశ్య శ్రవణ పద్ధతుల ద్వారా రైతులకు తెలియజేయడం.
13. రైతుబజార్ల ద్వారా మధ్య దళారులను తొలగించి రైతులు తమ కూరగాయలను నేరుగా వినియోగదారులకు అమ్మించడం వల్ల రైతులకు అధిక రొక్కం, వినియోగదారునికి చౌకగా కూరగాయలు అందుతున్నాయి.
14. రసాయనిక మందులు, ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువుల ద్వారా (వర్మి కంపోస్టు) కూరగాయలు పండించడానికి మార్కెటింగ్ శాఖ కృషిచేస్తుంది.
15. గ్రేడింగ్ కూరగాయలు, సంచార రైతుబజార్ల ద్వారా రైతులు నేరుగా తాజా కూరగాయలను విక్రయించటం వల్ల రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడం.
16. రైతుబజార్ల ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ ద్వారా విత్తనాలు అందించి, ఆధునిక సాగు పద్ధతుల్లో శిక్షణ ఇప్పించడం.
17. మధ్య దళారుల ప్రమేయం తగ్గించి వ్యవసాయ మార్కెటింగ్ యార్డుల్లో ప్రత్యక్ష అమ్మకాన్ని ప్రోత్సహించడానికి మార్కెటింగ్ శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌లో మధ్య దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ఖరీదుదారులకే అమ్ముకొనుటకు అవకాశం కల్పించబడుతుంది. దీని వల్ల మధ్య దళారీల దోపిడి నివారించబడుతుంది.
18. మనరాష్ట్రం నుండి మామిడి పండ్లను ఇతర ప్రాంతాలకు, విదేశాలకు ఎగుమతికి వీలుగా సదుపాయాలు కల్పించడం.
19. కడప, అనంతపూర్, కర్నూల్ తదితర జిల్లాల్లో టమోట, బొప్పాయి ధరలు గణనీయంగా పడిపోయినపుడు మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో టమోట, బొప్పాయిలను డిమాండు ఉన్న ప్రాంతాలకు తరలించి రైతులను ఆదుకోవడం జరుగుతోంది. అవసరమైన పక్షంలో రైతుల సరుకుల రవాణాకు సబ్సిడీ రూపంలో భరించడం జరుగుతోంది.

వి.ఎమ్. మనోహర్ ప్రసాద్ ఐ.ఎ.ఎస్
సంచాలకులు, మార్కెటింగ్ శాఖ

వ్యవసాయకార్మికులు

" తెగించిన ఆగ్రహం అనివార్యం"

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి



మన దేశపు జనాభాలో వ్యవసాయ కార్మికులే అన్నిటికంటే ఏకైక అతిపెద్ద సెక్షన్‌గా ఉన్నారు. 1961 నాటి జనాభా లెక్కల ప్రకారం మొత్తం 44 కోట్ల మంది వ్యవసాయ కార్మికులే. అంటే మొత్తం జనాభాలో వారు 25% లేదా గ్రామీణ జనాభాలో మూడోవంతున్నారు. మన ప్రజానీకంలో-అమెరికాలోని నీగ్రోలకంటే, దక్షిణాఫ్రికాలోని నల్లజాతి వారి కంటే ఎంతో హీనంగా చూడ బడుతూ, అనేక విధాలుగా అత్యంత నికృష్ట దోపిడీకి, సామాజిక పీడనకు గురవుతున్న వర్గమిదే.

ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ విధానం, రుణాల పంపిణీ విధానం, అలాగే అధిక దిగుబడి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల పంపిణీ విధానం, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు-లేనివారు అని రెండు ధృవాలుగా చీలిపోవడం మరింత తీవ్రతరం కావడానికి మాత్రమే తోడ్పడుతున్నాయి. భూసంస్కరణల గురించి ప్రభుత్వం ఏమి ప్రచారం చేసుకొంటున్నప్పటికీ ట్రాక్టర్లు, కంబైన్లు (కోత యంత్రాలు), ఆయిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లు, గ్రామీణ ధనికులకు అవసరమైన తదితర సౌకర్యాలను కల్పించడానికి; వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రపంచబ్యాంకు తన అనుబంధ సంస్థ అయిన అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (IDA) ద్వారా ఇస్తున్న కోట్లాది రూపాయల రుణాలు ఆచరణలో గ్రామీణ ప్రాంతాలలో కొద్ది మంది చేతుల్లో మరింతగా భూమి కేంద్రీకరించబడటానికీ, వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరుగుదలకు మాత్రమే తోడ్పడుతున్నాయి.

ఈ ఆర్థిక సదుపాయాలేవీ చిన్న రైతులకు చేరనేలేదు. "చిన్న వ్యవసాయదారుల్లో అత్యధిక భాగంగా ఉన్న హరిజనులకు వ్యవసాయ విస్తరణ సంస్థలు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అసలు తెలియనే తెలియదు. పంచాయితీ సమితులు సాంద్ర ఎరువుల పథకం క్రింద ఇస్తున్న రుణాలు (ఐ.యం.యఫ్.రుణాలు-అను) సామాజికంగా అశక్తులైన చిన్న వ్యవసాయదారులకు చేరడం చాలా అరుదు." (వ్యవసాయాభివృద్ధి, చిన్న రైతులు-ఆంధ్రప్రదేశ్‌లో ఒక పరిశీలన-గోగుల పార్థ సారథి - ఆంధ్ర విశ్వవిద్యాలయం 1971 - పేజి 68)

వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు వేళ్ళూను కొన్నచోట భూమి ధర మూడు, నాలుగు, ఐదు రెట్లకు సైతం పెరిగిపోయింది. వ్యవసాయంలో మెరుగైన పద్ధతుల ద్వారా అందుతున్న ఫలితాలను ఇతరులతో పంచుకోవడానికి భూమి యజమానులు ప్రత్యేకించి పెద్ద భూస్వాములు సిద్ధంగా లేరు. వారి ప్రయత్నమంతా కౌలుదార్లను సాంతం వదిలించుకొని, సొంత సాగు పేరిట భూమిని తిరిగి తమ చేతుల్లోకి తీసుకొని, వాస్తవంలో అపరిమితంగా సరఫరా అవుతున్న కూలీలను పెట్టుకొని వ్యవసాయం చేయడమే. ఈ విధంగా కౌలుదార్లు భూమిలేని వ్యవసాయ కార్మికుల స్థాయికి దిగజార్చబడుతున్నారు.

ప్రధానంగా వ్యవసాయ కార్మికులుగా ఉన్న ఈ గ్రామీణ శ్రామికుల సంఖ్య విపరీతంగా పెరగడం భారతదేశంలో పెరుగుతున్న ఒక లక్షణంగా ఉంది.

గ్రామీణ శ్రామికుల పెరుగుదల

రెండవ లేబర్ ఎన్‌క్వయిరీ (కార్మిక విచారణ) రిపోర్టు ప్రకారం 1956-57 నాటికి మొత్తం మన దేశంలో 66.6 మిలియన్ల గ్రామీణ కుటుంబాలున్నాయని అంచనా వేయగా, అందులో 24.5% లేదా 16.3 మిలియన్లు వ్యవసాయ కార్మికుల కుటుంబాలే. 18వ జాతీయ నమూనా సర్వే ప్రకారం 1963-64 లో భారత దేశంలో మొత్తం 67.6 మిలియన్ల గ్రామీణ కుటుంబాలుండగా అందులో 17.2 మిలియన్లు అంటే 26%గ్రామీణ కార్మికుల కుటుంబాలే.

కామ్రేడ్ నాగిరెడ్డి 1971-72 సంవత్సరాలలో - ఇప్పటికి 30 సంవత్సరాలకు పూర్వం వ్రాసినది. విప్లవకారులపై పెట్టిన హైద్రాబాద్ కుట్రకేసు సందర్భంగా ప్రత్యేక సెషన్స్ కోర్టులో 6 వందల పేజీల స్టేట్‌మెంట్ (తాకట్టులో భారతదేశం) రూపంలో చదివారు. దానిలోని చిన్న భాగమే ఇది.

వ్యవసాయ కూలీలుగా మొదటి, రెండవ తరం కమ్యూనిస్టులు పేద దళితులుగా పిలువబడుతున్న, చిన్నచూపుకి గురైన అత్యధిక క్రింది కులాలయిన ఎస్.సి., బి.సి.ల వారిని వర్గ పునాది, సాంఘిక పునాది ప్రాతిపదికన సంఘటిత పరిచారు. ప్రత్యేకంగా ఎస్.సి.లను హరిజనులని గూడా పిలిచేవారు. వారి నివాస ప్రాంతాలను వ్యవసాయ కూలీ పేటలని, హరిజన వాడలని గూడా పిలిచేవారు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ పద్ధతులు, ప్రధానంగా డబ్బు రూపంలోనే కూలి చెల్లించే పద్ధతి పెరిగిన తర్వాత వ్యవసాయ కార్మికులని పిలుస్తున్నారు. కామ్రేడ్ నాగిరెడ్డి వ్యవసాయ కార్మికులని, హరిజనులని, అగ్రకులాలని, అగ్రకుల సవర్ణ హిందువులని ఈ రచనలో వాడారు. ఆ విధంగా ఆనాడు ఎస్.సి., బి.సి.లు వ్యవహరించబడ్డారు. ఆనాటి వ్యవహారరీతిలోనే నాగిరెడ్డిగారు తన రచనల్లో వాడారు. దళితులుగా, రైతుకూలీలుగా, గ్రామీణ పేదలుగా, దళిత కూలీ రైతులుగా, వ్యవసాయ కూలీలుగా వివిధ దృక్పథాలతో పనిచేస్తున్న సంస్థలలో ఎస్.సి., బి.సి., పై కులాల కష్టజీవులు నేడు నిర్మాణయుతులై వున్నారు. వీరందరి స్థితిగతులు 30 సంవత్సరాల నాడు

ఇంతకు ముందు " భారతదేశం పారిశ్రామికీకరణ పథంలో పయనిస్తోందా?" అనే అధ్యాయంలో దేశంలో పారిశ్రామిక వ్యవసాయ వృత్తులకు సంబంధించినంత వరకూ వృత్తుల పంపకం సరళిలో ఎలాంటి ప్రాథమికమైన మార్పు సంభవించలేదని మనం గమనించాం. ఈ అంశం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ విషయంలో సైతం వాస్తవమే.

1901, 1969 మధ్యకాలంలో మొత్తం శ్రామికుల్లో వ్యవసాయ కార్మికుల భాగం 70% వద్ద నిలకడగా ఉన్నప్పటికీ, మొత్తం జనాభాలో వ్యవసాయ కార్మికుల భాగం 70% కి కొంచెం అటూ ఇటూగా ఉంటూ వచ్చింది. స్పష్టమైన అంకెల్లో చెప్పాలంటే 97.2 మిలియన్ల నుండి 132 మిలియన్లకు పెరుగుదల ఉంది.

భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో మొత్తం గ్రామీణ కుటుంబాలలో గ్రామీణ కార్మికుల కుటుంబాలశాతాలు ఈ క్రింది పట్టికలో ఇవ్వబడ్డాయి. ఈ పట్టికను బట్టి కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, బీహార్ మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలోని మొత్తం గ్రామీణ కుటుంబాలలో మూడో వంతుకు పైగా గ్రామీణ శ్రామికుల కుటుంబాలే ఉన్నాయని విశదమవుతుంది. గ్రామీణ శ్రామికులలో ప్రధాన భాగం వ్యవసాయ కార్మికులే. మొత్తం గ్రామీణ శ్రామికులలో వ్యవసాయ కార్మికులు 82% ఉంటారు.

పట్టిక 14:1

వివిధ రాష్ట్రాలలో మొత్తం గ్రామీణ కుటుంబాలలో గ్రామీణ కార్మికుల కుటుంబాల శాతం - 1963-64

రాష్ట్రం పేరు	శాతం
కేరళ	36.7
తమిళనాడు	36.3
ఆంధ్రప్రదేశ్	34.7
పశ్చిమ బెంగాల్	33.8
బీహార్	32.9
మహారాష్ట్ర	30.0
ఒరిస్సా	30.0
మైసూరు	23.6
మధ్య ప్రదేశ్	22.9
గుజరాత్	19.8
అస్సాం (మణిపూర్, త్రిపుర తో సహా)	15.0
ఉత్తర ప్రదేశ్	15.2
పంజాబు, ఢిల్లీ, హిమాచలప్రదేశ్‌తో సహా)	14.9
రాజస్థాన్	11.8
జమ్మూ - కాశ్మీర్	2.5
అఖిల భారత స్థాయి :	25.5

తాజాగా లభ్యమైన గణాంక వివరాల ప్రకారం మొత్తం గ్రామీణ జనాభా 434 మిలియన్లు ఉండగా, అందులో 100 మిలియన్ల జనాభాకు అసలు భూమే లేదని; 185 మిలియన్లకు కుటుంబానికి 5 ఎకరాల లోపు భూమి ఉన్నదని తెలుస్తోంది. చిన్న చిన్న భూఖండాలుగా 5ఎకరాలకు తక్కువ భూమి ఉన్నవారిలో అత్యధిక భాగం ప్రధానంగా వ్యవసాయ కార్మికులే.

ఎలా వున్నాయి? భూస్వామ్య అగ్రకుల పెత్తందారులు, రాజ్యాంగ యంత్రమూ ఏ విధంగా వీరిని అణచిపెట్టిందో, దోపిడీ చేసిందో కామ్రేడ్ నాగిరెడ్డి ఉదాహరణ సహితంగా వివరించారు. ప్రజాస్వామిక, ప్రగతిశీల దృక్పథం నుంచి పరిస్థితులను విశ్లేషించిన వారి రచనల నుంచి పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు, బూర్జువా పత్రికలు, వివిధ కమిషన్ల సర్వే రిపోర్టులు దాచిపెట్టలేని, వెల్లడించక తప్పని వాస్తవాలను కామ్రేడ్ నాగిరెడ్డి ఆ పత్రికల నుంచి, కమీషన్ రిపోర్టుల నుంచి గూడ ఉటంకించారు. మీ ప్రభుత్వ కమిషన్లు, సర్వేలు ఏమి చెబుతున్నాయో కళ్ళు తెరచి చూడండని హెచ్చరించాడు.

30 సంవత్సరాల నాడు " తెగించిన ఆగ్రహం అనివార్య" మని మొత్తం పరిస్థితుల సారాంశం నుంచి హెచ్చరించారు. గ్రామీణ శ్రామికుల సంఖ్య ఎలా పెరిగిందో; వారిలో భూమిలేని వారు, భూమి నుంచి తరిమివేయబడుతున్న వారి శాతం ఎలా పెరుగుతూ వస్తుందో, వారి సగటు ఆదాయం ఎలా పడిపోతూ పెరుగుతూ, పడిపోతూ వుందో వివరించారు.

కట్టుబానిస పద్ధతి, జీతపద్ధతి, కుల వ్యవస్థ, అంటరానితనం వివిధ రాష్ట్రాలలో ఎలా కర్కశ రూపాన్ని ప్రదర్శించిందో, ప్రవర్తిస్తూ వుందో వివరించారు. దళితులపై హింసాకాండ గురించి వివరిస్తూ ఆగ్రహం, ఆవేదన కలగలిసిన తీవ్రమైన బాధను వ్యక్తం చేసారు. " సామాజిక, రాజకీయ, ఆర్థిక వైరుధ్యాలు ప్రత్యక్ష ఘర్షణగా రూపొందుతున్నాయి. భూస్వాములు చట్టాలనే తమ చేతులలోకి తీసుకొని గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో క్రౌర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నీగ్రోల ఉద్యమాన్ని అణచడానికేర్పడిన రహస్యసంస్థ కూ- క్లక్స్-క్లాన్‌ని మరిపించేవిగా వున్నాయ"ని విశ్లేషించారు. గ్రామీణ పేదలు తమ న్యాయమైన హక్కుల రక్షణకై సాయుధ ఘర్షణ మినహా మరోమార్గం లేని పరిస్థితిని ఈ సాయుధ భూస్వాములే సృష్టించారని, సృష్టిస్తున్నారని ఆయన కోర్టులో ఉద్ఘాటించారు.

1963-64లో రాష్ట్రాల వారీగా మొత్తం గ్రామీణ కుటుంబాలలో వ్యవసాయకార్మికుల కుటుంబాల శాతం ఈ క్రింది పట్టిక చూపుతోంది.

పట్టిక : 14.2

1963-64లో మొత్తం గ్రామీణ కుటుంబాలలో వ్యవసాయ కార్మికుల కుటుంబాల శాతం

రాష్ట్రం పేరు	శాతం
ఆంధ్రప్రదేశ్	29.1
అస్సాం	11.7
బీహారు	26.3
గుజరాత్	15.8
జమ్మూ - కాశ్మీర్	1.0
కేరళ	27.2
మధ్యప్రదేశ్	19.5
మహారాష్ట్ర	26.6
ఒరిస్సా	26.5
మైసూరు	19.5
పంజాబ్ (హిమచల ప్రదేశ్‌తోసహా)	12.2

రాజస్థాన్	4.5
తమిళనాడు	30.9
ఉత్తరప్రదేశ్	12.4
పశ్చిమ బెంగాల్	27.4
అఖిల భారత స్థాయి :	**20.0**

ఆంధ్రప్రదేశ్, బీహారు, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో గ్రామీణ కుటుంబాల్లో వ్యవసాయ కార్మిక కుటుంబాల శాతం అఖిల భారత స్థాయిని మించిపోయింది.

భూమి లేని కూలీలు

దేశంలో నేడు భూమిలేని కూలీల సంఖ్య ఒక పెరుగుతున్న లక్షణంగా ఉంది. పెట్టుబడిదారీ సంబంధాలు, సరుకుల ఉత్పత్తి విధానంపెరగటం వలన చిన్న తరహా ఉత్పత్తి నాశనమవుతుంది. వ్యవసాయంలో ఇది చిన్న సాగుదార్లను, కౌలుదార్లను భూమిలేని వ్యవసాయ కార్మికుల స్థాయికి దిగజార్చి; ఆ విధంగా ఎటువంటి ఉత్పత్తి సాధనాలులేని గ్రామీణ శ్రామిక వర్గాన్ని సృష్టిస్తుంది. జీవించటం కోసం వీరు మార్కెట్లో అమ్ముకొనటానికి తమ శ్రమశక్తి మినహా మరేమీ ఉండదు.

"రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి" అనే తన గ్రంథంలో లెనిన్ ఇలా వ్రాశారు :

"వ్యవసాయంలో యంత్రాలు ఉత్పత్తి కేంద్రీకరణకు, పెట్టుబడిదారీ సహకార పద్ధతులకు దారి తీశాయి." మరియు "యంత్రాల వినియోగం ప్రత్యేకించి విస్తృతంగా వ్యాపించి ఉన్న ప్రాంతాలలో (Novo Russia) క్షేత్రాలు గణనీయమైన పరిమాణం కలిగినవిగా కూడా ఉంటాయి" "మరమగ్గం చేనేత పనివాడిని త్రోసివేసినట్లుగానే, వ్యవసాయంలో ఒక క్రమపద్ధతిలో యంత్రాల వాడకం పెరగడం వలన పూర్వకాలపు మధ్య రైతుల్ని తిరుగులేని విధంగా త్రోసి వేస్తుంది."

ఆ విధంగా వ్యవసాయంలో సరుకుల ఉత్పత్తి విధానం పెరుగుదల, గ్రామీణప్రాంతాలలో పెరుగుతున్న పెట్టుబడిదారీ సంబంధాలు, ఉత్పత్తి కేంద్రీకరణ, యంత్రాల వాడకం పెరుగుదల చిన్న, మధ్యతరగతి రైతులను తమ భూముల నుంచి వెళ్ళగొట్టి భూమిలేని కార్మికుల సంఖ్య పెంచుతాయి.

కాబట్టి భారతదేశంలోని పాలకవర్గమైన బడా బూర్జువా – భూస్వామ్య వర్గం అనుసరిస్తున్న విధానాలు గ్రామీణ శ్రామిక వర్గ సైన్యాన్ని అధికం చేస్తున్నాయంటే ఆశ్చర్యపడవలసిన విషయమేమి కాదు. భారతదేశంలో "నూతన వ్యవసాయ అభివృద్ధి వ్యూహం" ప్రభావం గురించి అనేక పరిశీలనలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

1956-57, 1963-64 సంవత్సరాలకు సంబంధించి వ్యవసాయ కార్మికుల కుటుంబాలలో భూమిలేని కుటుంబాలు, భూమి ఉన్న కుటుంబాలు ఏ నిష్పత్తిలో ఉన్నాయో ఈ క్రింది పట్టిక నుండి తెలుసు కోవచ్చును. ఈ పట్టికలోని వివరాలు భూమిలేని గ్రామీణ శ్రామికవర్గం పెరుగుదల ధోరణిని సూచిస్తాయి.

పట్టిక : 14.3

1956-57-1963-64 లో మొత్తం వ్యవసాయ కార్మిక కుటుంబాలలో పంపిణీ శాతం వర్గీకరణ

రాష్ట్రం పేరు	భూమి ఉన్న కుటుంబాల శాతం		భూమి లేని కుటుంబాల శాతం	
	1956 -57	1963-64	1956-57	1963-64
ఆంధ్రప్రదేశ్	33.0	27.3	67.0	72.7
అస్సాం	29.7	40.3	70.3	59.7
బీహారు	61.2	47.3	38.8	52.7
గుజరాత్	27.1	13.7	72.9	86.3
జమ్ము-కాశ్మీర్	32.8	50.0	67.2	50.0
కేరళ	56.1	69.9	43.9	30.1
మధ్య ప్రదేశ్	38.9	50.0	61.0	50.0
మహారాష్ట్ర	27.1	28.6	72.9	71.4
మైసూర్	34.5	31.0	65.5	69.0
ఒరిస్సా	53.0	44.8	47.0	55.2
పంజాబ్	11.0	14.5	89.0	85.5
రాజస్థాన్	35.8	39.6	64.2	60.4

" నేడు హరిజనులకు గ్రామాలలో రక్షణ వుండడం లేదు. హరిజనుడు తనకు అన్యాయం జరిగిందని తెలిసినా, అధికారులు తమకు న్యాయం కలిగించడానికి సిద్ధంగా వున్నారనుకొని ఫిర్యాదు చేద్దామనుకున్నా, సమాజంలో ప్రత్యేక హక్కులు అనుభవిస్తున్న అగ్రకులాల వారి ప్రతీకార చర్యలకు భయపడి అతడు ఫిర్యాదు చేయడం లేదు."

" భూసంస్కరణలు ప్రస్తుత వ్యవసాయక వ్యవస్థ శిఖరాన్ని చదును చేశాయే తప్ప, పునాదిని ఏ మాత్రం తాకలేక పోయాయి. ఫలితంగా భూమి యజమానులైన సవర్ణ హిందువులకు, భూమిలేని హరిజనులకు మధ్య ఉద్రిక్తతలు పదునెక్కాయి. సస్య విప్లవం వల్ల వచ్చే సామాజిక మార్పులు సైతం ఇదే ధోరణిలో వున్నాయి" అని 1971 సెప్టెంబరు 15 (టైమ్స్ ఆఫ్ ఇండియా) పత్రిక సంపాదకీయాన్ని ఉటంకించారు.

" సమాజంలో కొన్ని మార్పులు సంభ వించినప్పటికీ అవి ప్రధానంగా ఫ్యూడల్ నిర్మాణంలోని కుల వ్యవస్థ పరిధిలోనే జరిగాయి. కాని కుల వ్యవస్థను ఏ మాత్రం బ్రద్దలు చేయలేదు. రూపాలు మారి వుండవచ్చు కాని ప్రాథమికంగా కులవ్యవస్థ అలాగే వుండిపోయింది."

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా అర్ధఫ్యూడల్, అర్ధవలస స్వభావాన్ని కల్గివుంది. ఈ కాలమంతటిలోనూ ఈ స్వభావంలో ప్రాథమికమైన ఎలాంటి మార్పు సంభవించక పోవడమే సమాజంలో కుల వ్యవస్థ అలాగే నిలిచి వుండడానికి కారణమయింది. సరుకుల ఉత్పత్తితో కూడిన ఆర్థిక వ్యవస్థలో సంపద తారతమ్యాలు సైతం కుల వ్యవస్థను మరింతగా తీవ్రం చేస్తాయి."

కనుక "తెగించిన ఆగ్రహం అనివార్య"మని కామ్రేడ్ నాగిరెడ్డి హెచ్చరించారు. గ్రామీసీమలలో విలయతాండవం చేస్తున్న హింసా కాండను వివరిస్తూ ఒరిస్సా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, కేరళ, రాజస్థాన్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో దళితులపై భూస్వామ్య అగ్రకులాలు సాగించిన దారుణ కృత్యాలను ఉదహరించారు.

తమిళనాడు	34.5	29.0	65.5	71.0
ఉత్తరప్రదేశ్	54.3	51.5	45.7	48.5
పశ్చిమబెంగాల్	33.4	37.8	66.6	62.2
అఖిలభారత స్థాయి	41.6	38.8	58.4	61.2

మొత్తం వ్యవసాయ కుటుంబాలలో భూమిలేని వ్యవసాయకార్మికుల కుటుంబాల అఖిలభారత సగటు 1956-57 నాటికి 58.4% ఉండగా, అది 1963-64నాటికి 61.2%కి పెరిగింది. ఆంధ్రప్రదేశ్, బీహారు, గుజరాత్, మైసూరు, ఒరిస్సా, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో భూమిలేని వ్యవసాయ కార్మికుల కుటుంబాల శాతంలో ఈ విధమైన పెరుగుదల ఉంది. మొత్తం వ్యవసాయ కార్మికుల కుటుంబాలలో భూమిలేని వ్యవసాయ కార్మిక కుటుంబాల శాతం అఖిల భారత సగటు (61.2%) కంటేపెచ్చుగా ఉన్న రాష్ట్రాలు ఇవి :ఆంధ్రప్రదేశ్ (72.7%), గుజరాత్(86.3%), మహారాష్ట్ర (71.4%), మైసూరు (69.0%), పంజాబ్ (85.5%), తమిళనాడు (71.0%), పశ్చిమ బెంగాల్ (62.2%)

" వరి పండించే ప్రాంతాలలో 80% మెజారిటీ ప్రజల ఆర్థిక పరిస్థితిలో సాపేక్షిక క్షీణత చవిచూశారు. నోటిమాట ఒప్పందంతో కౌలు చేస్తున్న అరక్షిత కౌలుదార్లకు ప్రాతినిధ్యం వహించే ఒక భాగం రైతుల జీవన ప్రమాణస్థాయి పూర్తిగా క్షీణించింది.

"హెచ్చు దిగుబడినిచ్చే వరివంగడాలు జయప్రదంగా ప్రవేశపెట్టిన ప్రాంతాలలో వాస్తవానికి ఒకవైపు పెద్ద వ్యవసాయదారులకు; మరొకవైపు అత్యధిక భాగంగా ఉన్న చిన్న రైతులు, స్వంత భూములుండి కౌలు భూములు కూడా సాగుచేస్తుండే రైతులు, పాలు సాగుదార్లకు - మధ్య ఆర్థిక విభజన పోకడ ఇప్పటికే ప్రారంభమైంది."

(మెయిన్ స్ట్రీమ్ - 1969 డిశంబరు13)

ఈ సమస్యను పరిశోధించి ఆయన సేకరించిన సమాచారం ప్రకారం బర్వాన్ జిల్లాలోని 4 గ్రామాలలోని మొత్తం జనాభాలో వ్యవసాయ కార్మికులు, భూమిలేని రైతులు, భూమిలేని పాలుదార్లు కలసి 39%, 52%, 67%, 59% ఉన్నారని తేలింది.

కామ్రేడ్ నాగిరెడ్డి వివరించి సూత్రీకరించిన విధంగానే గత 30 సంవత్సరాల (1971-2003) గ్రామసీమల పరిస్థితి వుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సహకార బ్యాంకులు, ప్రభుత్వ సంస్కరణలు, ప్రపంచీకరణలో భాగంగా సాగుతున్న సామ్రాజ్యవాద దోపిడీకి అనుకూలమైన సంస్కరణలు అన్నీ గ్రామసీమలలో ఒక నూతన సంపన్న వర్గాన్ని సృష్టించాయి. గ్రామాలలో గత 30 సంవత్సరాల కాలంలో దళితులపైన, వ్యవసాయ కార్మికులపైన దమనకాండ మరింత తీవ్రమయింది.

జాతీయ ఎస్.సి., ఎస్.టి, కమీషన్ ఆరవ నివేదిక (2000-01) 30 సంవత్సరాల తర్వాత నేటి పరిస్థితిని యిలా తెలియజేస్తుంది. "భూవివాదాలు, భూ పరాయీకరణ, బలవంతపు కూలీ, కనీసవేతనాలు చెల్లించక పోవడం అన్న కారణాల పైనే ఎస్.సి., ఎస్.టి.లపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని వివిధ నివేదికలు వెల్లడిస్తున్నాయి."

సర్వసాధారణంగా గత 30 ఏళ్ళ క్రితం కారణాలే హింసాకాండకు, అత్యాచారాలకు కారణంగా వున్నాయి. దళితులు చట్టపరిధిలో, పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టినందుకు, కోర్టుల కెళ్లినందుకు, భూమి, నీరు, అడవి తదితర సహజవనరులపై హక్కుకోసం; దళితులు, ఆదివాసీలు సంఘాలు కట్టినందుకు; తమ కిష్టమైన రీతిలో, వృత్తిలో జీవించడానికి ప్రయత్నించినందుకు; పండుగలు, తిరునాళ్లు, పెళ్ళిళ్ళలో సాముదాయక, సాంస్కృతిక జీవితంలో కలసి ఆనందించాలనుకొన్నందుకు; ఓటు హక్కుని స్వేచ్ఛగా వినియోగించు కొన్నందుకు; స్వాభిమానంగా వ్యవహరించినందుకు; అగ్ర, ఆధిపత్య కులాల మూఢాచారాలకు తలవంచి బలిపశువులు కానందుకు; వ్యవసాయ వృత్తిదారులైన రైతు కూలీలు, దళితులు హింసాకాండకు, అత్యాచారాలకు గురవుతున్నారని దళిత మానవహక్కుల నిఘా (సాక్షి) సేకరించిన రిపోర్టులు తెలియజేస్తున్నాయి.

- సంపాదకులు

వ్యవసాయ కార్మిక కుటుంబాలలో తరగతులవారీగా చూస్తే కొద్దిపాటి భూములున్న కుటుంబాల సంఖ్య 1956-57లో 42% ఉండగా, అది 1963-64 నాటికి 39%కి పడిపోయింది. వ్యవసాయ కార్మికుల ఎన్‌క్వయిరీ రిపోర్టుల ప్రకారం మొత్తం వ్యవసాయ కార్మికులలో భూమిలేని కార్మికులు 1950-51లో 50% ఉండగా, అది 1956-57 నాటికి 57%కి పెరిగింది.జాతీయ నమూనా సర్వే ప్రకారం ఇది ఇంకా పెరిగి 1963-64 నాటికి 61%కి చేరుకున్నది.

"ఈ విధంగా అభివృద్ధి ప్రణాళికలు అమలు జరిగిన అన్ని సంవత్సరాల్లోను భూమిలేని వ్యవసాయ కార్మికుల శాతం పెరుగుతూనే ఉన్నది."

1963-64 తర్వాత సాంద్ర వ్యవసాయం అభివృద్ధి చెందిన కొన్ని ప్రాంతాలలో "సస్య విప్లవం" ప్రభావం గురించి పూర్తి అధ్యయనం జరగలేదు. నూతన వ్యవసాయ అభివృద్ధి వ్యూహం తీవ్రంగా అమలు జరిపిన ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికుల సంఖ్య ప్రముఖంగా పెరిగిందని ఇంతవరకూ జరిపిన కొన్ని పరిశీలనలు రుజువు చేస్తున్నాయి.

నూతన వ్యవసాయ అభివృద్ధి వ్యూహం అమలు జరిపిన ప్రాంతాలలో రైతాంగం యొక్క సామాజిక, ఆర్థిక సంబంధాలను గురించి పరిశీలించిన ఫ్రాంకైన్ ఫ్రాంకెల్ ఈ క్రింది నిర్ణయానికి వచ్చాడు.

బర్వాన్ జిల్లాలో చాలా పెద్ద మెజారిటీ వ్యవసాయ కుటుంబాలు అసలు భూమిలేని వారుగానో లేక గిట్టుబాటుకాని మూడు ఎకరాలలోపు భూమి కలిగిన వారుగానో ఉన్నారు. పై లెక్కలు సూచిస్తున్న ఈ వివరణను " ప్రాజెక్టు అధికారి, సాంద్ర వ్యవసాయాభివృద్ధి పథకం ఉద్యోగులు సైతం బలపరుస్తున్నారని" కూడా ఆయన పేర్కొన్నారు. (పై పత్రిక - పేజి 20) "పశ్చిమ గోదావరి జిల్లాలోని వ్యవసాయదారుల కుటుంబాలలో 60% వాస్తవానికి వ్యవసాయ కూలీలేనని " ఆయన తెలియజేశారు. (మెయిన్ స్ట్రీమ్-7-12-69) "పాల్ఘాట్ జిల్లాలోని వ్యవసాయక జనాభాలో అత్యధిక భాగం 85% మేరకు వ్యవసాయ కూలీలే". లూథియానా జిల్లా గురించి తెలియజేస్తూ ఆయన ఇలా వ్రాశారు. గిట్టుబాటులేని "వ్యవసాయదారులు అంటే వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని చిన్న వ్యవసాయదారులు పెద్ద క్షేత్రాల మీద, చిన్న క్షేత్రాల మీద పెట్టిన పెట్టుబడులకు వచ్చే ఆదాయంలో గల వ్యత్యాసం చాలా తీవ్రమైనదిగా ఉండటంతో, చివరికి తమ కమతాలను అమ్ముకొని" వ్యవసాయ వృత్తినే వదిలి పెట్టే స్థితికి క్షీణించిపోతారు. అదే విధంగా కౌలుదారీ వర్గం సైతం క్రమంగా అంతర్ధానమై పోతుంది.

ఈ నూతన వ్యవసాయాభివృద్ధి వ్యూహం ప్రభావం గురించి తాను చేసిన పరిశీలనను సమీక్షిస్తూ ఆయన " ఇది ఇప్పటికే గ్రామాలలో పెద్ద సంఖ్యలో వున్న యువకులను నిరుద్యోగులుగా చేసింది. వీరు రాబోవు సంవత్సరాలలో తీవ్రమైన సామాజిక ఆర్థిక సమస్యలకు, శాంతి భద్రతల సమస్యలకు కారణం కావచ్చును. భూమి యజమానులకు, వ్యవసాయకార్మికులకూ మధ్య 'సత్సంబంధాలు' శ్రీఘంగా క్షీణించి ఇప్పటికే భూస్వాములకు,కార్మికులకు మద్య ప్రథమ ఘర్షణలకు దారితీసిందనీ" వ్యక్తం చేశారు.

ఈ విధంగా రెండు ధృవాలుగా ఉన్న శక్తుల మధ్య సంఘర్షణలు మరింతగా పెరుగుతాయని చెబుతూ ఆయన ఈ విధంగా ప్రకటించారు.

" గోధుమ పండే ఇతర ప్రాంతాల్లో - ఉదాహరణకి 10 ఎకరాల కంటే తక్కువ కమతాలు కలిగిన వ్యవసాయదారుల కుటుంబాలు అత్యధిక మెజారిటీగా ఉన్నటువంటి, అసమాన కౌలు ఒప్పందాలు చేసుకోవడం వల్ల చిన్న వ్యవసాయదారులకు అసలే చాలీచాలకుండా ఉన్న వనరులు మరింతగా కరిగిపోతున్నటువంటి, భూమిలేని కార్మికులు అధిక భాగంగా ఉన్నటువంటి పారిశ్రామికాభివృద్ధి స్థాయి చాలా తక్కువగా ఉన్నటువంటి ఉత్తరప్రదేశ్, బీహార్‌లో గోధుమ విప్లవం వల్ల వచ్చిన విశేషమైన సదుపాయాలు వ్యవసాయక జనాభాలో చాలా కొద్ది భాగానికి తప్ప ఇంకెవ్వరికీ అందటం మనకు కన్పించదు. వాస్తవానికి ఈ ప్రాంతం లో సాధించిన విజయాలను చాల పెద్ద యెత్తున వక్రించవచ్చు. అంతరాలు మరింత పెరుగుతాయి; వ్యవసాయ రంగంలో నిరుద్యోగులయ్యే వారి సంఖ్య వ్యవసాయేతర రంగంలో ప్రత్యామ్నాయ ఉద్యోగ వసతి కల్పించగల సంఖ్యకంటే చాలా హెచ్చుగా ఉంటుంది." ఈ అన్ని కారణాలు "గ్రామీణ ప్రాంతాలలో వర్గ సంఘర్షణకు" దారి తీస్తుంది. "వరిపంట ప్రబలంగా ఉండే పశ్చిమ గోదావరి, తంజావూరు, పాల్ఘాట్, బర్ద్వాన్ జిల్లాల్లో వ్యవసాయం ఆధునికీకరణ, సామాజిక మార్పును పరిశీలిస్తే ఇదే దృశ్యం స్పష్టంగా బయటపడుతుంది."

వ్యవసాయ కార్మికుల సగటు ఆదాయం

తలసరి ఆదాయం గురించి చర్చించిన సందర్భంలోనే భారత రిజర్వుబ్యాంకు సమాచారం ప్రకారమే "1967-68లో గ్రామీణ ప్రజానీకంలో 70% దారిద్ర్యంలో మగ్గుతున్నారని" మనం గమనించాం. ఈ విధంగా భారతదేశంలో పస్తులతో సమానమైన ఆహారంతో బ్రతుకున్న వారిలో ప్రధాన భాగం వ్యవసాయ కూలీలే. వారి వేతనాలు అత్యంత తక్కువ స్థాయిలో వుండటమే కాదు. నిరుద్యోగం కూడా అత్యంత హెచ్చుస్థాయిలో వుంది. 'ఎకనమిక్ టైమ్స్' పత్రిక (25-11-1970) చేసిన ఒక పరిశీలన ప్రకారం ఇతర గ్రామీణ కటుంబాలలో ఈ నిరుద్యోగం 15% వరకు వున్నది. భూస్వాములు నియమించుకొనే జీతగాళ్లు, పాలెగొళ్ళ లాంటి వారికో తప్ప తక్కివ వ్యవసాయ కార్మికులకు సంవత్సరం పొడుగునా కూడా పనిదొరకదు. మెట్ట ప్రాంతాలలో పనులు దొరికే రోజులు ఎక్కువలో ఎక్కువ సంవత్సరానికి 150రోజులు మాత్రమే వుంటాయి. నీటి పారుదల సౌకార్యాలున్న ప్రాంతాలలో సైతం నాట్ల, కోతల కాలంలో మాత్రమే నిండుగా పనులు దొరుకుతాయి. ఇక మిగతా కాలాల్లో చిల్లర మల్లరగానూ, పాక్షికంగానూ మాత్రమే పని వుంటుంది.

1956-57, 1963-64 రెండు వేర్వేరు సంవత్సరంలలో వ్యవసాయ కార్మిక కుటుంబం ఒక్కింటికి లభ్యమయ్యే సగటు సంవత్సరాదాయం వివరాలు ఈ క్రింది పట్టికలో ఇవ్వబడ్డాయి. ఈ సమాచారం భారతదేశం అంతటికీ సంబంధించినది. రాష్ట్రాలవారీ సమాచారం లభ్యం కాలేదు.

పట్టిక : 14.4

వ్యవసాయ కార్మికుని కుటుంబం ఒక్కింటికి సాలీనా సగటు ఆదాయం వనరుల వారీగా అఖిల భారత స్థాయిలో

ఆదాయం వనరు	ఆదాయం సాలీనా రూపాయలలో		మొత్తంలో శాతం	
	1956-57	1963-64	1956-57	1963-64
1.భూమి సాగు ద్వారా	32.15	42.54	8.3	6.4
2.వ్యవసాయ వేతనాలు	281.08	544.55	72.9	82.5
3.వ్యవసాయేతర వేతనాల ద్వారా	56.96	33.33	14.8	5.1
4. ఇతర వనరుల ద్వారా	15.19	39.47	4.0	6.0
మొత్తం	385.38	660.89	100.0	100.0

ఆధారం : ఎకనమిక్ టైమ్స్ - 9 ఆగస్టు, 1970.

వ్యవసాయ కార్మికుని కుటుంబం ఒక్కింటికి సాలీనా సగటు ఆదాయం 1956-57లో రూ. 385.38 పైసలు ఉండగా అది 1963-64 నాటికి రూ. 659.86 పైసలకు అంటే 71% పెరిగింది.

ఇక్కడ గమనించవలసిన మౌలికాంశం ఏమంటే 1956-57 లో కంటే 1963-64లో వ్యవసాయ కార్మికులు వేతనాల మీద ఆధారపడటం చాలా హెచ్చుగా పెరిగింది. వ్యవసాయ కార్మికులు మొత్తం ఆదాయంలో వ్యవసాయ వేతనం 1956-57లో 72.9% ఉండగా అది 1963-64 నాటికి 82.5%కి పెరిగింది. వ్యవసాయేతర పనులు ద్వారా, ఇతర వృత్తుల ద్వారా వచ్చే ఆదాయం 1956-57లో రూ. 56.96 పైసలు ఉండగా 1963-64 నాటికి రూ. 33.33 పైసలకు పెద్దగా పడిపోయింది. గ్రామీణ రంగంలో ఇతర వృత్తులకు ఉన్న కొద్దిపాటి అవకాశాలు సైతం మృగ్యమయ్యాయని స్పష్టమౌతున్నది.

వ్యవసాయ కార్మికుల రోజువారీ సగటు ఆదాయం 1950లో 207 పైసలు ఉండగా అది 1956-57 నాటికి 203 పైసలకు పడిపోయి తిరిగి 1964-65 నాటికి అది 297 పైసలకు పెరిగిందని " ఎకనమిక్ టైమ్స్' పరిశోధన బృందం తెలియజేసింది. **(18 నవంబరు,1970)**

గ్రామాల్లో నివశించే ఎవరికైనా సగటు ఆదాయానికి సంబంధించిన ఈ అంకెలు చాలా అతిశయోక్తులని స్పష్టమవుతాయి. నాలుగింట మూడు వంతుల భూమి మెట్ట వ్యవసాయం క్రింద ఉండగా,వీటిలో అనేక వెనుకబడిన మారుమూల ప్రాంతాలలో ఇప్పటికీ రోజువారీ కూలీ 50పైసల కంటే తక్కువస్థాయిలో ఉండగా, ఈ సగటు ఆదాయం ఎలా సాధ్యం? ఇవీగాక అత్యధిక సంఖ్యాక నిరుద్యోగుల్ని, సంవత్సరంలో అత్యధిక భాగం పనులు లేని వాళ్ళను పరిగణనలోకి తీసుకొన్నపుడు, చాలా అభివృద్ధయిన ప్రాంతాల్లో సైతం ఈ సగటు ఆదాయం సాధ్యంకాదు.

అయినప్పటికీ ఈ సమాచారాన్ని మరొక దృక్కోణం నుంచి పరిశీలించుదాం. 1950-51 -1956-57 సంవత్సరాలలో జరిపిన ఈ రెండు వ్యవసాయ విచారణల రిపోర్టులను, 1964-65 సంవత్సరానికి సంబంధించి కేంద్ర కార్మిక బ్యూరో విడుదల చేసిన సమాచారాన్ని

పరిశీలించినట్లయితే ఈ "14 సంవత్సరాల కాలంలో వ్యవసాయ కార్మికుల ఆదాయం డబ్బు రూపంలో 37% పెరిగినప్పటికీ, వారి నిజవేతనాలు వాస్తవానికి 5% తగ్గాయని" మనం గమనించగలం. "ఎకనమిక్ టైమ్స్" పత్రిక అదే వ్యాసంలో ప్రచురించిన క్రింది పట్టిక ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తున్నది.

పట్టిక : 14.5

వ్యవసాయ కార్మికుల ద్రవ్య నిజవేతనాల సూచికలు

సంవత్సరం	ధనరూపంలో వేతనాల సూచికలు		నిజవేతనాలు సూచికలు	
	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు
1950-51	100	100	100	100
1956-57	94	94	94	94
1964-65	137	145	95	100

"రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతన చట్టాలు ఆమోదించినప్పటికీ వాస్తవంలో నిర్ణయించబడిన కనీస వేతనం కంటే చాలా తక్కువే వ్యవసాయ కూలీలకు లభ్యమవుతున్నది."

అందువల్ల వ్యవసాయ కూలీల వేతనాలలో ఏమాత్రం పెరుగుదల ఉన్నా దానిని కాస్తా ధరల పెరుగుదల మింగివేసింది. దానితో వ్యవసాయ కూలీల పరిస్థితి వాస్తవానికి మరింత దారుణంగా తయారైంది. ఫలితంగా గ్రామీణ సమాజంలో ఉన్నత శ్రేణికి చెందిన భూస్వాములకు, గ్రామీణ శ్రామికులకు మధ్య ఆర్థిక పరిస్థితులలో ఉన్న అగాధం మరింత విస్తృతమయింది.

వేతనాలు వివిధ రూపాలలో చెల్లించబడుతున్నాయనేది కూడా మనం గుర్తుంచుకోవాలి. సరకుల ఉత్పత్తి విధానం పెట్టుబడిదారీ సంబంధాలు అభివృద్ధి చెందిన ప్రాంతాలలో సైతం ఫ్యూడల్ సంబంధాలు వివిధ రూపాలలో ఉన్నాయి. కొన్ని సందర్భాలలో వేతనాలు రొక్కం రూపంలో చెల్లించబడుతున్నాయి. అయితే ఇంకా అనేకచోట్ల, అనేక సమయాలలో ప్రత్యేకించి కోతల సమయంలో వేతనాలు వస్తు(ధాన్యం వగైరా) రూపంలో చెల్లించబడుతున్నాయి. ఇంకా మరికొన్ని చోట్ల కొంతభాగం నగదు రూపంలోను, కొంతభాగం వస్తురూపంలోను చెల్లించబడు తున్నాయి. లెనిన్ చెప్పినట్లుగా " పెట్టుబడిదారీ విధానం ప్రత్యేకించి నెమ్మదిగా, పూర్తిగా విభిన్నమైన రూపాలలో వ్యవసాయంలోకి చొరబడు తుంది." దీని ఫలితంగా ఫ్యూడల్ దోపిడిలో వివిధ రూపాలలో ఉన్న పెట్టుబడిదారీ సంబంధాలు కలగలసి గ్రామీణ పేదలపై అంతులేని భారాన్ని మోపుతాయి.

మనదేశపు గ్రామీణ ప్రాంతాలలో దాదాపు అన్నిచోట్ల ఫ్యూడల్ సంబంధాలు ప్రబలంగా ఉన్నాయి. గ్రామాలలోని రైతాంగంపై మధ్య యుగాలనాటి భూస్వాముల పెత్తనాన్ని దాదాపు పూర్తిగా ఈ ఫ్యూడల్ సంబంధాలు పరిరక్షిస్తున్నాయి. గ్రామసీమల్లో ఉద్రిక్తతల పెరుగుదలకు దారితీస్తున్న ఫ్యూడల్ దోపిడీ పద్ధతులను విదితంచేసే కొన్ని ఉదాహరణలను ఇక్కడ ఇస్తాను. దేశంలో ఇంకా " కట్టు బానిసత్వం" లేదా "రుణ బానిసత్వం" అనే పద్ధతి అనేక ప్రాంతాలలో ప్రబలంగా కొనసాగుతూనే ఉంది. "ఎకనమిక్ టైమ్స" పత్రికలో మైసూరు రాష్ట్రంలోని హరిజనుల పరిస్థితులను గురించి వ్రాసిన ఒక వ్యాసంలో ఈ రుణ బానిసత్వం పద్ధతి గురించి ఇలా ఉంది.

ఇక "జీత" పద్ధతి అనేది మరొకటుంది. ఇది చాల కఠోరమైన వెట్టి చాకిరీ పద్ధతి. అమెరికాకు ప్రారంభంలో వలస వెళ్లి స్థిరపడిన వారు అమలు చేసిన బానిసత్వానికి చాల దగ్గరగా ఉంటుంది. హసన్ జిల్లాలోని కొన్ని భాగాల్లోనూ, దక్షిణ కెనరా, చిక్‌మగళూరు, షిమోగా జిల్లాలోను ఇది అమలులో ఉంది. ఈ పద్ధతిని గురించి విలయ పెరుమాళ్ కమిటీ ఇలా వివరించింది. ఈ జీత పద్ధతి ప్రకారం వ్యవసాయ కార్మికులకు బాగా అవసరమైన సమయంలో కొద్దిపాటి డబ్బు అప్పుగా ఇస్తారు. తన చాలీచాలని జీతం నుండి ఈ అప్పు మరల తిరిగి చెల్లించలేని విధంగా కొన్ని షరతులతో ఆ వ్యవసాయ కార్మికుడు బంధించబడతాడు. ఎందుకంటే అతనికి భూస్వామి ఆహారం, బట్టలు, కొద్దిపాటి జీతం మాత్రమే ఇస్తాడు. అందువల్ల ఆ అప్పు తీర్చడం ఎంతమాత్రం వీలుగాకుండా ఉంటుంది. పైగా అది పెరుగుతూనే ఉంటుంది. ఈ అప్పు తిరిగి తీర్చడంలో ఆ వ్యవసాయకార్మికుని కుటుంబంలోని పిల్లలు కూడా ఇరికించబడతారు." (ఎకనమిక్ టైమ్స్- జూన్, 1970)

ఆ విధంగా ఈ భూస్వామ్య ప్రభువులు తమ "కూలీల" పై న్యాయాధికారం సైతం కలిగి వున్నారు. వివిధ రూపాల వెట్టిచాకిరీతో బాటు మధ్యయుగాలనాటి ఫ్యూడల్ పద్ధతులను దాదాపు అన్నింటినీ వారు పరిరక్షించారు. ఫ్యూడలిజం కొన్ని ప్రాంతాలలో ఇతర ప్రాంతాల కంటే మరింత ఎక్కువగా వర్ధిల్లుతున్న మాట వాస్తవమే. అయినప్పటికీ ఏ ప్రాంతాలలో కూడా ఫ్యూడలిజం పూర్తిగా నిర్మూలించ బడలేదనేది వాస్తవం.

ఉదాహరణకు దేశమంతటా పాలేరు (attached labourer) పద్ధతి ప్రబలంగా ఉంది. ఫ్రాంకైన్ ఫ్రాంకెల్ బర్వాన్ జిల్లా గురించి వ్రాస్తూ ఇలా తెలియజేశాడు. " భూమి యజమానులకు, వ్యవసాయ కూలీలకు మధ్య శాశ్వత సంబంధాలు ఇప్పటికీ అమలులో ఉన్నాయి. ప్రత్యేకించి జిల్లాలో పెద్ద కమతాలు ఉన్న ప్రాంతాలలో ఇది సర్వసామాన్యం. సాంద్రవ్యవసాయ పద్ధతులు అమలులోకి రావడంతో, పనులు బాగా ముమ్మరంగా ఉన్న సమయాలలో హామీగా వచ్చే కూలీలు అవసరం హెచ్చుగా ఉంటుంది. ఈ అవసరమే వాస్తవానికి భూమి యజమానులకీ, వ్యవసాయ కార్మికులకూ మధ్య శాశ్వత సంబంధాల పద్ధతిని బలీయం చేసింది." (మెయిన్ స్ట్రీమ్ 13 డిసెంబరు, 1969)

ఈ పద్ధతి స్థానిక సాంప్రదాయాలపైన, ఆచారాలపైన ఆధారపడి ఉంది. "వీరు (వ్యవసాయకూలీలు) సాంప్రదాయకమైన ఏర్పాటు ప్రకారం నియమించబడతారు. ఈ ఏర్పాటు వల్ల వ్యవసాయ కూలీ కుటుంబాలు సాధారణంగా ఒక తరం తర్వాత మరొకతరం యజమాని కుటుంబం వారికి శాశ్వతంగా ముడిపడి ఉంటారు. అటువంటి వారిలో కొందరు తమకు నగదు రూపంలో సంవత్సరానికి రూ. 110ల నుంచి రూ. 150ల వరకు ఏటా 6 నుంచి 7 మణుగుల ధాన్యం వరకు చెల్లించబడు తుందని చెప్పారు. ఇవికాక మామూలుగా వారికి రోజుకు రెండు లేక మూడు పూటల భోజనం, సంవత్సరంలో మూడు లేక నాలుగు పంచలు, ఒక గొంగడి, నూనె, బీడీలు, ఇల్లు కప్పుకునేందుకు వరిగడ్డి దొరుకుతాయి." (పై పత్రిక - పేజీ 22)

ఈ విధంగా పాలేర్లని చెప్పేవారిలో రుణబానిసత్వం, కులకట్టుబాట్లు, భూమి కేటాయింపులో భూస్వామికి బంధించబడి ఉండటం లక్షణాలుగా ఉంటాయి. పెట్టుబడిదారీ విధానం పూర్వపు లక్షణాల ప్రాబల్యాన్ని ఈ కూలీ పద్ధతులు సూచిస్తున్నాయి. ఆచరణలో తిరిగి చెల్లించడానికి

అసాధ్యమయ్యే పద్ధతులలో ఉండే అప్పుల వల్ల వీరు శాశ్వతంగా భూస్వాములకు బంధీలుగా ఉండాల్సి వస్తోంది.

అంతేగాక అనేక సందర్భాలలో పాలేర్లను నియమించుకొనే భూస్వాములు ఆ కూలీలకు ఇళ్ల స్థలాలను, కొన్ని సందర్భాలలో పంటలో భాగం (పాలు) ఇచ్చే ప్రాతిపదికపై భూములు కూడా ఇస్తారు. దక్షిణ భారతదేశంలో పడియాల, పన్నెయాల, పులయాలు, పాలేర్లు, జీతగాళ్ళు అని పిలువబడే వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారిలో అత్యధిక భాగం ఒక తరంనుండి మరొకతరం వరకూ కాకపోయినా, కనీసం సంవత్సరం తర్వాత సంవత్సరం ఒకే భూస్వామి కుటుంబాలకు పనిచేస్తూ ఉంటారు.

ఇలాంటి మధ్య యుగాలనాటి కట్టుబానిసల పద్ధతి ఇంకా పెరుగుతోందని రెండవ వ్యవసాయ కార్మిక విచారణ నివేదిక వెల్లడి చేసింది. మొత్తం వ్యవసాయ కూలీలలో ఈ విధమైన కట్టుబానిసల భాగం 1950-51లో 9.7% వుండగా, 1956-57 నాటికి 26.63%కి పెరిగింది. **భారతదేశం లోని వ్యవసాయ కూలీలలో గణనీయమైన భాగం పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావానికి ముందున్న ఫ్యూడల్ దోపిడీ పద్ధతులకు గురవుతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు.** మనదేశపు విస్తారమైన గ్రామీణ ప్రాంతాలలో వస్తురూపంలో వేతనాలు చెల్లించే అర్ధఫ్యూడల్ పద్ధతి ఇంకా ప్రబలంగానే ఉంది. ఈ కాలంలో వ్యవసాయ కూలీల ఉపాధిపరిస్థితి, అలాగే కూలీ పని షరతులు, నిబంధనలు గమనించదగినంత హీనంగా తయారయ్యాయని రెండవ వ్యవసాయ కార్మిక విచారణలో వెల్లడయ్యింది.

తక్కువ జీతాలు, అమానుషమైన జీవిత పరిస్థితే గాక వ్యవసాయ కార్మికులు నిరుద్యోగానికి, తక్కువ పనిపాటల (Under employment) కు బలవుతున్నారు. 1965లో వ్యవసాయకార్మికుల విషయమై జరిగిన అఖిల భారత సెమినార్‌కు కేంద్ర గణాంకసంస్థ సమర్పించిన ఒక నోటులో కూడా వ్యవసాయ కార్మికులకు ఏడాదిలో 200 రోజులు మాత్రమే పనులు దొరుకుతున్నాయని తెలియజేసింది.

వ్యవసాయ కార్మికులు గ్రామాలలో ఒక అంతర్భాగంగా పరిగణించ బడటంలేదు. గ్రామాలకు వెలుపల వారు విడిగా మురికి వాడలలో మంచినీటి బావులు, రోడ్లు, సందులు మొదలగు కనీస సౌకర్యాలు కూడా లేకుండా దుర్భరమైన జీవితాన్ని గడపవలసి వస్తోంది. వారిలో అధికభాగం నిరక్షరాస్యులే.

వీరి పరిస్థితులు ఈ విధంగా ఉండి నానాటికీ దిగజారుతూ, ఫ్యూడల్ దోపిడీ అణచివేత పద్ధతులు వ్యవసాయ కార్మికునిపై బహిరంగ హింసా రూపాలు తీసుకొంటున్నాయి. (ఈ హింసాకృత్యాలకు సంబంధించిన అనేక ఉదాహరణలు ఈ అధ్యాయంలోనే తర్వాత ఇవ్వబడినాయి). పరిస్థితులు ఇలా ఉండగా "పాక్షికమైన బూర్జువా వ్యవసాయక సంస్కరణలను అమలు జరిపినందుకుగాను కాంగ్రెస్ ప్రభుత్వానికి సోవియట్ రివిజనిస్టులు తమ పొగడ్తలనందజేయడం చాలా అసహ్యాన్ని కలిగిస్తుంది. 1970 సెప్టెంబరు 4న 'ఇజ్వెస్తియా' పత్రికలో ప్రచురితమైన ఒక వ్యాసంలో వారిలా వ్రాస్తున్నారు. "భారతదేశంలో అమలు చేయబడుతున్న బూర్జువా వ్యవసాయ సంస్కరణలు అసంపూర్ణంగా వున్నప్పటికీ, వ్యవసాయ సమస్యను రైతాంగానికి అనుకూలంగా పరిష్కరించలేక పోయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాలలో పురాతన ఉత్పత్తి సంబంధాలను నిర్మూలించలేక పోయినప్పటికీ - అవి ఫ్యూడల్ భూస్వాములపై, సంస్థానాధీశులపై, జమిందార్లపై దెబ్బతీశాయి." భారత బూర్జువా వర్గానికి సేవ చేయడంలో సోవియట్ రివిజనిస్టులు రాజును మించిన రాజభక్తి పరాయణులుగా తయారయ్యారు.

"పురాతన అర్ధబానిస విధానం" కంటే ఈ వ్యవస్థ ఏ మాత్రం మెరుగుకాదని "ఎకనమిక్ టైమ్స్" సైతం తన 1 జూన్,1970 తేదీ సంచికలో వర్ణించింది. రంజిత్‌దాస్‌గుప్తా వ్రాసినట్లుగా " పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావానికి ముందున్న దోపిడీరూపాలు - పెట్టుబడిదారీ దోపిడీ పద్ధతులు పెనవేసుకుపోయి గ్రామీణ భారత దేశంలోని అట్టడుగు వర్గాల దారిద్ర్యాన్ని స్వయంగానూ, సాపేక్షికంగానూ, అధికతరం చేసింది.

కులవ్యవస్థ

ఈ ఆర్థిక దోపిడీలతో పాటు వ్యవసాయకార్మికులు మన దేశంలో అనాదిగా ఉన్న కుల వ్యవస్థ వల్ల కూడా సామాజిక పీడనకు గురవు తున్నారు. మన దేశపు వ్యవసాయ కార్మికులలో అత్యధికభాగం అంట రాని కులాలకు లేదా వెనుకబడిన కులాలకు చెందిన వారే. ఈ కులాల పై అమలు చేయబడుతున్న సాంఘిక బహిష్కరణ (వెలి) పద్ధతులు అమెరికాలోని నీగ్రోలపై తెల్లజాతి వారి వైఖరికంటే దారుణంగా ఉన్నాయి. బావులు, చెరువులు ఉపయోగించటం, దేవాలయాలలో ప్రవేశం, ఇతర పబ్లిక్ స్థలాల వినియోగం వీరికి నిషిద్ధం.

ప్రధానంగా అర్ధఫ్యూడల్, అర్ధవలస స్వభావం కలిగిన భారత ఆర్థిక వ్యవస్థలో బ్రిటిష్‌వారి కాలంలో ఎలాంటి మౌలికమైన మార్పు సంభవించ కపోవడమే దీనికి కారణం.

బ్రిటీష్ వారి నుండి భారత దళారీ బూర్జువా వర్గానికి అధికార మార్పిడి జరిగిన తరువాత కూడా దేశంలోని సామాజిక, ఆర్థిక పరిపాలనా రంగాలలో ఎలాంటి మౌలికమైన మార్పులు సాధించ బడలేదు; అందువల్లనే ఈనాటికీ భారత ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా అర్ధఫ్యూడల్, అర్ధ వలస స్వభావాన్ని కలిగి ఉంది. కొన్ని అంశాలలో రూపంలో కొంతమార్పు ఉన్నప్పటికీ, కుల పద్ధతిలో మౌలికంగా మార్పు సంభవించలేదు.

పంచాయతీరాజ్ వ్యవస్థ, సస్య విప్లవం అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాలలో సరుకుల ఉత్పత్తి విధానం అభివృద్ధి, ఇవన్నీ బడా భూస్వాముల, బడా పెట్టుబడిదారీ వర్గాల ప్రాబల్యం పెరగటానికే తోడ్పడ్డాయి. కులవ్యవస్థపై ఆధారపడిన సనాతన పునరుద్ధరణ వాద, ఛాందసవాద సామాజిక సిద్ధాంతాల అండదండలతో ఈ వర్గాలు తమ పెత్తనాన్ని మరింతగా బలీయం చేసుకొన్నాయి.

తమపై రుద్దబడిన ఈ దారుణ జీవిత పరిస్థితుల నుండి వ్యవసాయ కార్మికులను విముక్తి చేయాలంటే ప్రప్రథమంగా భూస్వామ్య విధానాన్ని తుడిచి పెట్టేయడం అవసరం. వ్యవసాయక విప్లవం ద్వారానే వ్యవసాయక వ్యవస్థలోను, గ్రామీణ ప్రాంతాల్లోని సామాజిక సంబంధాల లోను ప్రాథమికమైన మార్పులు సాధించబడగలవు.

అంటరానితనం

అంటరానితనం సమస్య గ్రామీణ ప్రాంతాలలోని భూమి సంబంధాల సమస్యలతో ముడిపడి ఉంది. ఇంత ఎత్తున, ఇంత విస్తృతంగా అంటరాని

తనం సమస్య వుండటమన్నది ప్రధానంగా షెడ్యూల్డు కులాల వారి ఆర్థిక దుస్థితికి ప్రతిబింబం. అలాగే ఫ్యూడల్ సాంఘిక ఆర్థిక సంబంధాలింకా బలంగా ఉన్న నేటి ఆర్థిక సమాజానికి ప్రతిబింబం. ఈ షెడ్యూల్డు కులాలవారు పూర్తిగా అగ్రవర్ణాలకు చెందిన భూస్వాముల పైననే ఆధారపడవలసి వస్తోంది. ఇవి ఈనాటి గ్రామీణ ఆర్థిక సంబంధాలు:

"గ్రామీణ ప్రాంతాలలో ఉన్నత శ్రేణిగా చెప్పబడుతున్న వారి అధికారం పెరగడం" వల్ల "భారతదేశం 'స్వతంత్రం' అయిన సమయంలో కంటే కులవ్యవస్థ నేడు మరింత బలంగా తయారైంది." " కులం అనేది భారతదేశపు సాంప్రదాయంలోచాలా లోతుగా పాతుకుపోయి ఉన్నది. సమూలమైన శస్త్రచికిత్స ద్వారా తప్ప దానిని నిర్మూలించడం సాధ్యం కాదు." (ఏషియన్ డ్రామా -పేజీ 279)

ప్రజా వెల్లువల ప్రభావంతో భూస్వామ్య వ్యవస్థను సమూలంగా తుడిచిపెట్టి, గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యూడల్ భూస్వాముల పట్టును తుత్తనియలు చేయశక్తి కలిగిన, నూటికి నూరుపాళ్ళు ప్రజాతంత్రమైన విప్లవ మొక్కటే అంటరానితనాన్ని పరిష్కరించగలదు.

మన దేశంలో వివిధ ప్రాంతాలలో భూస్వాములకు, వ్యవసాయ కార్మికులకు మధ్య ఉద్రిక్తత వాతావరణం నిరంతరం పెరుగుతున్నది. సాంద్ర వ్యవసాయ జిల్లా పథకం క్రింద నున్న తంజావూరు జిల్లాలో ఈ విధమైన ఉద్రిక్త వాతావరణం గురించి "ఎకనమిక్ టైమ్స్" ప్రత్యేక విలేఖరి 9 జులై, 1970 తేదీ సంచికలో ఇలా వ్రాశారు. "జిల్లాలో తూర్పున ఉన్న అరడజను తాలూకాల్లో వ్యవసాయ కార్మికులకు భూస్వామ్య వర్గానికి మధ్య నిరంతరం సాగుతున్న ఉద్రిక్త వాతావరణం ఆందోళనకర అంశంగా తయారైంది. ఈ ఉద్రిక్తత స్త్రీలు, పిల్లలతో సహా 42 మంది వ్యక్తులను సజీవదహనం చేసిన దారుణ మారణకాండకు దారితీసింద" ని వ్రాశాడు. కేవలం న్యాయమైన కూలికోసం అణగారిన వ్యవసాయ కార్మికులు పోరాటం చేస్తేనే, భూస్వాముల ఆగ్రహావేశాలు ఊహించడానికే వీలులేని స్థాయికి చేరుకొంటున్నాయి.

భారతదేశంలో షెడ్యూల్డు కులాలు, జాతులు

భారతదేశంలో జనాభాలో అయిదోవంతుకు పైగా షెడ్యూల్డు కులాలకు, జాతులకు చెందినవారే. 1961 జనాభా లెక్కల ప్రకారం మన దేశపు మొత్తం జనాభాలో షెడ్యూల్డు కులాలవారు 14.67% (6.44కోట్లు), షెడ్యూల్డు జాతులవారు 6.87% (2.99 కోట్లు) ఉన్నారు. అంటే భారతదేశంలోని ప్రతి 7వ వ్యక్తి షెడ్యూల్డు కులాలకు, ప్రతి 15వ వ్యక్తి గిరిజనులకు చెందినవారే.

రాష్ట్రాల వారీగా మొత్తం జనాభాలో 1961 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డు కులాల, జాతుల శాతాలు ఈ క్రింది పట్టికలో ఇవ్వబడినాయి.

పట్టిక : 14.6

రాష్ట్రం పేరు	షెడ్యూల్డు కులాలు	షెడ్యూల్డు జాతులు	మొత్తం
ఆంధ్ర	13.82	3.68	17.50
అస్సాం	6.17	17.39	23.56
బీహార్	14.00	9.05	23.05
గుజరాత్	6.63	13.35	19.98
జమ్ము కాశ్మీర్	7.98	-	7.98
కేరళ	8.49	1.26	9.75
మధ్య ప్రదేశ్	13.14	20.63	33.77
తమిళనాడు	18.01	0.75	18.76
మహారాష్ట్ర	5.63	6.06	11.69
మైసూర్	13.22	0.81	14.03
ఒరిస్సా	15.75	24.07	39.82
పంజాబ్	20.38	0.07	20.45
రాజస్థాన్	16.67	11.67	28.34
ఉత్తరప్రదేశ్	20.88	-	20.88
పశ్చిమ బెంగాల్	19.73	5.88	25.61
అఖిలభారత స్థాయి శాతం	14.67	6.87	21.54

రాష్ట్రాల వారీగా షెడ్యూల్డు కులాల జనాభా సంఖ్యలను పరిశీలన చేసినట్లయితే, మొత్తం షెడ్యూల్డు కులాల జనాభాలో 20.88% ఉత్తర ప్రదేశ్ లోను, 14% బీహారులోను, మరో 19.73%పశ్చిమ బెంగాల్‌లోను వున్నారని తెలుస్తుంది. దేశంలోని షెడ్యూల్డు జాతులు (గిరిజనులు) జనాభాలో సగభాగం మధ్యప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలోనే ఉన్నారు. దేశంలోని షెడ్యూల్డు కులాల జనాభాలో దాదాపు 97%, షెడ్యూల్డు జాతుల జనాభాలో 97% కంటే హెచ్చు భాగం గ్రామీణ ప్రాంతాలలోనే నివశిస్తున్నారు. మొత్తం గ్రామీణ జనాభాలో షెడ్యూల్డు కులాలవారు 15.97%, షెడ్యూల్డు జాతులవారు 8.16% ఉన్నారు.

భారతదేశపు సాధారణ అక్షరాస్యత రేటుకంటే ఈ షెడ్యూల్డు కులాలు, జాతుల అక్షరాస్యత రేటు చాలాతక్కువ. భారతదేశపు సాధారణ అక్షరాస్యత రేటు 24% ఉండగా షెడ్యూల్డు కులాలు, జాతులలో అక్షరాస్యత రేటు 10% మాత్రమేనని 1961 జనాభా లెక్కలు తెలియజేస్తున్నాయి. ఈ అక్షరాస్యు లలో సైతం అత్యధిక భాగం "విద్యా స్థాయిలేని" అక్షరాస్యులే.

షెడ్యూల్డు కులాలు, జాతుల జనాభాలో అత్యధిక భాగం గ్రామీణ ప్రాంతాల్లో నివశిస్తున్న వారే. వీరిలో అధికభాగం వ్యవసాయపు పనులలో నిమగ్నమై ఉంటారు. అందువల్ల గ్రామీణ పేదరికం అనే సాధారణ సమస్యకు సంబంధం లేకుండా ప్రత్యేకించి విడిగా వీరి విముక్తి సాధ్యం కానేరదు. భూస్వామ్య విధానాన్ని బలవంతంగా, హింసాయుతంగా కూలద్రోసి, భూములను విప్లవాత్మక పద్ధతిలో పునఃపంపిణీ చేయకుండా ఈ విముక్తి సాధ్యం కాదు. క్లుప్తంగా చెప్పాలంటే దేశవ్యాపితంగా సామాజిక ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పు ద్వారానే షెడ్యూల్డు కులాల, జాతుల సమస్యలు పరిష్కారం కాగలవు.

హరిజనుల స్థితిగతులు

1970లో "ఎకనమిక్ టైమ్స్" పత్రిక హరిజనుల పరిస్థితుల గురించి వ్యాసపరంపరను ప్రచురించింది. వాటిలో కొన్ని భాగాలను పరిశీలించినట్లయితే సమాజంలో అట్టడుగున పడి వున్న హరిజనులు - మధ్య యుగాలలోని అర్ధబానిస కంటే అతిహీనంగా, దారుణంగా చూడబడుతున్నారనే వాస్తవం వెల్లడవుతుంది.

పంజాబ్‌లో : సామాజికంగా మంచిస్థితిలో ఉన్న వారికి దూరంగా వున్నపేటలలో ఈ హరిజనులు నివశించవలసివస్తోంది.. "అగ్రవర్ణాలు" వారి బావుల నుండి వీరు మంచినీరు తెచ్చుకోడానికి వీలులేదు. డేరా బాసాయి సబ్-డివిజన్‌లోని డేహ్రా గ్రామంలో నీటి పంపులు (చేతి పంపులు) వున్నప్పటికీ, హరిజనులు వాటిని తాకడానికి కూడా వీలులేదు.

పాటియాలాకు సమీపంలో గల దావున్‌కలాన్ అనే ఒక ఆదర్శ గ్రామంలో స్థానిక మహేంద్ర కళాశాలకు చెందిన ప్లానింగ్ ఫోరం వారు గత ఏడాది సామాజిక ఆర్థిక సర్వే జరిపారు. ఈ గ్రామం ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందినదే. ఈ గ్రామంలో ఒక హైస్కూలు, పోస్టాఫీసు, పారిశ్రామిక శిక్షణాకేంద్రం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తదితర అన్ని సౌకర్యాలున్నాయి. అయితే ఈ గ్రామం సామాజికంగా ఎంత వెనుకబడిన స్థితిలో ఉందంటే ఆ గ్రామంలో బావుల నుండి హరిజనులు నీళ్ళు తెచ్చుకోవడం నిషిద్ధం. గ్రామ హైస్కూలులో షెడ్యూల్డు కులాల ప్రవేశానికి నిషేదం లేకపోయినప్పటికీ, ఆ కులాలకు చెందిన ఒక్క విద్యార్థి కూడా అందులో లేడు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరగటంతో, భూమిలేని వ్యవసాయ కూలీలు హెచ్చు కూలీ డిమాండ్ చేసినపుడల్లా, భూస్వామ్య వర్గం నుంచి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొనవలసి వస్తుంది... మూడు నెలల క్రితం గ్రామ పాఠశాల కోసం ఒక మంత్రి శంకుస్థాపన చేసినపుడు ఈ పాఠశాల ఆటస్థలం కోసం గ్రామ పంచాయితీ భూమి దానం చేసినపుడు తీవ్రమయిన తగవు తలెత్తింది.

ఇందులో లాల్‌లకేర్ (గ్రామ నివేశన స్థలాలు) భూమి కొంత కలసి ఉంది. ఆ భూమి పంజాబ్ గ్రామ ఉమ్మడి భూముల చట్టంలో నిర్వచించిన 'షమ్లాత్' భూమి కాదు. హరిజనుల ఇళ్ళ ముందు కనీసం దారి సమ కూర్చకపోతే హరిజన కుటుంబాల వారికి చాలా కష్టం కలుగుతుందనే కఠిన వాస్తవాన్ని భూమిని దానం చేసిన గ్రామ పంచాయతీ దృష్టిలోకే తీసుకోలేదు. 20 ఫ్రిబవరి, 1970న హరిజనుల ఇళ్ళ చుట్టూ ముళ్ళ తీగతో కూడిన కంచె ఏర్పాటు చేయబడింది. " పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్ (ఇందిరా గ్రూపు) అధ్యక్షుడైన జైల్‌సింగ్ నాయకత్వాన పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్ నియమించిన ఒక అధ్యయన బృందం ఆ గ్రామాన్ని సందర్శించినపుడు రెండు ఇళ్లలోనికి వెళ్ళడానికి అసలు దారే లేదన్నట్లు కనుగొన్నది." " చాలా సందర్భాలలో పోలీసులు ప్రేక్షకుల్లాగా మౌనంగా చూస్తూ ఊరుకొన్నందున రాష్ట్రమంతటా ఇదే విధమైన సంఘటనలు అనేక రెట్లు అధికమౌతున్నాయి."

"మౌలికమైన సామాజిక ఆర్థిక అసమానత్వం సమస్యతో అంటరాని తనం సమస్య ముడిపడి ఉంది. పురాతనమైన వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థలో భూస్వామ్య వర్గాలకు అతిచౌక కూలీకి శ్రమచేసి పెట్టేందుకు హరిజనులు అనివార్యమైన భాగంగా పరిగణించబడుతున్నారు." "పాత సామాజిక వ్యవస్థ నూతనంగా తలెత్తుతున్న ధోరణులను ప్రతిఘటిస్తున్నది. దీని ఫలితంగా హరిజనులలో అత్యధిక మెజారిటీ భాగం అతిహీనంగా చూడబడుతున్నారు."

స్వాతంత్ర్యానంతరం రెండు దశాబ్దాల తర్వాత కూడా పంజాబ్‌లోని షెడ్యూల్డు కులాల సామాజిక ఆర్థిక పరిస్థితులలో గణనీయమైన ఎలాంటి మెరుగుదల సంభవించలేదని రాష్ట్రంలో ఇటీవల అధికారయుతంగా జరిగిన ఒక సర్వే వ్యక్తం చేస్తున్నది".

"గ్రామాలలోని అట్టడుగు వర్గాల వారికి వ్యతిరేకంగా ఇతర వర్గాలు ఆర్థికాధికారాన్ని ఒక ఆయుధంగా వినియోగిస్తున్న అనేకసంఘటనలు రిపోర్టులో పేర్కొనబడ్డాయి. ప్రత్యేకించి షెడ్యూల్డు కులాలవారు తమ హక్కులను అమలుపరచుకోవాలని ప్రయత్నించినపుడల్లా ఇలాంటి తీవ్ర సంఘటనలు-అట్టడుగు వర్గాల వారిని భూముల నుండి బేదఖలు చేయడం, వారిని పనులలో నుండి తొలగించడం, గ్రామ నౌకర్లకు చెల్లించవలసిన జీతభత్యాలను చెల్లించకుండా నిలుపుదల చేయడం వంటి రూపాలు తీసుకొంటాయి. 1963-64 సంవత్సరంలో రాష్ట్రంలోని మొత్తం జనాభా తలసరి ఆదాయం సాలీన రూ. 483 ఉండగా, షెడ్యూల్డు కులాల జనాభా తలసరి ఆదాయం సాలీనా రు.194 మాత్రమేనని ఆ రిపోర్టు పేర్కొన్నది. (ఎకనమిక్ టైమ్స్ - 29 జూన్,1970)

మధ్యప్రదేశ్‌లో : 1. ఒక దేవాలయానికి సంబంధించిన నిర్మాణ స్థలంలో పనిచేయడానికి ఒక హరిజన వ్యవసాయ కూలీకి అనుమతి నిరాకరించబడింది.

2. హరిజనులే స్వయంగా నిర్మించుకొన్న ఒక దేవాలయంలో వారు పూజ చేయకుండా నిరోధించబడ్డారు.
3. మందసూర్ గుర్రం ఎక్కి ఊరేగుతున్న చమర్ (మాదిగ) కులానికి చెందిన పెళ్లి కుమారుణ్ణి బలవంతంగా దించివేశారు. ఎందుకంటే ఆ అర్హత కేవలం సవర్ణ హిందువులదేనట!
4. ఎన్నికల ద్వారా ఏర్పడిన సంస్థలలో సైతం అంటరాని తనం పాటించ బడుతోంది. పంచాయితీకి ఎన్నుకోబడిన హరిజనులు పంచాయతీ సమావేశాల సందర్భంగా, సమావేశపు హాలు గుమ్మం బయట నేలమీదనే కూర్చోవలసి వస్తున్నదని, అగ్రవర్ణ హిందువులు మాత్రం కుర్చీలు ఆక్రమించుకొని కూర్చుంటారని తరచుగా రిపోర్టులు వస్తుంటాయి.

"అంటరానితనం నిర్మూలన చట్టాన్ని అమలు చేయడంలో వైఫల్యాలకు అనేక కారణాలు చెప్పబడుతున్నాయి." "దీనికి సంబంధించిన ఫిర్యాదుల పట్ల పోలీసులు ఉదాసీన వైఖరి" దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి."అంటరాని తనం నేరాలు చేసేది సాధారణంగా అగ్రకులాలవారే. వీరే ఆయా ప్రాంతాలలో పలుకుబడి గల్గిన వ్యక్తులుగా ఉంటారు. అంతేగాక ప్రభుత్వ ఉన్నతాధికారులలో అత్యధిక శాతం ఫ్యూడల్ భూస్వామ్య కుటుంబాలకు చెందినవారే."

రాష్ట్రంలోని భూమిలేని హరిజనులకు భూములు ఇవ్వాలనేది ఎడతెగని డిమాండ్‌గా ఉంది. వివక్షత చూపటం, పక్షపాతం, స్వజన పక్షపాతం, భూసంస్కరణల పథకంలోని నిబంధనలను పాటించక పోవడం - ఇలాంటి ఫిర్యాదులను వెనుకబడిన కులాలకు చెందిన ప్రతినిధులు తరచూ చేస్తుంటారు. **వాస్తవానికి పరిస్థితి చాల ఉద్రిక్తంగా తయారైంది. ప్రభుత్వం కట్టుదిట్టమైన పద్ధతి రూపొందిస్తే తప్ప ఏ రోజునైనా పరిస్థితి బద్దలై బయటపడవచ్చు."** (ఎకనమిక్ టైమ్స్ - 25 మే, 1970).

మైసూర్‌లో: ఇటీవల కొందరు హరిజన నాయకులు కోలారు జిల్లాలోని ఒక గ్రామానికి పత్రికా విలేకరుల బృందాన్ని ఒక దానిని తీసికెళ్ళగా-"ఉమ్మడి బావుల నుండి నీళ్ళు తెచ్చుకోకుండా హరిజనులు ఇప్పటికీ అటకాయించబడటం, వారిని అగ్రవర్ణాలవారు పూర్తిగా వెలివేయడం చూసి ఈ బృందం చాలా ఆశ్చర్యపోయింది."

"యుగ యుగాలుగా అమలు జరుగుతున్న అర్థ బానిసత్వం, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రతిస్పందించే తత్వాన్ని హరిజనులు దాదాపు పూర్తిగా కోల్పోయారు." ఈ విధంగా అసమానతలు చివరకు ధృడమైన సామాజిక తరగతుల విభజనతో ఘనీభవించాయి. వీటిలో కులవ్యవస్థ గుర్తించదగిన అంశం. రాజకీయ వికేంద్రీకరణ లేదా పంచాయితీరాజ్ వ్యవస్థ అగ్రకులాల వారికి రాజకీయ పదవీ ప్రాపకాలకు మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా అగ్రకులాల వారి స్థానాన్ని మరింత బలోపేతం

చేసింది. వివిధ తరగతుల ప్రయోజనాల మధ్య అంతర్గతంగా ఇమిడి ఉన్న సంఘర్షణ గురించి శ్రీ ఎమ్.ఎన్. శ్రీనివాస్ "యోజన పత్రిక" (1అక్టోబర్, 1961)లో ఇలా వర్ణించారు.

" తమ ముందున్న రాజకీయ ఆర్థిక అవకాశాల పట్ల చైతన్యం గల వర్గంగా గ్రామాల్లోని ఉన్నత శ్రేణికి చెందినవారు తయారయ్యారు. ఈ అపారమైన అవకాశాలను తమ సొంతం కోసం ఉపయోగించు కోవడానికి వీరు ఏమాత్రం వెనుదీయరు. ఇక్కడ ఒక మౌలిక వైరుధ్యాన్ని గురించి ప్రస్తావించవలసిన అవసరం ఉంది. గ్రామీణప్రాంతాల ప్రయోజనార్థం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను అమలు పరచడంలో భాగమైన గ్రామీణ నాయకుల మార్గదర్శకత్వాన్ని తీసు కొంటుంటారు. **గ్రామాలలోని ఉన్నత శ్రేణుల ప్రయోజనాలకు, అట్టడుగు వర్గాల ప్రయోజనాలకు మధ్య ప్రాథమికమైన ఘర్షణ ఉంటుందనే వాస్తవం ఇక్కడ విస్మరించబడుతోంది.** గ్రామాల్లోని ఉన్నత శ్రేణి వర్గం సంపాదనాభిలాష ఎక్కువ కలిగి దౌర్జన్య పూరితంగా వుండటమే కాక తాము దోపిడీ చేస్తున్న ప్రజలపట్ల తప్పు చేస్తున్నామనే భావంతో కూడా వ్యవహరించరు. గ్రామీణ ప్రాంతాలలో వారసత్వం దోపిడీ ఎంత లోతుగా వేళ్ళూనుకొన్నాయంటే మారుమాట లేకుండా ఇవి ఆమోదించబడు తున్నాయి. తమతో సంబంధం లేకుండా పట్టణ రాజకీయ నాయకులు కానీ, పరిపాలకులు గానీ ఏమీ చేయలేరని గ్రామీణ ఉన్నత శ్రేణికి తెలుసు" (యోజన – 1 అక్టోబర్, 1961) ఈ విధంగా ప్రజాస్వామ్యమే ఈ ధనిక స్వామ్యానికి దాసోహమంటోంది.)

ఈ పరిస్థితులలో గ్రామ ప్రాంతాలలోని వైరుధ్యాలు హింసాయుత సంఘర్షలకు దారితీసేంతగా పెరుగుతున్నాయంటే ఆశ్చర్యమేముం టుంది! "హరిజనులు తదితర వెనుకబడిన కులాలకు చెందిన గ్రామీణ పేదలు తమ సామాజిక హక్కుల కోసం, అధిక వేతనాల కోసం ఎక్కడ, ఎప్పుడు పోరాటాలు చేసినా (సామాజికంగా ఉన్నతులైన అగ్రకులాల లకు చెందిన భూస్వాములు) కుల చీలికలు సృష్టించి, అన్ని రకాల హింసాయుత పద్ధతుల ద్వారా వారి న్యాయమైన పోరాటాలను గొంతు నులిమి వేస్తున్నారు." ఈ వెనుకబడిన కులాలవారిని చిత్రహింసలకు, హత్యలకు గురిచేస్తున్న అనేక సంఘటనలు ప్రతినిత్యం పత్రికలలో ప్రచురించబడుతున్నాయి. అంటరానివారికి, వెనుకబడి తరగతులకు వ్యతిరేకంగా జరుపని ఘోరనేరాలంటూ లేవు.

గ్రామ సీమలలో విలయతాండవం చేస్తున్నహింసాకాండ

గ్రామీణ ప్రాంతాలలో ఉన్నతశ్రేణికి చెందిన వారి అధికారం పెరగటంతో హింసా దౌర్జన్యాలు కూడా పెరుగుతున్నాయి. గ్రామ ప్రాంతాలలోని పేదలపై, ప్రత్యేకించి తక్కువ కులాలవారిపై కనీవినీ ఎరుగని దౌర్జన్యాలు ఇటీవలి సంవత్సరాలలో అసంఖ్యాకంగా పెరిగాయి. సామాజిక, రాజకీయ, ఆర్థిక వైరుధ్యాలు ప్రత్యక్ష ఘర్షణగా రూపొందుతున్నాయి. భూస్వాములు చట్టాలనే తమ చేతుల్లోకి తీసుకొని గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో క్రౌర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కూ-క్లక్స్ క్లాన్ నే (అమెరికాలో నీగ్రోల ఉద్యమాన్ని అణచడానికేర్పడిన అత్యంత హింసాత్మకమైన రహస్య సంస్థ. ఇది 1861-65 అంతర్యుద్ధం తరువాత అనేక దక్షిణాది రాష్ట్రాలలో ఏర్పడింది. తిరిగి 1916లో యూదులు, కాథలిక్కులు, నీగ్రోలకు వ్యతిరేకంగా పునరుద్ధరించ బడింది-అను) తలదన్నారు. **జర్మనీలో యూదులపై సాగిన నాజీల క్రూరకృత్యాలను భారతదేశంలోని గ్రామీణ ప్రాంతంలో సర్వశక్తి సంపన్నులైన ఫ్యూడల్ భూస్వాములు పునరావృతం చేస్తున్నారు. గ్రామీణ పేదలు తమ న్యాయమైన హక్కుల రక్షణకై, సాయుధ ఘర్షణ మినహా మరో మార్గం లేని పరిస్థితిని ఈ సాయుధ భూస్వాములే సృష్టించారని, సృష్టిస్తున్నారని నేను అభిప్రాయపడుతున్నాను.**

కేంద్ర దేశీయాంగశాఖ అందించిన సమాచారం ప్రకారమే దేశంలోని వివిధ ప్రాంతాలలో 1969 లో తొంభైముగ్గురు హరిజనులు దారుణంగా హత్య చేయబడ్డారు. మానభంగాలు, హత్యలతో సహా హరిజనులపై అత్యాచారాలు సాగిన సందర్భాలు 355 వరకు ఉన్నాయని షెడ్యూల్డు కులాల కమీషనర్ కార్యాలయం తెలియజేసింది.

చాలా అరుదుగా మాత్రమే నేరస్థుడిపై కేసులు పెట్టబడ్డాయి. అరుదుగా మాత్రమే చట్టాన్ని ధిక్కరించినవారిని శిక్షించారు. అధికార్ల ఈ ఘోరమైన ఉదాశీన వైఖరి యాదృచ్ఛికం కాదు. రాజ్యాంగ యంత్రానికి చెందిన ఈ అంగాలు ప్రభుత్వానికి ప్రధాన గ్రామీణ పునాదిగా ఉన్న సమాజంలోని ఉన్నత శ్రేణి వారితో అత్యంత సన్నిహితంగా ముడిపడి ఉన్నాయి. వ్యవసాయ కూలీలుగా, భూమిలేని రైతులుగా హరిజనులు ఆర్థికంగానే కాక, సామాజికంగా కూడా దారుణ దోపిడీకి గురి అవుతున్నారు.

'గౌరవనీయమైన' పత్రికలలో ప్రచురితమైన దౌర్జన్య సంఘటనలను కోర్టువారి దృష్టికి తీసుకురాదల్చాను. అధికారుల పర్యవేక్షణ, ఆశీర్వాదం, కుమ్మక్కులతోనే భూస్వాములు దేశంలోని హింసాకృత్యాలకు ఏవిధంగా బాధ్యులో ఈ సంఘటనలు రుజువు చేస్తాయి. నేను కోర్టువారిని ఒక విషయం అడగదలుచుకొన్నాను. హింసను హింస ద్వారానే ఎదుర్కొనడం ప్రజల న్యాయమైన బాధ్యత కాదా?

మనం ఒక నిర్ణయానికి రాబోయే ముందు మనం ఎదుర్కొంటున్న సమస్య ఎంతటి స్థాయిలో ఉన్నదో, వాస్తవాలేమిటో మొదట పరిశీలిద్దాం. దేశంలో విలయ నృత్యం చేస్తున్న ఫ్యూడల్ స్వైర్య విహారం ఎలాంటిదో, సంఘటనలలో ఇమిడి వున్న వివిధ సమస్యలు ఎలాంటివో, భూస్వాములు అనుసరిస్తున్న వివిధ పద్ధతులు ఎలాంటివో దీని ద్వారా మనకొక అభిప్రాయం వస్తుంది.

"పేట్రియాట్" దినపత్రిక 11 డిశంబరు, 1968న పంజాబ్ రాష్ట్రం లోని పిరోజ్‌పూర్ జిల్లా ధరంకోట జిరా సెక్షన్‌లో హరిజన సాగుదార్లపై సాయుధ గూండాల దాడిని గురించి ప్రచురించింది. ఈ సంఘటనలో ఇళ్లను అగ్నికి ఆహుతి చేశారు. పంటలను ధ్వంసం చేశారు. సాగు దార్లను కట్టివేసి తీవ్రంగా కొట్టారు. ఇదొక్కటే అయితే అంత ఆందోళన కలిగించేది కాదని, ఇది అలాంటి అత్యాచారాల పరంపరలో ఒక ఘటన అని, ఇలాంటి సంఘటనలు ఒకటి రెండు రాష్ట్రాలకే పరిమితమైలేవని, ఆ పత్రిక వ్యాఖ్యానించింది. హరిజనుల హత్యలు, వారి స్త్రీలపై అత్యా చారాలు, వారి ఇళ్ళు ధ్వంసం చేయడం వంటి సంఘటనల పరంపర దేశమంతటా జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో ఇటీవలి మాసాల్లో హరిజనులను బెదిరించి, లొంగదీసుకొనే పద్ధతిలో ఒక దుర్మార్గపు పథకం కనిపిస్తున్నది. ఉన్నత స్థానాలలో ఉన్నవారి సానుభూతి ప్రకటనలు ఈ సహించరాని పరిస్థితిని అంతమొందించలేవు. ఆత్మరక్షణకై తమంతట

తాము సంఘటితపడుతున్న హరిజనులకు ప్రత్యామ్నాయంలా కులోన్మాదులను పరిపాలనా యంత్రాంగం నుండి క్షాళనం చేసేందుకై తీవ్రచర్య గైకొనడం ఒక్కటే మార్గం." అని ఆ పత్రిక వ్రాసింది.

ప్రధానంగా 1970-71 సంవత్సరాలలో జరిగిన సంఘటనలను తీసుకొందాం.

మే 20వ తేదీ అర్ధరాత్రి ఒరిస్సా రాష్ట్రంలోని ఢెంకనాల్ జిల్లా మసానియా గ్రామంలో పెద్ద సంఖ్యలో హిందువులు హరిజనులపై దాడి చేసి, వారి ఇళ్ళను తగులబెట్టి, 13 కుటుంబాలకు చెందిన 14 మంది హరిజనులను నిరాశ్రయుల్ని చేశారని "నేషనల్ హెరాల్డ్" పత్రిక 28-5-70 సంచిక తెలియజేసింది.

చేపలు పట్టుకొనే హక్కుల గురించి తలెత్తిన వివాదంలో సంబల్‌పూర్ జిల్లా తాందై గ్రామంలో ఒక గోండు (హరిజన) కుటుంబానికి చెందిన నలుగురు సోదరులు సజీవదహనం చేయబడ్డారని "స్టేట్స్ మన్" పత్రిక ఆగస్టు 7, 1970 సంచిక తెలియజేసింది.

"ఇండియన్ ఎక్స్‌ప్రెస్" (6-8-70) సంపాదకీయంలో ఇలా వ్రాసింది: " ఇటీవలి మాసాలలో హరిజనులపై ప్రధానంగా వారు హరిజనులైన కారణంగానే అత్యాచారాలు జరిగిన ఇతర సంఘటనలు ఇంకా అనేకం ఉన్నాయి. మే నెలలో ఒరిస్సాలోని ఒక గ్రామంలో ఒక అగ్రవర్ణస్తునికి కొద్దిమంది హరిజనులకు మధ్య వచ్చిన ఒక చిన్న తగాదాను పురస్కరించుకొని, ఆ గ్రామ హరిజనవాడలో ఒక హరిజన యువతిని సజీవంగా దహనం చేసిన దిగ్భ్రాంతికరమైన దారుణ ఉదంతాన్ని ఆ రాష్ట్ర పార్లమెంటు సభ్యుడొకడు రాజ్యసభలో తెలియజేశారు. కొన్ని బావుల నుండి నీళ్లు తెచ్చుకొన్నందుకు, దేవాలయాలలో ప్రవేశించినందుకు, హరిజనులను హింసించిన సంఘటనలకు సంబంధించిన వార్తలు దేశం నలుమూలల నుండి అందుతూనే ఉన్నాయి."

"అనేక రాష్ట్రాలలో అంటరానితనం **భూసంస్కరణల సమస్యతో మిళితమవుతుంది.** అగ్రవర్ణాలవారు పెత్తనం సాగిస్తున్న గ్రామీణ సమాజంలో ఇది నూతన ఉద్రిక్తతలకు కారణమవుతుంది. ఊరికి దగ్గర లో గల ఒక గ్రామంలో భూమి స్వాధీనం గురించి తలెత్తిన తగాదాలో కొందరు హరిజనులను దారుణంగా హత్య చేశారన్న భువనేశ్వర్ వార్త గుర్తించదగింది. **వ్యవసాయ కూలీల వేతనాల సమస్య ఈ ఘర్షణలకు మరొక కారణం.** ఈ వేతనాల సమస్యపై కొన్ని నెలల క్రితం పాటియాలకు దగ్గర్లో గల ఒక గ్రామానికి చెందిన హరిజనులపై స్థానిక గ్రామపంచాయితీ సాగించిన అకృత్యాలు నిజంగా నమ్మశక్యంగాకుండా ఉన్నాయి. ప్రజాధనంతోనే వారి ఇళ్ళ చుట్టూ ముళ్ళతీగతో కంచె కట్టారు. ఆ ప్రాంతంలో హరిజనేతరులకు ఇచ్చే నామమాత్రపు కూలిలో సగంకంటే తక్కువైన 2.50 రోజు కూలీకి పనిచేయడానికి వారు నిరాకరించడమే దీనికి కారణం."

ఈ సంఘటనల కంటే అధికారుల నిర్లక్ష్యధోరణే మరింత విభ్రమాన్ని కలిగిస్తుంది. హరిజనుల న్యాయమైన హక్కులను పరిరక్షించటంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి.

అనేక సంవత్సరాలుగా సాగుచేసుకొంటున్న భూముల నుండి హరిజనులను బేదఖల్ చేసిన ఒక ఉదంతాన్ని గురించి " పేట్రియాట్" దినపత్రిక 20-12-70 సంచిక ఇలా తెలియజేసింది.

"పంజాబ్‌లోని జలంధర్ జిల్లా ఫిల్లావర్ తాలూకాకు చెందిన గన్నాపిండ్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బహదూర్‌సింగ్ చెప్పినదాని ప్రకారం-24 హరిజన కుటుంబాలకు ప్రభుత్వం కొంత భూమిని కేటాయించింది. ఈ హరిజనులు ఆ భూమిని అభివృద్ధి చేసి ఒక గొట్టపు బావి ఏర్పాటు చేసిన తరువాత, లూధియానా జిల్లాకు చెందిన ఒక సీనియర్ పోలీసు ఉన్నతాధికారి ఆ ప్రాంతంలోని రెవిన్యూ అధికారులతో లాలూచిపడి భూమి కేటాయింపు ఆర్డర్‌ని రద్దు చేయించాడు. తర్వాత భూములు స్వాధీనం చేసుకోవడానికి హరిజనులపై పోలీసుదాడి చేయించాడు. ఈ దాడిలో ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. **ఈ సంఘటనపై ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్య తీసుకోలేదు.**

"తల్వాండ్ కాలవ వద్ద హరిజనుల భూములు గురించి సహకార సంఘాల సీనియర్ అధికారి ఒకరు తన బంధువుల పేరిట తప్పుడు రికార్డులు సృష్టించి హరిజనులను భూముల నుండి వెళ్ళగొట్టాలని చూస్తున్నాడు."

4000 జనాభా కలిగున్న పెద్ద గ్రామం "చోటీఖాతు" నిర్మానుష్యమై పోయినట్లు కనిపిస్తుందని " టైమ్స్ ఆఫ్ ఇండియా " పత్రిక 24-3-71 సంచికలో తెలియజేసింది. ఆ గ్రామంలోను, దాని శివార్లలోను 30 నుంచి 40 బావోరీ (షెడ్యూల్డు కులం) కులస్తుల కుటుంబాలు నివశించాయి. ఈ బావోరీ కులస్తులకు చెందిన ఇళ్ళను దుండగులు ధ్వంసం చేశారు. వీటిలో కొన్ని పక్కా ఇళ్లు కూడా ఉన్నాయి. పొలాల్లో ఉన్న 4 గుడిసెలను సైతం తగులబెట్టారు. దానితో భీతి చెందిన గ్రామస్తులు తమకు చెందిన వస్తువుల్ని- చినిగిన తెగిపోయిన చెప్పులు, లాంతర్లు, తిరగలిరాళ్ళు, పీటలు వగైరా అన్నింటిని వదిలేసి పారిపోయారు. ధాన్యపుగింజలు నిల్వచేయడానికి వినియోగించే మట్టికుండలను సైతం దుండగులు ధ్వంసం చేసి వాటిలో మిగిలిన ధాన్యాన్నంతటినీ ఎత్తుకుపోయారని ఆ పత్రిక తెలియజేసింది.

అయిదుగురు పిల్లల తల్లి, 30 సంవత్సరాల వయసు కలిగిన పిప్లీ అనే ఆమె ఇలా చెప్పిందిః "మార్చి 9వ తేదీన మరో ముగ్గుర్ని ఇళ్ళలోంచి బయటకు లాగి కనికరం లేకుండా గొడ్లను బాదినట్లు బాదారు తర్వాత కొందరు ఆరేళ్ళబిడ్డ చంకలో ఉన్న జార్వాతి అనే ఆమెను తీసుకొచ్చారు.ఆమెను కూడా దుడ్డుకర్రతో బాదారు. ఫలితంగా ఆమె ఒళ్లో ఉన్న బిడ్డ కాస్తా చనిపోయింది.

నిండుచూలాలుగా ఉన్న పిప్లీ అనే మరొకామెను సైతంబాదారు. ఫలితంగా ఆమె అదేరోజున నెలలు పూర్తిగాకుండా ప్రసవించింది. మైసూరు రాష్ట్రంలో ఒక గ్రామ పంచాయితీ సర్పంచ్ నాయకత్వాన హరిజనులను సాంఘిక బహిష్కరణ చేసిన ఉదంతాన్ని "టైమ్స్ ఆఫ్ ఇండియా" 26-3-71 సంచికలో వ్రాసింది. హరిజనులకు దుకాణదారు నిత్యావసర వస్తువుల్ని అమ్మలేదు. కమ్మరి, కుమ్మరివాళ్లు హరిజనులతో ఎలాంటి వ్యవహారాలు పెట్టుకోవడానికి తిరస్కరించారు. స్థానిక దేవాలయంలోని పూజారి సైతం వారిని దేవాలయంలోకి అడుగుపెట్టనివ్వలేదు. దీన్ని బట్టి ఈ సాంఘిక బహిష్కరణ ఎంత సంపూర్ణంగా సాగిందో అర్థంచేసుకోవచ్చును.

" పంజాబులో ఒక గ్రామంలో హరిజనుల ఇళ్ళను మిగతా గ్రామం నుంచి పూర్తిగా వేరుచేయడానికి అడ్డుగోడ కట్టడానికి ఆ గ్రామ పంచాయతీ ఆదేశించింది. పంచాయతీలు క్రింది స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని వృద్ధి చేస్తాయని భావించబడుతుంది. కానీ ఆచరణలో అవి చిన్న సైజు నిరంకుశ రాజ్యాలుగా పనిచేస్తున్నాయి."

భూస్వాముల హింసాకాండ ఫలితంగా ఖుర్దా హరిజనుల పలాయనం గురించి "పేట్రియాట్" పత్రిక 21-6-71 తేదీన ఇలా వ్రాసింది."ఉత్తర ప్రదేశ్‌లోని బులందషార్ జిల్లాలోని ఒక గ్రామానికి చెందిన 15 కుటుంబాల హరిజనులు అక్కడి బడా భూస్వామి సాగించిన హింసాకాండకు భయపడి ఇళ్ళు వదిలి పారిపోయారు".

"18 ఏళ్ళ హరిజన యువకుడు ఒక పనిని చేయడానికి తిరస్కరించడంతో వారిని కాల్చి పారవేస్తానని భూస్వామి బెదిరించగా,ఈ 15 కుటుంబాల వారు ఇళ్లు విడిచిపెట్టి పారిపోయారు. వారిపుడు ఢిల్లీలో ప్రధాన మంత్రి ఇందిరాగాంధీని కలుసుకొని తమ ఇబ్బందులు పోగొట్టుకోవడానికి తీన్‌మూర్తి భవనం వెలుపల ఒక పెద్ద చెట్టు క్రింద ఆశ్రయం తీసుకొంటున్నారు."

" సోహన్‌లాల్ అనే 18 ఏళ్ళ హరిజన యువకుడు మూడు నాలుగు గంటల పాటు భూస్వామి ఇంట్లో ఇంటి పనులన్నీ చేసి, టీ త్రాగటానికి కొంచెం విశ్రాంతి కావాలని కోరడంతోనే, ఆ భూస్వామి ఆగ్రహావేశపరుడయ్యాడు. అతన్ని కనీసం టీ త్రాగటానికి కూడా అనుమతివ్వలేదు. అయినా ఇంటిపనులన్నీ పూర్తి చేశాకనే ఆయువకుడు తన ఇంటికి చేరుకొన్నాడు".

"అయినా ఆ భూస్వామి కోపం చల్లారలేదు. తన మేనల్లుళ్ళతో సహా ఆ యువకుని ఇంటికి వెళ్ళి తీవ్రంగా కొట్టారు. అతని తల్లి అడ్డురాగా ఆమెను సైతం పొట్టమీద తన్నారు. ఆ యువకుని భార్యపట్ల సైతం ఇదే విధంగా వ్యవహరించారు. ఆ సమయంలోలేని ఆ యువకుని తండ్రి తిరిగి వచ్చాక గ్రామ పంచాయతీలో ఈ సమస్యను చర్చిండానికి ప్రయత్నించాడు. కానీ ఆ గ్రామ పంచాయతీ ఆ సంఘటనను గుర్తించడానికి సైతం తిరస్కరించింది. ఆ మరుసటి రోజున పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎట్టి ప్రయోజనం లేకపోగా, ఆ పోలీసులు భూస్వాములతో రాజీపడమని హరిజనులకు సలహా ఇచ్చారు."

" ఆ తర్వాత రెండు రోజుల పాటు ఆ యువకుడు భూస్వామి ఇంట్లో పనిచేయడానికి వెళ్లకపోయేసరికి మరలా ఆ భూస్వామి హరిజన వాడకు వెళ్ళి, మరుసటి రోజున పనిలోకి రాకపోతే అందరినీ కాల్చి వేస్తానని బెదిరించాడు." "భీతి చెందిన హరిజనులు తమ ఇళ్ళలో ఉన్న కాసిని వస్తువుల్లో చేతికందినవి తీసికొని ఖుర్జానుండి ఆ రాత్రికి రాత్రే రైలు మీద ఢిల్లీకి పారియారు."

"పేట్రియాట్" పత్రిక (22-6-71) గ్రామీణ ఉద్రిక్తతల గురించి ఒక సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. గ్రామీణ భూస్వాములు తమ ప్రత్యేక నీతిని అమలు జరుపుతూ సమాజంలో తిరోగమన సామాజిక ప్రమాణాలను ప్రవేశపెడుతున్నారు. ఠాకూర్లు, గౌండర్లు, రెడ్లు ఇలాంటి వారంతా గ్రామాల వెలుపల ఉండే హరిజనవాడలను రోజువారీగా చౌక శ్రమ శక్తికి వనరులుగా వాడతారు. అర్ధరాత్రులు హరిజన స్త్రీల కోసం వాడలలో జొరబడుతుంటారు. కానీ వారికి సమాజంలో ఒక భాగంగా ఎట్టి నాగరిక హక్కులనూ ప్రసాదించడానికి మాత్రం అంగీకరించరు.

" ఆంధ్రప్రదేశ్‌లో దారుణమైన కంచికచర్ల ఉదంతం జరిగిన తర్వాత అలాంటి ఉదంతాలు అనేకం సంభవించాయి. కీలవేణ్మణిలో ' తిరుగబడ్డ' హరిజన వ్యవసాయ కూలీలతో నిండి ఉన్న గుడిసెలను తగులబెట్టడం వంటి సంఘటనలు; ఉత్తరప్రదేశ్ సరిహద్దు గ్రామాలలో భీతావహం చెందిన పురుషులు, స్త్రీలు, పిల్లలతో సహా ఢిల్లీకి చేరిన ఉదంతాలు సర్వసామాన్యమై పోయాయి. **వీటిని గురించి ఎవరూ ఏమీ చేయగల స్థితిలో లేనట్లు కనిపిస్తోంది.** ఎందుకంటే చాలామంది ఇలాంటి సంఘటనలు భారతదేశం పరిస్థితిలో ఒక భాగమని అంగీకరిస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే ఈ పరిస్థితి పట్ల కొందరు తమ విచారాన్ని మాత్రం వ్యక్తం చేస్తున్నారు. ఒక కుటుంబాన్ని కాల్చి వేస్తానని బెదిరించి, గ్రామాన్నుంచి వారిని వెళ్లగొట్టిన ఉత్తరప్రదేశ్ భూస్వామి సమాజంలో చిరకాలంగా ఉన్న "మామూలు' పద్ధతినే అమలు చేశారు. కోయంబత్తూరు జిల్లాలోని ఒక గ్రామంలో ఒక హరిజన యువకునితో తమ కులస్తురాలైన ఒక యువతి కలసి వెళ్ళిపోవడంతో రెచ్చిపోయిన గౌండర్లు స్వయంగా చిన్న సైజు యుద్ధానికే సమాయత్తం అవుతుండవచ్చు. **ఇద్దరికీ పోలీసు సహాయం ఇస్తామన్నా బలం, అధికారంలో ఉన్న, లేదా శక్తివంతమైన వారి ప్రయోజనాలకే తోడ్పడుతుందే కాని బలహీన వర్గాలకు లేదు.** హరిజనుల్లో సైతం తమ కుల ప్రయోజనాలను బలి పెట్టే కొందరు దాదాలు(గుండాలు) తయారవుతున్నప్పటికీ, పోలీసు బలగాలను భూస్వాములకు వినియోగపడకుండా నిరోధించి బలహీన వర్గాలను రక్షించడానికి ప్రభుత్వ యంత్రాంగము చర్యలు తీసుకుంటే తప్ప **గ్రామీణ ప్రాంతాల్లో ఏదో ఒకస్థాయిలో సంఘర్షణ తప్పవని అగుపిస్తోంది."**

బానిసత్వం :(బ్లిట్జ్ -21-8-71- కథనం) : గోరఖ్‌పూర్ జిల్లాలోని కనైల్ గ్రామంలో ఒక యువకుని కుటుంబం పూర్వీకులు తనకు రూ.1,2,000 లు బాకీ ఉన్నారంటూ తనకు వెట్టిచాకిరీ చేయాలని, తన పొలాల్లో నాగలి దున్నాలనీ, ఒక మాజీ జమిందారు డిమాండ్ చేసినపుడు ఆ యుకుడు తిరస్కరించినందుకు ఆ జమిందారు ఆ యువకుని 'భామియా' కు కట్టివేసి విపరీతంగా బాదాడు.

"కేరళ రాష్ట్ర హరిజన సంక్షేమశాఖామంత్రి వైనాడ్ అడవులలోని గిరిజనులలో బానిస వ్యాపారం ఉన్నదనే విషయాన్ని తిరస్కరిస్తూ, వ్యక్తిగత భూస్వాములకు నిర్ధిష్ట కాలంపాటు గిరిజనులను ఒప్పందాల ద్వారా కట్టివేసే పద్ధతి అమలులో వున్న"దని అంగీకరించక తప్పలేదు.

"గ్రామ ప్రజల యాజమాన్యంలో వున్న పొలాల్లోకి హరిజనులు అడుగుపెట్టటానికి వీలులేదని దండోరా వేయించి హరిజనులకు తెలియజేయబడింది".

"రాజస్థాన్‌కు చెందిన బికనీరు గ్రామంలోని దేవాలయంలో హరిజనులకు చెందిన పెండ్లి బృందాన్ని రాజపుత్రులు కొట్టినట్లు ఆరోపించబడింది. గంగానగర్ జిల్లాలో ఒక హరిజనుని తల నరికివేసి బావిలో త్రోసివేశారు."

హరిజనులపై సాంఘిక బహిష్కరణ (స్టేట్స్‌మన్ -22-8-71): "మోగాకు దగ్గర్లో రెండు మైళ్ళ దూరంలో గల దునేకా గ్రామంలో గత రాత్రి తమ్ము సాంఘిక బహిష్కరణ చేశారన్న ప్రకటన విన్న హరిజనులు అప్రతిభులయ్యారు."

ఆ ప్రాంతంలో గ్రామస్తులు నిర్ణయించిన రేట్లను మించి హరిజనులు కూలి రేటును డిమాండ్ చేయడమే ఈ సాంఘిక బహిష్కరణకు కారణమని తెలియవస్తోంది.

పాటియాలా హరిజనులపై సాంఘిక బహిష్కరణ (పేట్రియాట్ 2-9-71): పాటియాలాకు 13మైళ్ళ దూరంలో గల ఖేరిగణేరాన్ గ్రామంలోని ఉమ్మడి భూములను సాగుచేస్తున్న హరిజనులను ఆ భూముల నుండి వెళ్ళగొట్టడంతో ఆ గ్రామంలో ఉద్రిక్త వాతావరణం చెలరేగింది.

" ఆ గ్రామ ఉమ్మడి భూమి మొత్తం విస్తీర్ణం 330 భిగాలుండగా, ఇందులో 107 భిగాల భూమి హరిజనులకు చాలా కాలంగా గ్రామ

పంచాయతీ కౌలుకిస్తూ వచ్చింది. ఇపుడు ఆ ఉమ్మడిభూమి మొత్తం అగ్రకులాలకు చెందిన వ్యవసాయదారుల ఆధీనంలోనే ఉంది."

హరిజనులను పీడించటం: (పేట్రియాట్ 2-9-71) పంజాబు శాసనసభా కాంగ్రెసు పార్టీ ప్రధానకార్యదర్శి శ్రీ సుందర్‌సింగ్ పంజాబులో హరిజనులు పీడించబడి భూముల నుండి వెళ్ళగొట్టబడుతున్నారని ఆరోపించాడు. అంతేకాకుండా నక్సలైట్లు అయ్యారనే సాకు పెట్టి హరిజనులు చంపబడుతున్నారని కూడా ఆరోపించాడు.

8-9-71 "టైమ్స్ ఆఫ్ ఇండియా"లో " కరంట్ టాపిక్" శీర్షిక క్రింద ఇలా వ్రాశారు. "పరిపాలనా యంత్రాంగమంతా తమ పట్ల శతృత్వ భావం వహిస్తున్నదని హరిజనులకు భావన కల్గితే అందుకు హరిజనుల నెలా తప్పుపట్టగటం? తమిళనాడులో దక్షిణ ఆర్కాట్ జిల్లా లోని ఒక గ్రామంలోని హరిజనులే ప్రత్యేకంగా వినియోగించేందుకు వీలుగా ఒక కొత్త రోడ్డు వేయబడింది. మామూలు రోడ్డుపై హరిజనులు నడవటం వల్ల ఆ రోడ్లు 'అపవిత్రమై' పోతాయని ఆగ్రామ హిందువులు భయపడిపోయి అందుకు అభ్యంతరం చెప్తునట్లు కనిపిస్తుంది."

దక్షిణాఫ్రికా రైల్వేలలో, హోటళ్ళలో "కుక్కలకూ', నల్లజాతి వారికి ప్రవేశం లేదు"అని శ్వేతజాతి పాలకులు బోర్డులను కడతారన్నప్పుడు భారతదేశం లోని పాలకులు మనస్సు పాపం చివుక్కుమంటుంది. కానీ దక్షిణాఫ్రికాలోని శ్వేతజాతి పాలకుల కంటే, దేశంలోని గ్రామీణ పేదల పట్ల "సున్నిత హృదయు"లైన పాలకవర్గాల ప్రవర్తన అంతకన్నా మంచిగాలేదు

షెడ్యూల్డు కులాలపై దాడి (హిందూ 10-07-71): నేడు మహారాష్ట్ర శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో దేవాలయాల్లో ప్రవేశించి నందుకు గాను షెడ్యూల్డు కులాల వారిపై దాడి జరిగిన రెండు ఉదంతాలు ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చాయి.

ఇందులో ఒక సంఘటన అహమ్మద్‌నగర్ జిల్లాలోని దియోగామ్ గ్రామంలో ఏప్రియల్ 20న సంభవించింది. రెండవ సంఘటన సంగ్లీ జిల్లాలోని గావ్‌హాన్ గ్రామంలో మే 22న షెడ్యూల్డు కులానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు హనుమాన్ దేవాలయంలోకి ప్రవేశించినందుకుగానూ ఆ గ్రామ సర్పంచ్ ఆ వృద్ధుని బాదాడు.

"ముద్దాయిల పేర్లను వెళ్ళడించవలసిందిగా ప్రతిపక్షసభ్యులు డిమాండు చేయగా మంత్రి తన **అశక్తతను వ్యక్తం చేశాడు.** అయితే స్పీకరు ఆదేశం ప్రకారం ముద్దాయిల పేర్లను ఒకటి, రెండు రోజులలో తెలియజేయడానికి వాగ్దానం చేశాడు."

రాజస్థాన్ గ్రామం నుండి భీతావహులైన హరిజనుల వలస (పేట్రియాట్ 31-9-71): "రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లా బస్సీ తహశీలుకు చెందిన పాల్వాలా జటాన్ గ్రామంలో నేడు ఒక్క హరిజనుడు కూడాలేడు. తమ పై జరుపబడిన దౌర్జన్యకాండ కారణంగా ఆ గ్రామంలోని మొత్తం 40 హరిజన కుటుంబాలు తమ ఇళ్లను ఖాళీ చేసి వలస వెళ్ళిపోయారు."

" సవర్ణ హిందువుల చెప్పులను ఉచితంగా బాగుచేయడానికి గ్రామ 'మాదిగ'లు తిరస్కరించటమే దీనికి కారణం. హిందువుల చెప్పులను గ్రామ మాదిగలు ఉచితంగా బాగుచేసి పెట్టడం రాజస్థాన్‌లోని అనేక గ్రామాలలో ఇప్పటికీ ఆచారంగా ఉంది. ఇలా చేయ తిరస్కరించటమంటే ఆచారాన్ని ధిక్కరించడమే."

"అగ్రకులాల హిందువు గుంపు ఒకటి ఈ హరిజనులపై దాడులు సాగించి గృహదహనాలు, లూటీలు సాగించారు. 10 హరిజనుల ఇళ్లను బూడిద చేశారు."

"జాట్‌లు, ఠాకూర్లు అనేక గ్రామాల్లో హరిజనులను భీతావహం చేస్తున్నారని వీరు (రాజధానికి చేరుకున్న హరిజనులు) ఫిర్యాదు చేశారు. ఈ కులాలవారు గ్రామాల్లో మాదిగలు నివశించడాన్ని అసాధ్యం చేస్తున్నారు. వీరు కొన్ని సందర్భాలలో హరిజనుల భూములను బలవంతంగా ఆక్రమించుకొన్నారు. హరిజనుల పొలాల్లో పెరుగుతున్న పైరులను నిర్ధాక్షిణ్యంగా ధ్వంసం చేశారు."

రక్షణలేని హరిజనులు (ట్రైమ్స్ ఆఫ్ ఇండియా 15-9-71 సంపాదకీయం): కులం కారణంగా అతి ఘోరమైన విచక్షణ పాటించే వార్తలు వెలుగు లోనికి రాని వారం అంటూ ఉండటం లేదు. దక్షిణ ఆర్కాట్ జిల్లాకు చెందిన ఒక గ్రామంలో మామూలు రోడ్డును హరిజనులు ఉపయోగించుకొనడానికి వీలులేకుండా చేసిన ఉదంతాన్ని తెలియజేస్తూ "ఇది విచక్షణకు సంబంధించిన విషయమే. బ్రాహ్మణ వ్యతిరేక మిలిటెన్సీని గూర్చి ప్రగల్భాలు పలికే ప్రభుత్వం (డి.యం.కె.-అను) కనుసన్నల్లోనే ఈ హింసాకాండ నిర్భయంగా జరుగుతున్నది " అని వ్రాసింది.

" నేడు హరిజనులకు గ్రామాలలో రక్షణ ఉండటం లేదు.హరిజనుడు తనకు అన్యాయం జరిగిందని తెలిసినా, అధికారులు తనకు న్యాయం కల్గించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, సమాజంలో ప్రత్యేకహక్కులను అనుభవిస్తున్న అగ్రకులాలవారి ప్రతీకార చర్యలకు అతడు భయపడి ఫిర్యాదు చేయటానికి సాహసించలేడు. దక్షిణ ఆర్కాట్ ఉదాహరణ వెల్లడి చేసినట్లు ఒక్కొక్కప్పుడు జీవనమే అసాధ్యమైపోతుందని భయపడు తున్నారు. **భూసంస్కరణలు ప్రస్తుత వ్యవసాయక వ్యవస్థ శిఖరాన్ని చదును చేశాయే తప్ప, పునాదిని ఏ మాత్రం తాకలేకపోయాయి.** ఫలితంగా భూమి యజమానులైన సవర్ణహిందువులకూ, భూమిలేని హరిజనులకూ మధ్య ఉద్రిక్తతలు పదునెక్కాయి. సస్య విప్లవం వల్ల వచ్చే సామాజిక మార్పులు సైతం ఇదే ధోరణిలో ఉన్నాయి."

బెహారాలో కులతత్వం స్వైర విహారం గురించి వారణాసినుంచి "పేట్రియాట్" విలేఖరి సెప్టెంబరు 17న ఇలా వ్రాశారు. "క్రూరమైన దాడులకు గురైన బెహారా హరిజనులు అర్ధ బానిసత్వపు రోజులు ఇంకా ముగియలేదని తీవ్రంగా ఫిర్యాదు చేస్తున్నారు."

గ్రామంలోని 'చామర్లు' (మాదిగలు- అను॥) చచ్చిపోయిన జంతువుల శవాలను తొలగించటం సాంప్రదాయకంగా ఉంది. దీనిని భూమి లేని వ్యవసాయకూలీలు తమ పనిలో భాగంగా ఎల్లప్పుడూ చేయటం తప్పనిసరి. వీరి ప్రస్తుత వేతనాలు నెలకు రూ. 3లు. రోజుకు అరకిలో ముతకధాన్యం.

" ఆదివారం రోజున జరిగిన ఒక సమావేశంలో ఇక నుండి తాము చచ్చిపోయిన జంతువు శవాలను పారవేసేపనిని చేపట్టకూడదని చమర్లు ఏకగ్రీవంగా నిశ్చయించుకున్నారు."

మంగళవారం నాడు అగ్రకులాల హిందువులు-కొందరు ఠాకూర్లు, మరి కొందరు పలుకుబడి గల్గిన వ్యక్తులు బస్తీలపై బడి కొల్లగొట్టారు. కుండలు, చట్టులు పగలగొట్టారు. స్త్రీలను, పిల్లలను విచక్షణా రహితంగా కొట్టి హింసించారు. అక్కడ ఒక వ్యక్తిని హత్య చేసేంతవరకూ ఆ గూండాలు ఆ ప్రాంతాన్ని వదలలేదు. ఆచారంగా వస్తున్న సేవలు కొనసాగే విధంగా చేయించుకోవడానికి వారిని భయపెట్టడమే ఈ దాడి లక్ష్యమని భావించబడుతోంది.

దోపిడీకి వ్యతిరేకంగా రాజస్థాన్ హరిజనుల పోరాటం (ట్రైమ్స్ ఆఫ్ ఇండియా 21-9-71): గత రెండు నెలలుగా భూమి యజమాను లైన అగ్రకులాల హిందువులతో అనేక సంఘర్షణలు చెలరేగిన అనంతరం జైపూర్ జిల్లాలోని పాల్వాలా, రాంపూరా, పతేరా బక్రి గ్రామాల నుండి 'రేగార్లు'అనే షెడ్యూల్డు కులం వారు తమ గ్రామాలు విడిచి వెళ్ళిపోయారు.

సామాజిక, ఆర్థిక ఉద్రిక్తతలే ఈ సంఘర్షణకు దారి తీసాయి. "గ్రామాలలో సామాజిక,ఆర్థిక మార్పులను ప్రతిఘటిస్తున్న రాజకీయ నాయకులు దీనికి కొంతవరకు బాధ్యులు."

ఫ్యూడల్ సంబంధాలు

ఈ 'రేగార్లు' అనే షెడ్యూల్డు కులాలవారు దశాబ్దాల తరబడి పశువుల చర్మాలు వలిచి శుద్ధిచేసి, బావుల నుండి నీళ్ళను తోడే తోలు బకెట్లు (చరాలు) తయారు చేస్తూ, పాతవాటిని బాగుచేస్తూ, పాత చెప్పులను బాగుచేస్తూ జీవనం వెళ్ళబుచ్చేవారు.

" కొత్త 'చరా' తయారుచేసి ఇచ్చినందుకు వారికి నగదు రూపంలో ప్రతిఫలం ముట్టినా, వారు చేసే ఇతర సేవలకు కోతల సమయంలో మాత్రమే ఆహారధాన్యాల రూపంలో ప్రతిఫలాన్ని స్వీకరించవలసి వచ్చేది".

వారిలో సామాజిక రాజకీయ చైతన్యం పెరగడంతో ఈ ఏర్పాట్లు రేగార్ కులస్తులకు ఇంకెంత మాత్రము అంగీకారయోగ్యం కాలేదు. పెరుగుతున్న ద్రవ్య ఆర్థిక వ్యవస్థలో సహజంగానే తాము చేసిన సేవలకు నగదు రూపంలోనే ప్రతిఫలం చెల్లించాలని రేగార్లు డిమాండు చేశారు.

" గత కొద్ది మాసాలుగా రేగార్ల పరిస్థితులను మెరుగుపర్చుకొనేందుకై అనేక సమావేశాలు జరిగాయి. ఒక సమావేశంలో నగదు రూపంలో ప్రతిఫలం చెల్లిస్తే తప్ప పశువుల చర్మాలు వలవకూడదని, పాత 'చరా'లు చెప్పులు బాగుచేయకూడదని రేగార్లు నిర్ణయించుకున్నారు.

రేగార్ల ఈ ఆందోళనను ప్రతిఘటించటానికి "వ్యవసాయ దారులు రేగార్లను దెబ్బ కొట్టేందుకు కిసాన్ సంఘర్ష సమితి స్థాపించారు." రేగార్లపై సాంఘిక బహిష్కరణ అమలుజరపటానికి ఈ సమితి నిర్ణయించింది.పాలు పద్ధతిపై రేగార్లకు కౌలుకిచ్చిన భూములను వ్యవసాయ దారులు తిరిగి లాక్కున్నారు. ఉమ్మడి పచ్చిక బయళ్ళలో రేగార్లు తమ పశువులను మేపుకోవడంపై నిషేధం విధించారు. వారి పొలాలకుగాని, ఇళ్ళకుగాని సంప్రదాయకంగా అమలులో ఉన్న అడ్డదారులను వారు ఉపయోగించకుండా చేసివేశారు. ప్రైవేటు బావుల నుండి నీళ్ళు తెచ్చుకోవడానికి వారికి అనుమతి నిరాకరించారు. గ్రామంలో ఉన్న దుకాణాలలో వారికి సరుకుల అమ్మకం నిలిచిపోయింది.

పాల్వాలా వద్ద 300 నుండి 400 వరకు జాట్లు, బ్రాహ్మణులు వారి సేవకులు కలిసి గుంపులుగా బయలుదేరి రేగార్ల ఇళ్ళను చుట్టుముట్టి పిల్లలను, స్త్రీలను, పురుషులను కొట్టి వారి ఆస్తులను లూటీ చేశారు.

బక్రిలో ప్రైవేటు బావుల నుండి నీరు తెచ్చుకోవడానికి రేగార్లకు అనుమతి నిరోధించబడింది. కొన్ని సందర్భాలలో ప్రభుత్వం తమకు కేటాయించిన భూమిని రేగార్లు స్వాధీనం చేసుకోవటానికి సైతం వీలు లేకుండా చేయబడింది.

" ఇన్ని ప్రతీకార చర్యలు జరిగినప్పటికీ రేగార్లు పాత 'చరా'లను, చెప్పులను బాగుచేయకూడదనే తమ నిర్ణయానికే కట్టుబడి ఉన్నారు. ఈ విధంగా నగదు వేతనాలకు బదులుగా ఆహార ధాన్యాలను నిరాకరించాలని ధృడ నిశ్చయంతో ఉన్నారు."

పేదలకు భూమి

షెడ్యూల్డు కులాలు, అత్యధిక భాగంగా ఉన్న భూమిలేని పేదలు "పేదలకు భూమి" కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ మరింత తీవ్రంగా పెరుగుతున్న కొద్దీ, కాంగ్రెసు ప్రభుత్వం ఒకవైపున భూసంస్కరణల ప్రచారాన్ని మరింతగా తీవ్రపరుస్తూనే, మరోవైపున వ్యవసాయ కార్మికుల స్వాధీనంలో ఉన్న కొద్దిపాటి భూముల నుండి కూడా వారిని వెళ్ళగొట్టటానికి చేసే ప్రయత్నాలకు దొంగచాటుగా సహకరిస్తున్నది. 14-9-71న " పేట్రియాట్" పత్రిక ప్రచురించిన ఈ క్రింది సమాచారం ఆసక్తికరంగా ఉంటుంది.

"గుజరాత్‌లోని పోర్బందరీ తాలూకాలో 20 హరిజన కుటుంబాలు తరతరాలుగా నివశిస్తున్న తమ గ్రామం నుండి వెళ్ళ గొట్టబడ్డాయి. వారి స్వాధీనంలో కొద్దిపాటి వ్యవసాయ భూములు ఉండటమే వారు చేసిన నేరమల్లా!"

"పంజాబ్‌లోని పాటియాలా జిల్లాలో హరిజనులకు బదిలీ చేయబడిన 'నాజుల్' భూమిని పలుకుబడి కల్గిన వ్యక్తులు తమ అక్రమ స్వాధీనంలో ఉంచుకున్నారు. దీన్ని అధికారులు చూసీ చూడనట్లు ఉపేక్ష వహించారు."

" ఉత్తర ప్రదేశ్‌లోని బులందషార్, ఆగ్రా, హమీర్‌పూర్, నైనితాల్, బహారియా తదితర జిల్లాల్లో భూమిలేని పేదలకు బంజరు భూములు పంపిణీ కార్యక్రమం తంతు ఆందోళనకరంగా తయారైందని ప్రాథమిక సర్వే నివేదికలు వెల్లడి చేస్తున్నాయి. అత్యధిక సందర్భాలలో పెద్ద ఎత్తున ఇదివరకే భూములు లేదా ఇతర ఆదాయపు వనర్లు ఉన్నవారికే, గ్రామ భూమి మేనేజ్‌మెంటు కమిటీ భూమిని పంపిణీ చేసింది. అమలులోఉన్న చట్టం ప్రకారం ఒక వ్యక్తి తండ్రికి చాలినంత భూమి ఉన్నప్పటికీ ఆ వ్యక్తి భూమిలేని వాడుగానే పరిగణించబడిన దాని ఫలితమే ఇది.బంజరు భూములలో, మిగులు భూములలో అత్యధిక భాగం షెడ్యూల్డు కులాల వారికే పంచిపెట్టినట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకొంటున్నది. దీన్ని రుజువు చేసేందుకు ఎప్పటికప్పుడు ఆసక్తికర మైన గణాంక వివరాలను ప్రభుత్వం ప్రకటిస్తూ ఉంటుంది. అయిన ప్పటికీ వాస్తవానికి భౌతికంగా షెడ్యూలు కులాల వారి చేతుల్లోకి భూమి వచ్చిన సంఘటనలు లేవు."

"ఈ పరిస్థితుల్లో షెడ్యూల్డు కులాలవారు ప్రత్యక్ష కార్యాచరణ కొరకు పూనుకొంటే వారి చర్య చాలా సమంజసమైనది. న్యాయమైనదీను." తరతరాలుగా తమ స్వాధీనంలో ఉన్న భూములను హరిజనులు, ఇతర పేద ప్రజలకు లేకుండా చేయటానికి అధికారులు మరింత తగియున్న పద్ధతిని అనుసరిస్తున్నట్లు విస్తృతంగా ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ పేద ప్రజలు, హరిజనుల క్రింద ఉన్న భూములను 'ప్రజోపయోగార్థం' సేకరిస్తున్నారు. ఈసందర్భములో ఘాట్ రోడ్డుమీద మీరట్ విశ్వ విద్యాలయం కోసం, ఆలీఘర్‌లో ఇదే విధమైన ప్రజోపయోగ సర్వీసుల కోసం భూములను సేకరించిన ఉదంతాలు ఇందుకు ఉదాహరణలు."

తెగించిన ఆగ్రహం అనివార్యం

ఈ సంఘటనలకూ, మనదేశంలో వివిధ రూపాలలోచెలరేగుతున్న వర్గ యుద్ధానికి సంబంధం లేదని త్రోసివేయడానికి వీలులేదు. భారత దేశంలో అసమాన ఆర్థికాభివృద్ధి ఫలితంగా మన గ్రామాల్లో ఇప్పటికీ కాలం చెల్లిన ఆర్థిక సంబంధాలు ఇంకా అమలులో ఉన్నందువల్లనే, గ్రామీణ భారతదేశంలో నేటి సమస్యలలో కొన్ని ఉత్పన్నమవుతున్నాయి.

ప్రధానంగా తక్కువ కులాలకు చెందిన పేదరైతులను, శ్రామిక వర్గాలను భూస్వామ్య కుటుంబాలకు బంధించి వేసే పద్ధతి కులాల పరస్పరాధారం అనే సంప్రదాయక వ్యవస్థ ఇప్పటికీ అమలులోనే ఉన్నది.

ఉత్పత్తిచేసే కులాల నుండి, సేవలు చేసే కులాల నుండి అగ్రకులాల వారు ఫ్యూడల్ పద్ధతుల్లో కప్పాలు, పన్నులు వసూలుచేయడం ద్వారా, వీరు బ్రిటీష్ పాలనాకాలంలో నూతనంగా ఆవిర్భవిస్తున్న వర్గ నిర్మాణంలో తమ సామాజిక, ఆర్థిక ఆధిపత్యాన్ని నిల్పుకొన్నారు. బ్రిటిష్ సామ్రాజ్య వాదం నుండి దళారీ బూర్జువా వర్గం, భూస్వాములు అధికారం స్వీకరించడం సమాజంలో వారి (అగ్రకులాల, ఫ్యూడల్ భూస్వాములు) పాలన స్థిరీకరించబడి, మరింతగా బలీయం చేయబడింది. అగ్రకులాలకు చెందిన ధనికవర్గాల వారికి లభ్యమైన సహకార సంఘాల, బ్యాంకుల రుణాలు, మంచి విత్తనాలు, ఎరువులు తదితర ఆర్థిక ప్రయోజనాల వల్లనూ; క్రింద స్థాయి నుండి పై స్థాయి వరకు పంచాయితీలు, సమితులు, జిల్లాపరిషత్‌ల ద్వారా పరిపాలనా యంత్రాంగముతో వారికి ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడటం వల్లనూ; ఆర్థికంగానే గాక, రాజకీయంగా కూడా వారి స్థానం పటిష్టం అయ్యింది.

మరో వైపున సేవ చేసే తక్కువ కులాల వారిలో అత్యధిక భాగం భూమిలేని వ్యవసాయ కూలీలుగా, కొద్దిపాటి భూమి మాత్రమే ఉన్న వ్యవసాయ కూలీలుగా సమాజంలో అట్టడుగున మిగిలిపోయారు.

సమాజంలో కొన్ని మార్పులు సంభవించినప్పటికీ అవి ప్రధానంగా ఫ్యూడల్ నిర్మాణంలోని కులవ్యవస్థ పరిధిలోనే జరిగాయి. కాని కుల వ్యవస్థను ఏ మాత్రం బ్రద్దలు చేయలేదు. రూపాలు మారి ఉండవచ్చు కాని ప్రాథమికంగా కులవ్యవస్థ అలాగే ఉండిపోయింది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా అర్ధఫ్యూడల్, అర్ధవలస స్వభావాన్ని కల్గివుంది. ఈకాలమంతటిలోనూ ఈ స్వభావంలో ప్రాథమికమైన ఎలాంటి మార్పు సంభవించకపోవడమే సమాజంలో కులవ్యవస్థ అలాగే నిలిచి వుండడానికి కారణమయింది. సరకుల ఉత్పత్తిలో కూడిన ఆర్థిక వ్యవస్థలో సంపదల తారతమ్యాలు సైతం కులవ్యవస్థను మరింతగా తీవ్రం చేస్తాయి. " ప్రాబ్లమ్స్ ఆఫ్ ఎకనామిక్ ట్రాన్సిషన్" (ఆర్థిక పరివర్తనా సమస్యలు) అనే తన గ్రంథంలో రంజిత్‌దాస్ గుప్తా వ్రాసినట్లుగా:

"ప్రణాళికా కార్యక్రమాలు గొప్పగా చెప్పుకుంటున్న నూతన వ్యవసాయాభివృద్ధి విధానాలతో సహా వివిధ వ్యవసాయాభివృద్ధి పథకాలు సైతం ప్రాంతానికీ-ప్రాంతానికీ మధ్య; ఒక ప్రాంతంలోనే విభిన్న తరగతుల మధ్య అగాధాలను, తారతమ్యాలను పెంచడానికే దోహదం చేసి; భూస్వాములకు, రైతాంగంలోని ఉన్నతశ్రేణికి మాత్రమే ప్రయోజనకరంగా పనిచేశాయి." ఆ విధంగా ఇవి " గ్రామీణ ప్రాంతాలలో వారసత్వంగా వస్తున్న కులవ్యవస్థకు నూతన జీవాన్ని పోయడమే గాక కొన్ని అంశాలలో దాన్ని మరింత బలీయం చేశాయి కూడా."

"అసమాన కులవ్యవస్థ విస్తృతంగా, బలంగా కొనసాగినందువల్ల ఎలాంటి తీవ్రస్థాయిలో సమస్యలు ఉత్పన్ననమవుతాయో; తమిళనాడులోని తంజావూరు జిల్లాలో స్త్రీలు, పిల్లలతో సహా దారుణంగా సజీవ దహనం చేయబడిన ఉదంతం; దేశంలోని విస్తృత ప్రాంతాలలో షెడ్యూల్డు కులాలకు వ్యతిరేకంగా ముమ్మరంగా సాగుతున్న దౌర్జన్య సంఘటనలు విదితం చేస్తున్నాయి."

మార్క్స్ ఎంతో ప్రతిభావంతంగా బహిర్గతపర్చినట్లు ఈ "నిరంకుశత్వం యొక్క పటిష్టమైన పునాది " దాని అత్యంత క్రూరత్వంతో సహా కొనసాగుతోంది. "చలనంలేని క్షుద్రమైన స్వార్థపూరిత జీవితాన్ని బలీయ మొనర్చుతోంది." ఇంకా "కులవిభేదాలతో, బానిసత్వంతో కలుషితమైపోయింది!."

అయితే గ్రామీణ ప్రజలు జాగృతమతున్నారు. ఆర్థిక సామాజిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు భావం నెమ్మదిగానే అయినప్పటికీ స్థిరంగా పెరుగుతూంది. "నేషనల్ హెరాల్డు" పత్రికలో భారతీయ గ్రామం గురించి వ్యాసాల పరంపరలో శ్రీ యోగేష్ వాజ్‌పాయి ఈ విధంగా వ్రాశారు. " గ్రామీణ ప్రజలకివ్వబడిన వాగ్దానాలు అమలు చేయబడకపోవడంతో, ఈ పరిస్థితులను ఇంక ఎంత మాత్రము సహించరాదనే చైతన్యం బాధితులలో ఉదయిస్తున్నది." అగ్రస్థానాల్లో ఉన్నవారి నిబంధనలకనుగుణంగానే వ్యవహరిస్తూ ఈ దారుణ పరిస్థితులను తారుమారు చేయటం సాధ్యం కాదనే వాస్తవాన్ని గ్రామీణులు గుర్తిస్తున్నారు. " ఇది ప్రమాదకరమైన సాంప్రదాయక పద్ధతులు ఇక ఎంతమాత్రం పనికిరావని గుర్తించిన తర్వాత సంభవించే నిస్పృహే. ఈ నిరాశ, నిస్పృహల నుండి జనించే ప్రతీకార కాంక్ష వల్ల ఉత్పన్నమయే ప్రత్యక్ష కార్యాచరణను అదుపులో పెట్టడం సాధ్యంకాదు."

(నేషనల్ హెరాల్డ్ -1970 మే 10)

అందువల్లనే "నీతి నియమాలని తూలనాడే శత్రువుకు వ్యతిరేకంగా సాగించే ప్రతిఘటనలో కేవలం చట్టబద్ధమైన పద్ధతులను ఉపయోగించాలనుకోవడం పూర్తిగా నిరుపయోగమని" ప్రజాబాహుళ్యం విశ్వసించడంలో ఆశ్చర్యం లేదు. (కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగిల్స్ - జర్మన్ రివల్యూషన్ అండ్ కౌంటర్ రివల్యూషన్ - పేజి 110)

అందువల్ల అణగద్రొక్కబడిన వారి తిరుగుబాటు వర్గ స్వభావం కొన్ని సందర్భాలలో కొన్నికులాల రూపంలో వ్యక్తమైనంత మాత్రాన, అట్టడుగు పీడిత వర్గాల అణచివేత కొన్ని కులాలపై క్రూరమైన యుద్ధరూపం తీసుకున్నంత మాత్రాన, వర్గపోరాటం యొక్క మౌలిక స్వభావాన్ని ఎంత మాత్రం మరుగు పర్చజాలవు. బ్రిటిష్‌వారి పరిపాలనా కాలంలో కులమత విభజన భావాలు గ్రామీణ ప్రజాబహుళ్యంలో ఎంత లోతుగా పాతుకొని పోయాయంటే కొన్ని సందర్భాలలో వారి రాజకీయ, ఆర్థిక తిరుగుబాట్లు మత మౌఢ్య స్వభావం తీసుకొన్నాయి. మలబార్‌లో 'మోప్లా తిరుగుబాటు' (ముస్లింలు) ఇలాంటిదే.

శాస్త్రీయ సోషలిజం స్థాపకుడైన కారల్‌మార్క్స్‌కు గొప్ప సహచరుడైన ఏంగిల్స్ మధ్యయుగాల నాటి యూరపులోని మత యుద్ధాలనే వాటిని ఈ క్రింది విధంగా విశ్లేషించాడు. "16వ శతాబ్దంలో సంభవించిన మత యుద్ధాలనబడే వాటిల్లో ఖచ్చితమైన పాదార్థికమైన వర్గ ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి. ఇంగ్లండు, ఫ్రాన్స్‌లలో తర్వాత జరిగిన గొప్ప అంతర్యుద్ధాలలాగే అవి వర్గ యుద్ధాలు కూడా. ఆ కాలంనాటి వర్గ పోరాటాలు, మత ముసుగులు ధరించినప్పటికీ, వివిధ వర్గాల ప్రయోజనాలు, అవసరాలు, డిమాండ్లు, మతం తెరల వెనుక మరుగు పర్చబడినప్పటికీ స్వభావంతో ఏ మార్పూ లేదు.దీనిని ఆనాటి పరిస్థితులు సులభంగా విశదం చేస్తాయి.

మధ్యయుగాల నుండి ఫ్యూడలిజం పట్ల విప్లవాత్మక వ్యతిరేకత బ్రతికే ఉంది. ఆయా సమయాల్లో పరిస్థితులననుసరించి ఇది 'మార్మికవాదం' (Mysticism) బహిరంగ మత ధిక్కారం, లేదా సాయుధ తిరుగుబాటు రూపాలు ధరించాయి. (ది పెజంట్‌వార్ ఇన్ జర్మనీ) ✦

ఆంధ్రప్రదేశ్‌లో అంటరానితనం రూపాలు

(కామేడ్ తరిమెల నాగిరెడ్డి వ్యాసం ముందిచ్చాము. దాన్ని ధృవ పరిచే విధంగా
దళిత మానవహక్కుల నిఘా (సాక్షి) రూపొందించిన రిపోర్టు వుంది.)

1. సామూహిక బావుల నుండి మంచినీటిని తీసుకోనీయకపోవటం.
2. సామూహిక బావుల నుండి అగ్రకులస్తులు వుపయోగించిన తరువాత మాత్రమే దళితులను తీసుకోనివ్వటం.
3. దళితవాడలో మంచినీటి సరఫరాను నిలిపివేయటం.
4. దళితవాడలో కరెంటు లేకుండా చేయటం.
5. హోటళ్ళలో దళితులకోసం ప్రత్యేక గ్లాసులను కేటాయించటం.
6. బహిరంగ ప్రదేశాల్లో దళితులను కూర్చోనివ్వకపోవటం.
7. బహిరంగ ఉత్సవాల్లో దళితులకు చివరన భోజనం పెట్టటం.
8. బహిరంగ ఉత్సవాల్లో దళితుల గిన్నెలను వారిచేతే కడిగించటం.
9. దేవాలయాల్లోకి దళితులను ప్రవేశించనివ్వపోవటం.
10. చర్చిల్లో దళితులను ముందు కూర్చోనివ్వకపోవటం
11. అగ్రకులస్థుల వీధుల్లో దళితులను చెప్పులు వేసుకోనీయక పోవటం.
12. అగ్రకులస్థుల వీధుల్లో దళితులు గొడుగు ఉపయోగించడం నిషేధం.
13. అగ్రకులస్థుల ఎదురుగా దళితులను మంచి బట్టలు వేసుకోనీయకపోవటం.
14. అగ్రకులస్థులు బస్సులో ఎక్కినపుడు దళితులు లేచి నిలబడుట.
15 బస్సుల్లో దళితులకు ప్రత్యేమైన సీట్లు కేటాయించటం.
16. పాఠశాలల్లో ప్రత్యేకమైన సీట్లు కేటాయించడం.
17. రచ్చబండ మీద (గ్రామపంచాయితీల్లో) కూర్చోనివ్వకపోవటం.
18. అగ్రకులస్థుల వీధుల్లో దళితులు అద్దెకుండటం, ఇళ్ళుకొనటం నిషేధించటం.
19. కులంపేరుతో దూషించి అవమానించటం.
20. పండగలు, ఉత్సవాలు, దహన కార్యక్రమాలలో దళితులే తప్పనిసరిగా డప్పులు వాయించటం .
21. ఓటుహక్కు వినియోగించకుండా ఆపటం.
22. ఓటర్‌లిస్టు నుండి దళితుల పేర్లు తొలగించడం.
23. ఎన్నికల సమయాల్లో దౌర్జన్యం చేయటం.
24. వెట్టి చాకిరీ చేయించుకోవటం.
25 జీవనాధార హక్కుల్ని తిరస్కరించటం.
26. పనికి తగిన కనీస వేతనం ఇవ్వకపోవటం.
27. దళితుల మతపరమైన వూరేగింపులను అగ్రకులస్థుల వీధుల్లోకి రానివ్వకపోవటం.
28. దళితుల పంటపొలాల్లోకి సాగునీరు ఇవ్వకపోవటం.
29. దళితుల వ్యవసాయ హక్కును తిరస్కరించటం.
30. ఎన్నికల్లో గెలిచిన దళిత నాయకుల అధికారాన్ని వినియోగించకుండా చెయ్యటం .
31. సామూహిక స్నానఘట్టాల వద్ద దళితులను నిషేధించటం.
32. దళితులకు క్షౌరం చేయటానికి తిరస్కరించటం.
33. మంచిబట్టలేసుకొని చదువుకున్న దళితుల్ని బాధించటం.
34. వెట్టిచాకిరీ : మృత కళేబరాలను తొలగించటం.
35. వెట్టిచాకిరీ : మలాన్ని చేతులతో ఎత్తించటం.
36. వృత్తిని మార్చుకునే హక్కును తిరస్కరించటం.
37. అగ్రకులస్థుల మతపరమైన ఉత్సవాల్లో దళితులచేత ప్రతిఫలం ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించటం.

వ్యాఖ్యానాలు

దళిత హక్కుల్ని సంరక్షించడానికి అనేక చట్టపరమైన అంశాలున్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ లో క్రమం తప్పకుండా ఏదో ఒక రూపంలో దళితులపైన అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. హత్యలు, సాంఘిక బహిష్కరణలు, దారుణాలను పరిశీలిస్తే వాటి వెనుకనున్న కారణాలలో ఒక సాధారణత్వం గోచరిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో దళితులు తరాలుగా తమపైన అమలవుతున్న అంటరానితనాన్ని, దానికి కారణమైన కులవ్యవస్థను ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో అంతవరకూ కొనసాగిన ఆచరణల ను మార్చాలని ప్రయత్నం చేయడం, అంట రానితనం లోపాలను నిరసించడం, అగ్రకులా ల ఆగడాలను ప్రశ్నించడం, భూమిపైన తమ హక్కు కోసం, వేతనాల కోసం, ఓటు వేయడం కోసం తమకున్న హక్కులను పొందాలని దళితులు ప్రయత్నం చేస్తుండడంతో గ్రామంలో ఎటువంటి మార్పులనీ సహించక, ఎలా వున్నది అలానే ఉండాలని కోరుకొనే అగ్ర కులాల వాళ్ళకి కంటగింపవుతోంది. దాంతో ఈ అత్యాచారాలు జరుగుతున్నాయి.

అనేక కేసుల్లో బాధితులు దళిత యువకులు. ఎంతో కొంత చదువుకొని ఆత్మ గౌరవాన్ని సంతరించుకొని కుల అణచివేతను తిరస్కరించి, ఆంక్షలను ధిక్కరించి, స్వతంత్రంగా బతకాలని ఆలోచిస్తున్న వాళ్ళే.

తమ హక్కుల కోసం నిలబడిపుడల్లా దళితుల పైన అత్యాచారాలు జరుగుతున్నాయి. పైన పేర్కొన్న ప్రతికేసుకూ ఈ నేపథ్యం వుంది. దళితుల హక్కుల స్పృహను తట్టుకోలేని ఆధిపత్య వర్గాలు వారిని సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అణచివేతకు గురిచేస్తున్నారు. అన్ని పరిస్థితులకు మూలంగా వున్న అంటరానితనం వలన ఆర్థిక సాంఘిక హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయి.

అంటరానితనం అనేది తీవ్రమైన ఆర్థిక అణచివేత. అది దళితులకు కనీస జీవనాధార

హక్కులైన నీరు, భూమి, వేతనాలు, ఉద్యోగావ కాశాలను తిరస్కరిస్తుంది. అది దళితులను అగ్రకులాల వారి దగ్గర తరాల బానిసత్వానికి గురిచేస్తున్నది.

అంటరానితనం రాజకీయంగా కూడా దళితులను అణచివేస్తున్నది. దళితులు స్వేచ్ఛగా ఓటు వేసుకొనే అధికారాన్ని చాలాచోట్ల అగ్రకులాల వారు తిరస్కరిస్తున్నారు. అగ్ర కులాలవారు వ్యతిరేకించే అభ్యర్థికి దళితులు ఓటువేస్తే, లేదా అసలు దళితులు తమ ఓటు హక్కును వినియోగించుకొంటేనే; వాళ్ళపైన, వాళ్ళ ఆస్తులపైన దాడులు జరుగుతున్నాయి.

అంటరానితనం ఒక సాంఘిక అణచివేత. అది దళితులను మానవగౌరవంతో జీవించే అవకాశాలను తిరస్కరిస్తుంది. తమకు ఇష్టమైన బట్టలు వేసుకొనే అవకాశం లేదు. పొరపాటున నిమ్న కులాలకు చెందిన వ్యక్తి చెప్పులు వేసు కొంటేనే అది చంపదగిన నేరం అవుతుంది. దళితులు అగ్రకులాలవారితో తమకున్న అభిప్రాయబేధాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే వీలు లేదు. తమకిష్టమైన వారిని పెళ్ళిచేసుకోవడానికి వీలు లేదు. బస్సుల్లో అగ్రకులాల వారందరికి సీట్లు దొరికిన తర్వాతనే దళితులు కూర్చోవాలి. కులంపేరుతో దూషించినా, హోటళ్లలో ప్రత్యేకంగా గ్లాసులు ఇచ్చినా, ఆ అవమానాన్ని దళితులు భరించాలి.

అంటరానితనం సాంస్కృతిక అణచివేత. అది జాతి సాంస్కృతిక జీవనంలో పాల్గొనాలా, వద్దా? అన్న విషయాన్ని నిర్ణయిస్తుంది. గ్రామం లో నిర్మించే దేవాలయానికి దళితులు ఉచితంగా శ్రమచేయాలి. ఒక్కసారి నిర్మాణం పూర్తయిం దంటే యిక దళితులకు అందులోకి ప్రవేశించే అర్హతే లేదు. గ్రామాల్లో జరిగే ఉత్సవాలు, సంబరాల్లో దళితులు డప్పులు కొట్టాలి. కాని తమ సొంత ఉత్సవాలను దళితులు జరుపు కోవడానికి వీలులేదు. అగ్ర కులాల వాళ్ళ పెళ్ళిళ్ళకు చావులకు ఉచిత సేవలు అందిం చాలి. విందుల్లో మాత్రము అంతా అయిపోయిన తర్వాత చిపరన కూర్చోవాలి. అగ్రకులాలవారి చావులకు సేవలు చేయాలి. తమ వాళ్ళశవాలను మాత్రం దళితులు వూళ్ళో నుంచి తీసుకు వెళ్ళటానికి లేదు.

అంటరానితనం సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కుల వుల్లంఘనల పుట్ట. దళితులు ఈ హక్కుల ఉల్లంఘనలు ప్రశ్నించి నపుడు తమ ఆధిపత్యానికి భంగం వాటిల్లు తుందని భయపడ్డ అగ్రకులాల వాళ్ళు హత్యల కు పాల్పడుతున్నారు. హత్యలు చేస్తారు. రేప్‌లు చేస్తారు. దాడులు చేస్తారు. తీవ్రమైన గాయాలు చేస్తారు. దోపిడీలు, గృహదహనాలకు పాల్పడుతారు. అంతా నిత్యం జరుగుతున్న సత్యం. జీవించే హక్కును తిరస్కరించడమంటే అన్ని హక్కులనూ తిరస్కరించడమే. ఎందు కంటే ప్రాణరక్షణ, బతుకులేకపోతే మిగతా హక్కులకు అర్థమే లేదు. ✦

రేపు


బి. పాండురంగారెడ్డి

తరాల నుండి దోచిన తమ
గుండెల నెత్తురు కక్కమని
ఆకలిదప్పులతో శోషిల్లిన కంఠాలు
ఒక్కటై చేస్తున్న సింహనాదం
అదిగో....

జెండా

- డా॥ బి.సూర్యసాగర్

అందులో గొప్పేమి లేదు
గాల్లో
ఏజెండా అయినా ఎగురుతుంది
త్రివర్ణమైనా కాషాయమైనా
మరేదైనా కాని
జెండా గుండెల్లో మండాలి
బతుకు సమస్యల
ఎజెండాతో ఎగరాలి
చెట్టులా మట్టి నుంచి ఎదగాలి
కులమతాల
శవసంస్కృతిపై
సమాధిలా లేవాలి
పీడకులను ధ్వంసించే
ధ్యేయంగా సాగాలి
ఒక త్యాగాన్ని భరించాలి
ఒక యుగాన్ని జయించాలి
ఉద్యమానికి వందనం జెండా
సదాశయాల ఆవేశం
అవ్యవస్థకు చికిత్సా లేజర్
అవకాశవాదానికి నీడ నివ్వని
మధ్యాహ్నపుటెండ
వర్గదృష్టిని సానబెట్టే ఆకురాయి
అణచివేత బండరాళ్ల కింద
నలిగి నిలిచిన
పోరాటం ఊపిరి
అశాంతికీ ప్రశాంతికీ మధ్య
పరుచుకున్న
అలజడి డప్పుల చప్పుడు
జెండా నెగురవేసే వాడు
జెండా లాగే నిలవగలగాలి



భూ కేంద్రీకృతం

- భూమిరెడ్డి నరసింహారెడ్డి

తెలంగాణ పోరాటం...

ఒక ప్రజా ప్రవాహం...

సామాజిక స్వరూపం....

నిజాంరాష్ట్రంలో 2600 మంది జమీందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు,... దేశ్‌పాండేలు ..... ఉండేవారు. వీరి ఆధీనంలో 10 వేల గ్రామాలుండేవి. మొత్తం 5 కోట్ల 30 లక్షల ఎకరాల సాగు భూమితో ఉండేది. ఇందులో 1 కోటి 50 లక్షల ఎకరాల భూమి జమీందార్ల కింద ఉండేది. అంతేకాదు వీరి ఏలుబడిలో ఉన్న 10 వేల గ్రామాలపై సర్వహక్కులు వీరికే ఉండేవి. సంవత్సరానికి ఒకసారి ప్రజలను పీల్చి పిప్పి చేసి, నానా ఇబ్బందులకు గురిచేసి పన్నులు వసూలు చేసేవారు. అందులో కొంత భాగాన్ని చక్రవర్తికి కప్పంగా కట్టేవారు. 1950-51 పరిపాలన విభాగం రిపోర్టు ప్రకారం నల్గొండ, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 500 ఎకరాలకు పైగా భూమి కలిగి ఉన్న భూస్వాములు దాదాపు 550 మంది ఉన్నట్లు ఆ రిపోర్టు వివరించింది. ఒక గ్రామంలో ఉన్న మొత్తం సేద్య యోగ్యమైన భూములలో 60శాతం నుండి 70శాతం భూమి భూస్వాముల చేతులలోనే ఉంటుండేది. సూర్యాపేట తాలూకాలో దేశ్‌ముఖ్‌గా పేరు గాంచిన ఎర్రపాడు దొర జన్నారెడ్డి దొరలకు 30 గ్రామాలలో ఒక లక్షా 50వేల ఎకరాల భూమి ఉండేది. జనగామ తాలూకా విసునూర్ దొర రాంచంద్రారెడ్డికి 40 ఎకరాల భూమి ఉండేది. మదిర తాలూకా కల్లూరు దేశ్‌ముఖ్‌కు 10 వేల ఎకరాల భూమి ఉండేది. ఇవేగాక 'ఇనాములు', 'పాయగాలు' పేర్లతోలక్షల ఎకరాల భూమి ఉండేది. అనేక గ్రామాలను నిజాం చక్రవర్తి తన బంధువులకు దత్తతగా అందచేసేవాడు. మొత్తం గ్రామీణ వ్యవస్థ అంతా జమీందారీ మయంగా ఉండేది.

ఎక్కడ ఏ చిన్న కదలిక జరగాలన్నా దొరగారి అదుపు ఆజ్ఞల్లోనే జరగవలసి వచ్చేది. పెద్ద పెద్ద గడీలు, గడీల ముందు వెట్టిచేసే వాళ్ళు, బరువులు మోసే వాళ్ళు, నిత్యం కాపలా ఉండడం ఆనాటి రివాజు. భూమంతా దొరల చేతిలో ఉండడం, భూమిలేని పేదలు దొరల వద్ద కూలీలుగా ఉండేవారు. దాన్యం అనుభవించి ఇక భరించలేక, దున్నేవాడికే భూమి కావాలని అడగటం తప్ప మరో మార్గం లేనంతగా భూములు భూస్వాముల చేతిలో కేంద్రీకరించడ్డాయి.

సగటున ఏ గ్రామంలోనూ పాఠశాల లుండేవి కావు. ఎక్కడో దూర నగరాలలో 'మిడిల్ మల్టీపర్పస్' పాఠశాలలు ఉంటుండేవి. ప్రాథమిక విద్య నిమిత్తం పూర్వ చరిత్ర గల ప్రాంతాలలో మదర్‌షా అనే పేరుతో కేంద్ర పాఠశాలలుండేవి. అంతేగాక అందులో పెద్దరైతు కుమారులు పెత్తందార్ల కుమారులు, చదువుకునేవారు. చదువు అందుబాటులో లేని రోజులవి. గ్రామీణ వ్యవస్థ అంతా కొద్దిమంది చేతిలో ఉండడం వల్ల ఉత్పత్తి చాలా బలహీనంగా ఉండేది. అందు వలన ఏ గ్రామంలోచూసినా నిత్యం 'ఆకలి' వెంటాడుతూ ఉండేది. కాచుకున్న గంజి తప్ప 'అన్నం' అనే మాట ఆ రోజుల్లో అరుదుగా ఉండేది. దాదాపుగా కొద్ది మంది తప్ప రైతులు కూడా ఘట్క తినేవారు. ఉత్పత్తి వ్యవస్థ బలహీనంగా ఉండటం వల్ల " బువ్వ" సమస్య చాలా తీవ్రంగా ముందుకొచ్చేది. అందుకే భూమి లేకుండా భుక్తిలేదని గ్రహించిన ప్రజలు **"దున్నే వాడికే భూమి కావాలని"** తద్వారా మాత్రమే భుక్తి, విముక్తి సాధ్యమవుతుందని గ్రహించారు. ఈ సామాజిక నేపథ్యమే తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి ప్రేరణ. ఈ పరిస్థితులే తిరుగుబాటుకు పునాది. వెట్టిచాకిరీ అర్ధ బానిసత్వం ఆనాటి జీవనలక్షణం. ఏ కులం బానిసత్వానికి మినహాయింపుగా ఉండేది కాదు.

వెట్టి చాకిరి

పెద్ద జమీందార్లు చిన్న పెత్తందార్ల పైన; వారు కౌలుదారుల, పాలుదార్ల, రైతుల పైన; ఇలా తంతులవారీగా పరిపాలన విస్తరించేది. ఇస్నూరు రాంచంద్రారెడ్డి, జన్నారెడ్డి, పెద్ద దొరలయితే; మహబూబ్‌నగర్, వనపర్తి, ఇతర గ్రామీణ భూస్వాములు చిన్న దొరలుగా ఒకరిపై ఒకరు ఆధారపడుతూ పాలన చేసేవారు. ఆనాడు సమాజంలో వెట్టి చాకిరీ అనేది సామాజిక క్రూర స్వరూపంగా నిలిచింది. ప్రజలందరూ ఉదయం 4 గంటల నుండి అర్ధరాత్రి వరకు బండెడు చాకిరీ చేయక తప్పేది కాదు. దొరలకు, పెత్తందారులకు వాళ్ల ఇల్లు వాకిలీ ఊడ్చడంతో ప్రారంభమయిన చాకిరి రాత్రిపూట పక్కలు వేసే వరకూ కొనసాగింది. ఆ రోజుల్లో రోజుల కొలది ప్రయాణాలుండేవి. భార్యపిల్లల్ని వదిలేసి ఇతర ప్రాంతాల్లో నివసించవలసి వచ్చేది. ప్రయాణ సమయాల్లో దొరల కచ్చరాలకు ముందు పరిగెత్త డమనేది ఆనాటి ఓ క్రూరమైన ఆచారం. భూమిని దున్నే రైతులకు ఏ హక్కు ఉండేది కాదు. తమ పశువులపై తమకు హక్కు ఉండేది కాదు. మంచి పశువులు ఏ రైతుకైనా ఉంటే దొర వారు అడిగితే మారు మాట్లాడకుండా రైతు పశువులను దొరకొట్టంలో కట్టేసి రావాలి. ఆ రోజుల్లో కూలికి పోవడమంటే దొరకు రెక్కలమ్ము కోవడమే. అణా (6 పైసలు), బేడా (12 పైసలు) ల కోసం ఇంటిల్లిపాది వ్యవసాయ కూలికి వెళ్ళేవారు. బాలింతలు సహితం కూళ్లకు పోక తప్పేది కాదు. పసిపిల్లలకు పాలివ్వడానికి ఇంటికి పోనిచ్చేవారు కారు. జమీందార్ల బరువులు మోయడం ఒక పెద్ద అసాధారణమైన, అనాగరికమైన దురా చారం. జమీందార్లు, పెత్తందార్లు, ప్రభుత్వోద్యోగు లు తమ ప్రయాణాల్లో బరువులు మోయడానికి విరివిగా ప్రజలను బానిసలుగా వాడుకునేవారు.

ఆరోజుల్లో ఒక ఎస్.ఐ. (అమిన్‌సాబ్) వస్తే ఎంతో పెద్ద ఆర్భాటం ఉండేది. ఆయనతో పాటు వచ్చిన ఆయన సామాన్లను 10 మంది మోసు కొచ్చేవారు. ఇలా సమస్త కులాలు పీడనకు గురైనాయి. ఆర్థికంగా పేదరికంలో ఉన్న అగ్ర కులాలు కూడా ఈ పీడనకు గురైనాయి. అంటే ఆర్థిక స్థితిని బట్టి పీడన ఉండేదని మన అర్థం చేసుకోవాలి. ఈ రకంగా వెట్టి చాకిరి ఒక వికృత రూపంగా జడలు విప్పి నృత్యం చేసింది. 1943 వరకు ఈ వెట్టి చాకిరిని భరించిన ప్రజలు అప్పుడప్పుడే వ్యతిరేకించడం ప్రారంభించారు. అలాంటి నేపథ్యంలో ఆవిర్భవించిన వాడే బందగి అనే పేద రైతు.

అర్ధ బానిసత్యం.... బానిసత్యం... ఆనాటి జీవనశైలి. ఏ కులం బానిసత్వానికి మినహా యింపుగా ఉండేది కాదు.

" అయ్యా బాంచోన్ని... నీ కాల్మొక్త.." ఇది అనాడు అట్టడుగు ప్రజలనోటి వెంట నిరంతరం ఊతపదంగా వచ్చేమాట. వాహనాల ముందు పరుగెత్తడం, దొరల గడీల ముందు కాపలా కాయడం, దొరలింట్లో పని చేయడం; కుమ్మరి, కమ్మరి, చాకలి, మంగలి, హరిజన, గిరిజన, చేనేత, అన్ని కులాల వాళ్ళు, కుటుంబాలవాళ్ళు,

తమ జీవితమంతా దొరల సేవలోనే గడపవలసి వచ్చేది.

ఒక ఇంటిముందు దొర కూచుని ఉన్నప్పుడు సామాన్యంగా ఎవరూ ఆ దారిన వెళ్ళేవారు కాదు. ఒకవేళ వెళ్ళవలసి వచ్చినా పెద్ద రైతులయితే రుమాలు తప్పనిసరిగా తీయాలి. చెప్పులు చేత పట్టుకోవాలి. వంగి, వంగి దొరకంట కనబడ కుండా వెళ్ళిపోవాలి. తలెత్తి నడిస్తే ఆరోజుల్లో నేరంగా భావించే వారు. నడకలో బానిసత్వం మాత్రమే కనబడాలి. ఏ మాత్రం తేడా వచ్చినా వెంటనే తగువిధంగా శిక్షించేవారు. పేరు అడిగినప్పుడు మోటుగా తన పేరు చెప్పుకోవాలి పేరును గ్రాంధికంలో చెబితే అతనికి దెబ్బలు తప్పేవికావు. ఉదాహరణకు లచ్చుమమ్మ అనే చెప్పుకోవాలి. లేదా లచ్చిగాడు అనే చెప్పు కోవాలి. లక్ష్మమ్మ అనో లక్ష్మయ్య అనో చెబుతే అతనిని నానా ఇబ్బందులు పెట్టడం ఆనాడు అలవాటు. దొరలకు అందరూ విధేయులుగా ఉండవలసిందే. సేవలు చేయడంలో ఎంత మాత్రం జాప్యం జరగడానికి వీలులేదు. పొర బాటున ఆలస్యం జరుగుతే ఆల స్యానికి కారణం అయిన వారిని వెతికి పట్టుకుని వచ్చి స్తంభాలకు కట్టేసి చిత్రహింసలు పెట్టినా ఎవరూ అడగలేని రాక్షసత్వం కొనసాగుతున్న రోజులవి. గడీ పై నుండి దొరవారు సైగ చేస్తే క్రింద ఉన్న తిరుగు బాటు చేసిన బానిసల్ని ఎందరినో హత్యచేసి అనవాలు కూడా లేకుండా చేసిన సందర్భాలు కోకొల్లలు. దొరలకిష్టం లేకపోతే కనీసం జీవించే హక్కు కూడా ఆ రోజుల్లో ఉండేది కాదు. ఇంతటి ఘోరమైన, దయనీయమైన సామాజిక జీవితం ప్రజలను బాగా ఇబ్బందులకు గురి చేసింది. భరించలేక కొన్ని సందర్భాలలో కొద్దిచోట్ల కల్గిన తిరుగుబాట్ల పర్వంలో గిరిజన నాయకుడు కొమరంభీం, ఇసునూరు దొర కెదురొడ్డి నిలిచిన ముస్లిం యువకుడు 'బందగి' వంటి ఎన్నో అగ్ని కణాలు అమరణిస్తూ ఎగిరిపడ్డాయి. కొమరంభీం, బందగిల మరణం తెలంగాణ సాయుధ పోరాటానికి తొలికేక.

గోండు దాదా కొమరం భీం

ఆదిలాబాదు జిల్లా ఆసిఫాబాద్ దగ్గర్లో సుంకరపల్లి అనే గ్రామంలో జన్మించిన కొమరం భీం తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి తొలివేకువలోనే మార్గ నిర్దేశకుడుగా నిలిచాడు. 'సుంకరపల్లి' అనేది ఒక గోండు గూడెం. అక్కడ కోయలు, గోండులు ఉండేవారు. అప్పుడప్పుడే పోడుగొట్టి అడవి భూములు సేద్యం చేసుకోవడం గోండులకు అలవాటవుతున్న రోజులవి. అయితే పోడుగొట్టడం, భూములను సేద్యం చేయడం గిరిజనుల పని. ఆ భూములకి తమ భూములని పట్టాలు తయారు చేసుకుని రావడం భూస్వాముల పని. ఈ వరుసలో సుంకరపల్లి గ్రామంలో గిరిజనుల పోడు భూములన్నీ భూస్వాముల పాలై, అక్కడ భూమి లేనందు వల్ల గోండులు కుటుంబాలతో సహా "సర్దాపూర్" అనే మరో గూడెం చేరుకున్నారు. అక్కడ భూమిని సదును చేసి, వ్యవసాయం చేసి పంట పండించేవారు. పంట చేతికొచ్చే సమయా నికి "సిద్దిఖ్" అనే భూస్వామి ఈ భూమి తనదేనని పట్టా కాగితం పుచ్చుకుని వచ్చాడు. రౌడీగుంపు తో వచ్చిన సిద్దిఖ్ గిరిజనులను హింసించడం మొదలు పెట్టాడు. తోటి గిరిజనులపై జరుగు తున్న హింసలను సహించ లేక 15 సం॥ల కొమరంభీం చేతిలో ఉన్న కర్రతో ఆ జమీందారుని ఒకే ఒక దెబ్బ తీసేసరికి అతను చనిపోయాడు. ప్రభుత్వం కొమరంభీం పై హత్యానేరం మోపింది. దాంతో పోలీసుల నుంచి తప్పించుకుంటూ ఈ రాష్ట్రం సరి హద్దులు దాటి, దేశంలో అనేక ప్రాంతాలు తిరిగి పరిస్థితులను గమనించాడు. భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు వంటి వారి వీరగాథలు విని ఉత్తేజం పొందిన కొమరంభీం తన ప్రజలను సమీకరించి, తన గడ్డపైన్నే ఉద్యమాన్ని నడపాలనే తిరిగి "అసిఫాబాద్" చేరుకున్నాడు. "భాభారుురి" అనే ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని గిరిజన పోరాటాన్ని నడిపాడు.

కట్టె మనది.....
కలపమనది....
అడవి మనది....
భూమి మనది... అనే నినాదంతో


కోయ ప్రజల్ని సంఘటితపర్చాడు. గ్రామ పాలనలో **"మా గూడెంలో మారాజ్యం"** అనే మాట బాగా సాగింది. గిరిజనులు భూముల పైన హక్కులు పొందారు. ఇది గమనించి నైజాం పోలీసులు రంగంలోకి దిగి ఉద్యమాన్ని అణిచివేయాలని దాడులకు సిద్ధ మయ్యారు. కోయ ప్రజలు పోలీసు దాడులను ప్రతిఘటిం చారు. అనేకమార్లు పోలీసులను గూడాల నుండి తరిమికొట్టారు. కోయబలాన్ని గమనిం చిన పోలీసులు కొమరంభీంను జనం నుండి వేరు చేయాలని ప్రజలకు డబ్బును, ఇతర సౌకర్యాలను ఎరగా చూపించి ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారు.అయినా ప్రజలు లొంగలేదు. కొమరంభీంను ప్రజలే రక్షించు కున్నారు. ఇలా సాగుతున్న ఉద్యమాన్ని దెబ్బ తీయాలని రెండవ అస్త్రంగా తీవ్రనిర్భంధాన్ని ప్రయోగించారు. గిరిజనులను అరెస్టు చేసి జైళ్ళలో కుక్కారు. అయినా కొమరంభీం లొంగలేదు సరికదా

"అరెస్టు చేయబడిన గిరిజనులను విడుదల చేయాలని"; "గిరిజనులుసాగు చేసుకున్న భూములకు, వారికే పట్టాలివ్వాలని" సవాలు విసిరాడు. దీంతో కన్నెర్ర చేసిన నిజాం పోలీసు బలగాలు ఏరకంగానైనా సరే కొమరంభీంను చంపాలని తలపెట్టాయి.

అది 1943 సంవత్సరం వెన్నెల రాత్రి. గూడాలన్నీ గాఢనిద్రలో ఉన్నాయి, తమ భూములకు భద్రత ఉందని, తమవైన బానిసత్వం లేదని, ఏ సర్కార్ తమ హక్కులను ఉల్లంఘించ లేదని, ఎంతో విశ్వాసంతో నిండు జీవితాన్ని నింపాదిగా అనుభవిస్తున్నందువల్ల గిరిజనులు ఆదమరచి నిద్రపోతున్న రోజు. ఆ పండువెన్నెల రాత్రి గూడెం చుట్టూ నిజాం పోలీసు బలగాలు కమ్ముకున్నాయ్. ధాం ధాం అంటూ కాల్పులు ప్రారంభించాయి. ఊహించని ఈ శత్రువు దాడిని ఎదుర్కొనేందుకు కొమరంభీం సన్నద్ధమయి తోటికోయ ప్రజలతో బాణాలు, బరిసెలు, నాటు తుపాలకులతో, పోలీసు బలగాల్ని ధీకొన్నాడు. కొన్ని గంటల పాటు హోరాహోరీ పోరాటం సాగింది. 'భీం' నేలకొరిగి చంద్రుడిలో కలిసి పోయాడు. ఆయన వీరమరణం గోండు వీరులకు ఆశాజ్యోతిగా నిలబడింది. తమ నాయకుని ఆశయ సాధన కోసం కట్టుబడి పని చేయడానికి ఆయన త్యాగం స్ఫూర్తినిచ్చింది. చరిత్రలో గిరిజన తిరుగుబాట్లకు పెట్టింది పేరు. వీరుడు కొమరం భీం జీవితం త్యాగాల చరిత్ర. ఇలాంటిదే మరొక సంఘటన మీకు వివరిస్తాను.

బానిస బంధనాలను ధిక్కరించిన బందగి

విస్నూరు రాంచంద్రారెడ్డి ఏలుబడిలో ఉన్న కామారెడ్డి గూడెం అనే గ్రామానికి చెందిన ఓ పేద ముస్లిం కుటుంబానికి చెందిన యువకుడు బందగి. బందగి కొద్దోగొప్పో వ్యక్తిత్వం, ఆత్మ గౌరవం ఉన్నవాడు. అందువల్ల విస్నూరు రాంచంద్రారెడ్డి అతనిని సహించేవాడు కాదు. ఏ విధంగానైనా అతనిని దెబ్బతీయాలని పథకం



1942కు పూర్వం నుండి బానిస బంధనాలను ధిక్కరించి విస్నూరు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా పోరాడి నేలకొరిగిన బందగి సమాధి.

పన్నాడు. బందగికి అయిదుగురు అన్నదమ్ములు. అందులో పెద్దవాడు అబ్బాసలీ. అతనిని చేరదీసి జ్యేష్ఠభాగం అడగమని పురమాయించాడు. బందగి భాగం కూడా తనకే కావాలని అబ్బాసలీ పట్టుపట్టేలా తగాదాను దొరవారు పెంచాడు. బందగి తన భూమిని వదులుకోవలెనని హెచ్చరిక కూడా చేశాడు. బెదిరిపోయిన బందగి కాళ్ల వేళ్ళా పడ్డాడు. తన భూమి తనకిప్పించమని కోరుకున్నాడు. అయినా దొరమనసు కరగలేదు. దీంతో తలొగ్గడం కన్నా తలపడటమే మంచిదని భావించిన బందగి న్యాయంకోసం పోరాటం చేయాలని నిశ్చయించుకున్నాడు.

కోర్టులో దావా వేసాడు. ఆరోజుల్లో కోర్టు కెక్కడం అనేది ఎందో అరుదైన విషయం. ప్రజలందరి అండ, సానుభూతి, బందగికే ఉంది. అప్పులు చేసి కోర్టుచుట్టూ తిరిగాడు. గ్రామంలో అన్నం సద్దికట్టుకుని కట్టెకు తగిలించుకుని ఏండ్లకేండ్లు కోర్టుకు కామారెడ్డి గూడానికి తిరిగాడు. చివరకు ఒకరోజున కోర్టు తీర్పు వెలువడింది. బందగి భూమి బందగికే చెందాలని కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఎంతో సంతోషంతో బందగి కామారెడ్డి గూడెం చేరుకున్నాడు. బందగి విజయం ఇస్నూరు రాం చంద్రారెడ్డికి తలవొంపుగా ఎదురు దెబ్బయ్యింది. ఆగ్రహంతో ఉగ్రుడయ్యాడు. గెలిచిన బందగిని చంపించి తాను గెలవాలని విస్నూరు రాం చంద్రారెడ్డి భావించి ఒక రౌడీని బందగిని చంపేందుకు పురమాయించాడు. అతను కత్తితో బందగిపై దాడి చేయగా అది గమనించి వచ్చిన రౌడీని చితకబాది తరిమి కొట్టడంతో బందగిపై దొరకు మరింత కోపం పెరిగింది. ఎలాగైనా బందగిని చంపాలని అబ్బాసలీని పిలిపించి బందగిని చంపేందుకు కుట్రపన్నాడు.

1942 జులై నెల దాదాపు వర్షాకాలం. బందగి కోర్టుతీర్పు నఖలు కోసం బయలుదేరాడు. ఊరు పక్కనగల రోడ్డుపై గల బస్‌స్టాప్ దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. బస్సు కోసం ఎదురు చూస్తున్న బందగిని మృత్యువు మింగింది. అంతకు ముందే చుట్టూ ఉన్న గడ్డి పొదల్లో పొంచి ఉన్న శత్రువు కత్తులతో, గండ్ర గొడ్డల్లతో నిరాయుధుడైన బందగిపై దాడి చేశారు. క్షణాల మీద బందగి తల నేల రాలింది.కర్కోటక జమీం దారీతత్వపు స్వభావం మనిషిని నిలువునా వధించి తన అమానుషత్వాన్ని ప్రకటించుకున్నది.

బందగి తరువాత ఆరక్తం నుండి విప్లవోద్యమాలు ఆవిర్భవించాయి. బందగి జ్ఞాపకార్థం అక్కడే సమాధిని నిర్మించినారు. ఆ సమాధి భవిష్యత్ పోరాటానికి నిత్యస్ఫూర్తిగా నిలిచింది! పోరాటయోధులకు బందగి మరణస్థలం ఒక పవిత్ర స్థలమయ్యింది! బందగి రక్తం అక్కడే ఇంకి పోలేదు. నలువైపులా విస్తరించిన బందగి రక్తపుజ్వాలలు తెలంగాణా పల్లెల్ని తట్టి లేపాయి. వీరుడు బందగిని చంపిన భూస్వామ్యం జనాన్ని కాటేసింది. అందుకే జమిందారీ సర్వాన్ని వధించేందుకు సన్నద్ధం కావాలని బందగి బలిదానం మారదర్శకమయ్యింది. ✦

స్వర్ణ భారతి సాక్షిగా ...

- రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి

ఖాద్రి నరసింహస్వామి సాక్షిగా
మాట్లాడుకుందాం
కదిరి ఈద్గాల సాక్షిగా చెప్పకొందాం
ఇక్కడ
నరుడు మృగమయ్యాడు
నిజంగా
మృగం మగాడయింది.

ఎడారి బతుకులకు
జీవితం దొంగసారా -అవుతుంటే
మరో వైపు
బొంబాయి చేతులూపి పిలుస్తుంటే
ఈ ఎడారి పూలు పూయడానికి
దొంగసారా కాసారమౌతోంది
బొంబాయి మల్లిపందిరై ఆహ్వానిస్తోంది.
చెరువు కట్ట తెగకుండా
ప్రాణత్యాగం చేసిన ముసలమ్మ నేల
తడారిపోయిన ఎడారై
జీవితాన్ని జూదం చేసింది
మనిషిని మాంసం ముద్దను చేసింది.

అందుకే మరోసారి
ఖాద్రి నరసింహస్వామి సాక్షిగా
మాట్లాడుకుందాం
కులాన్ని తుడిచి మనిషి ఎవరో చూద్దాం
రమణమ్మకు
తన జన్మభూమి
స్వర్గం కన్నా ఎంత గరీయసో . . .

నా తెలంగాణ

- కృష్ణమూర్తి యాదవ్

నా తెలంగాణ బీదదే కావచ్చు
బాధల్లో ఉన్నా భయపడే రకం కాదు
పోరాటం దాని ఊపిరి
నిజాం నవాబును గద్దె దిగే దాక
నిలేసి పోరాడింది
నా తెలంగాణా బీదదే కావచ్చు
బతుకుదెరువు కోసం
చెరువుల కింద కుంటల కింద
పాలాలను సాగు చేసుకోవచ్చు
జమిందార్లు జాగీర్దార్ల క్రూర పెత్తనాన్ని
కూకటి వేళ్ళతో పీకేసింది
నా తెలంగాణ బీదదే కావచ్చు
గుట్టల పొంటి గట్ల పొంటి తిరుగుకుంట
బర్రెలను మేపుకుంట గొర్రెలను కాసుకుంట
గట్కగంజి నీళ్ళు తాగి
గట్టి పోరాట పటిమను నేర్చుకుంది

తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలుకాలో కష్టజీవుల ఉద్యమంలో పెనవేసుకొన్న మహిళా ఉద్యమం

(కామ్రేడ్ భూపతి కమలమ్మ పాత్ర)

- జి. నరసింహమూర్తి

తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకాలో కష్టజీవుల ఉద్యమంలో పెనవేసుకున్న మహిళా ఉద్యమం గురించిన అనుభవాల్ని అందించే వ్యాసమిది. కష్టజీవులైన మహిళలు, యువకులు ఏ విధంగా దోపిడీశక్తుల్ని, పెత్తందారీ శక్తుల్ని ఎదుర్కొని; వర్గపోరాటంలో రాటుదేలి, విజ్ఞానవంతులయ్యి, త్యాగమూర్తులైన కార్యకర్తలుగా ఎదిగారో ఈ అనుభవాలు తెలియజేస్తున్నాయి. ఇది నేటితరం యువతీయువకులు ఆదర్శంగా తీసుకోవలసినవి. కొద్దిపాటి సవరణలతో ఈ వ్యాసాన్ని యిస్తున్నాం. - సంపాదకులు

కష్టజీవుల ఉద్యమం పుట్టుక రాజోలు తాలూకాలో కాకతాళీయంగా జరిగింది కాదు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి గుడితో ఉన్న ప్రదేశం పుణ్యక్షేత్రంగా సుమారు నాలుగు వందల సంవత్సరాలుగా చరిత్ర కెక్కింది. ఈ అంతర్వేది గ్రామంలో గల భూముల్ని మొగల్తూరు రాజులు ఆక్రమించుకొని, వాటిని దేవుడి మాన్యాలుగా మార్చారు. ఇక్కడి ఈ మాన్యాలు ఎక్కడో ఉన్న మొగల్తూరు రాజులు వచ్చి చేసుకునే సౌలభ్యం శూన్యం కనుక వాటిని అర్చకుల ఆధీనంలో తొంభైతొమ్మిది సంవత్సరాల కౌలుకి ఇచ్చారు. ఆ భూముల్ని సాగు చేసుకోవడమెలాగో తెలియని అర్చకులు వారు శ్రమించడంకంటే, శ్రమదోపిడీ చాల సులువైన మార్గం కనుక నమ్మకస్తులైన నిన్ను కులాలవారికి తలో అయిదు ఎకరాల భూమిని గుత్తకిచ్చారు. ఈ అంతర్వేది భూములు గొంది, రామేశ్వరం వరకూ వ్యాపించి ఉండుట వలన బీదా బిక్కీ, అంటరాని కులాలవాళ్ళు హాయిగా వ్యవసాయం చేసుకుంటూ బతికేస్తూ తమ ఆధీనంలో లేకుండాపోతే, రానున్న రోజులలో తమ ఉనికికే ముప్పు తెచ్చేయగలరని గుడిమూలలో గల ఓ క్షత్రియ భూస్వామి కుటుంబీకులకు కంగారు పుట్టుకొచ్చింది. తమ సరసనున్న భూముల్లో, తక్కువ కులస్తులైన వాళ్ళు కౌలుదారులుగా వ్యవసాయం చేసుకుంటూ సంపన్నులైతే, రానున్నకాలంలో ఆ చుట్టుపక్కల తమ ఆధిపత్యం దెబ్బతింటుందని గమనించారు. కౌలుకిచ్చిన బ్రాహ్మణుల్ని భయపెట్టో, బ్రతిమాలో కొందరు గుత్తదార్లను వారు చేసే భూముల నుంచి తరిమేశారు. ఆ భూమి నంతా తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని బలం, బలగం, రౌడీయిజం చేయగల కాపు వర్గీయుల్ని తమ పక్కకు లాక్కున్నారు. ప్రలోభపెట్టి, గుత్తదార్ల పొలాలకు నీళ్లు అందకుండా, అసలు నీళ్ళు వెళ్ళకుండా, ఆ భూస్వామి వర్గం మరో పంట కాల్వ తవ్వి ఆ నీరంతా తామే పెట్టుకోవడం ప్రారంభించింది. అంతర్వేది పర్రభూమికి సరైన నీటి సదుపాయం చాలా ముఖ్యం. చౌడు పర్రలకు కాటన్‌దొర విముక్తి కలిగించాడు. సేద్యానికి అనుకూలమవడంతో పోటీ పెరిగింది. మరోపక్క



కామ్రేడ్ కమలమ్మ

అంతర్వేదిలో జరుగుతున్న ఆక్రమణలాంటిదే తామూ చేసి అవతల తన ప్రత్యర్థి వర్గమైన గుడిమూల రాజులకంటే అధిక భూములు తాము కైవసం చేసుకోవాలని చింతలపల్లికి చెందిన మరో క్షత్రియ భూస్వామి ప్లాను వేశాడు. స్వతంత్రపార్టీ అనే దానిని తన అధీనములో నడుపుతూ, ప్రభుత్వాన్ని ఒప్పించి సుమారు 400 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. చింతలపల్లి సమీపంలో గల కొన్ని దేవాలయ మాన్యాలు వీరి చేతిలో పెట్టుకున్నారు. ఇలా ఒకర్ని మించి మరొకరు రాజకీయంగా, సంపన్నంగా ఎదగాలని ఘర్షణలకు దిగారు; వర్గాలను కూడగట్టారు. ఇదే సమయంలో అంతర్వేది పాలెం ఫిర్కాగా పిలవబడే అంతర్వేది పాలెం గ్రామంలోనూ, సకినేటిపల్లి చుట్టుపట్ల గ్రామాల్లో క్రైస్తవ మతం ప్రవేశించింది. ఈ హిందూ మత ఛాందసుల మీద, వారి నియంతృత్వ వైఖరి వలన క్రైస్తవ యువకుల్లో తెగింపు వచ్చింది. అప్పటి వరకు ఈ భూస్వాముల అవమానాలను ఎలా ఎదిరించాలన్న ఆలోచనలో గల తక్కిన యువకులకు మంచి సపోర్టు దొరికింది.

ఆధ్యాత్మికతోపాటు, అణగదొక్కేవర్గం వాళ్ళపై తిరగబడకపోతే బతకలేమన్న మనోధైర్యం క్రైస్తవులు తక్కిన వారిలో కల్పించారు. చదువుకున్న క్రైస్తవ యువకుల్లో ప్రణాళికాబద్ధమైన తిరుగుబాటు లక్షణాలు తక్కినవారికి ఓ లక్ష్యం చూపించాయి. అప్పట్లో మొట్ట మొదటి పాస్టర్ అయిన కొల్లాబత్తుల లాజరస్ వందమంది నిమ్న కులస్తులతో అంతర్వేది గ్రామాన్ని గునపాలతో, పారలతో దండెత్తారు.

"యెహోవా పేరిట నేను తొలి పార వేస్తున్నాను. అక్రమంగా తవ్విన ఈ కాల్వను పూడ్చి పారేసి, మన భూములకు కాల్వ తవ్వండి." అంటూ పాస్టర్ లాజరస్ తొలి పార వేశారు. భూస్వాములు అక్రమంగా తవ్విన కాల్వ పూడ్చేశారు. తమ భూముల్లోకి కొత్త పంటకాల్వ తవ్వేశారు. ఎదుర్లేని తమ భూస్వామ్య పెత్తనానికి ఇన్ని సంవత్సరాల తర్వాత అడ్డు తగిలినందుకు వాళ్ళంతా భగ్గుమన్నారు. వైరాలతో కొట్టుకుచచ్చే ప్రత్యర్థులైన భూస్వాములు కలిశారు. మరికొన్ని వర్గాలను కలుపుకున్నారు. మరికొన్ని అగ్రకులాలు తమతో కలిస్తే కొన్ని ఎకరాలు వాళ్ళకిచ్చేస్తామని ఆహ్వానించారు.

అంతక ముందు ఆడది రవిక తొడుక్కొని పొలంపనికి వస్తే, ఆమెను అదితీయించి అవతల పారేయించేవరకు పొలంతో వంగనిచ్చే వారు కాదు. అందమైన ఆడది కనిపిస్తే తమకు లొంగక పోతే అత్యాచారం జరిపే రోజులు అవి. వాళ్లేం అఘాయిత్యం చేసినా బయటకు తెలియకూడదు. తెలిసినా మగవాళ్ళు నోరెత్తకూడదు. తమ ఎదుట చెప్పులు వేసుకోకూడదు. తాము పారబోసే గంజినీళ్ళు చిప్పల్లోనే తాగాలి.

అనుకోకుండా దళితుల్లో ఇంత తెగింపు వచ్చి నందుకు దీనికి ఎవరి ద్వారా ప్రతీకారం చెయ్యించాలో ఆలోచించారు.

బూర్జువా తత్వం ప్రబలింది. తమ చేతికి మట్టి అంటుకోకుండా ప్రభుత్వ అధికార్లను తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. పోలీసు బలగాల్ని తాము జీతమిచ్చే పాలేర్లలా మార్చేసుకున్నారు. కాలంలో తీవ్రగతిని మార్పు వచ్చేసింది. చదువుకున్న యువకుల్లో రూసో చెప్పిన మాట నాటుకుంది. " ఏ పౌరుడూ మీరొక పౌరుడిని కొనగలిగినంత ధనం కూడ బెట్టకూడదు. ఏ పౌరుడు తనను తాను మరొకడికి అమ్ముకునే టంత పేదవాడు కాకూడదు. భూమి ఇచ్చే ఫలాలు అందరి ఉమ్మడి ఆస్థి అయినపుడు, ఈ భూమి ఏ ఒక్కరిదికాదు. ఇది నా భూమి అని కంచె కట్టుకుంటే, తోటి వ్యక్తులు వెంటనే దానిని ఊడబెరకకపోతే తద్వారా రానున్న భయంకర ఘోరాలకు, నేరాలకూ మానవజాతి ఏమైపోతుంద"ని శ్రామికజీవులైన అట్టడుగు వర్గాలవారు సంఘటితమయ్యారు. జూలు ఝుళిపించారు. భూస్వాములకు, వాళ్ళ తొత్తు లకూ, ఆ అహంకారులకూ, ఆ రక్తపిపాసు లకూ, ఆ సోమరి పోతులకూ ఎదురుతిరిగారు.

అప్పట్లో భూమికోసం, బానిసత్వ విముక్తి కోసం సాగిన ప్రపంచ విఖ్యాత సాయుధ రైతాంగ పోరాటం తెలంగాణా గ్రామాలను జాగృత మొనర్చింది. దోపిడీ దారుల్ని తరిమి, లక్షలాది ఎకరాల భూమిని పేద రైతాంగం విముక్తి చేసింది. అయితే యూనియన్ కాంగ్రెస్ ప్రభుత్వం దొంగలు పారిపోతున్న దేశ్ ముఖుల్ని, జాగీర్దారుల్ని బుజ్జగించి, గాంధీ టోపీలు తొడిగి, వారి ద్వారా పేద రైతాంగాన్ని క్రూరంగా అణచి, పోవాల్సిన ఫ్యూడల్ వ్యవస్థకు ప్రాణం పోసింది. ఇదే జబ్బు కోస్తా జిల్లాకు పాకింది. ఆనాడు తెలంగాణా పేద రైతులు తమ రక్తమాంసాలను అర్పించారు. అభ్యుదయ మార్గాలకు తోవ చూపారు.

తెలంగాణా రైతుకూలీ పోరాటం కోనసీమ లో కూడా వ్యాపించడం చూసిన అగ్రకుల భూస్వాముల గుండెలు దద్దరిల్లాయి. 'దున్నే వాడికే భూమి' అనే నినాదంతో వందలాది ఎకరాలున్న రైతులకు నిద్ర పట్టకుండా పోయింది. లేబర్ క్లాస్ భగభగమండే అగ్ని గుండమయ్యింది. రాజోలు తాలూకా లోని రైతు కూలీలంతా ఈ పోరాటం జరిగి తీరాల్సిందేనన్న నిశ్చయాని కొచ్చేరు. గుడిమూల, రామేశ్వరం, అడ్డాలపాలెం స్కూలు దగ్గరా; ఇంకా అనేకచోట్ల; భూస్వామి గూండాలకూ, రైతు కూలీలకు కొట్లాటలు జరిగాయి. నూనూగు మీసాలొస్తున్న విద్యార్థులు కూడా ఈ పోరాటంలో పాలు పంచుకున్నారు.

కాట్రు ఏలియా, గొల్ల దైవసహాయం, చొప్పల కిషన్‌రెడ్డి, బీర ఆశీర్వాదం, మేడిది ఆశీర్వాదం లాటి యువకులు సఖినేటిపల్లిలో ఒకశక్తిగా మారారు. కందికట్ల నాగభూషణం, అతర్వేదిపాలెం నుంచి అల్లూరు వెంకట్రామ రాజు, బి.దామోదరం, ఇంకా యెందరో ఈ పోరాటంలో సమైక్యమయ్యారు. జగ్గన్నపేట నుంచి గంజి నాగేశ్వరరావు కమ్యూనిస్టు భావాలు గల యువకుల్తో చుట్టుపట్ల రైతు కూలీ ఉద్యమం ప్రారంభించారు.

కందికట్ల నాగభూషణం నాయకత్వం అందర్నీ ఒక తాటిమీద నిలిపింది. ఆయన ఆబాలగోపాల నికీ అత్యంత ప్రీతిపాత్రంగా రైతుకూలీ భూ పోరాటాలలో నాయకత్వం వహించారు.

కష్టజీవుల ఉద్యమం ఇచ్చే ప్రేరణతో నిమ్న వర్గాలు భూస్వాములకు ఎదురుతిరిగి, తమను మట్టుపెట్టకముందే తమను తాము రక్షించు కోవాలని, ఎదురుతిరిగిన వారి కుటుంబాల్ని సర్వనాశనం చెయ్యాలనీ, రాజోలు తాలూకాలో అగ్రకుల పెత్తందార్లు, ధనికులూ, దళారీలూ, పోలీసు గుండాలకు లంచాలిచ్చి, దొరికిన ప్రతి కమ్యూనిస్టునీ చంపిపారేయ్యమన్నారు.

పోలీసులు రాక్షసులుగా మారిపొయ్యారు

పైశాచికత్వం పెట్రేగిపోయింది.

ప్రభుత్వమంటే ఎవరికీ తెలియదు.

పోలీసులే ప్రభుత్వం !

వాళ్ళు ఏదైనా చెయ్యొచ్చు

ఎందర్నయినా చంపిపారెయ్యవచ్చు.

ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. వందలాది మంది ఉద్యమ కార్యకర్తల్ని మర్డర్, లూటీ, టెర్రరిజం లాంటి కేసుల్లో యిరికించి ఉద్యమకారుల్ని తుడిచి పారెయ్యాలని ధనం వెదజల్లారు.

ఐక్య మహిళా సంఘం

పెత్తందార్లపై తిరుగుబాటు ప్రారంభమైన తర్వాత కోనసీమలో తమ ఆధిపత్యాన్ని రక్షించు కోవడానికి సెంటర్‌నుంచీ, రాష్ట్రం నుంచి కొంత మంది కాంగ్రెసు నాయకులు దిగి కొత్త పన్నాగాలు, కొత్త ఒత్తిడులు, కొత్త ఎత్తుగడలు ప్రారంభించారు. కమ్యూనిస్టు కార్యకర్తలకీ, నాయకులకీ సహాయంగా ప్రతి యింటి నుంచి ఓ మహిళ ముందుకు వస్తే గాని ఈ ఉద్యమం లో ధనిక వర్గం ఆటలు కట్టించలేమని తెలిసి పోయింది. మహిళాశక్తి ఐక్యతతో చూసి ముందు కురికే శత్రువు తన పైశాచికత్వానికి తానే భయపడక తప్పదు. అగ్ర వర్ణాల పురుషులు దళితవర్గాల స్త్రీలను అవమానిస్తుంటే, అది చూస్తూ అగ్రవర్ణాల స్త్రీలు సహించగలరా? అయినా స్త్రీ ఏ కులమైనా, ఏవర్గ మైనా, ఏపార్టీ అయినా తన తోటి స్త్రీకి అన్యాయం జరిగితే సహించకూడదు. అది జరగ నివ్వకుండా ప్రతి ఘటించాలన్నదే కమల అభి. ప్రాయం. స్త్రీలు కూడా ప్రాణత్యాగం చెయ్యాల్సి వస్తే చేసి మానవ హక్కుల్ని కాపాడుకోవాల్సిం దేనని కమల ఉద్దేశ్యం.

అంతర్వేది నుంచి గన్నవరం వరకూ అన్ని గ్రామాలూ, పేటలు తిరిగి మహిళా కార్యకర్త లను తయారు చేసింది. పోలీసుదాడుల్ని ఎలా ఎదుర్కొనాలో, తమకు తాము ఎలా రక్షించు కోవాలో చెప్పింది. భయంతో కుంగిపోయిన స్త్రీలను ఈ సంఘంలో చేర్పించారు. ఇందులో అభ్యుదయ భావాలు గల అగ్రకుల గృహిణులు కూడా చేరి స్త్రీల సమస్యల గురించి చర్చించి, పరిష్కార మార్గం కోసం కృషి చేశారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన స్త్రీ నాయకులతో సంప్రదించి సమిష్టి నాయకత్వంలో నూతన మహిళా సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ మహిళా సంఘంలో కాంగ్రెస్ భూస్వామి ముప్పర్తి వెంకటరత్నం సోదరి సత్యవతి, సోషలిస్టు నాయకురాలు మరియు కుందెం సత్యంగారి కుటుంబంలో కొందరు స్త్రీలను ఈ ఐక్యమహిళా సంఘంలో చేర్చింది. మలికి పురంలో రాష్ట్ర మహిళా సదస్సును ఆనాడే ఆమె నిర్వహించింది. దానికి అధ్యక్షులుగా రాష్ట్ర సంఘఅధ్యక్షురాలు శ్రీమతి మోటూరి ఉదయం పాల్గొనడం కూడా విశేషించి చెప్పుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పుచ్చలపల్లి సుందరయ్యలాంటి మహానాయకుల నాయకత్వంలో కమ్యూనిస్టులు బలపడుతున్నారు. అప్పట్లో కమల రాజోలు తాలూకా కమ్యూనిస్టుపార్టీ కమిటీలోకి సభ్యురా లుగా ఎన్నికయ్యింది. సాధారణ గృహిణిగా ఉండి నాయకత్వ స్థాయికి ఎదిగింది.

మారుతున్న రాజకీయ, సాంఘిక వ్యవస్థ

రష్యా దేశంలో కార్మిక కర్షకుల జీవన విధానంలో మార్పులొచ్చాయి. దేశీయ శ్రామిక

వర్గంలో కూడా చైతన్యం రావాలన్నదే అందరి కోరిక. ఆంగ్లేయుల మీద దేశ ప్రజలు తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఈ దేశం వదలి వెళ్లి పోమ్మని నెహ్రూ, పటేల్ లాంటి వ్యక్తులు దేశ వ్యాప్తంగా తెచ్చిన ఐక్యపోరాటం ఫలించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా దేశభక్తులమంటూ, పేదలను పీల్చుకుతింటున్న బూర్జువా శక్తుల ఆటలు కట్టించడానికి బెంగాల్, కేరళ, ఒరిస్సా లాంటి కొన్ని రాష్ట్రాలు ముందుకొచ్చి, ధనికుల దారుణాల్ని ఎండగట్టడం ప్రారంభించాయి. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టుల సంఖ్య పెరిగింది. కోనసీమలో కమ్యూనిస్టులపై తెస్తున్న నిర్బంధం పై కమ్యూనిస్టు అభిమానులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎదురు తిరిగారు.

స్టాలిన్ చెప్పినట్లు విప్లవతత్త్వం వస్తేగాని సోమరితనమూ, ఊకదంపుడూ, మితవాద పోకడలూ, మానసిక నిస్తబ్ధతా, పాత సాంప్రదాయాలు, బానిసప్రవృత్తి పోవని అందరికీ అర్థమయ్యింది.

సమ్మెలు- నిరసనలు - సంక్షోభాలు:

1942 సం॥లో బర్మా సంక్షోభంలో పడ్డాక, అక్కడ జీవించేవారి ఆర్థిక స్థితిగతులు దుర్భరమయ్యాయి. అనేక వందలమంది కోనసీమ వాసులు తిరిగివచ్చేశారు. నడచి రావడానికి ప్రయత్నించిన వారిలో కొందరు మధ్యలోనే అసువులు బాసారు. కోనసీమ ఆర్థికపరమైన ఇబ్బందులకు గురయ్యింది. వ్యవసాయ కూలీలు పెరిగారు. ఇచ్చే రోజువారీ కూలి చాలక బెజవాడలో బ్రహ్మాండమైన రైతు కూలీల ర్యాలీ నిర్వహించారు. అందులో కమల పాల్గొంది. రోజు కూలీ నాలుగు అణాలైతే, కనీసం అదనంగా ఒక్క అణా పెంచమని అడిగారు. ఈ కారణంగా భూస్వాములకు, కూలీలకూ వివాదం రేగింది. పెత్తందార్ల, భూస్వాముల ఆగడాలు పెచ్చరిల్లాయి.

బట్టేలంక గ్రామంలో వ్యవసాయ కూలీల సమ్మె

కూలి రేట్ల పెంపుదలపై రాజోలు తాలూకా బట్టేలంక గ్రామంలో 1945 సం॥లో చారిత్రాత్మక సమ్మె 56 రోజులు నిరవధికంగా జరిగింది. ఈ సమ్మెలో కమల ముందు నిలిచింది. గ్రామ గ్రామాన తిరిగి ధన, వస్తు రూపంలో సమ్మెకు వనరులు సేకరించింది. నాయకత్వం వహించిన గంజి నాగేశ్వరరావును (తరువాత కమ్యూనిస్టు ఎం.ఎల్.ఎ) పోలీసులు అదుపులోకి తీసుకొని రాజోలు సబ్‌జైలులో బంధించారు. రైతు కూలీల మధ్య భూస్వామి రుద్రరాజు రామలింగరాజు తీవ్ర విభేదాలను సృష్టించాడు. రెండు వేలమందికి పైగా ప్రజలు సఖినేటిపల్లి నుండి రాజోలు వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళా నాయకురాలు కమల ఈ ర్యాలీలో ముందు నిలిచింది.

మోరి గ్రామంలో జీడిపప్పు కార్మికుల సమ్మె

జీడిపప్పు కార్మికులు మోరి గ్రామంలో అధికరేట్ల కోసం చేసిన సమ్మెలో కమల నాయకత్వం వహించింది. అప్పుడది గూండాల రాజ్యం కనుక జీడిపప్పు గోడౌన్‌లో ఆమెను నిర్బంధించారు. కాంగ్రెసు నాయకుడు, భూస్వామి అయిన ముప్పర్తి వెంకటరత్నం గోడౌన్‌లోకి వెళ్ళి, "నీకెంతపొగరే! ఓ ఆడదాని వయ్యుండి మా జీడిపప్పు పనిలోకి మనుష్యుల్ని రాకుండా చేస్తావా?" అంటూ బూతులు తిడుతూ కాలుతో ఆమె ఛాతి మీద తన్నాడు. వెంటనే ఆ వార్త తాలూకా అంతా పాకిపోయింది. కళ్ళు మూసుకుపోయి ప్రవర్తించిన ముప్పర్తి వెంకటరత్నానికి, అతని వర్గీయులకు బుద్ధిచెప్పడానికి ఆరువందల మంది కష్టజీవులు ఆ గోడౌన్లు చుట్టుముట్టారు. ముప్పర్తి వెంకట రత్నం పారిపోయాడు. తమ రక్షణార్థం, ఆమెను వెంకటరత్నం మనుష్యులు మలికిపురం పోలీసు స్టేషన్‌కి తరలించారు. కమల ఒళ్లో ఉన్న పాలుతాగే బిడ్డని గుండాలు బయటకు విసిరేస్తే ఆ చంటికూనను కమల తల్లివైపు వారెవరో రక్షించుకున్నారు. జీడిపప్పు కార్మికుల వేతనాలు మెరుగయ్యాయి. కమల జీడిపప్పు కార్మికులకు దగ్గరయ్యింది.

1946 సం॥లో వ్యవసాయ కూలీల ర్యాలీ

వ్యవసాయ కూలీల సత్తా చూపించేందుకు వ్యవసాయ కూలీల ర్యాలీ మలికిపురం, మోరి, శృంగవరప్పాడు గ్రామాల మీదుగా కేశవదాసు పాలెం చివర వరకు కొనసాగింది. ముగింపు సభలో కొర్రపాటి, పట్టాభి, కందికట్ల నాగ భూషణం, అల్లూరి వెంకటరామరాజు (రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షుడు), బి. దామోదరం, భూపతి నారాయణమూర్తి, కానేటి మోహనరావు, కమల, గుర్రం మాణిక్యం, కాంతమ్మ, మేడది గొంతమ్మ మొదలగువారు చురుగ్గా పాల్గొన్నారు. ఆ రోజుల్లో హేతువాది, ఇంజనీరింగ్ విద్యార్థి, ప్రస్తుతం అమెరికాలో స్థిరపడిన ఇంజేటి సామ్యూలుగారు కూడా ఉన్నారు. కష్టజీవి ఉద్యమాల్లో కనుమూరి రంగరాజు, అల్లూరి సూర్యానారాయణ రాజు (పొట్టియ్యరాజు), సరెళ్ళ రామారావు, సాకా వెంకట్రావు, జి.ఎస్. బాలాజీదాస్, దంతులూరి జగన్నాథరాజు, బోడపాటి నరసింహారావు మొదలగు వారెందరో పనిచేస్తూ ఉండేవాడు. వారితో కమల పనిచేసింది. ఆమెను ఈ నాయకులంతా చాలా గౌరవించేవారు.

కష్టజీవులపై దాడులు, దమనకాండ

1942 నుంచి జులై 1947 వరకు కోనసీమలో కష్టజీవులఉద్యమం అత్యంత బలీయంగానే సాగింది. ఈకాలంలో రైతుకూలీలకూ, భూస్వాములకూ అనేక ఘర్షణలు, తగవులూ, కొట్లాటలూ, జరిగాయి. దొరికిన అనేకమంది కమ్యూనిస్టులను కాల్చి చంపారు. చంపించారు. అయినా ఉద్యమం మరింత తీవ్రమవుతూనే వచ్చింది. దీని కారణంగా రానున్న సంవత్సరాల్లో వాళ్ళ ఉనికికే ముప్పు వచ్చే ప్రమాదముందని భయపడ్డారు. ప్రజావాహిని పొంగి తమను తుడిచి వెయ్యగలదని ప్రపంచంలో వచ్చిన మార్పుల వలన గ్రహించారు. తమ వంతు లంచాలు ఇచ్చారు. వాళ్ళకు కావలసింది సమకూర్చుతూ లూటీలూ, దోపిడీలు చేయించారు. కమ్యూనిస్టులను ఎంతమందిని చంపితే ఈ పోలీసులకు భూస్వాముల నుంచి అంత ప్రోత్సాహం, గుర్తింపు కల్గించారు. అప్పటికే ఎందరో పేద కమ్యూనిస్టు అభిమానులు కాంగ్రెసు వాళ్ల చేతిలో హతమయ్యారు. స్త్రీలను చిత్రహింసలు చేశారు. కొందర్ని మానభంగం చేశారు. నీళ్లు అడిగితే వాళ్ళ మూత్రాన్ని వాళ్ళనే తాగమన్నారు. కొందరు మరణించారు. మరో కొందరు తలో దిక్కు పారిపోయారు. కుల ఘర్షణలతోపాటు, వర్గ పోరాటం ప్రారంభమైంది. అయితే ధనిక భూస్వామ వర్గం కష్టజీవుల అజేయమైన శక్తి సామర్థ్యాలకు బలహీనమయ్యింది. బడుగు జీవులు బలవంతులయ్యారు. ఐక్యంగా ఉంటే ఎంతటి వాడినైనా జయించి తీరుతామన్న ఆత్మ విశ్వాసం వారికి కలిగింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది

1947 లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. తెల్లవాళ్ళు తమ అధికారాన్ని భారతీయులకు అప్పగించారు. కొందరు యూనియన్ నాయకుల ప్రోద్బలంతో, రాష్ట్ర కాంగ్రెసు భూస్వామి, ధనిక

వర్గాల కోరిక మేరకు, వివిధ యువజన సంఘాల కార్యకలాపాలపై ప్రభుత్వం క్యూర నిర్భంధం విధించింది. ఈ దెబ్బ ప్రజాస్వామ్యం కోసం విప్లవించే అన్ని సంఘాల మీద పడిన పెద్ద గొడ్డలి పెట్టుగా అప్పటి మేధావులు భావించి తిరుగుబాటు చేశారు.కాని పోలీసులు న్యాయ వ్యవస్థలో గల కొన్ని సెక్షన్లు ప్రయోగించి అరెస్టులు చేయడం ప్రారంభించారు. రహస్య జీవితానికి వెళ్ళిన కమల భర్త నారాయణమూర్తిని పోలీసులు అరెస్టు చేయాలని సంకల్పించారు. లీగల్‌గా బయట ఉండనీయరని కమలను పార్టీవారు అజ్ఞాతంలోకి పంపేశారు. 6.7.42 సంవత్సరంలో పుట్టిన తన నెలల ఆడబిడ్డ (జెన్నీమార్క్స్) తో కమల కొన్ని నెలలు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్ళింది.

ధనికవర్గం ఎలాగైనా కమ్యూనిస్టులను మట్టుపెట్టాలని మాటువేసి ఉంది. కొందరు ముఖ్యనాయకుల్ని తొలగించకపోతే నిమ్న కులాలు వాళ్ల మీద తిరిగి అధికారం సాగిస్తారని బాధ. పంజా విప్పిన పులుల్లా ప్రభుత్వ అధికారుల్ని తమ దళారుల్లా మార్చుకొని మాటువేసుకుని కూర్చున్నారు. ఉద్యమకారుల్ని టెర్రరిస్టులుగా, దేశ ద్రోహులుగా, గూండాలుగా చట్టపరంగా అరెస్టు చేసి, ఆ ఉచ్చులోంచి బయటకు రాకుండా బిగించి చంపిపారెయ్యడ మెలాగన్న ఆలోచనలో ధనికవర్గం, పోలీసుల తో కుట్రపన్ని ఉంచింది. నాయకుల మీద నిఘావేసింది.

మే 1వ తారీఖు 1948, రంపపుకోత ప్రారంభం

అది మే 1వ తారీఖు 1948 సం॥. స్వాతంత్ర్యం వచ్చి 9నెలలు అయ్యింది. చాలా మంది మహిళా నాయకులు, కార్యకర్తలు ముందు వరుసలో ఉండే ఇతరత్రా నాయకులందరూ అజ్ఞాతవాసం నుండి బయటకొచ్చారు. మలికిపురంలో భూపతి నారాయణ మూర్తి యింటి సమీపంలోగల రామాలయం వద్ద చాలా కాలం తర్వాత కూలీలు, అంత వరకూ నానా కష్టాలనుభవించిన పిల్లా జెల్లా, ఆడా మగా రామాలయం దగ్గరికి చేరారు. కామ్రేడ్ బి. దామోదరం తదితర నాయకులు కుసుమ శ్రీరాములు, కమ్యూనిస్టు కార్యకర్త (బి.సావరం) ఏర్పాటు చేసిన బెయిల్ మీద బయటకొచ్చారు. చాలకాలం తర్వాత మీటింగ్ చాలా ప్రశాంతంగా, ఆత్మీయంగా నడుపుకోవడానికి చూస్తున్నారు. సుమారు అయిదు సంవత్సరాల నిరంతర పోరాటం తర్వాత మళ్లీ విజయాన్నినాదంతో కష్టజీవులు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరుపుకోవాలని చూస్తున్న మీటింగ్ అది.

రాత్రి 9 గంటలయింది. మీటింగ్ ఉత్సాహంగా, ఉత్తేజంగా నడుస్తోంది. అక్కడికి ప్రభుత్వం వారిచేత పంపబడ్డ ఓ సిఐడి పోలీసు వచ్చాడు. అంతవరకూ పోలీసుల చేతిలో చిత్ర హింసలనుభవించిన ప్రజానీకం, ఆ పోలీసును అక్కడ చూసి మండిపడ్డారు. "స్వాతంత్ర్యం వచ్చినా పోలీసుల నిఘా ఇంకా ఎందుకు?" అన్న ప్రశ్న తలెత్తింది. పోలీసు సిఐడిని వెళ్లి పొమ్మన్నారు. అతను జాప్యంచెయ్యడం వలన, అతని సైకిల్ని అవతల పారేశారు. గొడవ పెరుగుతుండటంతో ఆ సిఐడి పోలీసుస్టేషన్‌కి తిరిగి వెళ్ళి పోతుండగా తాగిన మైకంలో ఉన్న మరెవరో వ్యక్తి ఆ సిఐడిని చితకబాదాడు. "ప్రజా రక్షకులైన పోలీసుల్ని ప్రజలే చంపేస్తారు. ఇక ఆలస్యం చెయ్యకుండా కఠిన చర్యలు తీసుకోండి" అని ధనికవర్గం ప్రభుత్వానికి సలహా యిచ్చింది. ఊరుకుంటే ప్రజలే పోలీసుల్ని చంపేస్తారని పోలీసులను ఎగదోసింది. పోలీసులు తమకు రక్షణ కరువైందని, తమకి సహాయంగా అదనపు బలగాల్ని పంపించాలని కాకినాడకు కబురు చేసింది.

మే 1వ తారీఖున మీటింగ్‌పై పోలీసులు పడ్డారు. అప్పుడెవరూ దొరక్కుండా పారిపోయారు. ధనికులకు, భూస్వాములకు, పెత్తందార్లకు మంచి అవకాశం చిక్కింది. ఉద్యమకారుల పై కేసులు బనాయించారు. వారి కోసం చెట్టూ పుట్టా వెదకడం ప్రారంభించారు. దొరికిన వాళ్ళని జైల్లో పెట్టి ఘోరంగా హింసించడం ప్రారంభించారు. అజ్ఞాతం నుంచి తిరిగి వచ్చిన కమల యింటిపై పోలీసులు దాడిచేసి, చంటిబిడ్డ తల్లయిన ఆమెను చితకబాదారు. దాడులు ఉధృతం చేశారు. అరెస్టులు ఎక్కువయ్యాయి. పోలీసులు ప్రత్యేకమైన అధికారాలున్నట్టు ప్రవర్తించడం ప్రారంభించారు. కాంగ్రెసు వాదులమని చెప్పుకుంటున్న లోకల్ భూస్వాముల ఆర్డర్స్ ప్రకారమే పోలీసులు దౌర్జన్యం ప్రారంభించారు. హింసారాజ్యం మళ్లీ పెచ్చరిల్లింది. ఈసారి తప్పించుకోవడానికి ముఖ్యమైన నాయకులకి చాలా కష్టమైపోయింది. రిజర్వు బెటాలియన్‌లు కమ్యూనిస్టు స్థావరాలపై రేయింబవళ్లు దాడులు ప్రారంభించారు. ఇక రహస్య స్థావరంగా నాయకులకు తోచింది ఫ్రెంచ్‌వారి ఆధీనంలో ఉన్న యానాం ఒక్కటే.

1950 సం॥లో ఫ్రెంచ్ యానంలో

యానంలో రహస్యంగా ఉండడానికి వెళ్ళిన వారిలో కమలతోపాటు కానేటి సూర్యకాంతం, కందికట్ల లక్ష్మి, బూసి లీల ఉన్నారు. కందికట్ల నాగభూషణం, కానేటి మోహనరావు కూడా యానంలోనే ఉన్నారు. కాంగ్రెసు దేశభక్తుల మంటూ రంగు బూసునుకున్న కాంగ్రెసు భూస్వామి నాయకులకు మెయిన్‌టార్గెట్ కందికట్ల నాగభూషణమే. అక్కడ రహస్య స్థావరంలో ఉన్న కందికట్ల నాగభూషణం చిక్కడమంటే పోలీసులకు చాలా సంబరమయ్యింది. గతంలో పోలీసుల చేతుల్లోంచి, నిర్భంధాల నుంచీ కందికట్ల నాగ భూషణం చాలాసార్లు తప్పించుకొన్న చలాకీ ఘటం. ఈసారి తప్పించుకోకుండా వెంటనే కాల్చి పారెయ్యడమే పోలీసుల కర్తవ్యమైంది. యానం నుంచి పోలీసులు ఆయన్ని లారీలో రాత్రికి రాత్రే జైలు నుంచి తరలించారు. పక్కనున్న ఆంధ్ర సరిహద్దు గ్రామమైన తాళ్ళరేవు పక్కనున్న కోరంగి (తూ.గో.జిల్లా) కొబ్బరి తోటలోకి తెచ్చారు.

"నేను చేసిన నేరం కోర్టుద్వారా రుజువు చేసి, అప్పుడు నామీద చర్య తీసుకోండి" అన్నాడు కందికట్ల నాగభూషణం. పోలీసులకు ఏదోలా కామేడ్ కందికట్లని తీసెయ్యాలన్నదే అభిమతం. దానికి సమాధానంగా పోలీసుల తూటాలు పేలాయి. కామ్రేడ్ కందికట్ల గుండెల్లోంచి కారిన ఎర్రనిరక్తం కష్టజీవుల ఎర్రజెండాకు మరింత ఎర్రదనాన్నిచ్చింది.

అరెస్టయిన కందికట్లనూ, కానేటినీ హెడ్ క్వార్టర్స్‌కు తరలించమని పోలీసులకు కబురొచ్చింది. కాని అప్పటికే కామ్రేడ్ కందికట్లని కాల్చేయడం వలన పారిపోతున్న వాడిని వెంటాడి కాల్చేశామని పోలీసులు సమాధాన మిచ్చుకున్నారు. కందికట్ల తర్వాత కాల్చేయడానికి సిద్ధం చేసిన కానేటిపై హత్యానేరంమోపి జైల్లో పెట్టారు. పోలీసులు రహస్యస్థావరాలపై పడ్డారు. భూపతి నారాయణమూర్తి చాకచక్యంగా తప్పించుకున్నారు. అక్కడ నుంచి కమల మరో ప్రాంతానికి చేరింది.

ప్రజాకళలు

తెలంగాణా పోరాట పోకడలు కోనసీమకు పాకాయి. తెలంగాణా ప్రజలను ప్రోత్సహిస్తూనే, ఇక్కడ భూమిలేని వారికి భూసంస్కరణలు జరగాలని, భూబకాసురుల్ని దుయ్యబడుతూ అనేక కళారూపాలు ప్రదర్శితమయ్యాయి. మా

భూమి, రైతుబిడ్డ మొదలగు నాటికలు వచ్చాయి. కుల వైషమ్యాలు పోవాలని మాలపిల్ల, పేద పడుచు, పేద పిల్ల, పాలేరు మొదలగు కళా రూపాలు కోనసీమలో విస్తారంగా ప్రదర్శింప బడ్డాయి. బుర్ర కథలుగా, జముకుల కథగా, జానపదులుగా, వీధి నృత్యాలుగా ఊపునందు కున్నాయి. ఎక్కడ బహిరంగసభ జరిగినా ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. కాంగ్రెసు కంగుతిన్నది. ఎర్రజెండా రెపరెపలాడింది. ఈ కార్యక్రమాలన్నింటిలో కమల స్త్రీలను జాగృత పరిచింది. ఎవరింట్లో ఏకష్టం వచ్చినా వెంటనే వెళ్ళి వాళ్ళను ఆదుకునే నైజం కనుక, ఆమె పిలిచిన వెంటనే ప్రజలు ఇంటిల్లిపాదీ తరలి వచ్చేవారు.

పూర్తికాలపు కార్యకర్తగా, మహిళా నాయకురాలిగా అందరికి స్ఫూర్తినిచ్చింది. విశ్వశాంతి, పోతుగడ్డ మొదలైన నాటక ప్రదర్శనల్లో తన కుమార్తెను నటింపజేసింది. ఆమె నాటక ప్రారంభానికి ముందు గ్రీన్ రూంలోకెళ్ళి వరుసలతో పలకరించి వాళ్ల కుండే సహజమైన స్టేజి టెన్షన్‌నూ, భయాన్ని పోగొట్టేది. పాత్రదారులు చాలా రిలీఫ్ ఫీలయ్యే వారు. నాటకానంతరం ఆమె స్వయంగా కళా కారులందర్నీ కలిసి అభినందనలు తెలిపేది. ఆమె కళా సంస్కారానికి ప్రజానాట్యమండలి ప్రజా కళాకారులు ఆమెను ఎంతో గౌరవంగా చూసేవారు.

ప్రజా ఉద్యమాలో చీలిక

ఆమె ఈ పరిణామాలకు ఎంతో వ్యధ చెందింది. పార్టమెంటరీ పంథాలోనే కూరుకు పోయి, ఉద్యమాలకు, ప్రజలకు దూరమైన వారిపట్ల కమలకు తీవ్ర నిస్పృహలు కలిగాయి. తాను వ్యక్తిగతంగా మహిళలతో సంబంధాలు పెట్టుకుంటూ ప్రజా సమస్యలపై ప్రజలకు నచ్చజెప్పి ధర్నా, ర్యాలీలు నిర్వహించేది.

సాంఘిక వివాహాలు, ఆదర్శవంతమైన నిర్వహణ

స్త్రీ స్వేచ్ఛ, హక్కులకోసం కమల తన జీవితం లో అనేకసార్లు పోరాటం సాగించారు. ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకునే యువతీ యువకులకు బాసటగా ఉండేది. వారి తల్లి దండ్రులను ఒప్పించి వివాహ కార్యక్రమం కమల నెత్తిన వేసుకునేది. అరమరికలు లేకుండా ఆలుమగలు ఎలా జీవించాలో తెలియజేప్పేది. కట్నాలకు వ్యతిరేకి, కులాంతర వివాహాలను ప్రోత్సహించింది. అన్యాయానికి ఏ స్త్రీకూడా బలవ్వకుండా, అటువంటి సమయాల్లో ఆమె ఆ స్త్రీల పక్షాన నిలిచి బహిరంగ ప్రదర్శనలు జరిపి, అభాగ్య స్త్రీలకు బాసటగా నిలిచిన సంఘటనలెన్నో ఉన్నాయి.

మనువు స్త్రీలను కించపరుస్తూ రాసిన గ్రంథాన్ని ఆమె విమర్శించింది. స్త్రీ పాతి వ్రత్యం కోసం ఒకే భర్తను కలిగి ఉండటం, పురుషుడు మాత్రం బహు భార్యత్వాన్ని కలిగి ఉండే హక్కు కల్పించిన హిందూ సాంప్ర దాయాన్ని దుయ్యబట్టింది.

దుబారా లేకుండా పది రూపాయాలతో సాంఘిక వివాహాలు కమల చేసింది. దుబారా చెయ్యకూడదన్నది ఆమె విశ్వాసం. పురోహితు లతో, తాళమేళాలతో, విందులూ, ఆచారాలంటూ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయే సమయం లో, సాంఘిక వివాహాలను ప్రోత్సహించేది. పెళ్ళిళ్ళకు అప్పులు పాలయ్యి, తర్వాత పాలేర్లగా, బానిసలుగా బతికే దురదృష్టం నుంచి గట్టెక్కిం చింది. ఈ తరహా సాంఘిక వివాహాలు అప్పట్లో డబ్బున్న అగ్రకులాల్లో కూడా సింపిల్‌గా జరిపించిన కమల ఆదర్శాన్ని కొనియాడారు.

స్త్రీలను దిగంబరుల్ని చేసిన పోలీసులు

కాటూరు (కృష్ణాజిల్లా), ఎలమర్రు (గుంటూరు జిల్లా) లలో అనేకమంది స్త్రీలను, ఉద్యమ కార్యకర్తలను అరెస్ట్ చేశారు. స్త్రీ పురుషుల్ని దిగంబరుల్ని చేసి గాంధీబొమ్మ చుట్టూ పోలీసులు ప్రదక్షిణలు చేయించారు. ఇటువంటి ఘోరకృత్యాలను నిరసిస్తూ అక్కడ ప్రదర్శనలు జరిగాయి. కమల కోనసీమ నుంచి కొందరు నాయకురాళ్ళతో వెళ్ళి ప్రదర్శనలూ, ర్యాలీలూ నడిపారు.

మూఢనమ్మకాలపై తిరుగుబాటు: పాత ఆచారాలకు స్వస్తి

మనిషి చచ్చి మట్టిలో కలిశాక సూక్ష్మ శరీరం, ఆత్మ ఉంటుందని కొందరు చెప్పే మాటల్ని కమల ఖండించింది. చచ్చిన తర్వాత ఎప్పుడైనా, ఎవరైనా బతికినట్టు శాస్త్రీయంగా చూపించారా? లేదు. దేవుడు బంగారు కిరీటంతో, పట్టుగుడ్డతో ఎవరికైనా కన్పించాడా? అలాగే దెయ్యం జుట్టు విరబోసుకుని ఉన్న ప్పుడు ఎవరైనా చూశారా? సమాధానం లేదు. కనుక ఇవన్నీ కట్టుకథలు, మోసాలు అని శాస్త్రయుక్తంగా విడమర్చి తక్కిన స్త్రీలను విజ్ఞానవంతుల్నీ, ధైర్యవంతుల్ని చేసింది.

పసువు కాళ్ళకు రాసుకోవడం దేనికి? కాళ్లనంటుకున్న సూక్ష్మ క్రిములు చావడానికి. సూర్యనమస్కారాలు, నీళ్ళు వదలడం దేనికి? అలా నీళ్ళు వదులుతున్నపుడు తెల్లటి సూర్య కిరణాలు నీటిగుండా రావడం వలన ఏ కిరణానికి ఆ కిరణం విడిపోయి, అల్ట్రా వైలెట్ కిరణాలు ఏర్పడి అవి శరీరానికి తగిలి ఆరోగ్యాన్ని చేకూరు స్తాయి. అవి శాస్త్రీయంగా మంచివి కనుక మనిషికి మేలు చేస్తాయి. కనుక మేలు చేసేవి స్వీకరించి, తక్కినవి విసర్జించగలిగే శాస్త్రీయ జ్ఞానం కలిగి ఉండాలని కమల తక్కినవారికి చెప్పేది.

చైనా ఆక్యు పంక్చర్‌వైద్యులు డా॥ గురుకుల మిత్రా ఎమ్.డి., నుండి అనేక వైద్య విషయాల్ని, శాస్త్రీయ దృక్పథాల్నీ తెలుసుకొని తక్కిన వారికి తెలియజేప్పేది. కమల నిరక్ష్యరాస్యురాలిగా, వ్యవసాయకూలీగా బతికి, తర్వాత అక్షరాలు దిద్ది శాస్త్రీయ అవగాహనతోపాటు శాస్త్రాలు చదివింది. శ్రాస్తాలు చదివి కూడ సమాజాన్ని చాంధసత్వం, మూఢనమ్మకాలవైపు తీసుకెళ్ళే వారిని నిలదీసి ప్రశ్నించింది.

పేద బాల బాలికల వసతి గృహము

చుట్టు ప్రక్కల దూర గ్రామాల నుంచి అనేక మంది పేద బాల బాలికలు మలికిపురం హైస్కూల్‌కి వస్తేగాని ఎస్.ఎస్.ఎల్.సి. గట్టెకే అవకాశాలు ఉండేవికావు. దారిద్ర్యంతో అల్లాడే కుటుంబాలే ఎక్కువ. విద్యార్జన కోసం రోజూ సుమారు 10-15 కిలోమీటర్లు దురాన్నుంచి రాగలిగే పరిస్థితులు లేక చాలమంది చదువుల్ని మధ్యలోనే ఆపేసేవారు.

ఇట్టి తరుణంలో పేద బాల బాలికల వసతి గృహాన్ని కమల ఎంతో సాహసంతో నెలకొల్పింది. తదుపరి ఆ వసతి గృహాన్ని ఉద్యమ కార్యకర్తలలో ఒకరికి అప్పగించింది. ఆ వసతి గృహం ద్వారా అనేక వందలమంది చదువుకున్నారు.

వర్గపోరాటం

ఎస్.సి., ఎస్.టి., బి.సి., క్రైస్తవ, ముస్లిం మైనారిటీల శక్తిని ఏ విధంగా కూడగట్టి బలమైన వర్గపోరాటం సాగించాలన్నది ఆమె ఆలోచన. వారందరిని వర్గపోరాటం వైపు నడిపి సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం, కులరహిత నూతన సమాజాన్ని తయారు చేయాలన్నదే ఆమె ఆలోచన. భర్త నారాయణమూర్తి సహాయం ఆమెకు లభించేది. భూస్వామ్య, బూర్జువా హస్తాల నుండి గ్రామ విముక్తిని సాధించాలన్న ఆసక్తి ఆమెకు మిక్కుటంగా ఉండేది.

కమల ఆశయాలకు అనుగుణంగా అనేక పోరాటాల్లో పాల్గొని అటు భూస్వాముల నుంచీ, పోలీసుల నుంచీ కష్టాలపాలైన అనేక మంది మహిళా కార్యకర్తల్లో కందికట్ల లక్ష్మి, గుబ్బల సత్యవతి, బూసి లీల, మాట్టాడి కాంతమ్మ, గెడ్డం ఐరావతి, గెడ్డం శ్రీదేవి, గుబ్బల కాంతమ్మ, మేడిది మేరీ, గొల్లమందల రోజీ, మేడిద అనసూయ, అప్పారి జానికమ్మ, పిల్ల కాంతమ్మ, రామతులసమ్మ, తాడివీరమ్మ మొదలగు మహిళ లెందరో ఉన్నారు. ప్రతి ఒక్కరూ కష్టజీవుల ఉద్యమంలో అష్టకష్టాలు అనుభవించారు. పరుల శ్రేయస్సు కోసం ఎన్నెన్నో త్యాగాలు చేశారు. పీడిత తాడిత జనావళి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం, వారి హక్కుల కోసం పోరాటం సాగించారు.

కామ్రేడ్ అల్లూరి వెంకట్రామరాజు (మాజీ ఎం.ఎల్.ఎ) సహకారంతో యువజన సంఘాల ద్వారా ప్రాతిబడులు నిర్వహించి ఎందరికో అక్షరదానం చేసింది కమల. మొదట్లో ఈమెకు తల్లిదండ్రులు పెట్టిన పేరు పుల్లమ్మ. అయినా కామ్రేడ్ వెంకట్రామరాజు కమలగా మార్చారు. ఈయన సాంఘిక సమస్యల విషయంలో స్త్రీలకు, పురుషులకూ తేడాలేదని అందరికీ అధ్యయనం నిర్వహించేవారు.

కమల ఓ సామాన్య గృహిణిగా నలభై సంవత్సరాల క్రితమే సైకిల్ తొక్కడం నేర్చుకుంది. అలా ఆమె ఆ రోజులలో సైకిల్ తొక్కుతుంటే గ్రామాల్లో విరగబడి చూసేవారు. ఆడ పిల్లలు అన్ని రంగాల్లోను ముందుకు రావాలని ప్రోత్సహించింది. ఆమె కబుర్లతో కాలం గడపలేదు. ఆచరించి చూపించింది. బాలికలకు సైకిల్ నేర్పడం వలన వాళ్ళ దైనందిన జీవితంలో మరింత వేగం వస్తుందనీ, శ్రమ తగ్గుతుందనీ ఆమె తెలియజెప్పింది.

కమల ఆశయాలు-దళితుల కోసం ఆమె ఆరాటం

1. సామాజిక వివక్ష, ఆర్థిక విధానాలలో అసమానతలు దళితుల పాలిట గొడ్డలిపెట్టు.
2. ఆత్మగౌరవం కోసం, అసమానతలు నిర్మూలించే దిశగా దళితులంతా ఉద్యమాలు చేపట్టాలి.
3. కులపెత్తనం, తద్వారా దోపిడీ అరికట్టబడాలి.
4. వెట్టి చాకిరీ, వ్యవసాయ కూలీలూ ఎక్కువ శాతం దళితులే గనుక వారికి కోర్టులు, చట్టాలు, పోలీసు యంత్రాంగం ఎంతవరకు న్యాయం చేస్తున్నదీ నిత్యం ప్రభుత్వ యంత్రాంగ పర్యవేక్షణలో ఉండాలి.
5. అస్పృశ్యత, అంటరానితనం పాటిస్తున్న గ్రామాల్లో అభివృద్ధి పథకాలు మంజూరు చేయించి, వాటిని విధిగా అమలు చేయించే బాధ్యత ప్రభుత్వ యంత్రాంగం స్వీకరించాలి.
6. సాంఘిక బహిష్కరణకు గురై, పెత్తందార్ల కారణంగా గ్రామాలను విడిచిపోయే జనావళిని ప్రభుత్వం ఆదుకొని వారి రక్షణ బాధ్యత స్వీకరించాలి.
7. ప్రభుత్వ బంజరు, పోరంబోకు, ఏటిబాడవ భూముల్ని సమగ్ర సర్వే నిర్వహించాలి. దురాక్రమణ చేసిన భూస్వాముల నుండి ఆ భూములను స్వాధీనపరచుకొని దళితులకు పంచాలి. సమగ్ర వ్యవసాయ కూలీ శాసనం తేవాలి.
8. దళిత జనాభాలో 74% ఇంకా నిరక్ష్యరాస్యులే. వారికి విద్యను కల్పించ వలసిన బాధ్యత ప్రభుత్వానిదే.
9. ఆదివాసీలు, పిల్లలు, స్త్రీలు, కూలీలు, చేతివృత్తుల వారూ పీడిత ప్రజలే కనుక ప్రభుత్వం తక్షణం వీరిని రక్షించే చట్టాలు అమల్లోకి తేవాలి. ✦

అతడు సైనికుడు

– భగ్వాన్

అన్నీ జయించడమే అతని పని
కోరికల్ని జయించాడు
సంసార సుఖాల్ని జయించాడు
మునికాదు వీరుడు
అతడు సైనికుడు

చిన్నప్పుడు
చీకటంటే భయపడే ఉంటాడు
చీకట్లోకి పోయేందుకు
అమ్మసాయం అడిగే ఉంటాడు
ఇప్పుడు చీకట్ని జయించాడు
భయాన్ని జయించాడు
అతడు సైనికుడు

చిన్నప్పుడు
స్నేహితులతో గలగలా మాట్లాడే ఉంటాడు
మాటలతో అందర్నీ ఆకట్టే ఉంటాడు
ఇప్పుడు మాటల్ని జయించాడు
మరణాయుధాల్ని జయించాడు
అతడు సైనికుడు

చిన్నప్పుడు
చన్నీళ్ళ స్నానం చేసేందుకు
అమ్మను తిప్పలు పెట్టే ఉంటాడు
ఇప్పుడు చలిని జయించాడు
బడికి నడిచి వెళ్ళేందుకు అలిగే ఉంటాడు
సైకిల్ కొనమని మారాం చేసే ఉంటాడు
ఇప్పుడు నడకను జయించాడు
అతడు సైనికుడు

చిన్నప్పుడు
బడినుంచి రాగానే
ఆకలంటూ అమ్మ కొంగు గుంజేవుంటాడు
ఇప్పుడు ఆకలిని జయించాడు
పట్టుమని పదినిమిషాలు చదివాడో లేదో
అమ్మ ఒడిలో ఆదమరిచే ఉంటాడు
ఇప్పుడు నిద్రను జయించాడు
అతడు సైనికుడు

స్నేహితుల్ని ప్రేమించేవాడు కాబట్టే
గురువుల్ని ప్రేమించేవాడు కాబట్టే
నాన్ననూ చెల్లాయినీ ప్రేమించేవాడు కాబట్టే
మరీ ముఖ్యంగా
అమ్మను ప్రేమించేవాడు కాబట్టే
ఇప్పుడు దేశాన్ని ప్రేమిస్తున్నాడు
దేశం కోసం బ్రతకడాన్ని ప్రేమిస్తున్నాడు

అతడు సైనికుడు
జయించడమే అతని పని
యుద్ధం జరుగుతున్నంత సేపూ
మనప్రేమల్ని జయించాడు
ఇప్పుడు యుద్ధాన్ని జయించాడు
యుద్ధంలో ప్రాణాన్ని త్యజించి
చివరకు స్వర్గాన్ని జయించాడు
అతడు సైనికుడు

ఆసియా సోషల్ ఫోరం సందర్భంగా

భూమి-ప్రజల జీవనాధారాలపై ప్రపంచీకరణ ప్రభావం

(జనవరి 2-7- 2003న హైదరాబాద్‌లో జరిగిన ఆసియా సోషల్ ఫోరమ్ సందర్భంగా జరిగిన సెమినార్‌లో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥ జె.కిషోర్‌బాబు ప్రవేశపెట్టిన పత్రం)

భారతదేశం గ్రామాల సముదాయం. 80శాతం పైగా జనాభా గ్రామాల్లోనే నివసిస్తున్నారు. వ్యవసాయం, దాని అనుబంధ వృత్తుల పైనే ప్రధానంగా ఈ జనాభా ఆధారపడుతున్నారు. అందువల్ల భూమే ఈ జనాభాకు ప్రధాన జీవనాధారం.

వలసపాలన కాలంలో భూసంబంధాల్లో కొన్ని మార్పులు జరిగాయి. గతంలో సంస్థానాధీశుల ద్వారా లేదా ఏదో ఒక రూపంలోని ఏజెంట్ల ద్వారా పన్నులు వసూలు చేసుకునే పద్ధతి ఉండేది. దీనికి బదులు కొన్ని ప్రాంతాల్లో బ్రిటీష్ పాలకులు నేరుగా రైతుల సంబంధంలోకి వెళ్లారు. ఆంధ్ర విషయానికి వస్తే వారు కోస్తా, రాయలసీమలో సర్వే జరిపి రైత్వారీ పద్ధతి అమలులోకి తెచ్చారు. తెలంగాణ ప్రాంతపు రైతాంగం నైజాం సంస్థానపు పాలనలోనే వుండేది. నైజాంనవాబు బ్రిటీష్ ఇండియాగా, కొంతభాగం రాజుల, మహారాజుల ఇండియాగా విభజితమై వుండేది. అటవీ ప్రాంతాల్లో గిరిజనుల స్వయంపాలన స్థానంలో అడవులపై బ్రిటీష్ ప్రభుత్వం తన పెత్తనం ప్రకటించుకొన్నది.

భూమిపై హక్కుతో వచ్చిన మార్పులు, శిస్తు వసూలు పద్ధతిలో వచ్చిన మార్పులు (పంట రూపం నుండి నగదు రూపంలోకి), పంటలను ప్రభుత్వం తమ సొంత (వాణిజ్య) ప్రయోజనాల కోసం తన అభీష్టం మేర పండించమని వత్తిడి చేయడం వంటి కారణాలన్నీ రైతాంగ తిరుగుబాట్లకు దారి తీశాయి. స్వాతంత్ర్య పోరాటంలో అధికభాగం రైతాంగ ప్రతిఘటనలు, తిరుగుబాట్లే.

వలస పాలకులు రైతాంగపు మేలు గూర్చి ఏమాత్రం పట్టించుకోలేదు. అప్పటికి వున్న సాగు నీటివనరులైన చెరువులు, కుంటల మరమ్మత్తు, నిర్వహణల గూర్చి కూడా పట్టించుకోలేదు. ఈ కారణాల వల్లా, ఇంకా ఇతర వినాశకర విధానాల వల్లా పలుదఫాలు రైతాంగం తీవ్రమైన కరువు కాటకాలకు బలయ్యారు. ఒక్కో కరువులో లక్షల సంఖ్యల్లోనే ప్రజలు మరణించారు.

జాతీయోద్యమంలో భాగంగా రైతాంగ సమస్యల పై ఉద్యమకారులు దృష్టి సారించారు. ప్రజాఉద్యమ నిర్మాణానికి నడుంకట్టారు. పంటలో అత్యధికభాగం కౌలురూపంలో రైతాంగం నుండి కొల్లగొట్టడానికి వ్యతిరేకంగా, రైతులను భూములనుండి వెళ్లగొట్టడానికి (బేదఖల్) వ్యతిరేకంగా, రుణభారం తగ్గింపు, పంటలకు సరైన రేట్ల కోసం, సులభతర రుణసౌకర్యం, పన్నుల తగ్గింపు మొదలగు డిమాండ్లను ముందుకు తేవడమే గాక భూములపై హక్కుకోసమూ, భూస్వామ్య విధానపు రద్దుకోసమూ - రైతాంగం పోరాడారు.

అధికనీటి పారుదల రేట్లకు వ్యతిరేకంగా మోంఘీర్‌లో జరిగిన ఒకస్త్ర రైతాంగ వుద్యమం అతిపెద్దది. అస్సాంలోని సుర్మాలోయ పోరాటం బేదఖల్‌కు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా జరిగింది. పంజాబ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, హైదరాబాద్, మలబార్‌లో బేదఖల్‌కు, పునరావాస కార్యక్రమాలకు వ్యతిరేకంగా రైతాంగం పలు పోరాటాలు చేశారు. 1936-45 లలో ఇలాంటి పోరాటాలు అనేకం జరిగాయి.

రెండవ ప్రపంచయుద్ధానంతర వెల్లువలో సాగిన పోరాటాల్లో నైజాం వ్యతిరేక తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం మహత్తరమైనది. నిరంకుశ వెట్టిచాకిరికి, భూస్వామ్య దోపిడి దౌర్యన్యాలకు వ్యతిరేకంగా; భూమి - భుక్తి - విముక్తికోసం అట్టడుగునున్న రైతాంగం సాగించిన పోరాటమిది. 1946 నుండి 51 వరకు సాగిన ఈ పోరాటంలో రైతాంగం దోపిడీ దొరల భూములను 3వేల గ్రామాల్లో 10 లక్షల ఎకరాలను స్వాధీనపర్చుకున్నారు. విభిన్న రకాల వెట్టిచాకిరి, వడ్డీ దోపిడీ తదితర రూపాలను రద్దు చేసుకున్నారు. అనేక గ్రామాల్లో ప్రజల స్వయంపాలనతో కూడిన గ్రామ రాజ్యాలను నెలకొల్పుకున్నారు. ఇదే కాలంలో బెంగాల్‌లో వీరోచిత తెభాగ రైతాంగ పోరాటం జరిగింది. పండిన పంటలో మూడింట రెండు వంతులు రైతుకు; ఒకవంతు మాత్రమే జోతేదారు (భూస్వామి)కు, అన్న నినాదంతో సాగిన పోరాటమిది. పంటను భూస్వాముల ఇంటి వరండాలో కాకుండా పంట కళ్ళంలోనే కొలవాలన్న నినాదంతో భూస్వాములను, వారి గూండాలను ఎదిరించి రైతాంగం పోరాడారు. ఈ మొత్తం పోరాటంలో 140 మంది రైతాంగ యోధులు, కమ్యూనిస్టులు ప్రాణాలర్పించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి భూస్వాములకు, కౌలుదార్లకు మధ్యవచ్చే తగాదాలను



పరిష్కరించేందుకు, కౌలుదార్లను గెంటివేయడం కష్టసాధ్యం చేస్తూనూ 'బర్గాదార్ చట్టం' తెచ్చింది.

తెలంగాణా పోరాటంలో 30లక్షల మంది ప్రజలు పాల్గొన్నారు. నైజాం నవాబు; ఫాసిస్టు సాయుధ సైన్యమైన రజాకార్లను - 1948 పోలీసు చర్య తర్వాత భారత ప్రభుత సైన్యాన్ని, ఎదుర్కొని సాగించిన ఈ పోరాటంలో 4 వేల మంది రైతాంగ కార్యకర్తలు, కమ్యూనిస్టులు అమరులైనారు. 10 వేల మంది 3,4 సం॥రాల పాటు జైలు శిక్షలను అనుభవించారు. 50వేల మంది ప్రజలు పోలీసు, మిలటరీ క్యాంపుల్లో చిత్రహింసల పాలయ్యారు.

ప్రజలు సాధించిన విజయాలను వమ్ము చేస్తూ-నైజాం సంస్థానాన్ని భారతదేశంలో కలుపుకునే పేరిట ప్రవేశించిన కాంగ్రెస్ మార్కు సైన్యం ప్రజా పోరాటంలో ఓడి, గ్రామాల నుండి పారిపోయిన భూస్వామ్య దోపిడీదారులను గ్రామాలకు తెచ్చింది. వారి నుండి రైతాంగం స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి భూస్వాములకు అప్పజెప్పింది.

ప్రజల పోరాటాన్ని పక్కదారి పట్టించేందుకు ఆచార్య వినోబాభావే నాయకత్వాన భారత పాలకులు 1951 సం॥లో భూదాన ఉద్యమమంటూ ముందుకు తెచ్చారు. భూస్వాములే ఐచ్ఛికంగా భూములను దానంచేయాలని, దానిని నిరుపేదలకు పంచుతామనీ, తద్వారా రక్తపాత రహితమార్పును సాధిస్తామని ప్రచారం చేశారు. 5కోట్ల ఎకరాల భూసేకరణ లక్ష్యంగా ప్రకటించి, కేవలం 45.9 లక్షల ఎకరాలు సేకరించగలిగినట్లు ప్రకటించారు. పనికిరాని రాళ్ళు, రప్పలు, తుప్పలతో కూడిన వ్యవసాయానికి పనికిరాని భూమే దీనిలో అధిక శాతం. ఈ భూదానోద్యమం ఫార్సుగా తేలిపోయింది. సేకరించిన 45.9 లక్షల ఎకరాల్లో 23.23 లక్షల ఎకరాల భూమి మాత్రమే పంచినట్లు ప్రకటించారు. కాని నిజానికి అత్యధిక భూములు భూస్వాముల వద్దే ఉన్నాయి అనేది నేటికీ ఈ భూములకోసం జరుగుతున్న పోరాటాలను బట్టే అర్థం అవుతుంది.

రైతాంగంలో వున్న భూదాహాన్ని, పోరాట శక్తినీ రంగంలోకి తెచ్చిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని చూసి దేశంలోని, అనేక రాష్ట్రాల్లోని భూస్వామ్య అనుకూల ప్రభుత్వాలు బెంబేలు పడ్డాయి. ఈ పరిస్థితిని ఎదుర్కొనడానికి రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కలిసి 78వరకు చట్టాలు చేశాయి. రాష్ట్రానికి, రాష్ట్రానికి మధ్య; రాష్ట్రంలోని ఒక ప్రాంతానికి, మరొకప్రాంతానికి మధ్య ఎన్నో తేడాలు చూపారు. భూస్వాముల, జమీందారుల ఆధీనంలో వ్యక్తిగత సాగుకోసం సిర్ లేదా ఖుద్‌కాస్త్ పేరిట ఉన్న పెద్ద పెద్ద భూకమతాలను వారిచేతుల్లోనే వుంచుకొనడానికి అనుమతించారు. ఆ భూములలో కౌలుచేసే రైతులకు ఏవిధమైన హక్కులు లేకుండా చేశారు. కేవలం 4 రాష్ట్రాల్లో మాత్రమే భూస్వాముల చేతుల్లో వుండదగు గరిష్ట భూపరిమితిని నిర్ణయించారు.

భూస్వాముల, జమీందార్ల భూములను స్వాధీనం చేసుకున్నందుకు వారికి పెద్ద మొత్తాల్లో నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయించారు. భూస్వాములకు భూమిపైననేగాక, గతంలో వారు వసూలు చేసుకుంటున్న పన్నులు -అడవులు, కొండలనుండి వచ్చే ఆదాయాన్ని, వారపుసంతలు, మార్కెట్లపై విధించే లెవీలు, రోడ్లు వంతెనలపై వసూలు చేసుకునే పన్నులతో సహా అన్నింటినీ లెక్కించి వారికి నష్టపరిహారాన్ని నిర్ణయించారు. ఈ అంచనాలు పెరుగుతూ పోయి 1958 నాటికి 670కోట్ల రూపాయలు పరిహారంగా చెల్లించినట్లు తేల్చారు.

భూసంస్కరణల లక్ష్యాలను ఇలా ప్రకటించారు. (1) ప్రభుత్వానికి, భూమిని దున్నే రైతుకు మధ్యనున్న దళారీ ప్రయోజనాలను రద్దు చేయడం (2) కౌలును క్రమబద్ధీకరించడం, భూమిపై భద్రతను కల్పించడం, అంతిమంగా స్వంత హక్కులను కలిగించడం (3) వ్యవసాయి భూముల పై భూపరిమితి చట్టాలు, మిగులు భూమిని పంచడం (4) కమతాలను సమీకరించడం.

అయితే నిజానికి ఈ భూసంస్కరణలు భూసంబంధాల్లో తెచ్చిన మార్పులు, గంభీర ప్రవచనాలు-ఖాళీ చేతులే. ఈ విషయాన్ని ప్రభుత్వ లెక్కలే తేటతెల్లం చేస్తున్నాయి.

కమతాల వారీగా భూ సంబంధాలు

వలసపాలన కాలం నాటికీ - 1950లలో చేయబడిన భూసంస్కరణల చట్టాల తర్వాత కూడా భూసంబంధాల్లో వచ్చిన మార్పులు నామ మాత్రమేనని ఈ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

1960-61లో చేసిన 16వ జాతీయ నమూనా సర్వే ప్రకారం కూడా - 80% జనాభా చేతిలో మొత్తం భూమిలో 25.4 శాతం భూమి మాత్రమే వుండగా, తర్వాతి 10% జనాభా చేతిలో 56.2% భూమి ఉన్నదని స్పష్టమైనది.

మూడు పంచవర్ష ప్రాణాళికల్లోనూ ప్రభుత్వాలు భూపంపకం గురించి ప్రస్తావించినప్పటికీ యధాతధస్థితే కొనసాగింది. పెరిగిన దారిద్ర్యం సామాజిక అంతరాలు అట్టడుగు వర్గాల్లో అశాంతిని రేపాయి. పోరాటమార్గం పట్టించాయి. 1967-68 నాటికి బెంగాల్లో నక్సల్‌బరీ ఉద్యమం, ఆంధ్రలో శ్రీకాకుళ గిరిజన ఉద్యమం ముందుకొచ్చాయి. రైతాంగ ప్రతిఘటన సాయుధరూపం తీసుకోవడంతో పాలకవర్గాలు మరోమారు కలవరపడ్డాయి.

దీంతో భూసంస్కరణల చట్టాలను మరోమారు రంగంలోకి తెచ్చారు. గిరిజనోద్యమాలపై ఉక్కుపాదం మోపి వేలాదిమంది గిరిజనులను జైళ్ళపాలు చేసి, వందల మందిని కాల్చిచంపడంతో పాటు, గిరిజనుల్లో ఆశలు కల్పిస్తూ గిరిజన భూముల బదలాయింపును నిషేధిస్తూ, భూబదలాయింపుల నిరోధక చట్టం (1/70) తెచ్చారు. ఆంధ్రలో మరో మారు గరిష్ట భూపరిమితి చట్టాన్ని పకడ్బందీగా చేస్తున్నట్లు ప్రకటించారు.

అయితే ఈ చట్టంలో ఏనుగులు దూరేంత కంతలు పెట్టారు. భూగరిష్ట పరిమితి పండ్ల తోటలకు వర్తించదన్నారు. చక్కెర మిల్లుల వంటివి, పాడి, పశు సంవర్ధక కేంద్రాల భూములు, తదితర అవసరాలకోసం ఉపయోగపడే భూములకు వర్తించదన్నారు. ఇలాంటి లొసుగులే కాక కమతాలను కుటుంబపరంగా కాక మేజర్లయిన కుటుంబ సభ్యుల పేర విడగొట్టే అవకాశం కల్పించారు. ఈ చట్ట ప్రకారం రక్షణ పొందేందుకు భూస్వాముల విడాకుల పత్రాలు,

కమతాల సైజు	1924		1939		1961	
	జనాభా శాతం	విస్తీర్ణం శాతం	జనాభా శాతం	విస్తీర్ణం శాతం	జనాభా శాతం	విస్తీర్ణం శాతం
5 ఎకరాలలోపు	58.3	12.1	63.7	12.2	55.8	11.8
5-10 ఎకరాల లోపు	18.3	15.1	16.9	13.1	19.0	14.5
10 ఎకరాలు ఆపైన	23.3	62.8	19.4	74.7	25.2	73.7

(ఆధారం : "తాకట్టులో భారతదేశం" తరిమెల నాగిరెడ్డి పేజి 372.)

నకిలీ దత్తు పత్రాలు సృష్టించారు. పలుపేర్లతో భూములను బదలాయించారు. అమ్మకాలు చేసినట్లు బినామీ పత్రాలు సృష్టించారు.

తగినంత రాజకీయబలం లేని పిడికెడు మంది తప్ప అత్యధిక శాతం భూస్వాములు, జమిందారులు తమ భూముల రక్షణ కోసం పై లొసుగులను ఉపయోగించుకున్నారు.

ఆంధ్రలో ప్రభుత్వ స్వాధీనంలో వుండే కొద్దిపాటి బంజరు భూములను మాత్రం షెడ్యుల్ కులాల పేదలకు పంచినట్లు పెద్దగా చూపించి, భూసంస్కరణలు అమలుపరిచినట్లు ప్రచారం చేసుకున్నారు. 1971 జనవరి తర్వాత తెల్లకాగితాల మీద భూస్వాములు చేసిన బినామి భూబదలాయింపులు చెల్లనేర వంటూ సుప్రీంకోర్టులో దాఖలైన కేసులో 1990లో అనుకూలమైన తీర్పు ఇచ్చింది. దాని ప్రకారం అయినా వేలాది ఎకరాలు ప్రజల పరం చేయాల్సి వుంటుంది. అయినా దాని కోసం ప్రభుత్వం పూనుకోవడం లేదు. చట్టం చేయడంలో జాప్యం, చట్టానికి అనుగుణ్యం గా వ్యవహరించటంలో భూస్వామ్య వర్గానికి అనుకూలంగా వ్యవహరించటం, రాష్ట్రంలోని గత ప్రభుత్వాలన్నింటి విధానం, ఆచరణగా వుంటూ వస్తున్నది.

గిరిజన భూ బదలాయింపుల నిరోధక చట్టం విషయమైతే చెప్పనే అక్కరలేదు. ప్రభుత్వం బదలాయింపులను ఆపేందుకు ఏ చర్యలూ తీసుకోలేదు సరిగదా-బదలాంపులు జరిగిన కేసులను ప్రభుత్వ దృష్టికి తెచ్చి అక్రమంగా కాజేసిన తమ భూమున్ని తమకు స్వాధీనం చేయమని గిరిజనులు పెట్టుకున్న అభ్యర్థనలపై కూడా ప్రభుత్వం కదిలిన పాపాన పోలేదు. గిరిజనులు తాము కోల్పోయిన భూముల స్వాధీనానికి పూనుకొన్న సందర్భాల్లో దాన్ని శాంతిభద్రతల సమస్యగా చర్చించి గిరిజనులపై తుపాకులు ఎక్కుపెట్టింది. తూర్పు గోదావరి జిల్లా కొండమొదలులో 1982 సం॥ చివర్లో ఇలాంటి సందర్భంలోనే గిరిజనులపై కాల్పులు జరిపి ఇద్దరు గిరిజన యువకులను బలిగొంది. విజయనగరం జిల్లాలోను, పశ్చిమ గోదావరి జిల్లాలోను ఇటీవలి కాలంలో కూడా తమ భూములు తమకు దక్కాలన్నందుకు గిరిజనులు లాఠీలు, తూటాలు చవిచూడాల్సి వస్తోంది.

కౌలుదోపిడీకి వ్యతిరేకంగా తమ భూములను గుంజుకొన్న భూస్వాములకు; వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా రైతాంగం పోరాడిన ప్రతిచోటా భూస్వామ్య గుండాలు- కొన్ని ప్రాంతాల్లో వారి సాయుధ సేనల దాడులకు వారు బలికావాల్సి వచ్చింది. పేద రైతులపైన, గిరిజనులపైనే నిర్బంధం ప్రయోగించాయి.

భూస్వాముల భూములపై సీలింగును అమలుజరిపి పంచకపోవడమే గాక; వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను భూస్వాములు, రాజకీయ నాయకులు, నిరంకుశ అధికారవర్గం కబ్జాలు చేస్తే ప్రభుత్వాలు వాటికి ఆమోద ముద్రలు వేశాయి.

ప్రసిద్ధ విప్లవకారుడు, ఆర్థికవేత్త కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి తన "తాకట్టులో భారత దేశం" అన్న గ్రంథంలో ఇలాంటి ఘటనలను సోదాహరణంగా వివరించారు. భూసంస్కరణల అమలు తీరుపై ఆయన ఇలా వ్యాఖ్యానించారు.

"ఈ విధంగా భూమిలేని పేదలకు ప్రభుత్వ భూమిని పంపిణీ చేస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రచారం అంతా నాటకమే. ఇదంతా ప్రజలను మోసగించేందుకే తప్ప వేరుకాదు. దేశవ్యాపితంగా సారవంతమైన భూములలో అత్యధిక భాగం ప్రభుత్వాధికారులకు, పాలకపార్టీ సభ్యులకు, భూస్వాములకే దఖలు చేయబడింది. ఈ ఉన్నత వర్గాలకు స్థానం కల్పించడం కోసం ఆ భూములను ఆక్రమించుకున్న పేద, భూమిలేని రైతాంగాన్ని బలవంతంగా బేదఖలు చేసింది."

(తాకట్టులో భారతదేశం : పేజి 392)

పారిశ్రామిక వస్తువుల వినిమయం పెరగాలంటే ప్రజల కొనుగోలుశక్తి పెరగాలి. కొనుగోలు శక్తి పెరగాలంటే ప్రజల ఆదాయం పెరగాలి. భూమి కేంద్రీకరణ రద్దయి విస్తారమైన రైతాంగపు చేతుల్లోకి భూములు రాకుండా అది అసాధ్యం. పెట్టుబడిదారీ వర్గం చరిత్రలో పలు దేశాల్లో భూపంపకం చేపట్టి సాగుచేసే రైతుకు భూమిపై హక్కులు కల్పించింది. అయితే మన దేశం లాంటి దేశాల్లో రూపొందిన బూర్జువా వర్గాలు సామ్రాజ్యవాద ప్రయోజనాలు కాపాడడమే కాక, భూస్వామ్య వర్గాలతో పీటముడి వేసుకొన్నాయి. భూస్వామ్య, బడా బూర్జువా వర్గాలు కుమ్మక్కై రైతాంగంపై దాడికి పూనుకున్నాయి.

వ్యవసాయ రంగంలో మన ప్రభుత్వాలు తెచ్చిన మార్పులన్నీ భూస్వామ్య వర్గాలకే ఉపయోగపడ్డాయి. 'పైరుపచ్చ విప్లవం' 'క్షీర విప్లవం' 'నీలివిప్లవం' వంటి వాటినన్నింటినీ ఉపయోగించుకోగలిగింది ఈ వర్గాలే. సామ్రాజ్యవాదుల వ్యూహాలకు, ప్రయోజనాలకు అనుగుణంగానే ఈ పథకాలన్నీ రూపొందాయి. అమలు జరిగాయి.

గ్లోబలీకరణ నేపథ్యంలో భూమి

మనదేశంలో ప్రజలకు భూమి జీవనాధారం. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే 80శాతం ప్రజల జీవితాలు దీనిపైనే ఆధారపడి వున్నాయి. భూసంస్కరణలు అమలుపరిచి దున్నేవానికే భూమిపై హక్కు కలిగించకపోగా-వ్యవసాయ పద్ధతుల్లో సామ్రాజ్యవాద వ్యూహానికి అనుగుణమైన మార్పులు తెచ్చారు. ఆధునిక వంగడాలు, యంత్రాలు, ఎరువులు, పురుగుమందుల వంటివన్నీ సామ్రాజ్యవాద కంపెనీలకు లాభాల పంటలు పండించాయి. ప్రభుత్వపరంగా భూస్వామ్య వర్గాలు ఈ సందర్భంగా పొందిన రుణాలు, సహాయం వల్ల భూమిపైనా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పైనా వారి పట్టును మరింత పెంచాయి.

జీవనాధారంగా వున్న భూమి వాణిజ్య పరమైన సరుకుగా మార్చబడింది. పెట్టుబడులు పెట్టి లాభాలు పిండుకోవడం తప్ప భూమిపై ఆధారపడే ప్రజల జీవితాలు ఏమవుతాయన్న స్పృహ పాలసీల రూపకర్తలకు లేదు. ప్రజలకు అవసరమైన ఆహార పంటలకు బదులు వాణిజ్య పంటలు పెద్ద ఎత్తున రంగంలోకి తీసుకొని రాబడ్డాయి. పెరిగిన పెట్టుబడులతో సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయకూలీలుగా దిగజారిపోయారు.

సంస్కరణలు, ప్రపంచీకరణ నినాదం-ఎగుమతి అనుకూల, లాభాల పంటలు వేసుకోమన్న పిలుపులు-ఈ విధానాల ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రంలోని కోస్తాతీరంలో గత దశాబ్దం పైగా కాలంలో రొయ్యల సాగుకోసం లక్షల ఎకరాల్లో వరిచేలు నాశనం చేశారు. ఈ క్రమంలో తీరప్రాంతంలోని చిన్న రైతుల చేతుల్లోని భూములలో చాలా భాగం సంపన్న వర్గాల చేతుల్లో కెళ్ళాయి.

మరోవైపు తోటలపెంపకం (Horticulture) పెరిగింది. పెట్టుబడులున్నవారు తమ చేతుల్లోని నల్లధనాన్ని భూముల కొనుగోలుకు మదుపు పెట్టారు. దీంతో సాగునీటి వనరులు, భూగర్భ జలాలున్న ప్రాంతాల్లోని భూములు పెట్టుబడి కేంద్రీకరణ చేయగల వారి చేతుల్లోకి వెళ్ళాయి. ఆహారపంటల నుండి వాణిజ్య పంటలవైపు, విదేశీఎగుమతి ఆధార ఉత్పత్తుల వైపు (రొయ్యల సాగు వగైరా) భూముల వినిమయం పెరిగింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచీకరణ విధానాలకు, సామ్రాజ్యవాద గుత్తకంపెనీల ప్రయోజనాల కనుగుణంగా; భూస్వామ్య, ధనాడ్య వర్గాలకనుకూలంగా భూచట్టాల్లో మార్పులు తెస్తున్నాయి.

గతంలో భూసేకరణ ప్రభుత్వ కార్యకలాపాల కోసం అవసరమైన సందర్భాల్లో మాత్రమే ప్రభుత్వం నిర్వహించేది. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని సవరించింది. ప్రైవేటు కంపెనీల అవసరాలను కూడా పబ్లిక్ అవసరంగానే పరిగణించి భూసేకరణ బాధ్యతను ప్రభుత్వమే చేపడుతూ చట్టసవరణ తెచ్చింది.

ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం బహుళజాతి కంపెనీలకు అటవీ భూములను కట్టబెట్టేందుకు 1/70 చట్టాన్ని సవరించబూనుకొంది. తీవ్రమైన ప్రజా ప్రతిఘటన ఎదురవడంతో తాత్కాలికంగా వెనక్కు తగ్గింది. 1/70 చట్టాన్ని ఎత్తివేసి గుత్తకంపెనీలకు అటవీ భూములను కట్టబెట్టేందుకు కృతనిశ్చయంతో వుంది. సుప్రీమ్‌కోర్టు తీర్పు పేరిట పోడు వ్యవసాయం నుండి కూడా గిరిజనులను బయటకు గెంటివేసే ప్రయత్నంలో వుంది.

రాష్ట్రంలో 3 లక్షల 75వేల ఎకరాల దేవాలయ భూములున్నాయి. భూస్వాముల చేతుల్లో వున్న దేవాలయ భూములకు కౌలు చెల్లించకుండా స్వాహాచేసినా, బినామీగా తామే కౌలుకిచ్చి ఆదాయాలు పొందుతున్నా పట్టించుకోని ప్రభుత్వం-సాగుచేసుకొనే చిన్న రైతులను భూముల నుండి తొలగించి వేలం వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కుప్పంలో రైతుల భూములను సేకరించి ఇజ్రాయిల్ తరహా వ్యవసాయం చేసేందుకు కంపెనీకి అప్పగించింది. కృష్ణాజిల్లాలో కూడా ఇట్లాంటి ప్రయోగం చేపట్టారు. కార్పోరేట్ కంపెనీల కోసం భూముల నుండి రైతులను తొలగించాలన్నది ప్రభుత్వ వుద్దేశ్యం. సరళీకరణ నేపథ్యంలో చేపడుతున్న చర్యలన్నీ రైతాంగం దివాళాతీసి తమ భూములను తామే అప్పజెప్పేట్లు చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

సారాంశంలో భూకేంద్రీకరణ బద్దలు కాలేదు, సరికదా వివిధ రూపాలలో తీవ్రమైంది. ప్రజల జీవనాధారాలను తీవ్రంగా దెబ్బతీసే విధంగా తయారయింది. వ్యవసాయరంగం లోకి వచ్చిన పెట్టుబడులు పేద రైతుల జీవితాలను ఛిద్రంచేసి సంపన్నవర్గాలకు, భూస్వాములకు మేలు చేకూర్చాయి. దున్నేవానికే భూమి అన్న నినాదంతో ఫ్యూడల్ వ్యతిరేక వ్యవసాయిక విప్లవం ద్వారా, విప్లవాత్మక భూసంస్కరణలను అమలు చేసినప్పుడే, గ్రామీణ రైతాంగానికి రక్షణ లభిస్తుంది.

ప్రపంచీకరణ - ఉపాధి

వ్యవసాయరంగంలో ప్రపంచీకరణ నేపథ్యంలో చేపడుతున్న చర్యలు గ్రామీణ ఉపాధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విజన్ 2020లో వ్యవసాయం మీద ఆధారపడే ప్రజల శాతాన్ని ప్రస్తుతమున్న దాంట్లో 50% తగ్గించడం లక్ష్యంగా చెప్పుకొన్నాడు. పారిశ్రామిక అభివృద్ధి జరిగితే వ్యవసాయ రంగం నుండి శ్రమశక్తి అటువైపు మరలుతుందని అనుకోవచ్చు. అయితే పారిశ్రామిక రంగం స్వయంగా తీవ్ర సంక్షోభాన్నెదుర్కొంటున్నది. పరిశ్రమల మూసివేతలు కార్మిక వర్గాన్ని లక్షల సంఖ్యలో వీధుల్లోకి నెట్టాయి.

వ్యవసాయరంగంలో ప్రపంచీకరణ నేపథ్యంలో సాగుతున్న సంస్కరణలు వినాశకర ఫలితాలనిస్తున్నాయి.

పంటల సరళిని మార్చుతున్నారు. ఆహార పంటలు గ్రామీణ వ్యవసాయ కూలీలకు సంవత్సరంలో అధిక పనిదినాలను కల్పించేవి. వీటికి బదులు పేపరుమిల్లుల కోసం వెదురు పెంచేందుకు సామాజిక వనాలను (Forestery) పెంచారు. జామాయిల్, సుబాబుల్ వంటి ప్లాంటేషన్లతో శ్రమవినియోగం పంట వేసేటపుడు; 5,6 సంవత్సరాల తర్వాత తిరిగిచెట్లు కొట్టేటపుడు మాత్రమే. లక్షల ఎకరాల్లో సామాజిక వనాలు పెంచి ఉపాధిని దెబ్బతీశారు. ప్రపంచ బ్యాంకు ఆదేశంతో ప్రభుత్వం అడవులలో మేకల పెంపకం నిషేధించాలని ప్రయత్నిస్తున్నది. వరి పండే 5 లక్షల ఎకరాలు రొయ్యలసాగు, ఇతర అవసరాల కోసం మారింది. దీని ఫలితంగా కూడా పని దినాలు వరిపంటతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి.

తీరప్రాంతాల్లో ఉప్పు పండించే రైతాంగం రాష్ట్రంలో పదుల వేలలో వున్నారు. సాంప్రదాయక ఉప్పును నిషేధించి-అయోడైజ్డ్ ఉప్పును వాడాలని ప్రభుత్వం చట్టంవేసి, ఉప్పుసాగు రైతులకు వ్యవసాయ విద్యుత్‌కు బదులు పారిశ్రామిక విద్యుత్‌శ్లాబ్‌ను అమలు పరడం మూలంగా, మార్కెట్లో పడిపోయిన ఉప్పు రేట్లతో గిట్టుబాటు కాక వేలాదిగా ఉపాధి కోల్పోయారు.

మార్కెట్ సంక్షోభాన్ని చూపి పొగాకు పంటకు ఒక సంవత్సరం క్రాప్ హాలిడే ప్రకటించారు. దాని ఫలితంగా పదులవేల వ్యవసాయ కుటుంబాలు లక్షల పనిదినాలు కోల్పోయారు.

గతంలో ట్రాక్టర్ల ప్రవేశం మాత్రమే వుంటే-ఇటీవల కోతయంత్రాలు పెద్ద ఎత్తున డెల్టా ప్రాంతాల్లోకి వచ్చాయి. దీనితో కోతకూలీ పనులలో కూడా శ్రమశక్తి వినియోగం సాంతం పడిపోయింది.


సంస్కరణల మూలంగా సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం కేటాయింపులు కత్తిరించారు. దాంతో వర్షాధార కరువు పీడిత ప్రాంతాల్లోనే కాక, సాగునీటి ప్రాజెక్టులున్న ప్రాంతాల్లో కూడా సాగు పడిపోయింది. ఈ సంవత్సరపు అనుభవమే చూస్తే-నాగార్జున సాగర్ ఆయకట్టు, కృష్ణాడెల్టా, గోదావరి పెన్నా డెల్టాతో సహా అన్ని ప్రాంతాలలోను పంట విస్తీర్ణం పడిపోయింది.

రాష్ట్రంలో సాగుబడిలో వుండే భూమి 3.73 కోట్ల ఎకరాలు. వర్షాభావం ఫలితంగా 90 లక్షల ఎకరాలు ప్రతిసంవత్సరం సాగులోకి రావడం లేదు. ఈ సంవత్సరము ప్రాజెక్టు ప్రాంతాలు కూడా దెబ్బతినడంతో ఈ సంఖ్య రెట్టింపు వరకు వుండవచ్చు. ఈ విస్తార ప్రాంతాల్లో పంటలు లేకపోవడంతో వ్యవసాయ కూలీలే కాక రైతాంగం కూడా పొట్టచేత బట్టుకొని వలసలు పోయింది.

మెట్టప్రాంతాల్లో సేద్యం విద్యుత్ మోటార్ల పైన, డీజిల్ ఇంజన్లపైన ఆధారపడి సాగుతుంది. విద్యుత్‌రేట్లపై సబ్సిడీని కత్తిరించి టారిఫ్ పెంచింది. డీజిల్ రేట్లు పెంచింది. దీంతో మెట్టసాగు పడిపోయి వుపాధి దెబ్బతిన్నది. అప్పులు పెరిగి రైతుల ఆత్మహత్యలకు, కిడ్నీల అమ్మకాలకు కూడా దారితీశాయి.

చంద్రబాబు ప్రభుత్వం కరువు ప్రాంతాల్లో ఉపాధిని కల్పించేపేర పనికి ఆహార (Food for work) పథకం కింద 35 నుండి 40 లక్షల టన్నుల బియ్యాన్ని కేంద్రం నుండి తెచ్చింది. ఆచరణలో పనులన్నీ కాంట్రాక్టర్లతో చేయించారు. కరువు పీడిత ప్రజలను వలసల పాల్జేశారు.

వ్యవసాయరంగంలో సబ్సిడీల కోత (ఎరువులకు - విద్యుత్ సబ్సిడీ ప్రధానంగా) కొనసాగుతున్నది. నీటిపారులదల రంగానికి బడ్జెట్ కేటాయింపులు కత్తిరించబడుతున్నాయి. ఇబ్బడి, ముబ్బడిగా దేశంలోకి వస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు మన పంటలపై వ్యతిరేక ప్రభావాలు



వేస్తున్నాయి. విదేశాల నుండి తప్పనిసరిగా ఆహారధాన్యాలు దిగుమతి చేసుకోవాలన్న షరతులు, విత్తనరంగంపై సామ్రాజ్యవాద గుత్త కంపెనీల అదుపు - విత్తనాలు, పంటల తీరుపై తీవ్రమైన చెడు ప్రభావాలు కలిగిస్తున్నాయి. ఇవన్నీ రైతుల, వ్యవసాయ కూలీల జీవనోపాధిని ఘోరంగా దెబ్బతీస్తున్నాయి.

ప్రజల జీవనోపాధి మెరుగుపడాలంటే భూ పంపకం జరగాలి. ఇది కీలకమైనది. ప్రస్తుత గణాంకాల ప్రకారం బీదరికపు రేఖకు దిగువన వున్న (Below Poverty Line-BPL)జనాభా రాష్ట్రంలో 40% పైగా ఉంది. ప్రపంచీకరణ ప్రభావం ప్రతిఏటా రాష్ట్రంలో పదుల లక్షల మందిని అదనంగా ఈ సంఖ్యలకు కలుపుతోంది.

కనుక అసలు సమస్య భూములు పంపకం జరగాలి. ప్రభుత్వాలు ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించడం లేదు. విప్లవకర, ప్రగతిశీల రాజకీయ శక్తులు, గ్రామీణ పేద ప్రజలే చొరవ తీసుకొనక తప్పదు. అప్పుడు మాత్రమే కనీసం ప్రభుత్వం ప్రకటించిన భూ పరిమితయినా ఆచరణ రూపం ధరిస్తుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే - దున్నేవానికే భూమి కేంద్ర నినాదంగా విప్లవకర భూసంస్కరణలు అమలు జరిగితేనే గ్రామీణ ప్రజల విముక్తి సాధ్యమవుతుంది. ఆకలి చావులు, ఆత్మహత్యలు అంతమవుతాయి. ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. నిజమైన అర్థంలో అది అభివృద్ధి మార్గంలో సాగగలుగుతుంది.

ఇందుకోసం భూస్వామ్య దోపిడీకి, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలు, పేద, మధ్యతరగతి, ధనిక రైతాంగంతో సహా సమైక్యంగా పోరాడాలి. ఇందుకోసం కృషి చేయడమే రైతాంగ ఉద్యమ కర్తవ్యం. ✦

విరిగిన మగ్గం

- భగ్వాన్

మగ్గం ఆడే చప్పుడు
ఇంట్లో సిరుల తల్లి నడుస్తున్న చప్పుడులా ఉండేది
అది కొయ్యకాళ్ళ చప్పుడని ఋజువయింది-
మగ్గం ఆడే చప్పుడు
ఒక జాతి జీవన గీతాలాపన వెనుక మోగే
డప్పుల చప్పుడులా ఉండేది
అది పాడె కోసం వెదురును చీల్చుతున్న చప్పుడని
తేలిపోయింది -
మగ్గం ఆడే చప్పుడు
రోజూ రెండు పూటలా అన్నం ఉడుకుతున్నచప్పుడులా ఉండేది
అది ఖాళీ కంచాల చప్పుడని తెలిసొచ్చింది.

ఉరికొయ్యో
పురుగుమందో
ప్రపంచీకరణ మహమ్మారి ఊపిరాడని బలవంతపు కౌగిలిలో
ఏదైతేనేం
వాడు గిలగిలా కొట్టుకొని చనిపోయాడు
వాడు నేసిన తెల్లని వస్త్రం
వాడి శవం మీదే కప్పడం పెద్ద విషాదం
ఇప్పుడు నాకు బట్టలు కట్టుకున్న ప్రతిమనిషీ
వాడి శవాన్ని మోస్తున్న ఉరికొయ్యలా కనిపిస్తున్నాడు.

పోరగాడు

- రేడియం

పసుల పోరగాడు
పాద్దు మూకినదాక గుడిసెకు రాడు
పైటాలదాక
గండి గట్కతాగడు
సెట్టు సేమను
పాద్దును జూసుకుంటా
యెద్వ బతుకు మాట ఆలోచిస్తడు
అయ్యోరి కొడుక్కు
దొర కొడుక్కు
బక్కచిక్కిన బాంచన్ కొడుక్కు
బొమ్మలు గీసి
నవ్వుకొంటడు
పాద్దు మూకినాకే కదా!
పాద్దు పాడిసేది
బక్క చిక్కినోళ్ళంత బరిసెలు తీసుకాని నడిస్తే
పాద్దు పాడువు సుక్క తెల్లగైతదని చెప్తది

ప్రపంచీకరణ నేపథ్యంలో ఆదివాసులు-భూమి సమస్య

(జనవరి 2-7-2003 న హైదరాబాద్‌లో జరిగిన ఆసియా సోషల్ ఫోరమ్ సందర్భంగా జరిగిన సెమినార్‌లో ఆదివాసీ హక్కుల వేదిక తరపున కా॥ఎస్.ఝాన్సీ ప్రవేశపెట్టిన పత్రం)

ఆదివాసీ తెగలకు సంబంధించినంత వరకూ భూమి కేవలం ఆర్థిక అవసరం మాత్రమే కాదు; వారి జీవనాధారం. సాంస్కృతిక సంపద. ఆదివాసులను భూమి నుంచి గెంటివేయడం అంటే నీటిలోని చేపలను ఒడ్డుకు విసిరివేయడం లాంటిది.

ఆదివాసీ ప్రజలకు సంబంధించినంత వరకు ప్రపంచీకరణ హఠాత్ సంఘటన కాదు. ఆస్ట్రేలియా, అమెరికా ఆదిమ తెగలను పూర్తిగా నిర్మూలించి వారి సమాధులపై ఆఫ్రికా నుండి అమానుషంగా తీసుకువచ్చిన ఆఫ్రికా ఆదిమ తెగలను బానిసలుగా మార్చి సామ్రాజ్యవాదం నిర్మించబడింది. నేటి ప్రపంచీకరణ సామ్రాజ్యవాదం యొక్క పరాన్నభక్కుతనానికి ఒక పరాకాష్ట. ఆదివాసీ ప్రజల జీవించే హక్కునే కాలరాసేందుకు మరింత దుర్మార్గమైన రూపంలో సాగుతున్న దాడి ఇది.

ఆదివాసీ ప్రజల జీవనం ప్రకృతితో విడదీయరాని విధంగా ముడిపడి వుంది. వారు స్వచ్ఛమైన హృదయంతో, నిరాడంబరత్వంతో, సమిష్టి తత్వంతో నిండివుంటారు. కాగా సామ్రాజ్యవాద వ్యవస్థవ్యష్టితత్వంతోటి, పరపీడన పరాయణత్వంతోటి, పంచనతోటి నిండి వుంటుంది. ఒక్కమాటలో ఆదివాసీ జీవిత విధానం స్వచ్ఛమైనది, అరమరికలు లేనిది. సామ్రాజ్యవాద లాభార్జన దృక్పథానికి సూటిగా వ్యతిరేకమైనది.

పెట్టుబడి ఉన్నత రూపమే సామ్రాజ్యవాదం; సామ్రాజ్యవాదమే నేటి ప్రపంచీకరణ

బ్రిటీషు సామ్రాజ్యవాదం భారతదేశంలో తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకునే నాటికి భూమి ఇంకా ఒక సరుకుగా సర్వవ్యాపితం కాలేదు. అంతకు పూర్వం రాజుకు పంట మీద కప్పం వసూలు చేయడానికి మాత్రమే హక్కు ఉండేది. ఇంగ్లాండ్‌లో అసమాన భూసంబంధాలను విప్లవం ద్వారా ప్రజాస్వామీకరించిన పెట్టుబడిదారీవర్గం సామ్రాజ్యవాదంగా రూపాంతరం చెందాక భారతదేశంలో కొత్త జమిందారీ, భూస్వామ్య విధానాలను సృష్టించింది. అప్పటిదాక దళిత, 'శూద్ర' కులాలను, ఇతర శ్రమ జీవులను అణచివుంచిన సాంఘిక సమూహాలకు ఆధునిక వర్గ దృక్పథాలను కల్పించింది. తన పాలనకు దళారీలుగా మార్చుకొనే క్రమాన్నే గాక దేశ రైతాంగాన్ని కౌలుదార్లుగా, కూలీలుగా మార్చేక్రమాన్ని కూడా తీసుకొంది. 1812లో థామస్‌మన్రో "ఈ దేశంలో భూమిలేని రైతు అరుదు" అని అంటే, 1920 నాటికి ప్రతి వెయ్యి మందికి 417మంది భూములు కోల్పోయారు. నూటికి 40మంది వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. 1858లో అంటే భారత ప్రధమ స్వాతంత్ర్యపోరాటం అనంతరం బ్రిటీష్ సామ్రాజ్యవాదం ప్రజలు సమూహాలుగా గాక వ్యక్తులుగా, పాలితులుగా మార్చే ప్రక్రియ చేపట్టింది. ఈ క్రమంలో వచ్చినవే S.P.C, CRPC, సెటిల్‌మెంటు తదితర చట్టాలు.

అయితే సమిష్టి జీవనం, స్వయంపాలన అన్న మంచి లక్షణాలను ఆదివాసీ సమూహాలు ఇంకా నిలబెట్టుకొనడం వలన అడవి ప్రాంతాలలో వర్గ విభజనకి అవకాశాలు పూర్తిగా ఏర్పడలేదు. ఆదివాసి సమూహాలు భూమి, స్వపరిపాలన విషయంలో తమ హక్కులో బ్రిటీష్ సామ్రాజ్యవాదుల జోక్యాన్ని అంగీకరించలేక పోయాయి. ప్రతిఘటించి పోరాడాయి. ఎవరిదీ భూమి? ఎవరిదీ అడవి ? ఈ ప్రశ్నలే రెండు శతాబ్దాల నుంచి వెంటాడుతూ వస్తున్నాయి. ఆదివాసి సమాజాలలో పెట్టుబడి, వర్గ దోపిడీ, సామ్రాజ్యవాదులు ప్రవేశించడం సాధ్యం కాలేదు. ఈ పరిస్థితులలో అడవిని, భూవనరులను అదుపుచేసేందుకూ – వ్యక్తిగత యాజమాన్యాల కిందకు తెచ్చేందుకు; పెట్టుబడిగల వర్గాలను, దోపిడీ దౌర్జన్యం చేయగల వర్గాలను బయటి నుంచి ఏజెన్సీ ప్రాంతాల్లోకి వెళ్ళడానికి సామ్రాజ్యవాదులు ప్రోత్సహించారు.

సంతాల్‌లు, మహాజన్‌లు, ఛోటానాగపూర్‌లో 'డికూ'లు, నైజాం నవాబుపాలనలో వతన్‌దార్‌ల పేరిట మార్వాడీలు, శ్రీకాకుళం జిల్లాలో సొండీలు ఈ విధంగా బయటినుండి పంపబడిన వారే. అడవి మీద, భూమి మీద ఆదివాసుల హక్కులను కాలరాచేందుకు రాజ్యం సాగిస్తున్న ఈ ప్రయత్నాలను ఆదివాసీ ప్రజలు అనేక రూపాల్లో నిరసించారు; ధిక్కరించారు. ధానా భగత్ ఉద్యమం ఇలా ప్రచారం చేసింది. "మనభూమి భగవంతునిది; మనం భగవంతుని బిడ్డలం; మధ్యలో ప్రభుత్వం ఎవరు?"

ఆదివాసీ సమాజాల ప్రకటన (ముసాయిదా)

1. మన సమాజానికి, ప్రత్యేకించి ఆదివాసీ ప్రజలకు భూమి, నీరు, అడవి, ఖనిజాలతో సహా సహజవనర్ల పైన సహజ హక్కులున్నాయి. ఈ హక్కుల విషయంలో రాజీ బేరాలకు తావులేదు.
2. ' ఎమినెంట్‌డీమెన్‌సూత్రం' ముసుగులో అభివృద్ధి పేరిట ఆదివాసీ ప్రజలను నిర్వాసితులను చేస్తూ, అవ్యవస్థకు, దారిద్ర్యానికి గురిచేస్తూ ప్రజలవనర్లను కాజేసే ప్రస్తుత ఆచరణను తిరస్కరిస్తాము.
3. సరళీకరణ, ప్రపంచీకరణ పేరిట సహజవనర్లను సరుకులుగా మార్చడాన్ని తిరస్కరిస్తాము.
4. సమాజం, సంబంధిత పరిశ్రమకు యజమానిగా వుంటుందనీ, నూతన ఏర్పాటులో సమాజ సభ్యులందరికీ గౌరవప్రదమైన స్థానం ఉంటుందనీ ప్రత్యేక హామీ గల అనుమతిని సమాజం నుండి ముందుగా పొందని పక్షంలో సహజ సంపదల ప్రత్యామ్నాయ వినియోగంపై ఆధారపడిన అభివృద్ధి కార్యక్రమాలనన్నింటినీ తిరస్కరిస్తాము.
5. ప్రపంచీకరణ పేరుతో భూమి, నీరు, అడవి, జన్యువనర్లు, ఖనిజాలు తమవి అంటూ కార్పోరేట్ రంగం చేస్తున్న వాదనలను, అన్ని ప్రయత్నాలనూ సమాజాలు, ప్రత్యేకించి ఆదివాసీ ప్రజలు తిరస్కరించాలనీ, ప్రతిఘటించాలని, తిప్పికొట్టాలని పిలుపునిస్తున్నాము.

ఆదివాసీ తిరుగుబాట్లు - చట్టాలు

భూములపైనా, అడవిపైనా తమకున్న హక్కులను అతిక్రమించడానికి బ్రిటీష్ సామ్రాజ్య వాదులు అనుసరించిన విధానాలకు, చర్యలకు వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజల తిరుగుబాట్లు, పోరాటాలు వెల్లువగా లేచాయి. 1803లో వచ్చిన రంప తిరుగుబాటు; 1850లో వచ్చిన వీరోచిత సంతాల్ తిరుగుబాటు; 1924లో అల్లూరి సీతా రామరాజు నాయకత్వం వహించిన సాయుధ పోరాటం; 1940లలో కొమరం భీం నాయకత్వం వహించిన గోండుల తిరుగుబాటు వీటిలో ప్రాధాన్యత గలవి.

1947 అనంతరం కూడా బ్రిటీష్ సామ్రాజ్యవాద విధానాలనే దేశీయ పాలకులు అనుసరించారు. దీని ఫలితంగానే ఆదివాసీ జీవితాలు అధమాధమంగా వున్నాయి. ఆదివాసీల భూములు పరాయీకరణకు గురయ్యాయి. ఆదివాసీ సంస్కృతి, సమిష్టి జీవనం ఛిద్రం చేయ బడింది. ఆదివాసీ మహిళలు భూస్వాముల చేతుల్లో అనేక అకృత్యాలకు గురైనారు. "సాగ్రి, జోతి, వెట్టి, హోలి లాంటి అనేక పేర్లతో పిలవబడే బానిసత్వపు పూర్వలక్షణాల అవశేషాలు దేశంలోని వివిధ ప్రాంతాలలో, ప్రత్యేకించి ఆదివాసీ ప్రాంతా లలో బలంగా నిలిచి వున్నాయి." అటవీ విభజన, వడ్డీ వ్యాపారం, ఎక్సైజ్‌విధానం, షావుకార్ల దోపిడీ, ఫారెస్టు, రెవిన్యూ అధికారుల, పోలీసుల వివిధ రూపాల్లో సాగించే వేధింపులు; దోపిడీ ఆదివాసీ ప్రజలను మరింత కష్టాల పాలుచేశాయి.

ఆంధ్రప్రదేశ్‌లో భూ పరాయీకరణ

ఆదిలాబాద్ జిల్లా ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణంలో 11% ఆక్రమించి ఉంది. ఒకప్పుడు ఇక్కడ గోండులు, కొలాములే ప్రధాన తెగలుగా మెజారిటీగా వుండేవారు. నైజాం తర్వాతి రాష్ట్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆదిలాబాద్ జిల్లా షెడ్యూలు ప్రాంత జనాభా 90,774 మందికి తగ్గిపోగా, గిరేజనేతర జనాభా 2,88,217కు చేరింది. అంటే, షెడ్యూలు ప్రాంతంలో గిరిజన జనాభా 23.9% కి వచ్చింది. సెటిల్ మెంటు క్రింద ఉన్న మొత్తం భూములు 2,27, 599 ఎకరాలు. దీనిలో51,235 ఎకరాల (5,436 పట్టాలు) మాత్రమే గిరిజనులు పేరిట ఉంటే, 1,76,364 ఎకరాల భూమి (17,542 పట్టాలు) గిరిజనేతరులు కలిగి ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని షెడ్యూల్ ప్రాంతంలోని మొత్తం కమతాలలో 10-25 ఎకరాల మధ్య ఉన్న కమతాల సంఖ్య 1,348. దీనిలో గిరిజనులు 342 మంది అయితే గిరిజనే తరులు 1006 మందిగా ఉన్నారు. అదే విధంగా 25 ఎకరాలకు పైబడిన కమతాలు మొత్తం 215 కాగా, గిరిజనులవి కేవలం 46 మాత్రమే. మిగతా 169 కమతాలు గిరిజనే తరుల చేతుల్లో ఉన్నాయి.

ఇక కోయలు, కొండరెడ్లు గణనీయంగా ఉండే ఖమ్మం జిల్లాలో గిరిజన జనాభా షెడ్యూల్ ప్రాంతంలో 3,58,880 గా ఉండగా, గిరిజనే తర జనాభా 9,65,620 మందిగా వుంది. భూమిలో 4,07,443 ఎకరాలు గిరిజనేతరుల పేరున ఉంటే, గిరిజనులు 91,631 ఎకరాలు మాత్రమే కలిగి వున్నారు. గిరిజన, గిరిజనే తరులలో 25 ఎకరాలకి పైబడినవారు మొత్తం 4,775 మంది వుండగా, వారిలో 4,073 మంది గిరిజనేతరులే. అంటే గిరిజనేతరుల చేతుల్లో భూమి ఎంతగా కేంద్రీకృతమై ఉందో అర్థం అవుతుంది. భద్రాచలం డివిజన్‌లో పూర్వపు ఎస్టేటు, మహల్దారీ గ్రామాలలో తప్పుడు సెటిల్‌మెంట్ పద్ధతుల ద్వారా గిరిజ నేతరులు 8,297 మందికి 29,554 హెక్టార్లకి పట్టాలు పొందారు. అంతేకాదు, ప్రభుత్వ బంజరు భూమి వేలాది ఎకరాలు గిరిజనేతర భూస్వామ్యశక్తుల చేతుల్లో ఉంది. ఒక్క అశ్వారావుపేట మండలంలోనే 6,880 ఎకరాలు ఫారెస్టు బంజరు వీరి చేతుల్లో ఉంది.

పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం షెడ్యూలు ప్రాంతంలో 1905లో గిరిజనేతర జనాభా కేవలం 5శాతం ఉండగా, 1991 నాటికి 57.9 శాతానికి పెరిగింది. ఏజెన్సీ లోని భూ వివాదాలపై 1997లో జిల్లా యంత్రాంగం రాష్ట్ర హైకోర్టుకు సమర్పించిన నివేదిక ప్రకారం వివాదంలో వున్న మొత్తం 38వేల ఎకరాల భూమిలో 28వేల ఎకరాలు గిరిజనేతరులకి పట్టాల రూపంలో దఖలు పడ్డాయి. "పనికిరాని మెట్టభూములు" గా పిలువబడే అటవీ బంజర్లు ఆదివాసులకు చెందాల్సి వుండగా, వాటిలో 6,000 ఎకరాలు గిరిజనేతర భూస్వాముల చేతుల్లో వున్నాయి. పై భూములన్నింటికీ సెటిల్‌మెంట్ ఆర్డర్ల కోసం ఆదివాసులు భూపోరాటం ప్రారంభించి భూములను తమ స్వాధీనంలోకి తెచ్చుకున్న తర్వాత ప్రభుత్వం గిరిజనేతర పెత్తందారీ భూస్వాములకు పట్టాలు ఇవ్వడం ద్వారా వారి అక్రమ ఆక్రమణలకు "చట్టబద్ధత" కల్పించేందుకు పూనుకుంది. దీనికి నకిలీ పాసు పుస్తకాలను సృష్టించడానికి హైకోర్టు తీర్పుల కుంభకోణాన్ని ప్రభుత్వమే ప్రోత్సహించింది.

విశాఖ, శ్రీకాకుళం జిల్లాలలో భూ కేంద్రీకరణ తీవ్రంగా ఉంది. శ్రీకాకుళంలో ఆదివాసీ ప్రజలు "గిరిజన సంఘం" కమ్యూనిస్టుల నాయకత్వాన సుదీర్ఘమైన, నిర్మాణయుతమైన పోరాటం సాగించారు. భూస్వాములు, ఫారెస్టు, రెవెన్యూ అధికారులు వివిధ రూపాల్లో సాగిస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా; భూమి, అడవిపై హక్కు కోసం; సర్వతోముఖ సాంస్కృతాభివృద్ధి కోసం వేలాది మంది గిరిజన ప్రజలు వివిధ పోరాట రూపాలు అనుసరించారు. భూస్వాముల పెత్తనానికి, దుర్మార్గాలకు, దాడులకు వ్యతిరేకంగా పోరాడారు. దారుణమైన పోలీసు నిర్బంధాన్ని ధిక్కరించారు. ఈ విప్లవోద్యమంలో 426 మంది ఆదివాసీ పోరాట యోధులు, విప్లవ కమ్యూనిస్టు కేడర్లు, నాయకులు ప్రాణాలర్పించారు; అమరు లయ్యారు. ఈ పోరాట ఫలితంగా, ఆదివాసీ రైతాంగ ప్రజలు కొన్ని హక్కులను సాధించు కొన్నారు. కొంత భూమిని స్వాధీనం చేసు కొన్నారు. కొంత భూమి పంచబడింది. కానీ ఆ పక్కనే వున్న సాలూరు, విశాఖ ఏజెన్సీ ప్రాంతా లలో గిరిజనుల భూమి సమస్య ఊసెత్తలేదు. ఇక్కడ ఆదివాసీ ప్రజలు సంఘటిత పోరాటాల్లోకి తీసుకొని రాబడలేదు. ఈ జిల్లా విభజన సందర్భం గా, కొత్తగా ఏర్పడిన విజయనగరం జిల్లాలో షెడ్యూలు ప్రాంతాల నుండి మినహాయించ బడిన గ్రామాలు గణనీయంగా వుండేలా జాగ్రత్త పడ్డారు.

ఇక్కడ 1986-87లో ఎస్.సి, ఎస్.టి కమిషనర్‌గా పనిచేసిన శ్రీ బి.డి. శర్మ ఆదివాసీల భూముల పరాయీకరణ సమస్య గురించి తన రిపోర్టు (12వ)లో చెప్పిన విషయాలు ఎంతో ప్రాధాన్యత గలవి :

"ఆదివాసీ ప్రాంతాల్లో పరిస్థితి గుణాత్మకం గా భిన్నంగా ఉంది. ఆరంభంలో ఆదివాసీ ప్రజల హక్కులు లాంఛనంగా గుర్తించబడి వుండకపోయినప్పటికీ, విధిగా ఆదివాసీ ప్రజలందరూ భూమి యజమానులుగా వున్నారు. అందువల్ల లాంఛనమైన పద్ధతిని వారికి విస్తరించడం వల్ల కలిగే తొలి ప్రభావం ఏమంటే భూమితో సహా ప్రకృతి వనర్లపైన వారి హక్కులను ప్రశ్నార్థక స్థితిలో పెట్టడమే. దీని దుష్ప్రభావాలు బాగా తెలిసినవే ఐనప్పటికీ, ఎక్కడా ఈ అసంబద్ధ పరిస్థితి సరిచేయబడ

లేదు. సాంప్రదాయకంగా తాము అనుభవిస్తూ వచ్చిన హక్కుల గుర్తింపు కోసం, తరతరాలుగా తాము నిర్వహిస్తూ వచ్చిన వనరుల అనుభవం కోసం ఆదివాసీ ప్రజలు ఇప్పుడు ఇతరుల దయాదాక్షిణ్యాల కోసం చూడాల్సిన స్థితిలో ఉన్నారు. పర్య వసానంగా హక్కుల రక్షణకోసం చట్టాలు, నియమనిబంధనలు ఎన్ని చేయబడినప్పటికీ, ఆదివాసీల భూమి పరాయీకరణ ఆగకుండా కొనసాగింది. చిత్రమైన విషయం ఏమంటే, ఆదివాసీ ప్రజల అభివృద్ధి కోసం చేపట్టబడిన కార్యక్రమాలు ఈ క్రమాన్ని మరింత తీవ్రతరం చేశాయి."

"కొత్త రవాణా మార్గాల వ్యాప్తితో పాటుగా ఆదివాసీ ప్రజలు భూముల్ని కోల్పోతున్నారు. కొత్త అవకాశాలు తలెత్తుతున్న చోటల్లా వీరు నిరంతరాయంగా వెనక్కి నెట్టబడుతున్నారు. బయటికి నెట్టి వేయబడ్తున్నారు. లేదా తమంతట తామే అక్కడి నుండి తరలిపోక తప్పని స్థితిలో పడుతున్నారు. ఎందుకంటే, మొదటిది; కొత్త నిర్మాణాల కోసం వారి భూములు సేకరించ బడుతున్నాయి. తిరిగి ఈ ప్రాంతాలకు తామర తంపరగా నిర్వాసితులు వచ్చి నిండిపోతున్నారు. సంపన్నుల దీవులుగా, అపారమైన అధికారం, బలం గల వారి కేంద్రాలుగా కొత్త నివాస శిబిరాలు వెలుస్తున్నాయి. వీటిలో ఆదివాసీలకు ఎలాంటి స్థానమూ లేదు. మహా అయితే, ఈ నూతన ఆర్థిక వ్యవస్థ యొక్క అట్టడుగు భాగాన్ని మాత్రమే వారాక్రమించగలరు. నూతన సాంఘిక వ్యవస్థగా మాత్రమే రాగలరు. అన్ని రీతులా నష్టపోయేది ఆదివాసీ ప్రజలే. చిత్రమేమంటే, సౌలభ్యంతో అనివార్యమైనదిగా ప్రచారం చేయబడుతున్న వ్యవస్థ యొక్క విధ్వంసానికి వారు బలి చేయబడుతున్నారు. ఇబ్బంది కలగడం, మనోభావాలు గాయపడడం లాంటి అపోహకు కూడా తావివ్వకుండా విధాన నిర్ణయాలకు బాధ్యులైన వారిని వదిలి వేస్తున్నారు."

ఆదివాసీ హక్కులపై మరోసారి పెద్ద దాడి

భారత పాలకులు నూతన ఆర్థిక విధానం ప్రకటించేనాటికి, సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలను అమలులోకి తెచ్చే నాటికి ఆదివాసీ ప్రాంతాలలో భూమిసమస్య ఈ విధంగా వుంది. (పేజీ 23)

1. విశాల ప్రాంతాలను షెడ్యూలు ప్రాంతాలుగా ప్రకటించబడకుండా ఉండడానికి ఉద్దేశ్య పూర్వకంగానే ప్రయత్నం జరిగింది. జిల్లాలు, మండలాల విభజన పేరుతో 796 గ్రామాలు వాటి నుండి మినహాయించబడ్డాయి. "షెడ్యూలు ప్రాంతాలు" గా ప్రకటించబడిన ప్రాంతాల లో 1874 ఏజెన్సీ ప్రాంతాల చట్టం మొదలు 1996 పంచాయితీరాజ్ సవరణ చట్టం వరకూ ఎన్నో రక్షణ చట్టాలు ఉన్నప్పటికీ అనేక ప్రాంతాలలో గిరిజనులు మైనార్టీలుగా మార్చి వేయబడ్డారు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాల షెడ్యూలు ప్రాంతాలలో గిరిజన జనాభా ఆధిక్యతలో ఉన్నప్పటికీ, ఇక్కడ ప్రభుత్వమే భూస్వామిగా వ్యవహరిస్తున్నది. ప్లాంటేషన్ల పేరుతో ఆదివాసులను భూమి హీనులుగా మార్చడానికి చేయగలిగిందల్లా చేస్తున్నది.

2. 1947 తర్వాత దేశాన్ని పాలించిన ప్రభుత్వాలన్నీ బ్రిటీష్ సామ్రాజ్యవాదుల విధానాలనే కొనసాగించాయి. ఏజెన్సీ ప్రాంతాల సహజవనరులపై ఆదివాసీ సమాజానికి వున్న సమిష్టి హక్కులను నిర్వీర్యపరుస్తూ, వ్యక్తిగత యాజమాన్యాల క్రిందకు తేవడం; రాజ్యమే భూస్వామిగా మారి సహజవనరులను కొల్ల గొట్టడం; దీనిలోభాగంగా ఆదివాసుల భూపరాయీకరణను "చట్టబద్ధం" చేయడానికి అనేక చర్యలు చేపట్టబడినాయి. సంస్కరణల పేరిట, సహాయం పేరిట ప్రభుత్వం తీసుకునే చర్యలన్నీ ఏజెన్సీలో మార్కెట్టు శక్తులు బలపడేందుకు ఉద్దేశించిన చర్యలు మాత్రమే. తమ కాళ్ళమీద తాము నిలబడి తమ సాయుదాయక జీవితాన్ని, వనరులను అభివృద్ధి పరుచుకొనడానికి ఆదివాసీ ప్రజలకు అవకాశాలు ఇవ్వడానికి మారుగా సంస్కరణల పేరిట, ఆధునిక వ్యవసాయ పద్ధతుల పేరిట మార్కెట్టు శక్తులను బలోపేతం చేయడం ప్రభుత్వ ఉద్దేశంగా వుంది.

3. మైదాన ప్రాంతాల్లో పెరుగుతున్న వ్యవసాయ సంక్షోభం, పేద, మధ్య తరగతి రైతుల పరిస్థితులు దిగజారిపోవడం వల్ల తమ జీవనాధారం కోసం వీరంతా పెద్ద ఎత్తున కౌలు పేరుతో, వ్యాపారం పేరుతో, ఏజెన్సీ ప్రాంతాల లోకి తరలి వస్తున్నారు. ఈ పరిణామం మైదాన ప్రాంతాల్లో విప్లవాత్మకమైన భూసంస్కరణల అవసరాన్ని, రుణ భారానికి, మార్కెట్ శక్తులకు వ్యతిరేకంగా సాగే ఉద్యమాల పట్ల గిరిజనులు సంఘీభావం తెల్పడం మాత్రమే గాక ఆ ఉద్యమాల్లో పాలు పంచుకోవాల్సిన అవసరాన్ని కూడా ముందుంచుతున్నది.

4. ప్రముఖ కమ్యూనిస్టు విప్లవకారుడు, అర్థశాస్త్రవేత్త కా॥ తరిమెల నాగిరెడ్డి "తాకట్టులో భారతదేశం" అన్న తన ప్రకటనలో చెప్పినట్లుగా "ఆదివాసుల సంక్షేమం కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నానని ప్రభుత్వం చెప్పుకుంటున్నదంతా బూటకం."

5. వీటన్నింటి దృష్ట్యా, భూమికోసం ఆదివాసీ ప్రజలు సాగించే పోరాటాన్ని జీవించే హక్కు కోసం సాగిస్తున్న పోరాటంగా చూడాలి. ఈ జీవన్మరణ పోరాటం ఫలితంగా వారు సాధించిన హక్కులను నిలుపుకొనడానికి వారు ఏమేరకైతే, ఎక్కడైతే సంఘటిత ఐక్యపోరాటం కొనసాగిస్తారో, ఆ మేరకే వాటిని వారు నిలుపుకోగలుగుతారని ఆదివాసీలు గుర్తించడం నేటి ఆవశ్యకతగా ఉంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఆదివాసుల భూమి సమస్య

అంతులేని లాభాలు పిండుకొనడానికి, తాము సాగించే విచ్చలవిడి దోపిడీ కార్యకలాపాలకు, పీడనకు, ఎలాంటి అవరోధాలు ఉండరాదని సామ్రాజ్యవాదులు కోరుకుంటున్నారు. భారత పాలకవర్గాలు, ప్రభుత్వాలు ఈ కోర్కెలకు అనుగుణంగా వుండేలా తమను తాము సరిచూసుకుంటున్నారు. ఆదివాసుల పోరాటాలకు తలొగ్గి గతంలో తాము చేయాల్సి వచ్చిన చట్టాలను ఇప్పుడు నిర్వీర్యం చేసేందుకు, రద్దుచేసేందుకు పూనుకుంటున్నారు.

(A) ఆంధ్రప్రదేశ్‌లో ఆదివాసీ భూ పరాయీకరణను నిరోధించడానికి తీసుకొని రాబడిన అనేక రెగ్యులేషన్ల కొనసాగింపుగా 1/70 రెగ్యులేషన్ వచ్చింది. ఈ రెగ్యులేషన్ షెడ్యూలు ప్రాంతాల భూమి అంతా ఆదివాసుల దేనని సూత్ర రీత్యా గుర్తిస్తున్నది. భూమిపై హక్కును నిరూపించుకొనే బాధ్యతను గిరిజనేతరులపై ఉంచడమేగాక గిరిజన, గిరిజనేతరుల మధ్య భూ మారకాలను నిషేధించింది. ఈ అంశాలన్నీ భూస్వాములకు, భూమిని ఒక సరుకుగా మార్చాలనుకునే స్పెక్యులేటర్లకు, బడా పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదు లకు, రాజ్యానికి ఆటంకంగా ఉన్నాయి. (సమత V/S ప్రభుత్వం కేసు తీర్పులో సుప్రీంకోర్టు రాజ్యాన్ని కూడా "గిరిజనేతరుని" గా నిర్వచించింది) కనుక తన దారిలో ఉన్న ఆటంకాలను తొలగించుకొనడానికి గాను 1/70కి సవరణ చేసే ప్రయత్నాలను రాష్ట్రప్రభుత్వం ప్రారంభించింది. దీనికోసం ఆదివాసీ సలహా మండలిచే తీర్మానం చేయించింది. ఐతే, ఈ

ప్రయత్నం ఆదివాసీ ప్రజలనుండి, ప్రజాతంత్ర సంస్థలు, శక్తుల నుండి విస్తృతమైన నిరసన, వ్యతిరేకతలను ఎదుర్కొంటున్నది.

(B) దీని తర్వాత పాలకవర్గాలకన్ను రాజ్యాంగంలోని 5వ షెడ్యూలుపై పడింది. దీన్ని సవరించి తద్వారా భూమిపై ఆదివాసులకున్న మౌళిక హక్కును హరించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. దేశవ్యాపితంగా సాగిన ప్రజా ఆందోళనోద్యమం ఫలితంగా ఈ ప్రయత్నం కూడా తాత్కాలితంగా వెనక్కి నెట్టబడింది.

ప్రపంచీకరణలో అటవీ భూములు - ఆదివాసులు

రాష్ట్రంలోనూ, దేశంలోనూ, విశాలమైన అటవీ ప్రాంతాలలో భూములను ఆదివాసులు సాగుచేసుకుంటున్నారు. ఒక అంచనా ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో 62, 948 హెక్టార్ల భూమిలో 62, 504 కుటుంబాలు పోడు వ్యవసాయం సాగిస్తున్నారు. దేశవ్యాపితంగా 12.50 లక్షల హెక్టార్ల భూమి పోడు సాగులో ఉందని అంచనా. 10మిలియన్‌ల ఆదివాసీ ప్రజానీకం అడవులపై ఆధారపడి జీవిస్తున్నారు. పోడు వ్యవసాయం తరతరాలుగా కొనసాగుతున్నది. ఈ వ్యవసాయంలో ఆదివాసీలు ఒకే ప్రాంతంలో అనేకరకాల పంటలను పండిస్తారు. ఏ మొక్క ఎన్ని అంగుళాల భూసారాన్ని గ్రహిస్తుందో ఎరిగిన ఆదివాసీ ప్రజలు సాగించే పోడు వ్యవసాయంలో కోల్పోయే భూసారంతో పోల్చితే, ట్రాక్టరుతో దున్నితే కోల్పోయే భూసారమే ఎక్కువ. అనేక పంటలను, విత్తనాలను, జీవ వైవిధ్యాన్ని పరిరక్షిస్తున్నది ఆదివాసులే.

1865లో బ్రిటీష్ సామ్రాజ్యవాదులు అడవుల చట్టం తేవడానికి ముందు అడవుల పై ఆదివాసీ సమూహాల ఆధిపత్యమే ఉండేది. "ఎమినెంట్ డొమేన్ సిద్ధాంతం" ప్రకారం బ్రిటీష్ సామ్రాజ్యవాదులు పీడక చట్టాలను తెచ్చారు. అడవులను తమ కంట్రోలు,అధికారం కిందికి తెచ్చుకున్నారు. దీనికి వ్యతిరేకంగా సాగించిన అనేక వీరోచిత పోరాటాల ద్వారా ఆదివాసి ప్రజలు సాధించుకొన్న హక్కులను 1952 "జాతీయ అడవిచట్టం" 'కొన్ని సౌకర్యాలు, రాయితీల' స్థాయికి దిగజార్చింది. 1980 అడవుల సంరక్షణ చట్టం అడవికీ, ఆదివాసులకు విడదీయరాని సంబంధం ఉందని గుర్తించితే; ప్రస్తుత ప్రభుత్వాలు ఆదివాసులందర్నీ 'ఆక్రమణ దారులు'గా చిత్రించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1980 నాటికి 77, 661 ఎకరాలు సాగులో వున్న, రెగ్యులరైజ్ చేయదగిన అటవీ భూములుగా ప్రభుత్వం గుర్తించింది. 1990 సెప్టెంబర్ 6 సర్క్యులర్ ప్రకారం కూడా ఇవి రెగ్యులరైజ్ చేయదగిన భూములుగా ఉన్నాయి. కాని ప్రభుత్వం ఎదో ఒక సాకుతో వీటినింకా క్రమబద్ధం చేయలేదు. దానికి మారుగా, భద్రాచలం సబ్‌డివిజన్‌లో అనేక గ్రామాలను తగులబెట్టించింది.

సామ్రాజ్యవాదం దృష్టిలో 'అడవి' అంటే వన్య ప్రాణులు మాత్రమే సంచరించే అభయారణ్యం మాత్రమే. కాని ఆదివాసుల దృష్టిలో అడవి కన్నతల్లి. మనుషులు, జంతువులు, చెట్లు, ఒకరిపై ఒకరు ఆధారపడి వుంటూ సహజీవనం చేసే ప్రకృతి ఇది. సామ్రాజ్యవాదానికి అడవి అంటే ఒక ఆదాయ వనరు, వాణిజ్య లాభాల వనరు. పరిశ్రమలకు ముడిసరుకుల సరఫరా కేంద్రము. ఈ దృక్పథాన్ని స్వీకరించిన దాని ఫలితంగానే జయకృష్ణన్ కమిటీకి ఆదివాసుల మూలంగా ఈ 50 సంవత్సరాలలో 4,59,978 కోట్ల రూపాయలు నష్టం వచ్చినట్లు కనపడుతున్నది. ఈ కారణం వల్ల ప్రభుత్వం లక్షలాది మంది ఆదివాసులను నిర్వాసి తులను చేయదలచు కొన్నది. ప్రభుత్వం శాసనపర చర్యలకు సిద్ధం అవుతున్నది. ఈ విషయంలో ఈ సారి కోర్టు సహాయం తీసుకొంటున్నది. రాష్ట్రంలో మరో ప్రక్క ప్రపంచబ్యాంకు ఇచ్చిన 640 కోట్ల రూపాయలతో ఆదివాసులచేతనే "ఐచ్ఛికంగా" భూములను వదులుకొనేలా ప్రలోభ పరచేందుకు ప్రభుత్వం వంచనాత్మకమైన వివిధ పథకాలతో ముందుకు పోతున్నది. ప్రస్తుతానికి దానికి CFM అని పేరు పెట్టింది. ఆదివాసులను పోడు భూముల నుంచి గెంటివేయడమే ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశం. ఈ పథకం మూలంగా, ఆదివాసీ ప్రజల ఆహార భద్రత మరింత దెబ్బ తింటుంది. అడవిప్రాంతాలలో ఇప్పటికే అనేక ప్రమాదకర రోగాలతో, రొష్టులతో కునారిల్లుతున్న ఆదివాసీ ప్రజలు మరింత నికృష్టమైన స్థితిలోకి నెట్టబడుతారు.

పోడు హక్కు ఆదివాసుల జన్మహక్కు. ఆహార భద్రతకు, జీవవైవిధ్యానికి అత్యంత కీలమైన ఆదివాసీల పోడు వ్యవసాయం హక్కుపై ప్రపంచీకరణ పేరుతో సామ్రాజ్యవాదులు సాగిస్తున్న దాడిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉంది.

అభివృద్ధి పేరిట నిర్వాసితులను చేయటం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విశాఖ జిల్లాలో బాక్సైట్ మైనింగు పేరుతో ఆదివాసీ ప్రజలను నిర్వాసితులను చేయడానికి; ఆదివాసీ ప్రాంతాల జలవనరులను బాక్సైట్ శుద్ధికి వినియోగించడం కోసం; మైదాన ప్రాంతాల పంట పొలాలను, తాగు నీటివనరులను ఎండ గట్టటానికి ప్రయత్నిస్తున్నది. ప్రపంచీకరణ నేపథ్యంలో పాలకులు 'అభివృద్ధి' పేరిట తమ వినాశకర కార్యకలా పాలన్నింటినీ ముమ్మరం చేస్తున్నారు. "త్యాగాల" కోసం ఆదివాసులను మానసికంగా సిద్ధం చేసేందుకు సాంస్కృతిక దాడులను సాగిస్తున్నారు. ప్రజల, శ్రమజీవుల భాగస్వామ్యం లేని, జీవనోపాధి కల్పించని, పెట్టుబడిపై హెచ్చుగా ఆధారపడే పరిశ్రమలను, భారీ నిర్మాణాలను దేశంపై రుద్దుతున్నారు. దీనికొరకు భూసేకరణ చట్టాన్ని సవరించడానికి పూనుకొంటున్నారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలను "అభివృద్ధి" పేరిట ఆదివాసీ తెగల విధ్వంసాన్ని చట్టబద్ధం చేసేందుకు వినియోగించుకొంటున్నారు. 'నర్మాదా బచావో' ఆందోళన సందర్భంగా రాజ్యం అనుసరించిన క్రమం ఇదే. తమ జీవనాధారాలను, సాంస్కృతిక ఉనికిని, భూమిని నిలుపుకొనేందుకు ఆదివాసీ ప్రజలు చేస్తున్న ప్రయత్నాలను నేరస్త చర్యలుగా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలుగా చిత్రించే క్రమం ఊపందుకొన్నది.

ముగింపు: భారత దేశానికి సంబంధించి నంత వరకు ప్రపంచీకరణ అన్నది ఒక విడి, హఠాత్ సంఘటన కాదు. సామ్రాజ్యవాదుల కనుసన్నలలో మెలిగే భారత పాలకవర్గాలు గత 50 సం॥లుగా అమలు చేస్తున్న విధానాల కొనసాగింపే ఇది. సామ్రాజ్యవాదులకు దళారీలుగా వుంటూ వచ్చిన బూర్జువా వర్గం, ప్రభుత్వ నిధులను కొల్లగొట్టే నిరంకుశాధికార వర్గం, చుక్క చెమట భూమిపై చిందకుండా వ్యవసాయ కూలీల నుండి, కౌలుదార్ల నుండి పేద రైతుల నుండీ; భూములనూ, అధికారాలనూ కాజేస్తున్న భూస్వామ్య శక్తులు; ఫారెస్టు స్మగ్లర్లు; భూస్పెక్యులేటర్లు; పర్యాటక కేంద్రాల పేరిట ఆదివాసీ యువతులను లైంగిక వేధింపులకు గురిచేయ ప్రయత్నించే బడా హోటల్ యజమానులు; అడవిలో దొరికే ఖనిజ, వస్తు సంపదలపై కన్నువేసిన బహుళజాతి కంపెనీలు

– వీరంతా ఆదివాసీ ప్రాంతాలను ప్రైవేటీకరించేందుకు, ఆదివాసీ ప్రజల సహజ హక్కులను కాలరాచేందుకు, "ప్రపంచీకరణ" కోసం రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రజావ్యతిరేక భూస్వామ్య సంపన్న వర్గాల సాంఘిక పునాది మీదే సామ్రాజ్యవాదం ఆధారపడి వుంది. ప్రపంచీ కరణ పథకాలకు ఈ వర్గాల వారే వాహకాలుగా పని చేస్తున్నారు. అనేక పోరాటాల ద్వారా, ప్రజాతంత్ర శక్తుల కృషి ద్వారా ఆదివాసులు సాధించుకొన్న రక్షణలను రద్దు చేయ చూస్తున్నది వీరే. 1/70 చట్టాన్ని, 5వ షెడ్యూలును, అడవులపై ఆదివాసుల సాంప్రదాయక హక్కులను రద్దు చేయాలని ఈ వర్గాల వారే కోరుతున్నారు.

ఇలాంటి పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల, శ్రీకాకుళం, విజయనగరం, ఖమ్మం, వరంగల్, ఆదిలా బాదు తదితర జిల్లాల ఆదివాసీ ప్రజలు అనేక సంవత్సరాలుగా వివిధ పోరాటాల ద్వారా సాధించుకొన్న హక్కుల పరిరక్షణ కోసమే కాక; వాటి అమలు కోసం కూడా సంఘటిత, ఐక్య పోరాటాలు సాగిస్తున్నారు. ఈ పోరాటాలను విస్తార ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం, నిర్మాణయుతంగా వాటిని ముందుకుతీసుకు పోవాల్సిన అవసరం ఉంది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు, దానికి సాంఘిక పునాదిగా ఉంటూ ప్రజలను అణచి పెడుతున్న భూస్వామ్య, దళారీ వర్గాలకు, రాజ్యానికి వ్యతిరేకంగా ఆదివాసి ప్రజలు పోరాడాల్సి వుంది.

ఆదివాసీ ప్రజల పోరాటం నేడు ఒంటరిగా లేదు. మైదాన ప్రాంతాలలో విప్లవాత్మక భూసంస్క రణల కోసం పోరాటం చేస్తున్న వ్యవసాయ కూలీల, పేద రైతుల సంఘీభావం; గిట్టుబాటు ధరల కోసం; రుణభారాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న పేద, మధ్య తరగతి రైతుల సంఘీభావం; మూసివేతలు, తీసివేతలకి వ్యతిరేకంగా, తమ హక్కుల కోసం పోరాటం సాగిస్తున్న కార్మిక వర్గ సంఘీభావం దీనికి ఉన్నాయి. ఇవన్నీ సామ్రాజ్యవాద ప్రపంచీ కరణకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిన పోరాటాలే.

భూమి, నీరు, అడవిపై ఆదివాసీ సమాజానికి గల హక్కుల కోసం; ఆది వాసీ ప్రాంతాలలో స్వయం పాలన గ్రామ గణ రాజ్యాల నిర్మాణం కోసం ఆదివాసీ ప్రజలు సాగించే పోరాటాలు దేశంలోనూ, ప్రపంచ మంతటా దోపిడీ పీడనలకు గురవు తున్న వర్గాల, సెక్షన్ల ప్రజలు సాగిస్తున్న పోరాటంలో ఒక అంతర్భాగం.

18 వ శతాబ్దంలో సామ్రాజ్యవాదం, రాజ్యం చేసిన చొరబాట్లకు, దోపిడీకి, పీడనలకు వ్యతిరేకంగా ఆదివాసీ సమాజాలు అనేక అప్రయత్న తిరుగుబాట్లు సాగించాయి. తర్వాతి కాలంలో, భారత జాతీయోద్యమ ప్రభావంతో అల్లూరి సీతారామరాజు, కొమురం భీముల నాయకత్వాన వచ్చిన ఆదివాసీ సాయుధ పోరాటం లాంటి మరింత సంఘటితమైన, రాజకీయ దృక్పథం గల పోరాటాలు ముందుకు వచ్చాయి. ఇవి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దోపిడీ పీడనలకు, పాలనకు వ్యతిరేకంగా సాగాయి. 1969 శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటం నెత్తుటి ఏరుల్లో ముంచి వేయబడిన ప్పటికీ, ఇది ఆదివాసీ ఉద్యమాలకు ఒక స్పష్టమైన సిద్ధాంత భూమికను, వ్యవసాయ విప్లవం కేంద్ర కర్తవ్యంగా నూతన ప్రజాస్వామిక విప్లవ దృక్పథాన్ని అందించింది. భూమి , భుక్తి, నీరు, అడవిపై ఆదివాసీ సమాజాల హక్కులు; ఆదివాసీ స్వయంపాలన కోసం సాగించాల్సిన పోరాటాన్ని ముందుకు తెచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఆదివాసీ ప్రాంతాలలో ఆదివాసీ ప్రజలు తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. దోపిడీ పీడలనకు గురవుతున్న జనబాహుళ్యపు విశాల ప్రజా ఉద్యమంలో అంతర్భాగంగా ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకొని వెళ్ళినప్పుడే సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు, దాని వకాల్తాదారులైన భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారులకు, రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటాన్ని శక్తివంతంగా, తుద కంటా నడపగలము. ఆదివాసీ ప్రజలు జీవించే హక్కును పరిరక్షించగలము.

-ఆదివాసీ హక్కుల వేదిక, ఆం.ప్ర.

విధ్వంస కర్బనం

- భగ్వాన్

పెరడూ వాకిలీ
తుడిచి పారేసిన పెంటపోగు
ఎరువవుతుందని తెలుసు
ప్లాస్టిక్ వస్తువుల చెలిమితో ఎరువు
విషమవుతుందని తెలుసా...
మంచుకొండల్లోకి విసిరినా
అడవుల్లో వదిలినా
ఎడారుల్లో పూడ్చినా
ప్లాస్టిక్‌ను చీమకూడా కుట్టదు
నిర్లక్ష్యంగా విసిరి పారేసిన ప్లాస్టిక్ వస్తు సమూహాలు
నేల పొరల నడుమ
ఒక మృత్యు పొరను నిర్మిస్తాయి.
ఇంత విశాలమైన నేల గర్భంలోకీ
మొక్క వేరు దిగదు
వాన నీరు ఇంకదు
చేలో నాగలి ప్లాస్టిక్ వస్తువు తగిలి
ముందుకు నడవదు

డ్రైనేజీల్లో మురుగు పారక
ఊట తేటగా నవ్వదు
చెట్లు నేలకు బరువై
భూగర్భ జలాలు కరువై
వలసకు పోయే చోటు ఏదీ కనపడదు

భూమిలోపాతుకున్న ప్లాస్టిక్
భూకంపం కన్నా భయంకరం
పగిలిన పరమాణువు కన్నా ప్రమాదకరం
ప్లాస్టిక్ వాడకం పెరిగిందంటే
మనిషి ఆయుస్సు తరిగిందని అర్థం



ప్రపంచీకరణ నేపథ్యంలో భారత వ్యవసాయరంగం- ప్రభుత్వ విధానాలలో వస్తున్న మార్పులు

(జనవరి 2-7, 2003న హైద్రాబాద్‌లో జరిగిన ఆసియా సోషల్ ఫోరమ్ సందర్భంగా జరిగిన సెమినార్‌లో రైతుకూలీ సంఘం రాష్ట్రఅధ్యక్షులు కా॥ఎస్.ఝాన్సీ ప్రవేశపెట్టిన పత్రం)

ఈనాడు విస్తారంగా ఉపయోగించబడుతున్న 'ప్రపంచీకరణ' అన్నపదం మానవవనరులను, ప్రకృతి వనరులను ఒకచోటకు సమీకరించి, అందరి మేలు కోసం, మొత్తం మానవాళి ప్రయోజనాల కోసం వినియోగించాలని ప్రపంచదేశాలు, ప్రజలు ఒక ఉమ్మడి అంగీకారానికి వచ్చిన దాని ఫలితం కాదు. ప్రపంచ ప్రజలపై దుర్మార్గమైన దోపిడీ పీడనలను, పెత్తనాన్ని రుద్దాలన్న తమ అణిచి పెట్టుకోలేని కోరికలను, పథకాలను, చర్యలను కప్పిపుచ్చుకొనడానికి గాను – మొత్తంగా సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు వ్యాప్తిలోకి తెచ్చిన పదం ఇది. దీని ద్వారా తమ మార్గంలో వున్న అన్ని రకాల అవరోధాలను తొలగించుకోవడానికి; మానవ వనరులను, ప్రకృతి వనరులను, నిరాటం కంగా, యథేచ్ఛగా కొల్లగొట్టడానికి; శాస్త్రీయ సాంకేతిక అభివృద్ధి ఫలాలను కంట్రోల్ చేయడానికి; ప్రపంచంలోని ఇతర జాతుల, ప్రజల హక్కులను కత్తిరించి వేయడానికి, పరిమితం చేయడానికి, అతిక్రమించడానికి, హరించి వేయడానికి; తాము తీసుకుంటున్న చర్యలను చట్టబద్ధం చేసుకోవాలని వారు కోరుకుంటున్నారు. కనుక ప్రపంచీకరణ అన్న అవగాహన, ఆచరణ క్షుణ్ణంగా బహిర్గతం చేయదగినది, తిరస్కరించదగినది.

సామ్రాజ్యవాద దోపిడీకి సుదీర్ఘచరిత్ర ఉంది

భారత జన బాహుళ్యం, ప్రత్యేకించి రైతాంగ ప్రజలు వలసవాదం, సామ్రాజ్యవాదంతో అత్యంత బాధాకరమైన, వినాశకరమైన అనుభవాలు పొందారు. 15 దశాబ్దాలకు పైగా బ్రిటీష్ సామ్రాజ్యవాదులు భారతదేశాన్ని ప్రత్యక్షంగా పరిపాలించారు. భారత ప్రజలను అమానుషమైన దోపిడీ పీడనలకు గురిచేశారు. 1947 తర్వాతి కాలంలో భారత ప్రజలు స్వతంత్రమైన, సర్వతోముఖమైన అభివృద్ధి మార్గంలో అడుగిడలేదు. దానికి మారుగా మరింత తీవ్రరూపంలో వివిధ సామ్రాజ్యవాదులు సాగిస్తున్న దోపిడీ మధ్య చిక్కుకొని వున్నారు. ఈ దోపిడీలో అమెరికా సామ్రాజ్యవాదులు ముందున్నారు. కనుక నిజమైన ప్రగతి కోసం, జీవనంలో మెరుగుదల కోసం భారత ప్రజలు సాగిస్తున్న పోరాటం ఫ్యూడల్, సామ్రాజ్యవాద సంకెళ్ళను బ్రద్దలు కొట్టడానికి సాగించే పోరాటం నుండి విడదీయరాని పోరాటంగా తయారైంది.

స్వయంపోషకంగా వున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బ్రిటీష్ సామ్రాజ్యవాదులు తమ వలసపాలనకు అనువైన విధంగా ఛిద్రం చేశారు. దీని వలన ఆహారంలో స్వయంపోషక స్థితి దెబ్బ తిన్నది. దీని స్థానంలో బ్రిటీష్‌వాడు తన పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకును సరఫరా చేసేదిగా భారతదేశాన్ని దిగజార్చాడు. దేశంలో వ్యవసాయ అభివృద్ధి కోసం వాడు తీసుకొన్న చర్యలన్నీ నౌకా రవాణా సౌకర్యాలకు అందుబాటులో వున్న కొద్ది ప్రాంతాలకే పరిమిత మయ్యాయి. తన యుద్ధ, వాణిజ్య అవసరాలకు తగిన విధంగా పంటలలో మార్పు తీసుకు వచ్చాడు. చౌకగా కూలీలను సరఫరా చేయడానికి ఒక వనరుగా అట్టిపెట్టుకొనాలనే ఉద్దేశంతో విశాలమైన గ్రామీణ ప్రాంతాలను శాశ్వత కరువు కాటకాల ప్రాంతాలుగా మార్చివేశాడు. భూమిని ఒక సరుకుగా, వ్యక్తిగత ఆస్తిగా మార్చివేశాడు. తన రాజ్యానికి ఆర్థిక వనరులను సమకూర్చిపెట్టే రెవిన్యూ విధానాన్ని అమలులోకి తెచ్చాడు. ఫ్యూడల్, భూస్వామ్య వర్గాన్ని తన ప్రధాన సాంఘిక పునాదిగా మార్చుకున్నాడు. కారల్ మార్క్స్ చెప్పినట్లు "భారత ప్రజలు పాతదానిని కోల్పోయారు. కానీ కొత్తది వారికి దక్కలేదు."

ఐతే బ్రిటీష్ సామ్రాజ్యవాదులు అమలుచేసిన విధానాలు ప్రశ్నించబడకుండా, ప్రతిఘటించకుండా సజావుగా సాగిపోలేదు. భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో భారత రైతాంగం లక్షల సంఖ్యలో సమరశీల పోరాటాల్లోకి కదిలారు. బ్రిటీష్ పాలకులకు, ఫ్యూడల్ వర్గ శక్తులకు వ్యతిరేకంగా అనేక మిలిటెంటు, విప్లవోద్యమాలు సాగించారు. వేలాదిమంది రైతాంగం రక్తతర్పణ గావించారు. ఆ విధంగా రైతాంగ ప్రజలు భారత జాతీయోద్యమంలో అత్యంత కీలకమైన పాత్ర నిర్వహించారు.

1947 అధికార మార్పిడితో ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా, ప్రజాతంత్ర సంస్కరణల కోసం తాము సాగిస్తున్న పోరాటం మరింత అనుకూలమైన రాజకీయ పరిస్థితుల్లో పురోగమించగలదని భారత రైతాంగం ఆశించింది. 1947 లోనూ, దానివెన్వెంటనే భారతదేశంలోని అనేక సంస్థానాలలో ఫ్యూడల్ వ్యతిరేక రైతాంగ పోరాటాల గొప్ప వెల్లువను చూశాము. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం (1946-51) ఈ పోరాటాలన్నింటికి తలమానికంగా నిలిచింది. 'ప్రజాస్వామ్యం', 'ప్రగతి' గూర్చి వల్లించిన భారత నూతన పాలకులు ఒకవైపున ఈ పోరాటాలను క్రూరంగా అణచివేయడానికి పూనుకున్నారు. మరోవైపున ప్రజలను బుజ్జగించడానికి దున్నేవానికి భూమి, జమిందారీ విధానం రద్దు, కౌలుదార్లకు రక్షణ చట్టాలు మొదలగు అనేక వాగ్దానాలు చేసారు. కానీ ఈ చట్టాలు,వాగ్దానాలు అన్నీ కాగితం మీదే వుండి పోయాయి.

సామ్రాజ్యవాదుల సేవలో భారత పాలకులు

భారత పాలకులు అందించిన సేవతో, కుమ్మక్కుతోనే గత ఐదు దశాబ్దాలకు పైగా భారతదేశంలో సామ్రాజ్యవాదుల దోపిడీ, చొరబాటు తీవ్రమయ్యాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం బలహీనపడిన బ్రిటీష్ సామ్రాజ్యవాదం వదిలిన చెప్పులలో అమెరికన్ సామ్రాజ్యవాదులు కాళ్ళు దూర్చారు. భారత నూతన పాలకులు సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణంగా తమ విధానాలను రూపొందించారు; సమన్వయం చేశారు.

ఇక్కడ సునీత్ కుమార్ ఘోష్ మాటలు గమనార్హమైనవి : "గ్రామాలను, గ్రామీణ జీవితాన్ని పునర్నిర్మించటానికి భారతదేశపు తొలి ప్రణాళిక చేపట్టిన కమ్యూనిటి అభివృద్ధి కార్యక్రమాలు అమెరికా ప్రోత్సాహంతో, అమెరికా సహాయంతో చేపట్టబడ్డాయి. అమెరికా వాస్తుశిల్పి, నగర ప్రణాళికావేత్త ఆల్బర్ట్ మేయర్, 1948లో అధికార మద్దతుతో ఉత్తర ప్రదేశ్



ఎట్టేవా జిల్లాలోని 64 గ్రామాల పరిధిలోని ఒక పైలెట్ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. దీనిని వ్యవసాయరంగంలో మౌళిక, సామాజిక సంస్కరణలను డిమాండ్ చేస్తున్న కమ్యూనిస్టు రైతాంగ ఉద్యమాలను, వామపక్ష శక్తుల నుండి వచ్చే విప్లవ ప్రమాదాలను ఎదుర్కోగల నమూనాగా నెహ్రూ అభినందించారు."

గ్రామీణ భారతదేశంలోని పరిస్థితులు ఎంతో విస్ఫోటకంగా ఉన్నాయని భారతదేశంలో ఇటు నెహ్రూ, అటు అమెరికా సామ్రాజ్యవాదులు భావించారు. భారత ప్రజలు చైనా మార్గం పట్టే ప్రమాదం ఉందని, దీన్ని నివారించడానికి ఏదో ఒకటి చెయ్యాలని భావించారు. అమెరికా అగ్రగామి నిపుణులైన ఉల్ఫ్‌లా పెంజిన్స్, ప్రొ॥కెన్నెత్ పార్సన్స్‌లను భారతదేశానికి తీసుకు వచ్చారు. వారు అనేక రాష్ట్రాలలో భూవివాదాలకు సంబంధించిన సమస్యలపై విస్తారంగా అధ్యయనాలు జరిపారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించారు. విప్లవానికి పూర్వపు చైనాలో కూడా ఇలాంటి సమస్యలు వుండేవని తమ నివేదికలో పేర్కొన్నారు. భారతదేశంలో భూమి పంపకంలో అసమానతలు ఆసియాలో ఎక్కడా లేనంత తీవ్రంగా ఉన్నాయని కూడా పేర్కొన్నారు. 1952 మే లో భారత్ - అమెరికాలు మొత్తం కమ్యూనిటీ అభివృద్ధి ఆర్గనైజేషన్‌కు సంబంధించి ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీనికి సంబంధించిన మరో అగ్రిమెంటుపై అదే సంవత్సరం నవంబర్‌లో రెండు ప్రభుత్వాలు సంతకాలు చేశాయి. ఈ కార్యక్రమానికి ఫోర్డ్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్లు మద్దతు ఆశీస్సులు ప్రకటించాయి. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులలో పనిచేసే భారతీయ సిబ్బందికి శిక్షణ ఇవ్వటానికి భారతప్రభుత్వం ఫోర్డ్ ఫౌండేషన్‌ను ఆహ్వానించింది. ఫోర్డ్ ఫౌండేషన్ సహాయంతో 35వేల మంది గ్రామసేవకులు శిక్షణ పొందారు. భారతదేశంలో వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, వ్యవసాయ పరిశోధనా సంస్థలు స్థాపించటానికి యు.ఎస్ లాండ్ గ్రౌండ్ యూనివర్శిటీలను, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్‌లను భారత పాలకులు ఆహ్వానించారు. ప్లానింగ్ కమిషన్ ద్వారా విధాన నిర్ణయ ఆలోచనలు, గణాంక వివరాలు అందజేయటానికి; ప్రభుత్వ విధానం మీద నిఘా వుంచటానికి దేశవ్యాప్తంగా అప్లైడ్ ఎకనామిక్ రీసర్చ్ కేంద్రాలను స్థాపించ వలసిందిగా ప్లానింగ్ కమీషన్ కార్యదర్శిని ఫోర్డ్‌ఫౌండేషన్ కోరింది.

ఆ విధంగా అమెరికన్ సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో ఎంతో జాగ్రత్తగా రూపొందించబడి, అమలుచేయబడిన, ప్రగతి వాహకాలుగా ఊరేగించబడిన "కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు" నిజానికి, గ్రామీణ ప్రజల మధ్య భ్రమలు పెంచడానికి, భారతదేశంపైన సామ్రాజ్యవాదుల పట్టును బలోపేతం చేయడానికి సాధనాలు మాత్రమే.

భారత వ్యవసాయరంగాన్ని తమ రథచక్రాలకు కట్టివేయడానికి అమెరికా సామ్రాజ్యవాదులు ఎంత పట్టుదలగా ప్రయత్నించారో తెలుసు కొనటానికి ఈ క్రింద పేర్కొన్నవి తోడ్పడతాయి.

'సహాయ' మనేది నిస్వార్థమైన అంతర్జాతీయ ఔదార్యానికొక రూపం అనే నమ్మకం ఒకటి వుంది. ఈ భావాన్ని ప్రచారం చేసేవారు 'సహాయం' అన్నది పలుకుబడికి, ఆధిపత్యానికి ఆయుధంగా వినియోగించబడుతుందన్న స్పష్టమైన వాస్తవాన్ని కప్పిపుచ్చి మోసగించటానికి ప్రయత్నిస్తున్నారే తప్ప మరేమి కాదు. 'సహాయం' నిర్వహించే పాత్ర గురించి ప్రెసిడెంటు కెన్నడి 1961లోనే దాపరికం లేకుండా ఇలా చెప్పాడు. "ప్రపంచవ్యాప్తంగా తన పలుకుబడిని, ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి అమెరికా అనుసరించే ఒక పద్ధతే విదేశీ సహాయం. ఈ 'సహాయం' అనేకానేక దేశాలను పతనం కాకుండా, కమ్యూనిస్టు శిబిరంలోకి వెళ్ళి పోకుండా నిలబెడుతుంది." 'సహాయం' స్వీకరించే దేశాల్లో పెరుగుతున్న విప్లవ శక్తుల బారినుండి ఆయాదేశాల పాలక వర్గాలను రక్షించటమే దానర్థం. ఏఏ దేశాల వర్తమాన ప్రభుత్వాలను రక్షించుకోవటానికి మనం (అమెరికా) విలువనిస్తామో; ఆయా దేశాల రాజకీయ, ఆర్థిక పరిస్థితులు క్షీణించి పోకుండా అడ్డుకోవటానికి అనుసరించే విదేశాంగ విధాన సాధనాలలో ఆర్థిక సహాయం ఒకటని అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థలో పనిచేసిన సీనియర్ ఆర్థికవేత్త అంగీకరించిన విషయాలివి. 'ఎయిడ్ యాజ్ ఇంపీరియలిజం' అనే ఆసక్తికరమైన తనరచనలో థెరిస్సా హెయిటం "సహాయం అనేది సంక్లిష్టమైన మోసానికి చిహ్నం" అని వర్ణించింది. అర్ధవలస దేశాలపై తమ దోపిడీని కొనసాగించేందుకు వీలుగా సామ్రాజ్యవాదులిచ్చే రాయితీగానే సహాయాన్ని పరిగణించవలసి వుంటుంది.

"భారతదేశానికి సహాయం చేసే దిశగా అమెరికా 1951లో మొదటి చర్య తీసుకుంది. అత్యవసరంగా ఆహారకొరతను నివారించేందుకు 2 మిలియన్ టన్నుల గోధుమలను కొనుగోలు చేయటానికి 142.28 కోట్లు ఋణమిచ్చింది. ఈ సహాయానికి అమెరికా గోధుమలకు బదులు మెనోజైట్ ఖనిజాన్ని ఎగుమతి చెయ్యాలని షరతు విధించింది. థోరియం అనే ఈ మూలకం అమెరికా అణు విద్యుత్ కేంద్రానికి కీలకమైనది." ("తాకట్టులో భారతదేశం" - కా॥ తరిమెల నాగిరెడ్డి)

ఈ విధంగా భారత వ్యవసాయరంగంలో అమెరికన్ సామ్రాజ్యవాదుల చొరబాటుకు, కంట్రోలుకు సుదీర్ఘమైన, కొనసాగుతున్న చరిత్ర ఉందని స్పష్టమవుతుంది.

P.L. 480 పథకం

అమెరికా తనకు మిగులుగా వున్న వ్యవసాయపు సరుకులను, ముఖ్యంగా గోధుమలను

వెనుకబడిన దేశాలకు సరఫరా చేసేందుకు అమెరికన్ కాంగ్రెస్ 1954లో పబ్లిక్ లా-480 ద్వారా ఒక పద్ధతిని రూపొందించింది. ఆ విధంగా అమెరికా తన మిగులు గోధుమలను వదిలించుకోవటానికి భారతదేశాన్ని పెద్ద మార్కెట్టుగా చేసుకున్నది. 1965 వరకు అమెరికా ఇచ్చిన సహాయంతో పి.ఎల్-480 భాగం 55.9% వుంది. భారత కరెన్సీపై పెత్తనం సాగించటానికి ఈ సహాయం అమెరికా చేతిలో ఒక మంచి సాధనంగా ఉపయోగపడింది. ఈ పథకం క్రింద పోగు పడిన రూపాయల నుంచి ఏర్పాటైన నిధుల నుండి ప్రైవేటురంగానికి నేరుగా రుణాలివ్వటం ద్వారా భారతదేశంలో అమెరికా పరిశ్రమలు నెలకొల్పటం విజయవంతంగా సాగింది.

1965 ఫిబ్రవరి 'స్పాన్' పత్రికలో ఈ క్రింది విధంగా వ్రాయబడింది : భారత ఆర్థికాభివృద్ధికి అమెరికా సూచించే డైరెక్షన్ ప్రకారం వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, వ్యవసాయ పరిశోధనా కేంద్రాలు, ప్రాంతీయ కోళ్ల ఫారాలు, పశుగణాభివృద్ధి క్షేత్రాలు, పాల ఉత్పత్తి కేంద్రాలు, పశుపోషణ, భూసార పరీక్ష ప్రయోగశాలలు; ఎరువుల వినియోగానికి రైతులని ప్రోత్సహించటానికి; లోతట్టు ప్రాంతాల లోనూ, సముద్రంలోనూ, చేపలు పట్టటానికి; ట్రాక్టర్లు తదితర వ్యవసాయ యంత్రాలు వాడటానికి శిక్షణలు; వ్యవసాయ అర్థశాస్త్రంలో పరిశోధనలు, పాడిపరిశ్రమ మొదలగు వాటికి ఖర్చుపెట్టటం జరిగింది. 1968 నాటికి అమెరికా భారత వ్యవసాయాభివృద్ధి కోసం ఖర్చుపెట్టిన మొత్తం 450 కోట్ల రూపాయలు దాటింది. పి.ఎల్-480 పథకం అమలుక్రింద లభ్యమైన మొత్తం 583 కోట్ల రూపాయలు. అంటే 1968 నాటికి అభివృద్ధి పేరిట భారత వ్యవసాయరంగానికి అమెరికా ఇచ్చినది వెయ్యి కోట రూపాయలు దాటింది.

ఈ విధంగా అమెరికా అమలుచేసిన పి.ఎల్-480 పథకంతో తన దేశంలో నిల్వలు గా పడివున్న గోధుమలను మనదేశానికి అమ్ముకున్నది. ఈ అమ్మకం ద్వారా వచ్చిన భారత కరెన్సీని ప్రైవేటురంగానికి ఋణాలిచ్చి తన పట్టును సాధించుకోవటానికి కావలసిన చర్యలు తీసుకుంది. ఈ విధంగా అమెరికా సామ్రాజ్యవాదం రెండు ప్రయోజనాలను నెర వేర్చుకోగల్గింది. మనదేశం రెండు విధాలుగా నష్టపోవల్సి వచ్చింది.

సస్యవిప్లవం :

భారతదేశపు రైతు చరిత్రలో సస్యవిప్లవం అనబడే దాన్ని ఒకముఖ్యమైన విషయంగా పేర్కొనవలసిందే. ఎందుకనంటే, అమెరికన్ సామ్రాజ్యవాదులు వ్యవసాయరంగంపై తమ పట్టును బలోపేతం చేసుకోవడానికి కొనసాగించిన చర్యలలో ఒకభాగంగా వ్యవసాయ రంగంలో అనేక మార్పులను ప్రవేశపెట్టారు. దేశవాళీ విత్తనాలను నాశనం చేస్తూ, హెచ్చు దిగుబడినిచ్చే హైబ్రిడ్ విత్తనాలను వాడకంలోకి తెచ్చారు. ఈ విత్తనాలను ఉపయోగించటంతో ఎరువులు, పురుగుమందులు కూడా వాడుకలోకి వచ్చాయి. అమెరికా, యూరప్ దేశాలనుండి దిగుమతి చేసుకున్న వ్యవసాయ పరికరాలైన ట్రాక్టర్లు మొదలగునవి ప్రభుత్వ సబ్సిడీ రేట్లకు వాడకంలోకి వచ్చాయి. వ్యవసాయాభివృద్ధి పేరుతో తక్కావి ఋణాలు, సహకార సంఘాల ద్వారా, భూతనఖా బ్యాంకుల ద్వారా అప్పులు ఇవ్వటం జరిగింది. వ్యవసాయాన్ని ఆధునీకరించటం అనే పేరిట ప్రభుత్వం బడ్జెట్టు నుండి ఇచ్చిన ఋణాలలో అత్యధిక భాగాన్ని భూస్వామ్య వర్గం చేజిక్కించుకున్నారు. అధికోత్పత్తితో పాటు కౌలు రేట్లు కూడా పెరిగాయి. దీనితో వ్యవసాయ పెట్టుబడుల కోసం డబ్బులను సమకూర్చుకోవటానికి కౌలుదార్లు విపరీత వడ్డీలకు అప్పు తెచ్చుకోవల్సి వచ్చింది. 'సస్యవిప్లవం' భూస్వాములకు, పేద రైతాంగానికి మధ్య వ్యత్యాసాన్ని మరింత పెంచింది.

అమెరికన్ రాడికల్ మాసపత్రిక అయిన 'రాంపార్ట్' 1970 మే సంచికలో శ్రీవీజ్‌మాన్ ఒక వ్యాసం వ్రాస్తూ "అమెరికన్ వాణిజ్య ప్రయోజనాలను ఇతోధికం చేసేందుకు" ఈ సస్యవిప్లవం ఏ విధంగా భారతదేశంపై రుద్ద బడిందో వివరించాడు.

ఈ సస్యవిప్లవం ఎంతవరకు పచ్చగా ఉండ గలదు అని ప్రశ్నిస్తూ ఆయన ఈ క్రింది విధంగా సమాధానం చెప్పాడు :

"నిజమైన వినాశనం ఏమంటే, తక్షణంగా జరిగే వ్యాపారపరమైన వ్యవసాయం అంటేనే ఉత్పత్తి లాభం కోసమే గాని ప్రజలకోసం కాదని నిర్వచనం. కొత్తవిత్తనాలకు నీటి పారుదల సౌకర్యం, క్రిమిసంహారక మందులు, భారీ ఎరువులు కావాలి. తగినంత పెట్టుబడి లేని వాళ్ళు; గ్రామీణ వడ్డీ వ్యాపారస్థుల నుండి గాని, ప్రభుత్వ పథకాల నుండి గాని అప్పు పొందలేని వాళ్ళు; భూముల నుండి వ్యవసాయ కూలీలు గానూ, అంతకన్నా హీనమైన స్థితిలోకి నెట్టివేయ బడతారు. అదే సమయంలో కొత్త కులక్‌లు, పెట్టుబడిదారీ వ్యవసాయదారులు తమ లాభాల ను ఆధునికమైన శ్రమ వినియోగాన్ని తగ్గించగల యంత్రాలపై తిరిగి పెట్టుబడి పెడతారు."

కా॥ టి.ఎన్.తన గ్రంథంలో పేర్కొన్న విధంగా : "సస్యవిప్లవం రాకతో అధికోత్పత్తి సాగించటం పేరిట పెద్ద ఎత్తున ప్రభుత్వ ధన సహాయం భూస్వాముల భోషాణాల్లోకి చేరడంతో వారి చేతుల్లో భూమి కేంద్రీకరణ మరింత పెరుగుతుంది. ఒకవైపున భూములను భూమి లేని రైతులకు పంపిణీ చెయ్యడం గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నప్పటికీ; వాస్తవానికి దేశంలో రాజకీయ రీత్యా, ఆర్థిక రీత్యా శక్తివంతమైన పెత్తనం సాగిస్తున్న గ్రూపులు చట్టవిరుద్ధంగా, అక్రమపద్ధతుల ద్వారా మరిన్ని భూములను హస్తగతం చేసుకుంటున్నాయి."

"మనదేశంలో ఈ పరిస్థితినే ఈనాడు మనం చూస్తున్నాం. ఈనాడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అనుభవిస్తున్న నరకయాతన చిన్న రైతులను, కౌలుదార్లను బలవంతంగా భూములనుండి వెళ్ళగొట్టడం; కొద్దిమంది భూస్వాముల చేతుల్లో భూమి కేంద్రీకరణ పెరగటం; వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరగటం; క్రింది కులాల వారిపై పెరుగుతున్న అగ్రకులాల వారి ఆధిపత్యం-ఇవన్నీ పెరుగుతున్న ఈ రోగ లక్షణాలే."

ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసిన సస్య విప్లవం పేదరైతుల పాలిట, దళితుల పాలిట, అట్టడుగు పేదప్రజల పాలిట యమపాశంగా మారింది. ప్రజల కోసం వ్యవసాయం అన్నది కాకుండా మార్కెట్టు కోసం వ్యవసాయంగా మార్చడంతో వ్యవసాయం ఒక సంక్షోభపు సుడిగుండంలోకి నెట్టబడింది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దాడి

డంకెల్ ముసాయిదా వచ్చిన సమయం, సోవియట్ యూనియన్, తూర్పు యూరపు దేశాలలో ప్రభుత్వాలు కూలిపోయిన సమయం కూడా.

ఈ పరిణామాలను చూపెట్టి సోషలిజం ఓటమి చెందిందని అమెరికా సామ్రాజ్యవాదులు వెంటనే దూషణాపూర్వక ప్రచారాన్ని లంకించుకున్నారు. మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచానికి నాయకుడిగా ముందుకు రావడానికి పూనుకున్నారు. మార్కెట్టు ఆర్థిక వ్యవస్థ

ఒక్కటే ప్రపంచానికి శరణ్యమని ప్రచారం చేశారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, వ్యవస్థాగత సర్దుబాటు మరియు ప్రపంచీకరణ విధానాలను చేపట్టాలని మూడవ ప్రపంచ దేశాలపై ఒత్తిడి తీసుకొని వచ్చారు.

డంకెల్ ప్రతిపాదనలు ముసాయిదా రూపంలో వుండగానే మనపాలకులు దాని అమలుకు పూనుకున్నారు. అప్పటికే సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తడం లోనూ, మనదేశంలో సామ్రాజ్యవాద పెట్టుబడి చొరబడడానికి, కంట్రోలు చెయ్యడానికి దారివెయ్యడం లోనూ అవమానకర రికార్డు నెలకొల్పిన భారత దళారీ పాలకులకు డంకెల్ ప్రతిపాదనలను వెంటనే ఆహ్వానించడం కష్టతరమూ కాలేదు; అవమానకరంగానూ కనిపించలేదు.

1991లోనే ఎరువులకు సబ్సిడీలు ఇవ్వడాన్ని ఎత్తివేయటానికి పూనుకున్నారు. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళనలు వచ్చాయి. మన రాష్ట్రంలో చిలకలూరిపేటలో ఆందోళనకారులపై కాల్పులు జరిగే దాకా వెళ్ళింది. డంకెల్ ముసాయిదాపై సంతకాలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ, ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరరాదని డిమాండ్‌చేస్తూ, దేశవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున నిరసన వెల్లువలోకి కదిలారు. ఆంధ్రప్రదేశ్‌లో వామపక్ష, ప్రజాతంత్ర మేధావులు, విప్లవ ప్రజాసంఘాలు డంకెల్ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఐక్యంగా బలమైన గొంతుతో ప్రచారం, ఆందోళనలు నిర్వహించాయి. ఈ శక్తివంతమైన ప్రజాందోళనకు తలొగ్గి డంకెల్ ముసాయిదాపై సంతకం చేయరాదని, ప్రపంచ వాణిజ్య సంస్థలో భారతదేశం చేరరాదని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించింది. డంకెల్ ప్రతిపాదనలంటే ఏమిటో, వాటిని అమలుచేస్తే భారతరైతాంగం ఏవిధమైన దుస్థితిలో పడనున్నదో వివరిస్తూ ఎంతో సాహిత్యం వెలువడింది. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం "డంకెల్ గురి వ్యవసాయానికి ఉరి" అంటూ ఒక పుస్తకాన్ని ప్రచురించింది.

గాట్ చర్చల నుండి "ప్రపంచవాణిజ్యసంస్థ" (WTO) ఆవిర్భవించింది. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ నినాదాలతో WTO ముందుకు వచ్చింది. మూడవ ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థను పునర్ నిర్దేశించే చర్యలతో ఇది ముందుకు సాగింది.

సరళీకరణ పేరుతో రైతాంగానికి ఎరువులకు, విద్యుత్తుకు ఇస్తున్న సబ్సిడీని ఎత్తివేయటం; ప్రైవేటీకరణ పేరుతో వ్యవసాయం, నీరు, విద్యుత్ తదితర మౌళిక రంగాలను ప్రైవేటుపరం చేయటం; గిట్టుబాటు ధరల రూపంలో రైతాంగానికి రక్షణ కల్పించే విధానాలను ఎత్తివేయటం; ప్రపంచీకరణ పేరిట 1429 వస్తువులను పరిమాణాత్మక ఆంక్షల చట్టం నుంచి తొలగించటం; విదేశీ వాణిజ్యం నిధులలో 8శాతం ఆహారధాన్యాల దిగుమతుల కోసం వెచ్చించాలనే షరతులను ఆమోదించటం; వ్యవసాయ విద్యుత్, నీటి ప్రాజెక్టులలో బహుళ జాతి కంపెనీల ప్రవేశాన్ని ఆహ్వానించటం ప్రపంచీకరణలోని కొన్ని అంశాలుగా వున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి, 1995లో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం ఆంధ్రదేశాన్ని ప్రపంచబ్యాంకుకు ధారాదత్తం చేసింది. అప్పటినుండి ప్రపంచ బ్యాంకు ఆదేశాలనే ప్రభుత్వ విధానాలుగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తూ వస్తున్నది. మెకన్సీ కంపెనీ ప్రపంచ బ్యాంకు నివేదికలను కలిపి దాన్నే "విజన్ 2020"గా వూరేగిస్తున్నది. ప్రపంచ బ్యాంకు చేతిలో పరికరంగా చంద్రబాబు నాయుడు ఈ క్రింది విధానాలను అమలుచేస్తూ వస్తున్నాడు.

1. భూమి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూసంస్కరణ చట్టాలను ఎత్తివేస్తున్నాయి. కార్పోరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయి. పేద, మధ్యతరగతి రైతులను భూమి నుండి దూరంచేసే విధంగా వివిధ చర్యలు తీసుకొంటున్నారు. 1995-96 లెక్కల ప్రకారం రాష్ట్రంలో 5 ఎకరాలలోపు వున్న చిన్న, సన్నకారు రైతాంగం మొత్తం కమతాలలో 81%గా వున్నారు. వీరి క్రింద మొత్తం సాగు భూమిలో 42.5% అనగా 61.33 లక్షల హెక్టార్లు వుంది. ఈ రైతులు నిరంతరం వ్యవసాయపు పనుల నుండి నెట్టివేయబడుతున్నారు. కుటుంబం యావత్తు శ్రమచేస్తూ శ్రమ ఆధార వ్యవసాయంగా, రాష్ట్రానికి ఆహారభద్రతను అందించే వ్యవసాయదారులుగానూ వున్న వారిని భూమి నుండి గెంటివేసి; యంత్రాలతో, భారీ పెట్టుబడుల తోటి సాగే వాణిజ్య పంటలకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఫలితంగా పేద, మధ్య తరగతి రైతాంగం అసంఖ్యాక కూలీల సంఖ్యలో చేరటంతో పాటు భవిష్యత్తులో సమాజానికి ఎంతో అవసరమైన ఆహార భద్రత లోపిస్తున్నది. వ్యవసాయపు పనులకు యంత్రాలను ఉపయోగించటంతో దళిత, రైతు-కూలీలు ముఖ్యంగా మహిళలు పనిదినాలను కోల్పోతున్నారు.

2. నీరు

దేశంలో మేజర్ ప్రాజెక్టులను నిర్మించ కూడదని ప్రపంచబ్యాంకు ఆదేశించింది. ఆంధ్ర రాష్ట్రానికి సంబంధించి ప్రపంచబ్యాంకు నివేదిక కూడా భారీ ప్రాజెక్టులు ఏవీ తలపెట్టరాదని, నిర్మాణంలో వున్న ప్రాజెక్టులను కూడా ఆర్థిక లాభసాటితనాన్ని బట్టి వాటి భవిష్యత్‌ను నిర్ణయించాలని ఆదేశించింది. సేద్యపు రంగంలో సబ్సిడీలను రద్దుచేసి నీటితీరువా చార్జీలను నిర్వహణ ఖర్చులకు అనుకూలంగా పెంచాలని, నిర్వహణ బాధ్యతలను నీటి సంఘాలకు అప్పచెప్పాలని ఆదేశించింది. నీటిపారుదల శాఖలలో వున్న ఉద్యోగులను తొలగించాలని ఆదేశించింది. వీటి అమలులో భాగంగానే APSIDC (Andhra Pradesh Small Irrigation Developement Corporation) ని రద్దుచేసింది.

విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించాలని ప్రపంచబ్యాంకు ఆదేశించింది. ప్రైవేటీకరణ ద్వారా వ్యవసాయ ఉత్పత్తి రంగంపై కంట్రోల్ సాధించాలన్న ఉద్దేశ్యంతో తీసుకున్న చర్య ఇది. APSEB సాగించిన కృషి ఫలితంగా బావులు, బోరుబావుల క్రింద వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా వుంది. విద్యుత్‌ను ప్రైవేటీకరించటం ద్వారా ఈ వ్యవసాయాన్నంతటినీ బలి చెయ్యాలనుకున్నది.

3. మార్కెటింగు సమస్య :

వ్యవసాయదారుడు పండిస్తున్న పంటకు కనీస మద్ధతు ధర ఇచ్చే పద్ధతి వుంది. ప్రపంచ బ్యాంకు ఈ మద్ధతు ధరను ఎత్తివేయమని వత్తిడి తెస్తున్నది. వ్యవసాయానికి వున్న కనీస రక్షణలను వుపసంహరించడంలో ఒక భాగమే ఇది. FCI ని ధాన్యసేకరణ బాధ్యత నుండి తప్పించటానికి చూస్తున్నది. రైస్‌మిల్లర్స్, ప్రభుత్వం కుమ్మక్కైన ఫలితంగా రైతాంగం రూ. 800 కోట్లు నష్టపోయారు. FCI ని నామమాత్రం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో వుండే మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్, సివిల్ సప్లయ్స్ కార్పోరేషన్స్ నామమాత్రం చేయ బడుతున్నాయి.

4. విత్తనాలు :

భారతదేశంలో రైతులు తరాల నుండి కాపాడుకుంటూ వస్తున్న విత్తనోత్పత్తి విధానం

ఎత్తివేయబడింది. అధికదిగుబడి పేరుతో నూతన వంగడాలను ప్రవేశపెట్టారు. ప్రభుత్వాలు విత్తన పరిశోధనకు నీళ్ళు వదిలాయి. ఫలితంగా జన్యు సంపద బహుళ జాతి కంపెనీల చేతుల్లోకి పోయింది. ఈ రోజు రైతు వ్యవసాయ పెట్టుబడిలో 10% విత్తనాల కోసమే ఖర్చుపెట్టవలసి వస్తున్నది. దేశంలో అమలవుతున్న జీవ వ్యవసాయ, పారిశ్రామిక విధానం దేశంలోని ప్రకృతిని, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నది. పేద, మధ్య తరగతి రైతాంగాన్ని దివాళా తీయిస్తున్నది. మోన్‌శాంటో కంపెనీ, బి.టి విత్తనాలు, 'టెర్మినేటర్' విత్తనాలు మార్కెట్‌లోకి రావటంతో గత 3 సంవత్సరాలలోనే వందలాది మంది పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు.

5. రుణం

ప్రపంచబ్యాంకు ఆదేశాల మూలంగా రైతాంగానికి రుణం లభించే అవకాశాలు తగ్గిపోతున్నాయి. బ్యాంకులు గతంలో వ్యాపారానికి 18% రుణాలు ఇస్తే, ఇపుడు 10% మాత్రమే ఇస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నది. సహకార వ్యవస్థను దెబ్బతీయటమే దాని లక్ష్యం. దీని ఫలితంగా పేద, మధ్య తరగతి రైతాంగం లోతైన అప్పుల ఊబిలో ఉన్నారు. సహకార చక్కెర ఫ్యాక్టరీలు, నూనె మిల్లులు అమ్మివేయబడుతున్నాయి.

6. అడవి :

ప్రపంచబ్యాంకు మన అడవి సంపదపై దృష్టి సారించింది. అడవిలో వున్న సమస్త సంపదలు తమకే చెందాలంటూ వాటిని చేజిక్కించుకోజూస్తున్నది. ఈ సంపదలను కొల్లగొట్టడానికి, తమ బహుళజాతి కంపెనీలకు (మందులకు) కావలసిన చెట్లను పెంచటానికి, అడవిని ఆధారం చేసుకొని బ్రతుకుతున్న గిరిజనులను అడవినుండి గెంటివేయడానికి చట్టాలు చేయటానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. ఆదివాసీల సంఘటితశక్తితో వీటి అమలును నివారించగలుగుతున్నాము.

ప్రపంచబ్యాంకు నిర్దేశిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా 1998 నుండి మనరాష్ట్రంలో 726మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆంధ్రరాష్ట్ర రుణభారం రూ॥ 49, 912 కోట్లకు చేరింది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలైన చక్కెర, జౌళి పరిశ్రమలు మూతపడుతున్నాయి. గ్రామీణప్రాంతాలలో విస్తారంగా వాడకంలో వున్న వంటనూనెను అందించే వేరుశెనగ, నువ్వుల పంటలు నాశనం చేయబడ్డాయి. ఒక దశలో పామాయిల్ తోటలనే ప్రభుత్వం ప్రోత్సహించింది. కాని ప్రస్తుతం పామాయిల్ నూనెను దిగుమతి చేసుకుంటూ పామాయిల్ పండించే రైతులను దివాళా తీయించింది. ఒక దశలో వంటనూనెల విషయంలో స్వయంసమృద్ధిగా ఉండిన రైతాంగాన్ని పాలకులు తమ ప్రజావ్యతిరేక విధానాలతో మరలా పరాధీనంలోకి నెట్టి వేస్తున్నారు. వాణిజ్య పంటలైన పొగాకు, పత్తి, మిరప పండిస్తున్న రైతులు దివాళా తీసే విధానాన్ని పాలకులు అనుసరిస్తున్నారు. పొగాకు పండిస్తున్నరైతులకు గిట్టుబాటు ధరలు లభించాలంటే క్రాప్ హాలిడే ప్రకటించడమే మార్గమంటూ పేద, మధ్య తరగతి రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీసి ITCకి లాభాలు చేకూర్చిపెట్టింది. విదేశాల నుండి పత్తిని దిగుమతి చేసుకోవటం, పత్తిపంటను పండించటానికి కావలసిన పురుగు మందులలో వున్న దోపిడీ ఫలితంగా పత్తి రైతాంగం కోలుకోలేని స్థితిలోకి నెట్టివేయబడింది. విదేశాల నుండి పాలపొడిని దిగుమతి చేసుకోవటంతో పాల పరిశ్రమ తీవ్రమైన సంక్షోభంలో పడింది. గ్రామీణ పేదలలో అత్యధికులకు తమ దైనందిన అవసరాలు తీర్చేదిగా వున్న పాడి పరిశ్రమ కూడా సంక్షోభంలో పడిపోవడంతో రైతులు అయోమయంలో పడిపోయారు. 1980లలో ప్రపంచబ్యాంకు సాయంతో ఎంతో ఉధృతంగా వచ్చిన నీలి విప్లవం సామ్రాజ్యవాద కంపెనీలు దిగుమతి చేసిన వైరస్‌వల్ల రొయ్య రైతాంగం దివాళా తీసింది. తీర ప్రాంతాలలో పంటకు అనుకూలమైన భూములన్నింటిని రొయ్యల చెరువులుగా మార్చటంతో భూగర్భజలాలు కలుషితమై వాతావరణ సమతౌల్యం దెబ్బతింటున్నది. ఈ సాగుతో గ్రామీణ జీవితం ఛిద్రం అయింది. ఈ రొయ్యల సాగుతో పేద కూలీలు ఉపాధి అవకాశాలను కోల్పోయారు. ఒకప్పుడు కోళ్ళపరిశ్రమ మీద ఆధారపడి బ్రతికే మధ్య తరగతి రైతాంగం ఇటీవల కాలంలో వస్తున్న సంక్షోభాలతో తీవ్ర నష్టాలపాలవుతున్నారు. లక్షలాది కోళ్ళను పెంచగలిగే వాళ్ళే కోళ్ళ పరిశ్రమను నడపగల్గుతున్నారు. మిగిలిన కోళ్ళ ఫారమ్ యజమానులంతా దివాళా తీశారు. కోళ్ళ పరిశ్రమ, రొయ్యల పరిశ్రమకు సంబంధించిన హేచరీస్, మందులు, వాక్సినేషన్, ఆహారం(Feeding) బహుళజాతి కంపెనీల చేతుల్లో వున్నాయి. కోట్లాది రూపాయల లాభాలు ఈ బహుళజాతి కంపెనీలు పొందుతుంటే పేద, మధ్యతరగతి వర్గం నష్టాలతో ఈ పరిశ్రమ నుండి బయటకు నెట్టివేయబడుతున్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలన్నింటిని మూసివేయటంతో నిరుద్యోగసమస్య, రైతాంగ సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఈ పరిణామాలతో చిన్న, మధ్యతరగతి రైతులు భూమిని వదులుకుని లేక అమ్ముకుని బ్రతుకు దెరువు కోసం పట్టణాలకు వలసలు పోతున్నారు. ఈ వలసలన్నీ కరువు వలసలే.

ఇక ప్రతిగ్రామంలోనూ, పట్టణంలోనూ తాగునీటి సమస్య తీవ్రంగా వుంది. తాగటానికి గుక్కెడు మంచినీళ్ళు దొరకక వీధుల మధ్య తగాదాలకు, గ్రామాల మధ్య తగాదాలకు, పల్లెలకు పట్టణాలకు మధ్య తగాదాలకు, జిల్లాల మధ్య తగాదాలకు దారి తీస్తున్నది.

అమెరికా సామ్రాజ్యవాదులు మనదేశంలో ఫలానా ఫలానా పంటలు పండించవద్దు అని రైతాంగాన్ని శాసిస్తున్నారు. భూమిని పెద్ద పెద్ద కార్పోరేటు సంస్థలకు అమ్ముకోమని చెప్తున్నారు. తమ కంపెనీలకు కావలసిన పారిశ్రామిక ముడి సరుకులను, పండించటానికి భూమిని, అడవులను ఉపయోగించాలని నిర్దేశిస్తున్నారు. చిన్న, పెద్ద తరహా ప్రాజెక్టులను పూర్తి చేయవద్దని ప్రపంచబ్యాంకు ద్వారా నిర్దేశిస్తున్నారు. భావి తరాలకు కావలసిన భూమి, నీరు, అడవిని నాశనం చేయమని ఈ దళారీ పాలకుల చేత చేయిస్తున్నారు.

కనుక వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా, వాళ్ళకు, ప్రధాన సాంఘిక పునాదిగా వున్న ఫ్యూడల్‌శక్తులకు, దళారీ పాలకులకు వ్యతిరేకంగా; దున్నేవానికే భూమి అన్న కేంద్ర నినాదంతో సంఘటిత పోరాటాలు విస్తృత స్థాయిలో నిర్మించవలసిన అవసరం ఉంది. మన సహజవనరులను కాపాడుకోవటానికి తక్షణమే ఆందోళనకు దిగాల్సిన అవసరం వుంది.

మనకు కావాల్సినంత భూమి వుంది – కాని ప్రజలకు దున్నుకోవటానికి భూమి లేదు!

మన గోడౌన్ల నిండా ఆహారధాన్య నిల్వలు వున్నాయి – కాని కోట్లాది మంది ప్రజలు ఖాళీ కడుపులతో వున్నారు !

గ్రుడ్లు, పాలు మార్కెట్‌లో సమృద్ధిగా వున్నాయి - కాని పోషకాహారం లేక కోట్లాది మంది ప్రజలు అనారోగ్యంతో వున్నారు!
మనదేశంలో నీటి వనరులున్నాయి-కాని మనకు సాగునీరు లేదు, తాగునీరు లేదు !
మన దేశంలో పత్తి పండిస్తున్న రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు - కాని కోట్లాది మంది ప్రజలకు కట్టుకోవటానికి గుడ్డ లేదు!
కోట్లాది మంది ప్రజలకు చేద్దామంటే పనిలేదు - కాని కోట్లాది రూపాయలతో యంత్రాలను దిగుమతి చేసుకుంటున్నాం!
"పెట్టుబడిదారీ విధానం - సామ్రాజ్యవాదం - సృష్టించే సంక్షోభాలే ఇవి" ✦

మళ్లీ రైతుగానే మొలకెత్తుతా

-పుప్పాల మట్టయ్య

కష్టాలకు తప్ప అన్నింటికి వెలేసినదేహం
ప్రపంచం కోసం తప్ప తన కోసం ఏమీ
చేసుకోని దేహం, నేడు ప్రపంచ చిత్రపటంపై
ఆత్మహత్యై వేలాడుతుంది
పుచ్చుపట్టిన గింజలకు సైతం తన సత్తువను
జోడించి మొలకెత్తించిన వాడు
కన్నీటితో కాల్వలు పారించి, కరెంటు కోతను
కాలిపోయిన మోటారును వెక్కిరించిన వాడు
పెరిగిన పంట చేనుపై తెల్లదోమ, పచ్చపురుగు
ఆకురసాన్ని తన రక్తంలా పీల్చి
తను కుటుంబాన్ని పత్తికాయలా డొల్ల చేయబడినవాడు
తెల్లబంగారాన్ని పండించడం కోసం
భార్యమెళ్ళో (తాలిబొట్టు) వున్న బంగారాన్ని
తాకట్టు పెట్టినవాడు
కొడుకు చదువు, కూతురి పెళ్ళి కళ్ళ ముందు
కదలాడినపుడు కాడికింది ఎద్దులా కన్నీరు కార్చినవాడు
తన కన్న కలలన్నీ కల్లలైనపుడు కాలం
కరెంటు కోతగానో- కల్తీవిత్తనాలు గానో, కల్తీమందులుగానో
కలిసి వచ్చినవాడు
నేడు భూమిని చీల్చాల్సిన నాగలి రైతు గుండెను
చీల్చింది
భూమిని నమ్ముకున్నవాడు
నేడు బూడిదే కావచ్చు
కానీ ఇపుడు భూమినే కాదు
ఈ ఎక్స్‌గ్రేషియాల అసమర్థ ప్రభుత్వాన్ని
సేద్యం చేయడంకోసం
రేపటి నాగేటి చాలులో నీరటి ఎల్లయ్య
తెనాలి గంగులు గంగారం బాలయ్య
కట్టాపాపిరెడ్డి... మళ్ళీ మళ్ళీ
రైతులు గానే మొలకెత్తుతారు
ఈ దోపిడీ వ్యవస్థను కూల్చివేస్తారు.

(ప్రత్తిరైతుల ఆత్మహత్యలకు స్పందిస్తూ)

చలో అసెంబ్లీ!

- రాధేయ

మనమిప్పుడు గాయాల గురించి మాట్లాడుకుందాం
మృతుల శవాల గురించి చర్చించుకుందాం
అవి లాఠీల గాయాలు కావచ్చు
బుల్లెట్ గాయాలు కావచ్చు
లాఠీలతో బాదిన చేతుల గురించి మాట్లాడుకుందాం
లాఠీల వెనుక తుపాకుల వెనుక
ప్రపంచబ్యాంక్ చూపుడు వేలును గురించి మాట్లాడుకుందాం
వారి ఆదేశాల్ని తు.చ. తప్పక అమలు జరుపుతున్న
అధికార నిరంకుశవైఖరిని గురించి చర్చించుకుందాం
నిన్నటి వరకూ
ప్రత్తి పొలాల్లో రైతుల ఆకలి చావులు చూశాం
చేనేత కార్మికుల ఆత్మహత్యలు చూశాం
అప్పుల బాధలు భరించలేక ఉరేసుకున్న వాళ్ళను చూశాం
భాగ్యనగరం చౌరస్తాలో " ఛలో అసెంబ్లీ' ప్రదర్శనకారుల
గుండెల్లో బుల్లెట్లు కురిపించిన అత్యంత దయనీయ
విషాద సంఘటన ఇప్పుడిప్పుడే చూస్తున్నాం
తొంబై రోజుల అవిశ్రాంత అహింసా పోరాటంలో
చిట్లిన ఎముకల గురించీ
చిందిన నెత్తురు గురించీ
మనమిప్పుడు చర్చించుకుందాం
మంటలు రేపింది నువ్వే
రేగిన ఆ మంటల్ని నీళ్ళ పైపుల్తో చిమ్మించిందీ నువ్వే
నీ అధికారం నిలుపుకోవడం కోసం
మా హక్కుల్ని కాలరాస్తేచూస్తూ ఊరుకోలేం
ఊపిరిని ఉద్యమం చేస్తే శక్తి మాది
యోధుడు చావుకు చింతించడు
యోధులు పోరాటంలో ముందుంటారు
లాఠీలు ఝుళిపించినా
గుర్రాలతో తొక్కించినా
నీ అధికార ఉక్కుపాదంతో
ఉద్యమాన్ని కర్కశంగా అణచివెయ్యాలనుకున్నా
మా సహనం సాయుధమవుతూనే ఉంటుంది
మా అహింస " అనివార్యహింస"గా
మార్పు చెందుతూనే ఉంటుంది.

విలుకాడు

-బి.రామానాయుడు

అనుభవాన్ని కోల్పోవడం
గొప్ప సంపదను కోల్పోవడమే
అనుభవాన్ని కోల్పోవడమంటే
    సుసంపన్నమైన ఆచార్యుడిని కోల్పోవడమే
నడకలు నేర్చుకున్నప్పటి
    బాల్యావస్థ గుర్తొచ్చి విలవిలలాడడం
కొద్దిసేపు మాటలు మర్చిపోవడం
సమూహం సముద్రమై
    జ్ఞాపకాల కల్లోలమయింది
సమూహాలు ఆకురాల్చిన
    వనాలవుతాయి, విషాదగీతాలవుతాయి
ఘనీభవించిన దుఃఖం
    రూపాంతరం చెందుతుంది
అలల మీద ఊగే నావలా
    ఆట మొదలవుతుంది
ఎవరో ఎత్తుకున్న పాట
    ప్రవహించటం ప్రారంభమవుతుంది
చంకలో పిల్లకు బువ్వపెడుతూ
    అమ్మ కథ చెబుతుంది
వింటి మీద కూర్చొని
    శత్రువుతో తలపడినప్పటి ఆట
చింతల కింద నులకమంచం మీద
    కూర్చుని శత్రువుతో వ్యవహరించినప్పటి పాట
అంబుల పాదిలో కూర్చుని
    వ్యూహం పన్నుతున్నప్పటి కథ
ఎండిన జీవితాలకు సారవంతమైన
    గోదావరి ఒండ్రుతో పచ్చదనాన్నిచ్చిన గాథ
ఆట సాగుతూనే ఉంది
పాట ప్రవహిస్తూనే ఉంది
అమ్మ కథ చెబుతూనే ఉంది
తమని బుజ్జగించి సముదాయించినవాడు
తమని మందలించి ఆజ్ఞాపించినవాడు
వర్గయుద్ధాన్ని నేర్పిన విలుకాడు
వాడికేమయిందని ఈ వెతుకులాట
ఏడుపులు, సముదాయింపుల వ్యథ
ఉద్రిక్తంగా కమ్ముకొస్తున్న నిశ్శబ్దం
చేష్టలుడిగి అస్తమించడాన్ని మర్చిపోయిన సూర్యుడు
యుద్ధం మధ్య విరామమా!
కాదు ! మరో యుద్ధ సన్నాహం
ఒక యోధుడి మరణం

(కామ్రేడ్ మోషే (సోమయ్య) స్మృతికి)

కామ్రేడ్ పాళీ స్మృతిలో ....

- బి.రామానాయుడు

అరణ్యగర్జన నువ్వు
అరణ్య నేత్రం నువ్వు
అరణ్యాలు నవ్వడం నువ్వు
నిన్ను చూసినప్పుడల్లా మాకు
పర్వతాన్ని తవ్వుతున్న
'ముసలి మూర్ఖుడు' గుర్తొస్తాడు
నీతో మాట్లాడినప్పుడల్లా మాకు
యుద్ధం చేస్తున్న ఇరవై అయిదు
    సంవత్సరాల యువకుడొకడు గుర్తొస్తాడు
నువ్వు
హృదయమున్న అరణ్యానివి
నువ్వు
వింధ్యారణ్యాల ముద్దుబిడ్డవు
వృద్ధాప్యాన్ని చూపి
    శత్రువును భయపెట్టి
విప్లవాన్ని స్వప్నించిన
    ఆయుధానివి నువ్వు
నది మరణం కాదు
    అభావం అభావం చెందడం
    అభివృద్ధి కావడం
విశాఖ జైలు గోడలు దూకిన
    నీ సాహసంతో మా సాహచర్యాన్ని
    స్మరిస్తున్నాం
    సంస్మరిస్తున్నాం
ఏడవడం వెనుదిరగడం
    నిన్నవమానించడమే
ఉద్విగ్నులమై
అరుణారుణ వీడ్కోలు గీతాన్ని
    గానం చేస్తున్నాం
రెడ్ శల్యూట్ కామ్రేడ్ !

సూదంటురాయి రూపాయి

- శిలాలోలిత


అన్ని విలువల వలయాల్ని
అంతరాల చట్రాలను
మాయాజూదంలో ఓడించే శకుని రూపాయి
చూడ్డానికి అమాయకమైన గుండ్రటి మొహం
వెండి, బంగారాల జోలికెళ్ళని సత్తురూపాయి

అనుబంధాలన్నీ, ప్రేమలన్నీ
దీని ముందు బొక్కా బోర్లా పడ్తాయి
బంధానికి బంధానికి మధ్య సన్నని తెరలు
ఘనీభవించిన హృదయాల చుట్టూ
కంచుకోటను నిర్మిస్తుంది.

నువ్వూ, నేనూ
అతనూ, ఆమెల మధ్య
అందమైన కత్తుల వంతెన
దీనికి రెండు వైపులా పదునే
తలలు బంతులై నడిరోడ్డుకు చేరుకుంటాయి
డబ్బు మాట్లాడదు
చూడదు, వినదు
కానీ నోరు తెరిచిందంటే -
ఎక్కడో అడవుల్లో ఆవులించే కొండచిలువ
సైతం చిన్నబోతుంది

ఈ భూమ్మీద
ఆరడుగుల నేల కావాలన్నా
నువ్వున్న ఇంటి కప్పు కింద
నువ్వే నిశ్చింతగా నిద్దరోవాలన్నా
నీ పిల్లలు పక్షులవ్వాలనుకున్నా
నీ ఆశయాల పందిరి వికసించాలన్నా
నీ అడుగులు కదలాలన్నా
అన్నింటినీ - డబ్బుల తివాచీపై
నీ గమనాగమనాలే నిర్దేశిస్తాయి

నవ్వుతున్న నిన్ను
నీ పెదాల పై నుంచి ఎత్తుకెళ్ళిపోయే గజదొంగ
ఏ దారి దోపిడీలు
దీన్ని మించి వుండవు



రొయ్యతల

- భగ్వాన్

లొట్టలేసుకుంటూ
రొయ్యల్ని తినేవాళ్ళూ జాగ్రత్త
రొయ్యతలలు మీ తలల్ని తింటాయి
ఓజోన్ పొర చిల్లుల గురించి బెంగపడే శాస్త్రవేత్తలారా
పరిశుభ్రం గురించి ఉపన్యసించే పరిపాలకులారా
రొయ్యతలలు రచిస్తున్న కాలుష్యకాండ
మీరు చదవనే లేదా
అత్యంత అద్భుత మానవ జీవన కాంతి దృశ్యసంపదల ఉనికిని
బతికించుకొనే సూత్ర పరికరాన్ని
ఎవరు కనుగొంటారు
రొయ్యలపంటకన్నా
మనిషి కలల పంట విలువైందని
రొయ్యల వ్యాపారికి ఎవరు చెబుతారు
డబ్బుపిచ్చిపట్టుకున్న వాడికి ఏదీ కనబడదు
వ్యాపారం మోజులో ఏదీ వినబడదు
డాలరు నోటు మీద రొయ్యబొమ్మ గీసుకుంటూ
ఏసీ రూములో ఏ వాసనా తగలకుండా
కులికే వాడ్ని
రొయ్యతలల లారీలో తలుపులేసి కూర్చోబెట్టాలి
రొయ్యతలలు కంపు ఎంత నరకమో
వాడికి మళ్ళీ మళ్ళీ రుచి చూపించాలి

కాచుకోరా! అమెరికోడా !!

ఓరోరి అమెరికోడా - ప్రపంచ పోలీసోడా
ఎగిరెగిరి పడకురోరి నీ పాగరు సాగదోరి
ఎగిరెగిరి పడకురోరి నీకోటకూలుతాది
పెట్రోలు పాశమేసి - పెను ఆశపోతుగోసి
ఇరాకుపైన యిసురు - తెగ యిరగబాటు బుసలు
అరె కొరివితోటి కోరి తలగొరుగుకోకు రోరి ॥ ఓరోరి॥

ఇరాకు ఆయుధాలు - యుద్ధానికబద్ధాలు
బాగ్దాదు నూనెగనిపై గజదొంగ వోలె పడితే
నీతంతు సాగనీరు మీ అంతు తేల్చుతారు ॥ ఓరోరి॥

మానవతను మరిచిన - రాబందువోలె నీవు
అణువాయుధాలు పేల్చిన - జపాను జనుల కూల్చిన
నీ ఉగ్రవాద చరిత గురుతాయె తొట్టతొలుత ॥ఓరోరి॥

అరె వియత్నాముపైన - నాపాము బాంబులొదిలి
అణచంగ తలలు నరికి - అడుగడుగు కుళ్లబొడిచి
ప్రజలెల్ల ఎదురుతిరగ - పారావు తోక ముడిచి ॥ఓరోరి॥

చైనాలో షేకు జంగు - చిలీన ఫినోఛెట్టు
జకార్త సుహార్తోలు- మార్కోసు ఫిలిప్పైన్స్
అరె తొత్తు కొడుకులంత నీ పాత్తు కట్టినోళ్లె ॥ఓరోరి॥

అరచేతిలోన గన్ను - నీ జేబులోన పెన్ను
ముషరాపు వాజపేయి - అహా! బొరుసు బొమ్మలోయి
ఒంగొంగి సలామోయి - జోహుకుం భాయి భాయి
అరె తెలిసె కపటమింగ మీ టెర్రరిజం వంక ॥ఓరోరి॥

అభివృద్ధి నిరోధకుల- ప్రపంచ ఖూనికోర్ల
ఆ మిల్టి నిరంకుశుల - ఈ మూక టెర్రరిస్టుల
ఫాసిస్టు మతంగాళ్ళ - మతపిచ్చి ఎక్కినోళ్ల
సాకి పెద్ద చేసే నేరస్త ముఠాకోరు ॥ఓరోరి॥


ఈ ఆసియాఫ్రికాలో - ఆ దక్షిణమెరికాలో
సైన్యాలనెన్నొబెట్టి - కూటములనెన్నొకట్టి
డేగ కంట చూసె - రాడార్ల కాపు గాసె
ప్రపచం టెర్రరిస్టు సరికొత్త ఫాసిస్టు.. ॥ఓరోరి॥


అరె... మాయకరవుజేసె - అవినీతి విషంబోసె
దేశాల లొంగదీసె - వినకుంటె కూలదోసె
సంపదలనెల్ల దోచె సామ్రాజ్యవాద బూచీ ॥ఓరోరి॥

నీ నోట శాంతిమాట - కాదసలుసిసలు ఝూటా
అది పెంటగనుల కోట - పీనుగుల పెనుగలాట
వదిలిద్ది నీదు తీటా ఇక కాచుకోర బేటా ॥ఓరోరి॥

మా అన్న గువేరాను కాంగోలో లుముంబాను
చిలీలో అలెండీని - దేశ దేశభక్తులాను
కాల్పించినావు భడవో చంపించినావు కొడకో ॥ఓరోరి॥

నీ కోరలన్ని పీకె- నీకొమ్ములిరగ పెరికె
నీకెదురు తిరిగె ఘనులు -ప్రపంచశాంతి జనులు
ఆ... శాంతిప్రియుల నాదాలకి - ఉద్యమ అభివాదాలు
వేనవేల వందనాలు .. వేనవేల వందనాలు..
వారందరికీ అండగ - మా తెలుగు ప్రజల జెండాలు
ఎర్రెర్రని దండాలు ఎర్రెర్రని దండాలు







ఊరు మారాలి

– భూపాల్

ఇది యేమి ఊరుర మామా
ఎన్ని ఎండ్లాకైన మారాని ఊరు
ఇదియేమి ఊరురమామా ॥ఇది॥

పాత ఇండ్లూ కూలిపోయా
పూరిగుడిసెల పేగులెల్లీ
ఊరినిండా మోరిపారీ
ముక్కు జారేటంత కంపు
మారె దేశం మారె
ఊరు మారంటావు ॥ఇది॥


పడుసు జడుసు పోరలంతా
పనిబాటలు లేకుండా
తాగి తందానా లాడీ
బడికాడ పేకాటలాడీ
భావిపౌరులంటె
బాంచలై పోతుండ్రు ॥ఇది॥

కూలీనాలీ జేసేటోళ్ళా
సాలిసాలని తిండి తింటూ
జీతగాళ్ళూ నాతగాళ్ళూ
జీవినట్లా నిలుపుకుంటూ
కర్మగిర్మోయని
కాలమెల్లేస్తుండ్రు ॥ఇది॥

చిన్న చిన్న రైతులాకూ
చిప్పదొప్పా అప్పులాయే
చేలు దుంబాలైతె చాలూ
పంట ఎవ్వడడుగ బోడూ
ఊరిపంటంతానూ
ఉన్న ఇండ్లకు జేరె ॥ఇది॥

పట్వారి కరణాలు వుంటే
పట్టింది బంగారమాయే
పోరంబోకులాని కొంతా
పట్ట భూములాని కొంతా
పగల బలిసినారు
పందులన్నా మేలు ॥ఇది॥

ఉన్న చోటే నీవు ఉంటే
ఎన్నడేమీ మారబోదూ
పేదలంతా ఒక్కటయ్యా
పెట్టాలి సంఘ మొక్కాటీ
పేద రైతుకూలీ
పోరాటసంఘము



Discover the secrets of Belum Caves

The Longest Cave system in the plains in the country

Visit the Belum Caves in Kurnool District of Andhra Pradesh.


Admire the fascinating stalacmite and stalactite formations in this millions of years old cave system. There are a number of spacious chambers, freshwater galleries and siphons in the two-km long caves now open to public.

Andhra Pradesh Tourism has created pathways and tastefully illuminated the caves for the convenience of the visitors.

Belum Caves have bagged the National Tourism Award as 'Best Unique Tourist Project' in the country.

Location: Belum Village in Kurnool District. 110 Km from Kurnool; 35 km from Gooty; 85 km from Anantapur; 30 km from Tadipatri; 290 km. from Bangalore; 310 km. from Bellary





For Details contact:

aptdc ANDHRA PRADESH TOURISM DEVELOPMENT CORPORATION

Divisional Office: C/o. 6, C-Camp, Nandyal Road, **Kurnool**. Telefax: 08518-270 104
SGL Tours & Travels, Bangalore Phone No.: 2383361 / 2383362.

Central Reservation Office: Tankbund Road, **Hyderabad**. Ph:23453036, 23450165; Fax:040-23453086.
Yatrinivas, S.P. Road, **Secunderabad.** Ph:040-27893100, 27816375.

AKSHARA

R.N.I. No. APENG/200/4182 Postal No. L 11/RNP/H-HD-974/2001

THE ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LTD.

Planning with Vision Serving with Dedication

Meeting the needs of essential commodities for a vast population, building the strongest Public Distribution System in Andhra Pradesh and serving the consumers with quality products, the Andhra Pradesh State Civil Supplies Corporation (APSCSC) has set high standards of excellence in public service-from sourcing commodities to supplying Subsidised Rice, Levy Sugar, Palmolein Oil and Wheat.

FOOD FOR WORK :

28.82 lakh tonnes of rice allotted by GOI at free of cost under Food for Work and Sampurna Grameena Rojgar Youjana up to, June 2002 is fully lifted for employment generation activities in the State.

PADDY PROCURMENT OPERATIONS :

APSCSCL procured 3.62 lakh tonnes in 2000-01 by paying an amount of Rs.195.06 crores to 73,750 farmers and Rs.85.19 crores in 2001-02 to 44,585 farmers towards purchase of paddy to ensure Minimum Support Price for farmers.

GRUHAMITHRA :

- ✦ APSCSCL is acting as facilitator for Gruha Mithra products and planning to play active role in future to deliver
- ✦ Ouality products at relatively lesser rates comparative to local retail market prices in packed and with correct weighment.
- ✦ To increase the income and make Fair Price Shops viable / sustainable
- ✦ Card and non-card holders can purchase Gruha Mithra items.
- ✦ In Hyderabad district, there are 2 lakh white cards (including AAY cards) and 6 lakh pink cards in circulation. In view of reduction in allotment of sugar only on white and AAY cards, levy sugar is being supplied. There is slight price difference between the open market price and PDS price. The net turnover of FP Shops have drastically come down and margin reduced. Rs.65.00 lakhs business conducted so far.
- ✦ Government of India's Sarvapriya Scheme is introduced in the interest of the consumers particularly lower income group and for mostly in rural areas.


With a strong commitment to controlling the prices of essential commodities, APSCSC intervenes from time to time, procures and supplies commodities like onions, tomatoes, dry chillies and red gram dal to consumers at affordable prices, APSCSC has built a model organization that ensures high priority to quality of products at every stage and health of the consumer, A brief look at the turnover of APSCSCL over the last three years is enough to indicate the phenomenal progress made by the organization in Civil Supplies.

	1998-99		1999-2000		2000-2001	
	Quantity Mts.	**Amount Crores**	**Quantity Mts.**	**Amount Crores**	**Quantity Mts.**	**Amount Crores**
Rice	2393710	1605.95	2229127	1866.22	2394594	1974.65
Sugar	357655	401.18	3511348	421.03	343012	442.86
Wheat	135683	68.32	100381	73.60	6318	5.66
P.Oil	42921	131.18	17534	50.50	3974	10.22
TOTAL	**2206.63**		**2411.35**			**2433.38**
Turnover	**2316.98**		**2460.95**			**2481.38**

Planning with vision, the Corporation is geared to add more and products to its PDS. Soon petroleum products like High Speed Diesel (HSD) Motor spirit, and Kerosene will be supplied through APSCSC'S outlets and LPG through exclusive LPG outlets in each and every district.

With Best Compliments From :

SRI SARATHI STUDIOS PRIVATE LIMITED




8-3-321, Ameerpet,
Hyderabad - 500 073.
Ph : 3237299

With Best Compliments From :

SAROVAR COFFEE SHOPPE

5-9-22, Sarovar Complex,
Secretariat Road,
Hyderabad - 500 063.
Ph : 3237299



AP SEEDS FOR BUMPER CROPS

అధిక పంటలకు ఎపిసీడ్స్

AP SEEDS QUALITY SEEDS

ఎ.పి.సీడ్స్ - నాణ్యమైన విత్తనములు

A.P. State Seeds Development
Corporation Limited,
Haca Bhavan
Hyderabad - 500 004.
Phone : 23236088

APSSDC

ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్
కార్పొరేషన్ లిమిటెడ్
హాకా భవన్
హైదరాబాద్ -500 004.
ఫోన్ : 23236088

వ్యవస్థాగత సంస్కరణలు మరియు సంపూర్ణ పారిశుధ్య పథకములు

సెక్టారు రీఫార్మ్స్ పైలట్ ప్రాజెక్టు - నెల్లూరు జిల్లా

సెక్టారు సంస్కరణలు : మన రాష్ట్రంలో వ్యవస్థాగత సంస్కరణల కోసం ఎంపిక కాబడిన ఏడు పైలట్‌ల ప్రాజెక్టు జిల్లాలో నెల్లూరు జిల్లా ఒకటి. భారత ప్రభుత్వం వారు రూ॥ 37.40 కోట్ల వాటాతో, రూ॥ 2.60 కోట్ల ప్రజల భాగస్వామ్యంతో వెరసి రూ॥ 40.00 కోట్ల అంచనాతో మంచినీటి పథకాల నిర్మాణానికి వ్యవస్థాగత సంస్కరణలతో మంజూరు చేయడం జరిగినది.

ముఖ్యోద్దేశ్యము : అ) ప్రజల అభీష్టము మేరకు సేవలను, సౌకర్యాలను అందించుట, ప్రజల భాగస్వామ్యాన్ని ఉపయోగించుకొనుట

ఆ) నిర్మాణ వ్యయంలో 10శాతము భరించుట, నిర్వహణ, యాజమాన్య బాధ్యతలను వినియోగదారులే పూర్తిగా వహించుట.

ఈ ప్రాజెక్టు క్రింద 450 నివాస ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం కల్పించవలెనని లక్ష్యం కాగా మొదటి విడతగా 183 నివాస ప్రాంతాలలో ప్రజలు చైతన్యవంతులై తమ వంతు భాగస్వామ్యంతో మంచినీటి పథకము నిర్మాణము, అనంతరం పూర్తి నిర్వహణ చేయుటకు ముందుకు వస్తున్నారు.

ఇప్పటివరకు జిల్లాలో సాధించిన ప్రగతి

ఏర్పడిన త్రాగునీరు మరియు పారిశుధ్య కమిటీలు	- 183
భాగస్వామ్యం అందజేసిన మజరాలు	- 183
భాగస్వామ్యం మొత్తం	- రూ. 228.24 లక్షలు
మంజూరీ కాబడిన పనులు	- 183
అంచనా విలువ	- రూ. 3332.10 లక్షలు
పూర్తికాబడిన పనులు 41, మిగిలిన 142 పనులు పురోగతిలో ఉన్నవి	
పాఠశాలల్లో మంచినీటి వసతి కొరకు ఇప్పటివరకు మంజూరైన పనులు	- 203
పూర్తికాబడినవి	- 155
మిగిలిన 48 పనులు పురోగతిలో ఉన్నవి.	

సంపూర్ణ పారిశుధ్య పథకము : భారత ప్రభుత్వము వారు గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరుచుటకు, త ద్వారా గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ మరియు మనోవికాస అభివృద్ధికి రూ 11.29 కోట్ల వాటాతో రూ॥ 3.27 కోట్ల రాష్ట్ర భాగస్వామ్యంతో, రూ॥ 2.44 కోట్ల ప్రజల భాగస్వామ్యంతో వెరసి రూ॥ 17.00 కోట్ల అంచనాతో సంపూర్ణ పారిశుధ్య పథకము మంజూరు చేయడం జరిగినది.

ముఖ్యోద్దేశ్యం : అ) 1,92,000 మంది దారిద్ర్యరేఖకు దిగువనున్న వారికి ఒక్కొక్కటి రూ॥ 750 నగదు మరియు రెండున్నర క్విటాళ్ళు బియ్యంతో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుట.

ఆ) పాఠశాలల్లో మరుగుదొడ్లు ఒక్కొక్కటి రూ॥ 15000/- రూ॥ 20,000 / రూ॥ 25000 విద్యార్థుల సంఖ్య ఆధారముగా విద్యాకమిటీలచే 3129 యూనిట్లు నిర్మించుట.

ఇప్పటివరకు సాధించిన ప్రగతి :

వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరైనవి	- 53, 248
పూర్తి కాబడినవి	- 51, 216
వ్యయం : నగదు - రూ॥ 385.00 లక్షలు, బియ్యం	- 1,32,380 క్విటాళ్ళు
పాఠశాల మరుగుదొడ్లు నిర్మాణము కొరకు మంజూరైన పనులు	- 3129
పూర్తికాబడినవి - 902, మిగిలిన 2227 పనులు పురోగతిలో ఉన్నవి.	

మరుగుదొడ్లు నిర్మించుకుందాం - అందరి ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

నెల్లూరు జిల్లా త్రాగునీరు మరియు పారిశుధ్య మిషన్
ఫోన్ నెం. 2341655

జి. అనంతరాము ఐ.ఎ.యస్
జిల్లా కలెక్టరు & ఛైర్మన్ NOWSC

డా॥ యం. జగన్మోహన్
ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ NOWSC


పి. చెంచలబాబు యాదవ్
ఛైర్మన్ NOWSM

With Best Wishes From

BIO-AGRI INPUTS PRODUCERS ASSOCIATION (BIP A) OF ANDHRA PRADESH

Producers of

1. Biopesticides
2. Biofertilisers
3. Bio control agents
4. Neem based Pesticides



BIPA

112, Sri Arcade, Bata Show Room Complex,
Erragadda, Hyderabad - 18.

జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంఘము లిమిటెడ్, నెల్లూరు

రాష్ట్రంలో 1,15,000 మంది షెడ్యూల్డ్ కులముల ఆర్థిక అభ్యున్నతికి 2003-2004 సం॥నకు 20,700.00 లక్షల రూపాయలను కేటాయించబడినది.
నెల్లూరు జిల్లాకు 6965 మంది షెడ్యూల్డ్ కులముల వారికి లబ్ది చేకూర్చుటకు 987.15 లక్షల రూపాయలను ఖర్చు చేయుటకు నిర్దేశించబడినది.

2003-2004 సం॥ షెడ్యూల్డ్ కులముల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాలు

		మంజూరైన యూనిట్లు	లబ్ధిదారుల సంఖ్య	కేటాయించిన మొత్తం రూ॥ లక్షలలో
1.	భూమి కొనుగోలు పథకము	250	250	100.000
2.	బోర్‌వెల్స్	175	525	92.400
3.	వ్యవసాయ బావులు	90	180	29.250
4.	ఫిల్టర్ పాయింట్లు + ఎలక్ట్రికల్ మోటార్లు	18	90	4.356
5.	ఎలక్ట్రిక్ మోటార్స్ (5 హెచ్.పి)	176	352	25.520
6.	ఆయిల్ ఇంజన్లు	125	250	25.000
7.	విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు	530	-	26.500
8.	ఇన్‌వెల్ బోర్లు	11	33	1.100
9.	ఎత్తిపోతల పథకం	16	98	32.000
10.	పండ్లతోటల పథకము	270	270	13.500
11.	భూమి అభివృద్ధి పథకము	200	200	10.000
12.	యన్.యస్. ఎఫ్.డి.సి స్వయం పథకములు	100	100	100.000
13.	బ్యాంకు లింకుడు స్వయంఉపాధి పథకములు	521	521	260.500
14.	మైక్రోక్రెడిట్	224	3360	168.000
15.	మాతమ్మ / బసివినుల పునరావాసం	7	7	1.400
16.	పాకీ పనివారల పునరావాసం	20	63	12.600
17.	సఫాయి కరంచారీల పునరావాసం	180	180	36.000
18.	ప్లేయర్స్, ట్యానర్స్ మరియు కాబ్లర్స్ (చర్మకారుల పథకము)	79	79	15.800
19.	ఇతర శిక్షణా కార్యక్రమాలు	407	407	28.490
20.	అవగాహన కార్యక్రమములు	-	-	4.734
	మొత్తం	**- 3399**	**6965**	**987.50**

పి.సి.పి. రాజు యం.ఏ., (లిట్)
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంఘము లిమిటెడ్, నెల్లూరు.

జి. అనంతరాము ఐ.ఏ.ఎస్.,
జిల్లా కలెక్టర్ / ప్రెసిడెంట్, జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవాసహకార సంఘము లిమిటెడ్, నెల్లూరు.

బి.వి. సుబ్బయ్య విద్యా సంస్థలు

పేర్నమిట్ట - ఒంగోలు, ప్రకాశం జిల్లా. ఫోన్స్ : (08592) 56232, 56295

"సమాజశ్రేయస్సే వ్యక్తి శ్రేయస్సు"

ఈ సూక్తి విద్యాబోధనలో ఎల్ల వేళలా మాకు మార్గదర్శకము

ఇంటర్మీడియట్ క్లాసు ప్రాధాన్యత - తల్లి దండ్రుల కర్తవ్యం

ఇంటర్మీడియట్ క్లాసు తర్వాత ఉన్నత విద్య మెడిసన్, ఇంజనీరింగ్, మొదలగు పలు భాగములుగా ఉన్నది. ఉన్నత విద్యలో వారి అభివృద్ధి ఇంటర్మీడియట్ క్లాసుపై ఆధారపడి ఉన్నది. కనుక ఇంటర్మీడియట్ క్లాసుకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడినది.

అయితే ఇంటర్మీడియట్ క్లాసును నిర్వహించు ప్రభుత్వ కాలేజీలు ఉన్నప్పటికీ ప్రజలు అత్యధికంగా ప్రైవేటు కాలేజీలలో చేరుతున్నారు.

విద్య యొక్క ఒకే లక్ష్యము విద్యార్థుల విద్యాభివృద్ధి. ఈ లక్ష్య సాధనలో ప్రైవేటు కాలేజీలు ఘోరముగా విఫలమైనవి. ఇందుకు నిదర్శనము 2001వ సంవత్సరము మార్చి పరీక్షలలో జూనియర్ ఇంటర్ విద్యార్థులు నూటికి 65మంది తప్పుట. మరొకబటమైన నిదర్శనము ఇంటర్మీడియట్ తరగతిలో 2సం॥రాల కాలమును వెచ్చించి, పెద్ద ఆర్థిక భారమును మోసి కూడా మెడిసిన్, ఇంజనీరింగ్‌కు అనర్హులగుట. ఇంత యాతనపడి చదివిన ఇంటర్ చదువునే ఎంసెట్ పేరుతో మరియొక సంవత్సరకాలమును వినియోగించి ఇంకొక 50వేల రూపాయల ఖర్చుతో చదవవలసి వచ్చుట మరీ బాధాకరము.

ఈ ఎంసెట్ నిర్వహించుట వలన రాష్ట్రములో తల్లిదండ్రులపై సంవత్సరానికి 2000 కోట్ల రూపాయల భారము పడుచున్నదని కూడా ఈ సందర్భములో గుర్తించండి.

ఈ తీవ్ర విషయాలు అర్థం చేసుకోకుండా ప్రజలను భ్రమలలో ముంచుటకు దుష్టశక్తి అయిన బట్టీ పెట్టు బోధనా విధానము విద్యాసంస్థల నిర్వాహకులకు రక్షణగా పనిచేయుచున్నది.

అమూల్యమైన విజ్ఞానము ఈ విధముగా ప్రజలకు అందకుండా పోవు పద్ధతిని తక్షణము అరికట్టకపోతే తీవ్రమైన నష్టము సమాజానికి ఇప్పుడు కలుగుటయే కాక ముందు తరాలవారికి ఎక్కువ హాని జరిగిపోతుంది.

పరిష్కారము

ప్రజలు తక్షణం మేల్కొని ఐకమత్యముతో నిలబడి పట్టుబట్టి పోరాడుటే దీనికి తిరుగులేని పరిష్కారము. ఐకమత్యముతో నిలబడిన ప్రజల మహాశక్తిని ఏదీ అడ్డుకొనలేదు, ఆపలేదు. ఈ సమస్యను గురించి గ్రామ గ్రామాన, ఇంటింట మేము ఈ కరపత్రములోనూ, మార్చి 15, 31 తేదీలలో ప్రకటించిన కరపత్రములలోనూ వివరించిన విషయములను చర్చించి సౌకల్యముగా అర్థం చేసుకొనగలరు. ఈ అవగాహన మీరు బలమైన పట్టుపట్టుటకు ఎంతో తోడ్పడును.

"ఐకమత్యమే మన బలము", "విజయము మనదే"
సాధించవలసిన లక్ష్యాలు

1. బట్టీపెట్టు విధానమును విద్యాసంస్థల నుండి తుడిచిపెట్టాలి.
2. స్వయంగా జవాబులు వ్రాయు పద్ధతిలో బోధన, సాధన జరగాలి.

ఈ విధానములో ముఖ్యాంశాలు :

- ✦ ఒక్కొక్క సెక్షన్‌లో 40మంది విద్యార్థులను మాత్రమే ఉంచాలి.
- ✦ విద్యార్థికి అర్థమగు వరకు ఒకటి, రెండు పర్యాయములు అవసరమైనప్పటికీ వివరించాలి.
- ✦ అప్పుడు విద్యార్థి ప్రశ్న వేస్తే విద్యార్థే స్వయంగా జవాబులు చెప్పగలుగును.
- ✦ ఉపాధ్యాయుడు తానే జవాబు చెప్పి వ్రాయించకూడదు.

ఇట్లు

మీ విజయాన్ని కాంక్షిస్తూ

బి.వి. సుబ్బయ్య విద్యా సంస్థలు

హైదరాబాదులో జరిగిన రాష్ట్ర సదస్సు



జెండా ఆవిష్కరణ చేస్తున్నవారు కా॥ కోటయ్య, ప్రక్కన డా॥ బి.డి. శర్మ, ప్రొ॥ కె.ఆర్. చౌదరి, కామ్రేడ్స్ జస్వంత్‌రావు, ఝాన్సీ, ముత్తిరెడ్డి శ్రీరాములు, హాజరైన ప్రతినిధులు




సిక్కోలుయుద్ధం నృత్య రూపకం



ప్రత్తి రైతు ఏకపాత్రాభినయం



సదస్సు సందర్భంగా జరిగిన ప్రదర్శన



ఓరోరి అమెరికోడా - ప్రపంచ పోలీసోడా
ఎగిరెగిరి పడకురోరి నీ పాగరు సాగదోరి
ఎగిరెగిరి పడకురోరి నీ కోటకూలుతాది

ankush 040-27663211